గురువారం
11•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 16
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD







# గుణాత్మక పాలనకు త్రివిధానాలు



## ప్రజల సమస్యలకు ఉపశమనం లభించేలా రూరల్ పాలసీ

## లంచాలు ఇచ్చే అవసరం లేకుండా రెవెన్యూ పాలసీ

## అవినీతికి ఆస్కారం లేకుండా అర్బన్ పాలసీ

### వీటిని పటిష్ఠంగా అమలుపర్చాలి: సీఎం కేసీఆర్

- నూతన మున్సిపల్ చట్టంపై కమిషనర్లకు శిక్షణ కార్యక్రమం
- ఉన్నతస్థాయి సమీక్షలో అధికారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఎన్నికల్లో అఖండ మెజారిటీ ఇచ్చి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి రాష్ట్రంలో గుణాత్మక పాలన తీసుకురావాలని తమ ప్రభుత్వం సంకల్పించిందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెప్పారు. రాష్ట్రంలో గుణాత్మక పాలన సాధించేందుకు త్రివిధానాలు అనుసరించాలని అధికారులకు సూచించారు. తెలంగాణ రూరల్ పాలసీ, తెలంగాణ అర్బన్ పాలసీ, తెలంగాణ రెవెన్యూ పాలసీ అనే మూడు విధానాలను పటిష్ఠంగా అమలుపరచడంద్వారా రాష్ట్రంలో గుణాత్మక పాలన అందించగలమని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యల నుంచి ఉపశమనం లభించేరీతిలో రూరల్‌పాలసీ, లంచాలు ఇచ్చే అవసరం ఎంతమాత్రం రాకుండా ఉండేలా రెవెన్యూవిధానం, జీరోస్థాయికి అవినీతి చేరుకునేలా అర్బన్‌విధానం ఉండాలన్నారు. నూతన మున్సిపల్ చట్టంపై కమిషనర్లకు శిక్షణ నిర్వహించాలని సీఎం అధికారులకు సూచించారు. రూపుదిద్దుకుంటున్న నూతన పురపాలక చట్టం పురోగతిపై, అందులో చేర్చాల్సిన అంశాలపై, చట్టంలో ప్రజాప్రతినిధుల

మిగతా 2వ పేజీలో



ప్రపంచకప్ టోర్నీలో బుధవారం మాంచెస్టర్‌లో జరిగిన సెమీస్‌లో వికెట్ కోల్పోయి నిరాశగా వెనుదిరుగుతున్న భారతజట్టు కెప్టెన్ కోహ్లీ

# ఓడి గెలిచారు..!

### సెమీఫైనల్లో కివీస్ చేతిలో భారత్ ఓటమి

### ప్రపంచకప్ నుంచి నిష్క్రమణ

**ప్రతిష్ఠాత్మక** ప్రపంచకప్‌లో భారత్ ప్రస్థానం ముగిసింది. కోట్ల మంది అభిమానుల ఆశలను మోసుకుంటూ బ్రిటిష్ గడ్డపై అడుగుపెట్టిన టీమ్‌ఇండియా అంచనాలు అందుకోలేకపోయింది. కప్ గెలువాలంటే న్యూజిలాండ్‌పై కచ్చితంగా గెలిచి తీరాల్సిన సెమీఫైనల్ మ్యాచ్‌లో కోహ్లీసేన పోరాడి ఓడింది. ప్రతికూల పరిస్థితుల మధ్య ప్రత్యర్థిని దీటుగా ఎదుర్కొంటూ పరాక్రమం చూపించిన భారత్‌జట్టు.. గెలుపు వాకిట బోల్తా కొట్టింది. లక్ష్యఛేదనలో జడేజా, ధోనీ అర్ధసెంచరీలతో చెలరేగినా.. ఆఖర్లో కివీస్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో నాకౌటైంది. బుధవారం కివీస్‌తో జరిగిన సెమీస్ మ్యాచ్‌లో భారత్ 18 పరుగుల తేడాతో ఓడి మెగాటోర్నీ నుంచి నిష్క్రమించింది. మొత్తంగా టోర్నీ ఆసాంతం చాంపియన్ ఆట తీరు కనబరిచిన టీమ్‌ఇండియా అద్భుత పోరాటపటిమతో అభిమానుల మనసు గెలుచుకుంది.

వివరాలు ఆటలో



కన్నెపల్లిలో నాలుగు మోటర్లు పనిచేస్తుండటంతో గ్రావిటీ కాల్వలోకి దుంకుతున్న గోదావరి జలాలు

**ఇటు మేడిగడ్డనుంచి.. అటు సుందిల్లనుంచి**

# గోదావరి పలుకరింపు

- అన్నారంలో పెరుగుతున్న నీటిమట్టం.. బరాజ్‌కు చేరిన 1.60 టీఎంసీల నీరు
- కొనసాగుతున్న ప్రాణహిత వరదప్రవాహం
- వరదతో కళకళలాడుతున్న త్రివేణిసంగమం
- కన్నెపల్లిలో నాలుగు మోటర్లతో ఎత్తిపోత • నేడు ఐదో మోటర్ ప్రారంభం!
- సుందిల్ల బరాజ్‌నుంచి దిగువకు గోదారి పయనం
- అప్రోచ్ చానల్ ద్వారా హెడ్‌రెగ్యులేటరీకి వెట్‌రన్‌కు సిద్ధమవుతున్న అన్నారం పంప్‌హౌస్

3

# అన్ని నదీజలాల వివాదాలకూ ఒకే ట్రిబ్యునల్

- రెండేండ్లలో వివాదాలను పరిష్కరించేలా గడువు
- చిన్నారులపై లైంగిక నేరాలకు పాల్పడితే మరణశిక్ష
- పోక్సో చట్టం మరింత పటిష్ఠం • అనియంత్రిత డిపాజిట్ స్కీములపై నిషేధం
- ట్రాన్స్‌జెండర్ బిల్లుకు ఆమోదముద్ర • కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు

9

# కోర్టు తీర్పిచ్చినా కనికరించలేదు

ధర్మగంట

- మ్యుటేషన్ చేయకుండా ఇరవై ఏండ్లుగా తాత్సారం
- ఓఆర్సీ సృష్టించి మరొకరికి పాస్‌బుక్
- 2011లో కోర్టు ఆర్డర్ ఇచ్చినా అమలుచేయని అధికారులు
- వికారాబాద్ జిల్లా రావులపల్లి రైతు ఆవేదన

కొనుగోలు చేసిన భూమి మ్యుటేషన్ కోసం ఇరవై ఏండ్లకు పైగా తిరిగినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు.. నకిలీ ఓఆర్సీ సృష్టించి మరొకరిపేరిట పాస్ పుస్తకాలు ఇచ్చేశారు. బాధితుడికి అనుకూలంగా కోర్టు ఇచ్చిన ఆర్డర్‌నూ దాదాపు ఎనిమిదేండ్లుగా పట్టించుకోవడం లేదు. కబ్జాదారుడి బెదిరింపులతో భూమి మీదకు వెళ్లలేకపోతున్నానని వికారాబాద్ జిల్లా రావులపల్లి రైతు కల్వ శ్రీనివాస్ వాపోతున్నారు. కోర్టు అధికారులు తన పేరుమీదకు రికార్డులను మార్చాలని కోరుతూ ధర్మగంటను ఆశ్రయించారు.

4

# వీఆర్వో ఆఫీసులో రైతుకు గుండెపోటు

**దవాఖానకు తరలిస్తుండగా మృతి.. పాస్‌బుక్ కోసం రెండేండ్లుగా తిరుగుతున్న బాధితుడు**

**ఖమ్మం జిల్లా కూసుమంచిలో విషాద ఘటన**



5

# పంటపై కాలం కాటు!

### రాష్ట్రంలో నిరాశజనకంగా వానకాలం సాగు

### పడిపోయిన పంట విస్తీర్ణం

**పంటలపై** కాలం కాటేస్తున్నది. వానల్లేక.. అక్కడక్కడ కురిసినా సరిపోక దుక్కులు గోసపడుతున్నాయి. విత్తనాలు చల్లినా మొలకల్లేవు.. ఎక్కడన్నా మొలకెత్తినా.. మండిపోతుండటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో 1.08 కోట్ల ఎకరాలకు 43.33 లక్షల ఎకరాల్లోనే సేద్యం మొదలైనట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదించింది. జూలైలో ఇప్పటివరకు 33శాతం లోటు వర్షపాతం నమోదైందని వివరించింది.

# అనర్హత సబబే

**ఎమ్మెల్సీల అనర్హత కేసులో రాములునాయక్, యాదవరెడ్డికి చుక్కెదురు**

**ఇరువురి పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు**

2

## ఎమ్మెల్యే చెన్నమనేనికి ఊరట

**పౌరసత్వం రద్దు ఉత్తర్వులను కొట్టేసిన హైకోర్టు**

# సుప్రీంకోర్టుకు కర్ణాటకం

- తమ రాజీనామాలను ఆమోదించేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరిన రెబల్ ఎమ్మెల్యేలు
- సంకీర్ణ సర్కార్‌కు మరో షాక్.. రాజీనామా చేసిన మరో ఇద్దరు ఎమ్మెల్యేలు
- ముంబైలో రెబల్స్‌ను బుజ్జగించేందుకు మంత్రి శివకుమార్ విఫలయత్నం
- సీఎం కుమారస్వామి రాజీనామా కోరుతూ అసెంబ్లీ ఎదుట బీజేపీ ఆందోళన







# కేంద్ర సాయంపై సమీక్షకు ప్రత్యేక కమిటీ

- అనుబంధంగా ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం కమిటీ
- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ఆర్థికశాఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర ప్రభుత్వ పథకాలు, కేంద్రం ఆర్థికసాయం ద్వారా అమలయ్యే రాష్ట్ర పథకాల తీరును ఎప్పటికప్పుడు సమీక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసింది. కమిటీ ఏర్పాటుపై ఆర్థికశాఖ బుధవారం ఉత్తర్వులను జారీచేసింది. రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు చైర్మన్‌గా వ్యవహరించే కమిటీలో రాష్ట్ర ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి, పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్, ప్రణాళికశాఖ డైరెక్టర్, ఆర్థికశాఖ డైరెక్టర్, ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్లు సభ్యులుగా ఉంటారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి ఎన్ని నిధులు రావాలి, ఎన్ని వచ్చాయి, ఎందుకు జాప్యం జరుగుతుంది, గ్రాంట్ ఇన్ ఎయిడ్ కాంట్రిబ్యూషన్ ఎంతవరకు అందిందనే అంశాలను ఈ కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటుంది. కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న పథకాలకు సంబంధించిన నిధులు, కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటాను వెనువెంటనే మంజూరయ్యేలా చేస్తుంది. ఆయా శాఖల నుంచి ఎప్పటికప్పుడు గణాంక వివరాలను సేకరించడానికి అనుబంధంగా ప్రభుత్వం మరో కమిటీని ఏర్పాటుచేసింది. ఆర్థికశాఖకు చెందిన సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ బీఎస్ నాగేంద్ర, ఏఏవో రాంనాయక్, ఏటీవో రామకృష్ణ, ఎస్టీవో రుబేన్ దుష్మన్‌తో ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కమిటీని ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు.

# చింతమడక అభివృద్ధికి రూ.10 కోట్లు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు స్వగ్రామం చింతమడక అభివృద్ధికి ప్రత్యేక అభివృద్ధి నిధి నుంచి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు విడుదలచేసింది. త్వరలో సీఎం కేసీఆర్ చింతమడకలో పర్యటించనున్న నేపథ్యంలో గ్రామంలో అభివృద్ధి పనుల కోసం ఈ నిధులను విడుదలచేయగా, ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి కే రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

# 2.71 లక్షల ఎకరాల్లో బిందుసేద్యం

- రూ.710.18 కోట్ల మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టుకు స్టేట్ లెవల్ సాంక్షనింగ్ కమిటీ ఆమోదం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 2019-20 ఆర్థిక సంవత్సరంలో 2.71 లక్షల ఎకరాల్లో బిందుసేద్యం పథకాన్ని అమలుచేయాలని ప్రతిపాదించిన ప్రాజెక్టుకు రూ.710.18 కోట్ల బడ్జెట్‌తో స్టేట్ లెవల్ సాంక్షనింగ్ కమిటీ (ఎస్సెల్లెస్సీ) కార్యాచరణ ప్రణాళికను ఆమోదించింది. హైదరాబాద్‌లో సీఎస్ ఎస్కే జోషి అధ్యక్షతన బుధవారం కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ ఏర్పడ్డాక 2.47 లక్షల మంది రైతులకు రూ.1,810.22 కోట్ల సబ్సిడీతో 6.55 లక్షల ఎకరాల్లో బిందుసేద్యం అమలుచేసినట్టు ఉద్యాన శాఖ డైరెక్టర్ ఎల్ వెంకట్రామిరెడ్డి చెప్పారు. రాష్ట్రంలో బిందుసేద్యానికి అనుకూలంగా మరో 32.65 లక్షల ఎకరాల భూమి ఉన్నట్టు పేర్కొన్నారు. దీనిలో 2019-20 ఏడాదికి 2.71 లక్షల ఎకరాల్లో బిందుసేద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకోసం రూ.415.79 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, రూ.249.39 కోట్లు కేంద్ర ప్రభుత్వం సమకూర్చే బడ్జెట్‌కు ఎస్సెల్లెస్సీ ఆమోదం తెలిపిందని ఆయన తెలిపారు.



# • గండిపేటలో వరుణజపం



గండిపేట జలాశయంలో వరుణ జపం చేస్తున్న చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకులు

**వర్షాలు సమృద్ధిగా** కురువాలని రంగారెడ్డి జిల్లా చిలుకూరు బాలాజీ దేవాలయం ఆధ్వర్యంలో వేదపండితులు బుధవారం గండిపేట జలాశయంలో వరుణ జపం నిర్వహించారు. చిలుకూరు ఆలయానికి చెందిన ఐదుగురు అర్చకులు.. సఫిల్‌గూడలోని వేదభవనం నుంచి శ్రీరామ గణపాటి శిష్య బృందంతో కలిసి వేదమంత్రోచ్ఛారణల మధ్య చేసిన వరుణ జపంతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. ఉదయం 10 గంటలకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను కలశంలో తీసుకెళ్లి జలాశయంలో కలిపి వరుణజపం ప్రారంభించారు. 108 సార్లు వరుణదేవున్ని ప్రార్థిస్తూ మంత్రాలు పఠించారు. అనంతరం జలాశయంలోని నీటిని తీసుకొచ్చి ఆలయంలోని గరుత్మంతుడికి, స్వామికి ఎదురుగా ఉన్న హనుమంతుడి పాదాలకు అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎంవీ సౌందరరాజన్, అర్చకులు సురేశ్‌స్వామి, సుదర్శన్‌స్వామి, ఇతర అర్చకులు పాల్గొన్నారు. **- మొయినాబాద్**

# 'నైనీ' గని ప్రారంభం దిశగా..

- ఒడిశా సీఎం, సీఎస్‌లతో సింగరేణి సీఎండీ శ్రీధర్ భేటీ
- భూసేకరణ, అనుమతుల్లో ప్రభుత్వ సహకారానికి విజ్ఞప్తి
- నైనీలో 34 కోట్ల టన్నుల బొగ్గు
- ఏటాకోటి టన్నుల ఉత్పత్తి లక్ష్యం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఒడిశా రాష్ట్రంలో సింగరేణి సంస్థ వచ్చే ఏడాది ప్రారంభించనున్న 'నైనీ' బొగ్గు బ్లాకు కోసం ఉన్నతస్థాయిలో సన్నాహాలు ముమ్మరం చేసింది. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఆదిత్య ప్రసాద్‌పాఢిని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ బుధవారం భువనేశ్వర్‌లో కలిశారు. ముందుగా సీఎస్ ఆదిత్య ప్రసాద్‌పాఢితో సమావేశమై 'నైనీ' బ్లాకుకు సంబంధించిన పలుఅంశాలను వివరించారు. రాష్ట్ర, దేశ విద్యుత్ అవసరాల రీత్యా బొగ్గు ఉత్పత్తిని పెంచడంలో భాగంగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఒడిశా అంగూల్ జిల్లాలోని 'నైనీ' బ్లాకును సింగరేణికి కేటాయించిందని, దీనికి సంబంధించిన అటవీ, రెవెన్యూ భూముల బదలాయింపు, పునరావాస, రైల్వేలైను ఏర్పాటు తదితర అంశాల్లో ప్రభుత్వం నుంచి సహకారం కోరుతున్నామన్నారు. భూముల సేకరణ అనుమతులకు, ప్రస్తుతం నిర్మించనున్న రైల్వేలైనును 'నైనీ' బ్లాకు వరకు కొనసాగించడానికి ప్రభుత్వపరంగా సహకారం అందించాలని సీఎండీ శ్రీధర్ కోరారు. పూర్తి సహకారం అందిస్తామని ఒడిశా సీఎస్ హామీఇచ్చారు.



బుధవారం భువనేశ్వర్‌లో ఒడిశా వరదబాధితుల కోసం ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్‌కు రూ.కోటి చెక్కును అందజేస్తున్న సింగరేణి సీఎండీ శ్రీధర్, సింగరేణి అధికారులు

### 'నైనీ' బొగ్గు నిల్వలు 34 కోట్ల టన్నులు

ఒడిశాలో వచ్చే ఏడాది ప్రారంభించనున్న 'నైనీ' బొగ్గు క్షేత్రం సింగరేణికి వరంగా మారనున్నది. 34 కోట్ల టన్నుల బొగ్గు నిల్వలున్న ఈ బ్లాకు నుంచి ఏటా కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తికి సంస్థ ప్రణాళికలు సిద్ధంచేసింది. ఈ బ్లాకును నిర్దేశిత సమయంలో ప్రారంభించడానికి సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. జనరల్ మేనేజర్ విజయరావును ఈ గని వ్యవహారాల పర్యవేక్షణ అధికారిగా నియమించి, ప్రతినెలా పురోగతి సమీక్షిస్తున్నారు. ఛెండిపడ తాసిల్ పరిధిలో 'నైనీ' బొగ్గు బ్లాకు ప్రభావిత గ్రామాలైన థలీపాసి, కుడాపాసి, కాసిదిహ, దౌరాఖమాన్, భీంభద్రపూర్, టెంటులోయి గోపినాథ్పూర్‌లల్లో ఇప్పటికే పలు సమాజహిత కార్యక్రమాలను మొదలెట్టారు.

### ఒడిశాకు సింగరేణి చేయూత

ఇటీవల భారీ వర్షాలు, వరదలతో సతమతమైన ఒడిశాకు చేయూతగా సింగరేణి తరఫున రూ.కోటి చెక్కును సింగరేణి సీఎండీ శ్రీధర్.. ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ అందజేశారు. వరద సమయంలో సింగరేణి నుంచి రెస్క్యూ బృందాలు, వైద్యబృందాలను పంపి 20 రోజులపాటు సేవలందించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో మైనింగ్ సలహాదారు డీఎన్ ప్రసాద్, జీఎం విజయారావు, డీజీఎం రవీంద్ర చౌదరి పాల్గొన్నారు.

# వారంలో బీఆర్కేభవన్ ఖాళీ



బుధవారం బీఆర్కే భవన్‌లో కొన్ని కార్యాలయాల సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది

- సచివాలయం తరలింపునకు మరో 10 రోజుల సమయం
- అంతస్తులవారీగా కార్యాలయాల కేటాయింపుపై జీఏడీ కసరత్తు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సచివాలయం కోసం బీఆర్కే భవన్ ఖాళీ అవుతున్నది. ఇందులోని వివిధశాఖల కార్యాలయాలు ఆయాశాఖల ప్రధాన కార్యాలయాల్లోకి తరలివెళ్తున్నాయి. బుధవారం కూడా ఫైళ్లు, ఇతర సామగ్రిని వాహనాల్లో తరలించారు. బీఆర్కే భవన్ పూర్తిగా ఖాళీ కావడానికి వారం పడుతుందని అధికారులు తెలిపారు. ఈ భవన్‌లో ఏ అంతస్తులో ఏయే కార్యాలయాలు ఏర్పాటుచేయాలనే దానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. జీఏడీ అధికారులు ముఖ్యమంత్రి చాంబర్, పేషీ, ఇతర ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, వారి పేషీలు, మంత్రుల చాంబర్లు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చాంబర్, ఇలా ఎవరెవరికి ఎంత స్థలం కేటాయించాలన్న విషయమై చర్చిస్తున్నారు. జీఏడీ అధికారులు ప్రొటోకాల్ ప్రకారం చాంబర్లు, పేషీలు కేటాయిస్తారు. జీఏడీ, హోం, న్యాయ తదితర శాఖలకు కూడా స్థలం కేటాయించాల్సి ఉన్నది. వీటన్నింటిపై నిర్ణయం తీసుకున్న తర్వాత రోడ్లు, భవనాల ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లుచేసి జీఏడీకి అప్పగిస్తారు. అనంతరం సచివాలయాన్ని బీఆర్కే భవన్‌కు తరలిస్తారు. ఇదంతా పూర్తికావడానికి బీఆర్కే భవన్ పూర్తిగా ఖాళీచేసిన తర్వాత పదిరోజుల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# ఎర్రమంజిల్‌పై కొనసాగిన వాదనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** ఎర్రమంజిల్ ప్రాంతంలో నూతన అసెంబ్లీ, మండలి భవనాల కాంప్లెక్స్‌ను నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై బుధవారం హైకోర్టులో వాదనలు కొనసాగాయి. ఎర్రమంజిల్ ప్యాలెస్ నిర్మాత ఫక్రుల్ ముల్క్ వారసులు దాఖలుచేసిన పిటిషన్‌కు నంబర్ ఇచ్చేందుకు హైకోర్టు అనుమతించింది. ఈ పిటిషన్‌లో హైకోర్టు రిజిస్ట్రీని కూడా పార్టీగా చేయడంతో రిజిస్ట్రీ నంబర్ ఇవ్వలేదు. పిటిషనర్ తరపు న్యాయవాది హైకోర్టులో వాదనలు వినిపిస్తూ నిజాంకాలం నాటి ఆస్తుల కేసులు ఇప్పటికీ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో కొన్నింటికి అప్పట్లో హైకోర్టు రిజిస్ట్రీ అఫీషియల్ రిసీవర్లను నియమించినందున రిజిస్ట్రీని ఫార్మల్ పార్టీగా చేర్చామని తెలిపారు. దీంతో సదరు పిటిషన్‌కు నంబర్ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది.

# భూసేకరణ పెండింగ్ కేసులకు రూ.152.6 కోట్లు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సివిల్ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ కేసుల్లో డిపాజిట్ చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.152.60 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

### ముహూర్తం

సూర్యోదయం: 5.52 గంటలకు

సూర్యాస్తమయం: 6.51 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, దశమి, నక్షత్రం: స్వాతి మధ్యాహ్నం 3.56 వరకు, తదుపరి విశాఖ, అమృతఘడియలు: ఉదయం 7.18 నుంచి 8.54 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.59 నుంచి 3.36 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.23 నుంచి సాయంత్రం 5.07 వరకు, వర్జ్యం: రాత్రి 9.32 నుంచి 11.08 వరకు.

# గుణాత్మక పాలనకు త్రివిధానాలు


మొదటిపేజీ తరువాయి...


బాధ్యతలు ఎలా ఉండాలన్న అంశాలపై సీఎం కేసీఆర్ బుధవారం ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'రాష్ట్ర సాధనలో స్థిరమైన ప్రయాణం చేశాం. అనుకున్నది సాధించాం. అధికారంలోకి వచ్చిన తర్వాత పలు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి విజయవంతంగా అమలు చేశాం. అన్నింటికన్నా పెద్ద సమస్యలైన మంచి నీరు, సాగునీటి సమస్యలను అధిగమించాం. ఓట్లే పరమావధిగా కాకుండా అభివృద్ధి, సంక్షేమంపట్ల దృష్టిసారించాం. ఈ నేపథ్యంలో కచ్చితంగా గ్రామాల పరిస్థితి బాగుపడాలి అనుకున్నాం. పటిష్ఠమైన చట్టం తెచ్చాం. గ్రామాల అభివృద్ధి కొనసాగుతున్నది. గ్రామాల్లో మూడునెలల్లో మార్పు చూడబోతున్నాం. అటు గ్రామీణ తెలంగాణలో ఎన్నికల్లో పోరాడి గెలిచాం. శాసనసభ ఎన్నికల్లో ప్రజలు బ్రహ్మాండమైన మెజారిటీ ఇచ్చి దీవించారు. అన్నిరకాల సంక్షేమం చేపట్టాం. ఇంకా వాళ్ల రుణం తీర్చుకోవడానికి గుణాత్మకమైన మార్పుతేవాలని ప్రభుత్వం సంకల్పించింది. చేతనైనంత మార్పు తెస్తాం. ప్రతిపనికి ఎవరో ఒకరు పూనుకోవాలి కాబట్టి మేం శ్రీకారం చుడుతున్నాం. అవినీతిని అరికట్టేదిశగా తెలంగాణ నూతన పురపాలకచట్టం రావాలి. ఈసారి ప్రభుత్వంనుంచి ప్రజలు ఆశించేది ఉత్తమ విధానాలు, అభ్యాసాలు. ఉత్తమ విధానాలవల్ల ప్రజలు బాగుపడాలి. ప్రజలకు సేవ చేసే ఉద్దేశంతోనే, ఆ స్ఫూర్తితోనే నూతన మున్సిపల్ చట్టం ఉండాలి. ప్రజల అవసరాలను తీర్చేలా, వారి బాగోగులు చూసుకునే రీతిలో, పట్టణాల అభివృద్ధి చక్కగా జరిగే పద్ధతిలో కఠినమైన మున్సిపల్ చట్టం రావాలి. చట్టం రూపకల్పన ఆషామాషీగా జరుగకూడదు' అని సీఎం కేసీఆర్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీఎంవో ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, కామారెడ్డి కలెక్టర్ సత్యనారాయణ, న్యాయ శాఖ కార్యదర్శి నిరంజన్‌రావు, పురపాలకశాఖ కమిషనర్ శ్రీదేవి, సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్, ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి, పురపాలకశాఖ మాజీ అధికారి డీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఇద్దరిపై అనర్హత సబబే

**చట్టవిరుద్ధం కాదన్న ధర్మాసనం**

- యాదవరెడ్డి, రాములునాయక్‌కు చుక్కెదురు
- ఇరువురి పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అనర్హత వ్యవహారంలో మాజీ ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, రాములునాయక్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. వారిని అనర్హులుగా ప్రకటిస్తూ శాసనమండలి చైర్మన్ ఇచ్చిన ఆదేశాలను చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌లతోకూడిన ధర్మాసనం సమర్థించింది. మండలి చైర్మన్ ఆదేశాలను సవాల్‌చేస్తూ యాదవరెడ్డి, రాములునాయక్ దాఖలుచేసిన పిటిషన్లను కొట్టివేసింది. తాము సుప్రీంకోర్టుకు వెళ్లేవరకు తమ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించకుండా చూడాలని పిటిషనర్లు ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. దానిని పరిశీలించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు సూచించింది. టీఆర్‌ఎస్ తరపున ఎమ్మెల్సీలుగా ఎన్నికైన యాదవరెడ్డి, రాములు నాయక్, భూపతిరెడ్డి గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. దీనితో వారిపై అనర్హత వేటు వేయాలని మండలిలో టీఆర్‌ఎస్ పక్షం మండలి చైర్మన్‌కు ఫిర్యాదుచేసింది. ఈ ఫిర్యాదుపై విచారణ జరిపిన అప్పటి మండలి చైర్మన్ స్వామిగౌడ్ వారిని అనర్హులుగా ప్రకటించారు. దీనిని సవాల్‌చేస్తూ ముగ్గురూ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలుచేశారు. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) జే రామచంద్రరావు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు.



యాదవరెడ్డి



రాములునాయక్

### పార్టీ మారినట్లు ఆధారాల సమర్పణ

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు హైదరాబాద్ సమీపంలోని మేడ్చల్‌లో కాంగ్రెస్ నేతృత్వంలోని మహాకూటమి నిర్వహించిన సభకు యాదవరెడ్డి హాజరవటమే కాకుండా.. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొన్నారని పేర్కొన్న ఏఏజీ.. అందుకు సంబంధించిన ఆధారాలను ధర్మాసనానికి సమర్పించారు. టీఆర్‌ఎస్ తరపున శాసనమండలికి నామినేట్ అయిన యాదవరెడ్డి.. సోనియాగాంధీకి కృతజ్ఞతలు ఎలా తెలుపుతారు? కాంగ్రెస్ కండువా ఎందుకు కప్పుకొంటారన్న ఏఏజీ.. అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ధర్మాసనం ముందుంచారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్టు నిరూపితమైనందునే ఆయనపై అనర్హత వేటు పడిందని తెలిపారు. ఒక పార్టీ తరపున ఎన్నికైన సభ్యుడు.. ఆ పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైనా అతని టర్మ్ ముగిసే వరకు అదే పార్టీ సభ్యుడిగా గుర్తిస్తారని పేర్కొన్నారు. పార్టీ సస్పెండ్ చేసినా చట్టసభల సభ్యుడు పార్టీ మారే అవకాశం లేదని, అలా మారితే అనర్హత వేటు వేసే అధికారం ఉన్నదని ప్రస్తావించారు. వీటన్నింటినీ పక్కన పెడితే షెడ్యూల్ 10 పేరా 8 ప్రకారం చైర్మన్ లేదా స్పీకర్ నమ్మినదాని (బిలీఫ్ ఆఫ్ చైర్మన్) ప్రకారం అనర్హత ఆదేశాలు జారీచేయవచ్చునని ఏఏజీ పేర్కొన్నారు. రాములునాయక్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యేటప్పుడు సమర్పించిన అఫిడవిట్‌లో తనకు టీఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వం ఉన్నదని పేర్కొన్నారని తెలిపారు. గవర్నర్ కోటాలో నామినేట్ అయిన రాములునాయక్ ఎమ్మెల్సీగా ప్రమాణం చేసేటప్పుడు టీఆర్‌ఎస్ కండువా కప్పుకొన్నారని చెప్పిన ఏఏజీ.. ఆ చిత్రాలను ధర్మాసనానికి సమర్పించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఢిల్లీకి వెళ్లి అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని కలిశారని, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని చెప్పారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. చైర్మన్ నిర్ణయాన్ని సమర్థిస్తూ తీర్పు వెలువరించింది.

### భూపతిరెడ్డి అనర్హత కేసులో త్వరలో తీర్పు

భూపతిరెడ్డి అనర్హత వ్యవహారంలో గతంలోనే వాదనలు ముగిసి తీర్పు రిజర్వ్ అయింది. త్వరలోనే తీర్పు వెలువడనున్నది. రాజ్యాంగంలోని షెడ్యూల్ 10 పేరా 8 రాజ్యాంగబద్ధతను భూపతిరెడ్డి సవాల్‌చేశారు. దీనితో పేరా 8 రాజ్యాంగబద్ధతను సమర్థిస్తూ కేంద్రం కూడా వాదనలు వినిపించింది.



# ఎమ్మెల్యే చెన్నమనేనికి హైకోర్టులో ఊరట

**పౌరసత్వం రద్దు ఉత్తర్వులను కొట్టేసిన ధర్మాసనం**

- సెక్షన్ 10 (3)ని దృష్టిలో పెట్టుకుని మళ్లీ పరిశీలించాలని కేంద్రానికి ఆదేశం
- దేశానికి ప్రమాదకరం కాదనుకుంటే పౌరసత్వానికి సెక్షన్ 10 (3) అనుమతి



ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబుకు హైకోర్టులో ఊరట లభించింది. రమేశ్‌బాబు పౌరసత్వాన్ని రద్దుచేస్తూ కేంద్రం జారీచేసిన ఉత్తర్వులను జస్టిస్ నవీన్‌రావు నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం బుధవారం కొట్టేసింది. రమేశ్‌బాబు పౌరసత్వాన్ని రద్దుచేసే క్రమంలో సిటిజన్‌షిప్ యాక్ట్‌లోని సెక్షన్ 10 సబ్ సెక్షన్ 3ను ఎందుకు దృష్టిలో పెట్టుకోలేదని ప్రశ్నించింది. ఒక వ్యక్తికి పౌరసత్వం కొనసాగించడం వల్ల దేశప్రజల సంక్షేమానికి, భద్రతకు ముప్పులేదని కేంద్రం సంతృప్తి చెందినప్పుడు సదరు వ్యక్తి పౌరసత్వాన్ని రద్దుచేయరాదని పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 10 సబ్‌సెక్షన్ 3 స్పష్టంచేస్తున్నది. రమేశ్‌బాబు దరఖాస్తును సెక్షన్ 10 (3) కోణంలో తాజాగా పరిశీలించాలని ధర్మాసనం ఆదేశించింది. ఈ ప్రక్రియను 12 వారాల్లోపు పూర్తిచేయాలని స్పష్టంచేసింది. తనకు భారత పౌరసత్వం కల్పించాలని గతంలో రమేశ్‌బాబు దరఖాస్తు చేసుకోగా.. 12 నెలల్లో కేవలం 96 రోజులు మాత్రమే భారత్‌లో ఉన్నారన్న కారణంగా ఆయన పిటిషన్‌ను కేంద్రం తోసిపుచ్చింది. దీనిపై ఆయన రివ్యూ దాఖలు చేసినప్పటికీ కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో రమేశ్‌బాబు హైకోర్టును ఆశ్రయించారు. సెక్షన్ 10 (3) ప్రకారం తన దరఖాస్తును కేంద్రం పరిశీలించకపోవడం రాజ్యాంగ విరుద్ధమన్న రమేశ్‌బాబు వాదనతో ఏకీభవించిన ధర్మాసనం తాజా ఉత్తర్వులు జారీచేసింది.

### లోకం పోకడ




అప్పుడు మేం బలహీన పడుతాం..
మా వల్ల కాదు, మమ్మల్ని వదిలేయండి!!

# మరో వారం మందగమనమే

- ఉత్తర భారతం వైపు రుతుపవనాలు కదలడమే కారణం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు మందగమనంలో సాగుతున్నాయని, మరో వారం వరకు ఇదే పరిస్థితి ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వై కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఉత్తర భారతం వైపు బలమైన రుతుపవనాలు కదలడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర దగ్గరలో బంగాళాఖాతం ప్రాంతంలో సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని, దాని ప్రభావం తెలంగాణపై ఉండదని పేర్కొన్నారు. ఉపరితల ఆవర్తనం వల్ల మూడ్రోజుల తర్వాత దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతంలో వర్షాలు కురుస్తాయని తెలిపారు. వచ్చే మూడ్రోజులు రాష్ట్రంలోని పలు ప్రాంతా ల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నదని కరుణాకర్‌రెడ్డి చెప్పా రు. మరోవైపు నిజామాబాద్ జిల్లాలో బుధవారం చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వాన పడింది. సిరికొండలో 26.5 మి.మీ., రుద్రూర్‌లో 18.5 మి.మీ., చందూరులో 16.3 మి.మీ., మోస్రాలో 13.8 మి.మీ., వర్నిలో 12.4 మి.మీ., గన్నారం, రెంజల్‌లో 12.3 మి.మీ. చొప్పున, కమ్మర్‌పల్లిలో 11 మి.మీ., వేల్పూరులో 9.5 మి.మీ. వర్షం కురిసింది. నిజామాబాద్ నగరంలో భారీ వర్షం పడింది.



బుధవారం సాయంత్రం నిజామాబాద్‌లో కురుస్తున్న వర్షం

# గ్రేటర్ హైదరాబాద్‌లో ఉక్కపోత

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** గ్రేటర్ హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గాలిలో తేమ కూడా తగ్గి ఉక్కపోత పెరిగింది. ఉదయం, సాయంత్రం వేళ మబ్బులు కమ్ముకున్నా.. పగలు ఎండలు దంచికొట్టాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 34.3 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.3 డిగ్రీలు, గాలిలో తేమ 53 శాతంగా నమోదైందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. శుక్రవారం (ఈ నెల 12న) గ్రేటర్‌లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని చెప్పారు.

## ఇటు మేడిగడ్డ నుంచి.. అటు సుందిల్ల నుంచి

# గోదావరి పలుకరింపు

**అన్నారం బరాజ్‌కు చేరిన 1.63 టీఎంసీల నీరు**

కొనసాగుతున్న ప్రాణహిత వరద ప్రవాహం

కన్నెపల్లిలో నాలుగు మోటర్లతో ఎత్తిపోత

నేడు ఐదో మోటర్ ప్రారంభానికి సన్నాహాలు

సుందిల్ల బరాజ్ నుంచి దిగువకు గోదారి పయనం



కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా అన్నారం బరాజ్‌కు తరలివెళ్తున్న గోదావరి జలాలు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్**

ఒకవైపు మేడిగడ్డ బరాజ్ నుంచి ఎదురేగుతున్న జలాలు.. మరోవైపు సుందిల్ల బరాజ్ నుంచి దిగువన అన్నారం పంప్‌హౌస్‌కు చేరుకుంటున్న నీరు.. వెరసి.. గోదారమ్మ తనను తానే పలుకరించుకుంటున్నది. ప్రాణహిత వరదనీటితో కాళేశ్వరం సమీపంలోని త్రివేణి సంగమం కళకళలాడుతున్నది. మేడిగడ్డ బరాజ్ అప్రోచ్ చానల్ ద్వారా వస్తున్న నీటిని కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటర్ల ద్వారా ఎప్పటికప్పుడు ఎత్తిపోస్తున్నారు. దీంతో గోదావరి జలాలు ఎదురెక్కుతున్నాయి. ఇప్పటికే మంథని మండలం ఆరెంద, మల్లారం, ఖాన్‌సాయిపేట, ఖానాపూర్ గ్రామ తీరాలకు చేరుకున్నాయి. క్రమంగా గోదావరిలో నీరు పెరుగుతుండగా, మరో రెండ్రోజుల్లో మంథని తీరానికి చేరుకోనున్నాయి. తెలంగాణలో గోదావరికి ఎగువన పెద్దగా వర్షాలు లేకపోవడంతో ప్రాణహిత నుంచి వస్తున్న కాళేశ్వరం నీళ్లే ఈ ప్రాంతానికి వరప్రదాయినిగా మారనున్నాయి. ప్రాణహిత వరద కొనసాగుతుండటం, మేడిగడ్డ బరాజ్ అప్రోచ్ చానల్ నుంచి కన్నెపల్లి పంప్‌హౌస్‌కు చేరుతున్న నీరు మోటర్లకు సరిపోయేంత ఉండటంతో వచ్చిన నీటిని వచ్చినట్టుగా ఇంజినీర్లు ఎత్తిపోస్తున్నారు. ఇప్పటివరకు మూడు మోటర్లతో నీటిని ఎత్తిపోయగా, బుధవారం నాలుగో మోటర్‌ను ఇంజినీర్లు విజయవంతంగా ప్రారంభించారు. బుధవారం వరకు అన్నారం బరాజ్‌కు 1.63 టీఎంసీల నీరు చేరుకున్నది. అన్నారం బరాజ్‌లో ఎనిమిది కిలోమీటర్ల వరకు గోదావరి నీరు రివర్స్ పంపింగ్‌తో నదిలో పరుచుకుంటున్నది.

**మొదలైన నాలుగో మోటర్**

కన్నెపల్లి పంప్‌హౌస్‌లో గత మూడురోజులుగా మూడు మోటర్లు నడుస్తున్న సంగతి తెలిసిందే. నాలుగో నంబర్ మోటర్‌ను బుధవారం ఉదయం 9 గంటలకు ప్రారంభించి, మధ్యాహ్నం రెండున్నరకు ఆఫ్ చేశారు. తిరిగి రాత్రి మళ్లీ ప్రారంభించి, నీటిని ఎత్తిపోశారు. ప్రస్తుతం కాళేశ్వరం వద్ద 20 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉన్నదని ఇంజినీర్లు తెలిపారు. ఈ క్రమంలో గురువారం ఐదో మోటర్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు. నీటి ఎత్తిపోతలు ఊపందుకోవడంతో కన్నెపల్లి పంప్‌హౌస్‌కు సందర్శకుల తాకిడి పెరిగింది.

**కొనసాగుతున్న ప్రాణహిత ప్రవాహం**

మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు ప్రాణహిత నదిలోకి వరద నీరు వచ్చి చేరుతున్నది. గత ఐదురోజులుగా కొనసాగుతున్న ప్రవాహంతో ప్రాణహిత కళకళలాడుతున్నది. నీటి ప్రవాహం పెరిగిన నేపథ్యంలో నదిలో నాటు పడవల ప్రయాణం నిలిపివేశారు. రాపనపల్లి సమీపంలో తెలంగాణ- మహారాష్ట్ర మధ్య నిర్మించిన వంతెనపై రాకపోకలు సాగుతున్నాయి. నదిలోకి వస్తున్న వరదనీటితో కాళేశ్వరం సమీపంలోని త్రివేణి సంగమం జలకళ సంతరించుకుంది.

**భద్రాద్రి వద్ద 16.3 అడుగులకు..**

ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం పట్టణం వద్ద బుధవారం సాయంత్రం ఆరు గంటలకు గోదావరి నీటిమట్టం 16.3 అడుగులుగా ఉన్నది. ఉదయం 6 గంటలకు 16.7 అడుగులున్న నీటిమట్టం క్రమేపీ తగ్గుముఖం పట్టింది. జూన్ నెల వరకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 2.3 అడుగులు మాత్రమే ఉండగా, ఇటీవలి వర్షాలకు భారీగా వరద నీరు వచ్చి చేరింది. నిన్నమొన్నటివరకు ఎడారిని తలపించిన గోదావరికి జలకళ వచ్చింది.

**బుధవారం వరకు అన్నారం బరాజ్‌కు**

1వ మోటర్ నుంచి **0.8** టీఎంసీ నీరు (9320 క్యూసెక్కులు)

3వ మోటర్ నుంచి **0.2** టీఎంసీ నీరు (2312 క్యూసెక్కులు)

4వ మోటర్ నుంచి **600** క్యూసెక్కులు

6వ మోటర్ నుంచి **0.5** టీఎంసీ నీరు (5225 క్యూసెక్కులు)

మొత్తం **18857** క్యూసెక్కులు (1.63 టీఎంసీలు).



అన్నారం బరాజ్‌కు వచ్చి చేరుతున్న గోదావరి జలాలు



సుందిల్ల బరాజ్ మూడో గేటు ఎత్తడంతో దిగువకు వస్తున్న గోదావరి నీరు

### ఆల్మట్టికి భారీ వరద

- ఇన్‌ఫ్లో 94 వేల క్యూసెక్కులు
- ఔట్‌ఫ్లో 12వేల క్యూసెక్కులు
- నారాయణపూర్‌కు కృష్ణాజలాలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎగువన కురుస్తున్న వానలతో ఆల్మట్టి ప్రాజెక్టుకు భారీ వరద నమోదవుతున్నది. వారం రోజుల నుంచి ఆల్మట్టికి వరద మొదలైంది. బుధవారం ఉదయానికి ఇన్‌ఫ్లో భారీగా పెరిగింది. సాయంత్రానికి 94,597 క్యూసెక్కులుగా ఉన్నది. ప్రస్తుతం ఆల్మట్టిలో 54.48 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 129.72 టీఎంసీలు. దిగువకు కాల్వల ద్వారా 4,921 క్యూసెక్కులు వదులుతుండగా.. రెండు విద్యుత్ ప్లాంట్ల ద్వారా 7 వేలకుపైగా క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో నారాయణపూర్ జలాశయానికి బుధవారం సాయంత్రానికి 12,499 క్యూసెక్కుల వరద వస్తున్నది. నారాయణపూర్‌లో 20.2 టీఎంసీల నీటినిల్వ ఉన్నది. ఉజ్జయినీ ప్రాజెక్టుకు కూడా ఎగువ నుంచి 21,525 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతున్నది. మరోవైపు తుంగభద్రకు వరద స్థిరంగా కొనసాగుతున్నది. బుధవారం సాయంత్రానికి 12,875 క్యూసెక్కులు వస్తున్నది. పూర్తిస్థాయి సామర్థ్యం 100.86 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 4.15 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఎగువనుంచి వరదనీరు పెరగడంతో.. జూరాల ప్రాజెక్టుపై ఆధారపడిన ఆయకట్టు ప్రాంతాల్లో ఆనందం నెలకొన్నది. ఈ వరద ఇలాగే కొనసాగితే.. నెలలోపే జూరాలకు ఇన్‌ఫ్లో మొదలుకానున్నది.

### తుపాకులగూడెం వద్ద తగ్గుతున్న ప్రవాహం

దేవాదుల ఇన్‌టేక్ వెల్, తుపాకులగూడెం బరాజ్ వద్ద రెండు రోజుల క్రితం 75.6 మీటర్లకు చేరుకున్న గోదావరి నీటిమట్టం తగ్గుముఖంపట్టి, బుధవారం సాయంత్రం 74.16 మీటర్లకు చేరుకొన్నది. వర్షాలు తగ్గడంతో గోదావరి ప్రవాహం కూడా తగ్గింది. అయితే దేవాదుల ఇన్‌టేక్ వెల్‌వద్ద నీటిమట్టం మోటర్లు నడిచేందుకు అవసరమైన ప్రవాహం కంటే ఎక్కువ ఉండటంతో పంపింగ్ కొనసాగుతున్నది.

## సుందిల్ల బరాజ్ మూడో గేటు ఎత్తివేత

కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన సుందిల్ల బరాజ్ మూడో గేటును అన్నారం పంపుహౌస్ మోటర్ల వెట్ రన్ నిర్వహించేందుకు ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం ఎత్తారు. దిగువకు వదిలిన 0.06 టీఎంసీల నీరు అప్రోచ్ చానల్ ద్వారా అన్నారం పంప్‌హౌస్ హెడ్‌రెగ్యులేటరీకి చేరుకొంటున్నది. పూర్తిగా నీరు చేరిన తర్వాత హెడ్‌రెగ్యులేటరీ గేట్లను ఎత్తి, పంప్‌హౌస్‌లోకి తరలిస్తారు. ఆ తర్వాత మోటర్లకు వెట్‌రన్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో సుందిల్ల బరాజ్ ఈఈ బండ విష్ణుప్రసాద్, డీఈ వేణుబాబు, అన్నారం పంపుహౌస్ ఈఈ ఎలకొండ యాదగిరి, డీఈలు మధుసూదన్, వెంకటేశ్వర్లు, జేఈలతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## పాడి వైపు దళితులకు ప్రోత్సాహం

పైలట్ ప్రాజెక్టుగా సూర్యాపేట జిల్లాలో అమలు

సత్ఫలితాలివ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తరణపై దృష్టి

ప్రణాళికలు రూపొందించిన ఎస్సీ కార్పొరేషన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దళిత కుటుంబాలను పాడి పరిశ్రమ రంగం వైపు ప్రోత్సహించేందుకు ఆర్థిక సహకారం అందించేందుకు ఎస్సీ కార్పొరేషన్ ప్రణాళికలు సిద్ధంచేసింది. సూర్యాపేట జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని 829 కుటుంబాలకు ప్రయోజనం కలిగేలా కార్యక్రమాన్ని ప్రారంభించింది. లబ్ధిదారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి.. మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పించింది. అక్కడ మంచి ఫలితాలు రావడంతో దీన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ఎస్సీ కార్పొరేషన్ చర్యలు చేపడుతున్నది.

**ప్రతి కుటుంబానికి ఆదాయం**

సూర్యాపేట జిల్లాలో ఎంపికైన లబ్ధిదారులకు పాడిపరిశ్రమ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. 60 శాతం సబ్సిడీ పోను.. మిగతా రుణం రూ.1.60 లక్షలను ఇండియన్ బ్యాంకు ద్వారా అందించారు. మొత్తం రూ.4 లక్షలకు గాను రూ.75 వేలు షెడ్ ఏర్పాటుకు, రూ.25 వేలు పశుగ్రాసానికి, నాలుగు పాడి పశువుల కొనుగోలుకు రూ.3 లక్షలు నిర్ధారించారు. 25 మంది లబ్ధిదారులను ఒక సొసైటీ చొప్పున ఏర్పాటుచేశారు. విజయడెయిరీ కేంద్రంలో పాలు విక్రయించి లబ్ధిదారులు బ్యాంకు రుణ వాయిదాలను చెల్లించుకునేందుకు వీలు కల్పించారు. నేరుగా లబ్ధిదారుడి ఖాతాలోనే డబ్బు జమచేశారు. ఈ కార్యక్రమం కింద గ్రామాల్లో బర్రెలు పొందిన ప్రతి కుటుంబానికి నెలకు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ఆదాయం వచ్చేలా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు దృష్టిసారించారు.

**కార్యక్రమం అమలు తీరు**

- దళిత కుటుంబాలు ఎక్కువగా ఉండే గ్రామాలను ఎంపికచేసి అక్కడి వనరులు, పాడిరంగం కొనసాగించేందుకు అనువైన పరిస్థితులను గుర్తించి, ఆసక్తి ఉన్నవారికి శిక్షణ ఇచ్చి.. అర్హులను ఎంపికచేస్తారు.
- గ్రామాలవారీగా 25 మందితో సొసైటీని ఏర్పాటుచేసి.. విధివిధానాలు రూపొందిస్తారు.
- ఈ సొసైటీల్లను డెయిరీ ఫెడరేషన్‌లో నమోదు చేయిస్తారు.
- ప్రతి గ్రామంలో పాల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తారు. కొనుగోలుకు ముందుకొచ్చిన విజయడెయిరీ సంస్థకు పాలను విక్రయిస్తారు.
- పాల సేకరణ, రవాణా ద్వారా నిరుద్యోగులకు సైతం ఉపాధి దక్కుతుంది.
- గ్రామాల నుంచి మిల్క్ చిల్లింగ్ కేంద్రాలను పాలను తరలించేందుకు నిరుద్యోగులకు ఎస్సీ ఆర్థిక సహకారం పథకం కింద సబ్సిడీపై వాహనాలను ఇప్పిస్తారు.

**Bhoj Reddy Engineering College for Women**
Vinaynagar, Santoshnagar Crossroads, Saidabad, Hyderabad - 500 059, Telangana
**Admissions to all Management Seats in**
**B Tech Courses: CSE-36, ECE-54, EEE-18, IT-36**
based purely on JEE (Main) Rank, EAMCET Rank & Intermediate (10+2) Marks
**No donation, No capitation fee, No broker commission.**
**Only fee fixed by government**
Application form and detailed notification may be obtained from the college free of cost or may be downloaded from www.brecw.ac.in.
Applications must be submitted in college office by 5 pm on 17th July 2019

**LORDS INSTITUTE OF ENGINEERING AND TECHNOLOGY**
Estd 2002 | Approved by AICTE | Accredited by NBA
**Affiliated to OSMANIA UNIVERSITY**
ACCREDITED 'A' Grade by NAAC | 8 kms from Mehdipatnam
Survey No. 32, Near Kali Mandir, Himayatsagar, Hyderabad - 500 091
Corporate Office: 3rd Floor, KFC McDonald's Building, Pillar No. 4, Mehdipatnam, Hyd-28
Ph: 9849510141, 8008885731, 9849519365 | www.lords.ac.in
**ADMISSION NOTIFICATION FOR 'B' CATEGORY**
Applications are invited for admissions under 'B' Category for the following courses for the Academic Year 2019 - 2020

| Course | CSE | IT | CIVIL | MECH | ECE | PET | EEE |
|---|---|---|---|---|---|---|---|
| Intake | 180 | 120 | 180 | 240 | 120 | 120 | 60 |
| Category - B | 54 | 36 | 54 | 72 | 36 | 36 | 18 |

Candidates who wish to opt for admission under Category B seat can apply by downloading the form from college website and submitting the filled form in person either at corporate office or College campus or e-mailing the filled application to admissions@lords.ac.in. Last date for submission is 25/07/2019 from 10 AM to 5 PM. The seats will be allotted on the basis of guidelines given by Convener TS-EAMCET and approvals by Government bodies. Application fee INR: 500/-
Sd/ Principal

## ఆగస్టు 6న కృష్ణా బోర్డు భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొత్త నీటి సంవత్సరం మొదలైన నేపథ్యంలో ఆగస్టు 6న రెండు రాష్ట్రాలతో సమావేశాన్ని నిర్వహించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు నిర్ణయించింది. బోర్డు సభ్యకార్యదర్శి పరమేశం రెండు రాష్ట్రాల ఈఎన్సీలకు బుధవారం లేఖ రాశారు. సమావేశంలో కృష్ణాజలాల పంపిణీ, బోర్డు కార్యాలయం విజయవాడకు తరలింపు, టెలిమెట్రీ రెండోదశ అమలు, బోర్డు వర్కింగ్ మాన్యువల్ తదితర అంశాలను ఎజెండాగా నిర్ధారించారు.

## గురుకుల డిగ్రీ బోధకుల ఇంటర్వ్యూ ఫలితాల వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గురుకుల డిగ్రీ బోధకుల నియామకానికి చేపట్టిన ఇంటర్వ్యూల్లో అభ్యర్థులు సాధించిన మార్కులు, అర్హత వివరాలను తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామక బోర్డు బుధవారం వెల్లడించింది. తెలంగాణ గురుకుల డిగ్రీ కాలేజీల్లో 466 బోధకుల నియామకానికి సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైనవారి మార్కులు, వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. అభ్యర్థులు treirb.telangana.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా టీఆర్‌ఈఐఆర్బీ వెల్లడించింది.

## వైద్య విద్యసీట్లపై డీఎంఈలతో ఢిల్లీలో సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో సీట్ల భర్తీపై అన్ని రాష్ట్రాలకు చెందిన వైద్య విద్య డైరెక్టర్ల (డీఎంఈ)తో బుధవారం ఢిల్లీలో జాతీయస్థాయి సమావేశం నిర్వహించారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో మెడికల్ పీజీ సీట్ల భర్తీ, విద్యావిధానంలో మార్పులు వంటి అంశాలపై చర్చించారు. ఈ ఏడాది నుంచి అమలుచేయనున్న ఈడబ్ల్యూఎస్ విధివిధానాలను వెల్లడించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి 10శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రం నిర్ణయించింది. ఆ మేరకు రాష్ట్రాలవారీగా ఈడబ్ల్యూఎస్ కోటాపై సూచనలు చేశారు.

## ఆన్‌లైన్‌లో మెడికల్ పీజీ కోర్సు!

- మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతిపాదన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ విద్యాసంవత్సరం నుంచి ఆన్‌లైన్ విధానంలో మెడికల్ పీజీ కోర్సులను నిర్వహించాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) ప్రతిపాదించింది. ప్రస్తుత పీజీ విద్యార్థులు వారి రెండో సెమిస్టర్‌ను ఆన్‌లైన్ విధానంలో పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఎంసీఐ ప్రతిపాదించింది. మెడికల్ పీజీ ఆన్‌లైన్ కోర్సును ఐసీఎంఆర్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజీ నిర్వహిస్తున్నదని, విద్యార్థులు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, దీనికి సంబంధించి పూర్తి వివరాలను ఎంసీఐ వెబ్‌సైట్‌ద్వారా పొందవచ్చని సూచించారు.

**ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన**
(పంటల బీమా పథకం) PMFBY (GO.Rt. No.156), RWBCIS (GO.Rt. No.157) & UPIS (GO.Rt. No.158) Dt. 03-05-2019
సత్యమేవ జయతే
**PMFBY మరియు RWBCIS ఖరీఫ్ 2019. నిర్ణీత పంటలు బీమా ప్రీమియం వివరాల పట్టికలు**

| నిర్ణీత పంటలు | జిల్లాలు | బీమా మొత్తం ఎకరాకు (రూ.) | రైతు చెల్లించవలసిన ప్రీమియం రేటు | రైతు చెల్లించవలసిన ప్రీమియం ఎకరాకు (రూ.) | బీమా చేసుకొనుటకు చివరి తేది |
|---|---|---|---|---|---|
| వరి | AIC కేటాయించిన అన్ని జిల్లాలు | 34,000/- | 2.00% | 680/- | 31 ఆగష్టు 2019 |
| మొక్క జొన్న | | 25,000/- | 2.00% | 500/- | 31 జూలై 2019 |
| జొన్న | | 14,000/- | 2.00% | 280/- | |
| కందులు | | 14,000/- | 2.00% | 280/- | |
| పెసర | | 15,000/- | 2.00% | 300/- | |
| మినుములు | | 15,000/- | 2.00% | 300/- | |
| సోయా చిక్కుడు | | 22,000/- | 2.00% | 440/- | |
| వేరుశనగ | | 19,000/- | 2.00% | 380/- | |
| పసుపు | మహబూబాబాద్ | 60,000/- | 2.00% | 1,200/- | |
| | సంగారెడ్డి, వరంగల్ (రూ) | 60,000/- | 3.50% | 2,100/- | |
| | నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్ | 60,000/- | 5.00% | 3,000/- | |

**PMFBY పథకంలో ఈ క్రింద పేర్కొన్న విపత్తులకు బీమా సౌకర్యం**
○ దిగుబడి నష్టంపై ఆధారపడి (విత్తినప్పటి నుండి పంట కోతవరకు)
○ విత్తలేకపోవుట/నాట్లు వేయలేకపోవుట (ప్రధాన పంటకు మాత్రమే)
○ స్థానిక విపత్తులు : ☛ పంట మధ్యకాలంలో ☛ పంటకోతల తర్వాత

**RWBCIS పథకంలో బీమా చేయబడే వాతావరణ అంశాలు**
○ అల్ప వర్షపాతం (ఎ) వర్షపాత పరిమాణము (బి) వర్షపాత విస్తీరణం
○ అధిక ఉష్ణోగ్రత
○ అల్ప ఉష్ణోగ్రత
○ అధిక వర్షపాతం
○ అల్పనీటి ఆవిరి పీడనం
○ అధిక ఉష్ణోగ్రత మరియు అధిక శాతం గాలిలో తేమ

| నిర్ణీత పంటలు | బీమా మొత్తం ఎకరాకు (రూ.) | రైతు చెల్లించవలసిన ప్రీమియం రేటు | రైతు చెల్లించవలసిన ప్రీమియం ఎకరాకు (రూ.) | బీమా చేసుకొనుటకు చివరి తేది |
|---|---|---|---|---|
| ప్రత్తి | 35,000/- | 5.00% | 1750/- | 15 జూలై 2019 |
| మిరప | 55,000/- | 5.00% | 2750/- | 31 ఆగష్టు 2019 |
| బత్తాయి | 40,000/- | 5.00% | 2000/- | 09 ఆగష్టు 2019 |
| ఆయిల్ పామ్ | 32,000/- | 5.00% | 1600/- | 14 జూలై 2019 |
| టమాట | 30,000/- | 5.00% | 1500/- | 31 ఆగష్టు 2019 |

★ PMFBY పథకం ప్రాంతాలవారీగా (Area approach) అమలు చేయబడుతుంది. ★ ప్రతి జిల్లాలో ఒక ప్రధాన పంటకు గ్రామం / గ్రామాలను ఒక బీమా యూనిట్‌గా అమలు చేయబడును.
★ రైతులు బీమా తీసుకొనుటకు బ్యాంకులను, వ్యవసాయ/ఉద్యానవన అధికారులను, ఎంపికైన సూక్ష్మ బీమా సంస్థల ద్వారా, లేదా ఆన్‌లైన్ (https://pmfby.gov.in) పోర్టల్ ద్వారా తగిన ప్రీమియం (NEFT) ద్వారా చెల్లించి ప్రపోజల్ ఫారం నింపి ఈ క్రింద పేర్కొన్న ధృవీకరణ పత్రాలను సమర్పించవలెను. 1) ఆధార్ కార్డు నకలు 2) బ్యాంకు పాసుబుక్ నకలు / బ్యాంకు ఎకౌంటు వివరాలు 3) ఋణం తీసుకోని రైతులైతే పట్టాదారు పాసుబుక్ నకలు మరియు పంట ధృవీకరణ పత్రము సమర్పించవలెను.
గమనిక : కామన్ సర్వీస్ సెంటర్ (CSC) ద్వారా బీమా చేయించుకొను రైతులు సరిపడ ప్రీమియం (నగదు) చెల్లించి స్కానింగ్ కొరకు ధృవీకరణ పత్రాలు ఇవ్వవలసి ఉంటుంది. స్కానింగ్ 5 పత్రాల వరకు ఉచితము, 5 ప్రతాలకు మించితే రైతులు ఒక్కొక్క పేజీకి 2 రూపాయలు చెల్లించవలసి ఉంటుంది.
★ AIC ద్వారా, జిల్లాల వారీగా బీమా అమలు అవుతున్న పంటలు మరియు పంటల బీమా పథకం గురించి అధిక వివరాల కొరకు కేంద్ర ప్రభుత్వ వెబ్ పోర్టల్ www.pmfby.gov.in ను సంప్రదించగలరు.
★ అధిక వివరాల కొరకు బ్యాంకులను, వ్యవసాయ / ఉద్యానవన అధికారులను, అనుమతింపబడిన మధ్యవర్తి సంస్థలు, CSC లేదా మా కార్యాలయాన్ని సంప్రదించండి.
**అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లి.**
ప్రాంతీయ కార్యాలయం, యునైటెడ్ ఇండియా టవర్స్, 8వ అంతస్తు, బషీర్‌బాగ్, హైదరాబాద్-500 029. ఫోన్ : 040-23242594, 23242595, 23242596, 23240235
www.aicofindia.com, e-mail : ro.hyderabad@aicofindia.com
ఏదైనా ఫిర్యాదు వున్నచో, మా ప్రాంతీయ కార్యాలయంలోని ఫిర్యాదులు పరిష్కరించే అధికారిని సంప్రదించగలరు.
सम्पन्न भारत की पहचान, बीमित फसल खुशहाल किसान పంటల బీమా రైతన్నకు ధీమా
బీమా అభ్యర్థించవలసిన అంశం
కృషక యత్న రక్షణమ్
టోల్ ఫ్రీ నెంబరు 1800 599 2594
ఇది ప్రకటన మాత్రమే (షరతులు వర్తిస్తాయి)
AICROHYD/2019-20/001 For Grievance Redressal, kindly log on to http:// www.aicofindia.com/AICEng/Pages/Grievance_Home.aspx

నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE





చంద్రుగొండలో వాటర్‌ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న ఆదివాసీ నాయకపోడు రైతులు

## సీలింగ్ భూమిని ఇప్పించండి

- వాటర్ ట్యాంక్ ఎక్కిన ఆదివాసీ నాయకపోడు రైతులు
- చంద్రుగొండ తాసిల్దార్ హామీతో ఆందోళన విరమణ

**చంద్రుగొండ:** సీలింగ్ భూములను తమకు అప్పగించాలని, సదరు భూములకు రైతుబంధు పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం దామరచర్ల సీలింగ్ భూముల ఆదివాసీ రైతులు తాసిల్ కార్యాలయంలోని వాటర్ ట్యాంక్ ఎక్కారు. 32 రోజులుగా తాసిల్ ఎదుట రిలే నిరాహారదీక్షలు చేస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని వాపోయారు. 130 ఎకరాల సీలింగ్ భూమిని వెంటనే అధికారులు స్వాధీనం చేసుకొని తమకు అప్పగించాలని కోరారు. సమాచారం అందుకున్న తాసిల్దార్ రావూరి రాధిక అక్కడికి వచ్చి రైతులతో మాట్లాడారు. దీంతో రైతులు కిందికి దిగి వచ్చారు. 130 ఎకరాల సీలింగ్ భూమికి సంబంధించి గిరిజనేతరులకు నోటీసులు జారీచేశామని, త్వరలోనే స్వాధీనం చేసుకొంటామని చెప్పారు. అప్పటివరకూ ఆందోళన విరమించాలని కోరారు. దీనికి సమ్మతించిన ఆదివాసీ నాయకపోడు రైతులు ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎస్సై ప్రసాద్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించగా, కొత్తగూడెం ఫైర్‌స్టేషన్ సిబ్బంది ముందస్తు జాగ్రత్తగా వాహనంతో అక్కడ వేచి ఉన్నారు.

## జనగామ ఆర్డీవో ఆఫీస్ ఎదుట రైతు ధర్నా

- అవినీతి అధికారులను సస్పెండ్‌చేయాలని డిమాండ్
- భూమి కొలతలు సరిచేయాలంటే రూ.లక్ష అడిగారని ఆరోపణ
- తనకు న్యాయంచేయాలని ఓబుల్‌కేశ్వాపూర్ రైతు వేడుకోలు



జనగామ ఆర్డీవో కార్యాలయం ప్రధాన ద్వారం మెట్లపై బైఠాయించిన వృద్ధ రైతు కృష్ణారెడ్డి

**జనగామ, నమస్తే తెలంగాణ:** 'వ్యవసాయ భూమి కొలతలు సరిచేయాలని కోరినందుకు రూ.లక్ష లంచం అడిగి.. ఇవ్వకపోవడంతో రెండేండ్ల నుంచి కార్యాలయం చుట్టూ తిప్పించుకొంటున్న డీఐ శ్రీనివాస్, జనగామ ఎంసీ ప్రకాశ్‌ను సస్పెండ్ చేయాలి.. ఇట్లు పేద రైతు ఓబుల్‌కేశ్వాపూర్' అని రాసి ఉన్న ప్లకార్డును ప్రదర్శిస్తూ ఓ వృద్ధ రైతు జనగామ ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్‌కు చెందిన జన్నెపల్లి కృష్ణారెడ్డి పేరిట గ్రామ శివారులోని సర్వే నంబర్ 452లో ఉన్న 3.20 ఎకరాల్లో 3.05 ఎకరాలను బీసీ కాలనీ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి విక్రయించారు. అయితే రెవెన్యూ అధికారులు మాత్రం మొత్తం 3.20 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని హద్దురాళ్లు పాతారు. బీసీ కాలనీకి ఇచ్చిన 3.05 ఎకరాలు మినహాయిస్తే తనకు అందులోంచి రావాల్సిన 15 గుంటలకు హద్దులు చూపి తనకు అప్పగించాలని ఉన్నా రెవెన్యూ అధికారులు ఏండ్ల తరబడి కాలయాపన చేస్తున్నారని కృష్ణారెడ్డి ఆవేదన చెందుతున్నారు. బీసీ కాలనీ నిర్మించిన ప్రాంతంలో ధరలు పెరుగడంతో గుంటకు రూ.లక్ష చొప్పున ధర పలుకుతున్నదని, సర్వే చేసి 15 గుంటలు చూపిస్తే రూ.15 లక్షలు వస్తాయని, ముందుగానే రూ.లక్ష ఇస్తే పని చేసి పెడుతామంటూ డీఐ, ఎంసీ డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. 'భూమి కొలతలు సరిచేస్తే అదనంగా భూమి తేలుతది.. అమ్ముకుంటే రూ.లక్షలు వస్తాయి.. మరి మాకేంటి లాభం' అంటూ అధికారులు రెండేండ్లుగా ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తనకు న్యాయం జరిగే వరకు కదలబోనన్నారు. దీంతో ఆర్డీవో మధు మోహన్ హుటాహుటిన కార్యాలయానికి చేరుకొని డీఐ, ఎంసీకి నోటీసులు జారీచేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు సర్వే జరిపించి న్యాయంచేస్తానని నచ్చజెప్పడంతో బాధితుడు శాంతించారు.

## మా భూమిని మరొకరికి పట్టా చేశారు



**మాక్లూర్:** 'నా పేరు పాతర్ల గంగాధర్. మాది నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం కొత్తపల్లి. నాకు మా ఊరి శివారులో సర్వే నంబర్లు 198/అ/పీ 2 లో 36 గుంటలు, 198/ఆ/పీ 2 లో 12 గుంటలు, 233/ఆ 1 లో 34 గుంటలు, 393/5పీ 2 లో 25 గుంటల భూమి ఉన్నది. ఈ భూములకు ఇప్పటివరకు పాస్‌పుస్తకాలు ఉన్నాయి. 1-బీ పత్రాలూ ఉన్నాయి. 2017, 18 ఆన్‌లైన్ పహాణీలలో కూడా భూమి నమోదై ఉన్నది. రైతుబంధు డబ్బులు కూడా వచ్చాయి. కొన్నాళ్ల కిందట నాకు తెలియకుండా 198/అ/పీ 2 లోని 36 గుంటల్లో నుంచి 12 గుంటలను అధికారులు రికార్డుల నుంచి తొలగించి మరొకరికి పట్టాచేశారు. న్యాయంచేయాలని తాసిల్ కార్యాలయం చుట్టూ ఏడాదిగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. తాసిల్దార్‌ను అడిగితే భూ సర్వే చేయించుకోవాలన్నారు. సర్వేలో వస్తే భూమిని రికార్డుల్లోకి ఎక్కిస్తామన్నారు. మండల కార్యాలయం నుంచి సర్వేయర్ వచ్చి కొలతలు చేయగా, మాకు మొత్తం 36 గుంటల భూమి వచ్చింది. అయినా రికార్డులను సవరించలేదు. పాత పాస్‌బుక్‌లు, పహాణీలు, 1-బీ చూపిస్తే.. సర్వే అన్నారు. సర్వే చేయిస్తే ఇప్పుడు పలుకడంలేదు. మా భూమిని మాకు కేటాయించి న్యాయం చేయాలని వేడుకొంటున్నా.'

- పాతర్ల గంగాధర్, కొత్తపల్లి, మాక్లూర్ మండలం, నిజామాబాద్ జిల్లా

### న్యాయంచేస్తాం..

సర్వే నంబర్ 198/ఆ/పీ2లో 36 గుంటల భూమి ఉన్నది వాస్తవమే. కానీ, భూరికార్డుల ప్రక్షాళన సమయంలో ఇందులోనుంచి 12 గుంటలను అధికారులు తొలగించారు. 24 గుంటల భూమిని మాత్రమే రికార్డుల్లోకి ఎక్కించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితుడికి న్యాయం చేస్తాం. గ్రామంలో కూడా విచారణ చేస్తాం. సర్వేప్రకారం ఆతనికి న్యాయం చేస్తాం.

- రాజేశ్, వీఆర్వో, కొత్తపల్లి

# కోర్టు తీర్పిచ్చినా కనికరించలేదు

ఇరవై ఏండ్లు మ్యుటేషన్ చేయకుండా తాత్సారం
ఓఆర్సీ సృష్టించి మరొకరికి పాస్‌పుస్తకాలు
2011లో కోర్టు ఆర్డర్ ఇచ్చినా అమలుచేయని అధికారులు
కబ్జాదారుల చెరవీడని ఐదున్నర ఎకరాల భూమి
ధర్మగంటను ఆశ్రయించిన వికారాబాద్ జిల్లా రావులపల్లి రైతు

**వికారాబాద్, నమస్తే తెలంగాణ:**

వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం రావులపల్లి గ్రామానికి చెందిన కల్వ పాండయ్య.. అదే గ్రామానికి చెందిన అవుసలి దశరథం వద్ద సర్వే నంబర్ 156లోని 5.27 ఎకరాల భూమిని 1970లో కొన్నారు. తన కుమారుడు కల్వ శ్రీనివాస్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. ఎన్నిసార్లు దరఖాస్తులు పెట్టుకున్నా ఆ భూమికి అధికారులు మ్యుటేషన్ చేయలేదు. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడంతో భూమిని అదేగ్రామంలో ఉండే చెల్లెలు సుశీల, బావ నారాయణకు కౌలుకు ఇచ్చి పాండయ్య ఉపాధి కోసం వికారాబాద్‌కు వలసవెళ్లారు. ఆ తర్వాత కూడా మ్యుటేషన్ కోసం యత్నించినా పనికాకపోవడంతో 1989లో వికారాబాద్ ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తుచేశారు. అయినా, కల్వ శ్రీనివాస్ పేరిట మ్యుటేషన్ చేయని అధికారులు.. 1991లో సుశీల పేరిట ఓఆర్సీ (ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్) సృష్టించి పాస్‌పుస్తకాలు జారీచేయడంతోపాటు, మ్యూటేషన్ కూడాచేశారు. 1996లో సుశీల ఆ భూమిని తాను పెంచుకొన్న కొడుకు వీరేశం కుమారుడు నరేశ్ పేరిట గిఫ్ట్‌డీడ్‌గా రిజిస్ట్రేషన్‌చేశారు. 2004 వరకు కౌలు చెల్లించిన నరేశ్ ఆ తర్వాత ఇవ్వకపోవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో కల్వ శ్రీనివాస్ 2007లో వికారాబాద్ సీనియర్ సివిల్ కోర్టులో కేసువేశారు. 2011 డిసెంబర్‌లో కల్వ శ్రీనివాస్‌కు అనుకూలంగా తీర్పునిస్తూ రెండు నెలల్లో అతడికి భూమిని అప్పగించాలని కోర్టు ఆర్డర్ ఇచ్చింది. అయినప్పటికీ కబ్జాలో ఉన్నవారు దౌర్జన్యానికి దిగుతుండటంతో ఏమీ చేయలేకపోతున్నానని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశారు. కోర్టు ఆర్డర్ తీసుకొని అధికారుల చుట్టూ ఎనిమిదేండ్లు తిరిగినా నరేశ్ పేరిట ఉన్న పట్టాను రద్దుచేయలేదని, తన భూమిని ఇప్పించడం లేదని వాపోయారు. చివరకు గత జూన్ 28న నరేశ్ పేరిట ఉన్న పాత పాస్‌పుస్తకాన్ని రద్దు చేసినట్టు చెప్తున్నారని.. భూమి వివాదంలో ఉన్నట్టు పేర్కొంటూ పార్ట్-బీలో చేర్చారని పేర్కొన్నారు.

### నా భూమిని ఇప్పించండి

1970లో కొన్న భూమికి 20 ఏండ్లపాటు మ్యుటేషన్ చేయని అధికారులు నకిలీ పత్రాలతో మా అత్త పేరిట పట్టాచేశారు. 1990లో మా మామ చనిపోగానే మా అత్త దుర్బుద్ధితో రిజిస్ట్రేషన్ చేయించుకొని.. మనుమడి పేరిట గిఫ్ట్‌డీడ్ రాసింది. విషయం తెలిసి కోర్టులో కేసు వేయగా మాకు అనుకూలంగా తీర్పుఇచ్చినా.. అధికారులు ఇప్పటివరకు నా పేరుమీదకు భూమిని మార్చలేదు. కబ్జాదారుడు దౌర్జన్యానికి దిగుతుండటంతో నిస్సహాయంగా ఉండిపోయాను. జూన్ 20న భూమిలో పంట వేసేందుకు వెళ్లి చదును చేసి రాగా కబ్జాకోరులు వచ్చి దౌర్జన్యంగా దున్నేశారు. భూమిలోకి వెళ్లాలంటే భయంగా ఉన్నది. కోర్టు ఆర్డర్ తీసుకొని తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయగా జూన్ 28న వివాదాస్పదంగా ఉన్నదని పేర్కొంటూ వారి పాత పట్టాదారు పాస్‌పుస్తకాలను కొట్టివేశారు. నా భూమిని నాకు ఇప్పించాలని గత సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదుచేశాను.



- కల్వ శ్రీనివాస్, రావులపల్లి, మర్పల్లి మండలం

### పరిశీలించి న్యాయంచేస్తాం

రికార్డులను పరిశీలించి బాధితుడు కల్వ శ్రీనివాస్‌కు న్యాయం జరిగేలా చూస్తాం. నేను ఈ మండలానికి కొత్తగా వచ్చాను. గతంలో ఏం జరిగిందో తెలుసుకొని సమస్య పరిష్కారానికి కృషిచేస్తా.

- ఆశాజ్యోతి, మర్పల్లి తాసిల్దార్

## వీఆర్వో ఆఫీసులో రైతుకు గుండెపోటు..
## దవాఖానకు తరలిస్తుండగా మృతి

- పాస్‌బుక్ కోసం రెండేండ్లుగా తిరుగుతున్న బాధితుడు
- ఖమ్మం జిల్లా కూసుమంచిలో ఘటన

**కూసుమంచి:** తన భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం కోసం రెండేండ్లుగా తిరుగుతూ విసిగిపోయిన రైతు బుధవారం వీఆర్వో కార్యాలయంలో గుండెపోటుతో మృత్యువాతపడ్డారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కూసుమంచిలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కూసుమంచి మండలం చేగొమ్మకు చెందిన రైతు గిరిబోయిన కోటేశ్వరరావు (44)కు అదే గ్రామంలో సుమారు మూడెకరాల భూమి ఉన్నది. దీనికి పాస్‌పుస్తకం కోసం గతంలో ఉన్న వీఆర్వో వద్దకు, తాసిల్ కార్యాలయానికి తిరిగారు. ఇటీవల వీరబాబు అనే మరో వీఆర్వో బదిలీపై రాగా, అతడి వద్దకు కూడా పలుమార్లు వెళ్లి తన సమస్యను విన్నవించారు. ఈ క్రమంలో బుధవారం కూసుమంచి తాసిల్ కార్యాలయం ఎదురుగా ఉన్న వీఆర్వో వీరబాబు వ్యక్తిగత కార్యాలయానికి కోటేశ్వరరావు వచ్చారు. ఆ సమయంలో వీఆర్వో తాసిల్ కార్యాలయంలోకి వెళ్లగా.. రైతు కోటేశ్వరరావు అక్కడే ఎదురుచూస్తున్న క్రమంలో కొద్దిసేపటికి గుండెపోటు వచ్చి స్పృహతప్పి పడిపోయారు. అక్కడే ఉన్న రెవెన్యూ ఉద్యోగి, రైతులు అతని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని కోటేశ్వరరావును ఖమ్మం దవాఖానకు తరలిస్తుండగా మృతిచెందినట్టు గ్రామస్థులు తెలిపారు. తన భూమి పట్టాదారు పాస్‌పుస్తకం కోసం రెండేండ్లుగా తిరిగి వేసారిన రైతు గుండెపోటుతో మృత్యువాతపడటాన్ని గ్రామస్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. రెవెన్యూ అధికారుల వైఖరి పట్ల వారు నిరసన వ్యక్తంచేశారు.



రైతు కోటేశ్వరరావు (ఫైల్)

## వారసత్వ భూమి ఒక్కరికే పట్టా



**రాజాపేట:** నా పేరు మాసపేట జగన్‌రెడ్డి. మాది జనగామ జిల్లా, బచ్చన్నపేట మండలం, నారాయణపురం. మా తండ్రి నారాయణరెడ్డి పేరిట యాదాద్రి భువనగిరి జిల్లా, రాజాపేట మండలం, బొందుగులలో సర్వే నంబర్లు 437, 438, 440 లలో 20.20 ఎకరాల భూమి ఉన్నది. మేము ముగ్గురం అన్నదమ్ములం. ఇద్దరు అన్నదమ్ములం ఉపాధి కోసం హైదరబాద్‌కు వెళ్లాం. మా నాన్న 2012లో మృతి చెందగా, ఆయన పేరిట ఉన్న భూమిని ముగ్గురు అన్నదమ్ముల పేరిట ఫౌతీ చేయాలని 2013లో రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొన్నాం. రికార్డులు పరిశీలించిన అధికారులు 2008లోనే మా పెద్దన్న పేరిట పట్టా మార్పిడి జరిగిందని చెప్పారు. ఎవరికీ సమాచారం ఇవ్వకుండా మా పెద్దన్న పేరిట పట్టా మార్పిడి ఎలా చేశారని అధికారులను అడిగితే అప్పటి తాసిల్దార్, వీఆర్వో చేశారని చెప్తున్నారు. పట్టా మార్పిడిచేసిన అమైన్‌మెంట్ కాపీ, నకలు ఇవ్వాలని దరఖాస్తు చేసుకొంటే.. రెండేండ్ల తర్వాత సంబంధిత రిజిస్టర్ దొరకడంలేదని అంటున్నారు. వారసత్వ భూమిని ముగ్గురు అన్నదమ్ములకు సమానంగా పట్టాచేయాలని అధికారులను కోరితే ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. భువనగిరి ఆర్డీవోకు అర్జీ పెట్టుకోగా మూడేండ్లు తిప్పించుకొన్నారు. కనీసం రికార్డులు కూడా పరిశీలించకుండా మా పెద్దన్న కాస్తులో ఉన్నాడు కాబట్టి ఆ భూమి అతనికే వర్తిస్తుందని, వాటాలు కావాలంటే కోర్టుకు వెళ్లమని ఉచిత సలహా ఇచ్చారు. లంచం తీసుకొని ఒక్కరికే పట్టాచేసిన అధికారులపై చర్యలు తీసుకొని, మాకు న్యాయంచేయండి.

- మాసపేట జగన్‌రెడ్డి, నారాయణపురం, జనగామ జిల్లా

## ఈటూరు వీఆర్వో సస్పెన్షన్

ఉత్తర్వులు జారీచేసిన సూర్యాపేట కలెక్టర్ అమయ్‌కుమార్

**నాగారం:** సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని ఈటూరు గ్రామ రెవెన్యూ అధికారి బైరబోయిన వెంకన్నను సస్పెండ్‌చేస్తూ జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేసినట్టు తాసిల్దార్ మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈటూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 135, 144 లలో కొందరు ఇండ్లు నిర్మించుకొన్నారు. అయితే వీఆర్వో ఈ స్థలాలను వ్యవసాయ భూమిగా పట్టా మార్పిడిచేసి స్థానికుడు గంట సోమిరెడ్డికి పాస్‌పుస్తకం జారీచేయడంతో గ్రామస్థులు తాసిల్దార్‌కు ఫిర్యాదుచేశారు. విచారణ జరిపిన అనంతరం కలెక్టర్ సస్పెండ్ చేసినట్టు వివరించారు.

## లక్ష ఇవ్వలేదని పట్టా మార్చిండ్రు

**దహెగాం:** మా పేర్లు జనగాం తారాబాయి, రత్నం సుగుణ. మేమిద్దరం అక్కాచెల్లెళ్లం. మా తల్లిగారి ఊరు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా, దహెగాం మండలం, చంద్రపల్లి గ్రామం. మా తండ్రి దుర్గం సుబ్బయ్య 15 ఏండ్ల కింద, తల్లి లస్మక్క ఐదేండ్ల కింద చనిపోయారు. మా తండ్రి దుర్గం సుబ్బయ్య పేరిట చంద్రపల్లి శివారులోని సర్వే నంబర్ 241లో 5.35 ఎకరాల భూమి ఉన్నది. మా నాయిన చనిపోయిన తర్వాత మూడేండ్లకు మా పాలోళ్లు (తండ్రి తరపు బంధువులు) మమ్ములను బెదిరించి భూమిని ఆక్రమించుకొన్నారు. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో సర్వే కోసం అధికారులు వచ్చినప్పుడు మా నాయిన పేరిట ఉన్న భూమిని మా పేరిట పట్టాచేయాలని అడిగినం. రూ.లక్ష లంచం ఇస్తే పనిచేసి పెడుతామని చెప్పిండ్రు. మా తాన అంత డబ్బు లేదని చెప్పినం. ఎంత వేడుకున్నా కనికరం చూపలేదు. ఆ తర్వాత మా పాలోళ్ల దగ్గర పైసలు తీసుకొని.. నలుగురి పేరిట మొత్తం భూమి పట్టా చేసిండ్రు. పోలీస్‌స్టేషన్, తాసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదుచేసినం. అధికారులెవరూ పట్టించుకోలేదు. ఇటీవల ప్రజావాణిలో కలెక్టర్, కాగజ్‌నగర్‌లో ఆర్డీవోకు న్యాయంచేయాలని వినతి పత్రాలు ఇచ్చినం. వారి పేరిట ఏ నిబంధనల ప్రకారం పట్టాచేశారో సమాచారం ఇవ్వాలని ఆర్టీఐ ద్వారా సమాచారం కోరగా ఫైల్, ఫాం నంబర్ -7 నమోదు కాలేదని చెప్పిండ్రు. ఇప్పటికీ మేము రెండెకరాల భూమిని సాగు చేసుకొంటున్నం. కానీ పట్టా లేదు. రేపో మాపో బెదిరించి ఆయింత భూమి కూడా తీసుకొంటరు. ఈ విషయంపై పూర్తి విచారణ జరిపించి మాకు న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నం.



- జనగాం తారాబాయి, రత్నం సుగుణ, చంద్రపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా

# పైసలిచ్చినోడికే పట్టా!

అసలు యజమానుల భూములు తగ్గించి.. వేరేవారి పేరిట మార్పు
జయశంకర్ భూపాలపల్లి జిల్లా యత్నారంలో వీఆర్వో బాగోతం
రెవెన్యూ కార్యాలయాల చుట్టూ గిరిజనుల ప్రదక్షిణలు

**మహాముత్తారం (జయశంకర్ భూపాలపల్లి):** రెవెన్యూ అధికారుల తీరుతో అటవీ గిరిజనులు అల్లాడుతున్నారు. రికార్డుల్లో భూములు తక్కువగా నమోదై కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తమకు న్యాయంచేయాలని వేడుకొంటున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం యత్నారం గ్రామ వీఆర్వో పీ రమేశ్ భూరికార్డుల్లో అసలు రైతుల పేర్లను తొలగించి వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. రైతుల పేరు మీద ఉన్న భూమికి ఏదో ఒక బై సర్వే నంబర్ వేసి ఊరిలో లేనివారికి ఒక్కో ఇంట్లో నాలుగైదు పాస్‌పుస్తకాలు జారీచేశారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. యత్నారం గ్రామంలో టీఫన్, సెత్వార్ ప్రకారం ఉన్న భూమికి రెట్టింపుగా వీఆర్వో పట్టాలు చేయడంతో గతంలో ఆర్డీవో షోకాజ్ నోటీసులు కూడా పంపారు. ఆ తప్పును పూడ్చేందుకు అసలు రైతుల భూములను గోల్‌మాల్ చేశారని యత్నారం గిరిజనులు 'నమస్తే తెలంగాణ' ధర్మగంటను ఆశ్రయించారు. యత్నారం గ్రామం కారడవిలో ఉంటుంది. గ్రామంలోని ప్రజలంతా గిరిజనులే. చదువుకున్నవారు తక్కువగా ఉండటంతో వీఆర్వో ఆటలు సాగుతున్నాయని గిరిజనులు చెప్తున్నారు. యత్నారంతోపాటు సింగంపల్లి, కనుకునూర్, రెడ్డిపల్లి గ్రామాలకు అతడే వీఆర్వో. ఈ గ్రామాలన్నీ అడవిలోనే ఉంటాయి. వారికి రెవెన్యూ కార్యాలయం అంటే ఏమిటో కూడా తెలియని పరిస్థితి. ప్రతి గ్రామంలో సగం మంది దగ్గర పట్టాలు చేయిస్తానని వీఆర్వో రూ.వేలకు వేలు డబ్బు వసూలు చేశారని, పట్టాలు మాత్రం చేయలేదని పలువురు రైతులు చెప్తున్నారు. అసలు ఊరిలో లేనివారి నుంచి వీఆర్వో రమేశ్ డబ్బు తీసుకొని ఒక్కో కుటుంబానికి 40 నుంచి 50 ఎకరాల భూమికి పట్టా ఇచ్చాడని ఆరోపిస్తున్నారు.

### వీఆర్వో పట్టించుకోవడంలేదు



నాకు సర్వేనంబర్ 13/9లో 14 గుంటలు, 14/ 37/2 లో ఎకరం, 14/ 37/3లో ఎకరం, 14/ 9/ఏ/1లో 12 గుంటలు 14/జీ/1/1లో రెండు ఎకరాల భూమి ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం నూతన పాస్‌బుక్ కూడా మంజూరు చేసింది. రైతుబంధు సాయం రెండుసార్లు నా ఖాతాలో పడింది. కానీ, ఇటీవల వీఆర్వో మా భూములను రెవెన్యూ రికార్డుల నుంచి తొలగించి మమ్మల్ని ఆగం చేసిండు. నాలుగున్నర ఎకరాల భూమి ఉండగా, వన్ బీలో మాత్రం రెండు ఎకరాలే చూపిస్తున్నది. రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా వీఆర్వో పట్టించుకోవడం లేదు.

- దయ్యాపు శ్రీను, యత్నారం

### ఆరున్నర ఎకరాలకు 14 గుంటలే వచ్చింది



నాకు సర్వే నంబర్ 7/2లో 14 గుంటలు, 14/15/ఏలో 1.28 ఎకరాలు, 14/15/బీలో 1. 28 ఎకరాలు, 14/38/2లో ఎరకం, 14/ఏ/1లో 1.11 ఎకరాలు, 14/డీలో 19 గుంటల భూమి ఉన్నది. నూతన పట్టాదారు పాస్‌పుస్తకం కూడా మంజూరైంది. రెండుసార్లు రైతుబంధు సొమ్మును తీసుకొని వ్యవసాయనికి పెట్టుబడి పెట్టిన. ఇటీవల వీఆర్వో రమేశ్.. పాస్‌బుక్‌లో మా భూములను తగ్గించాడు. రైతు సమగ్ర సమాచార సేకరణలో భాగంగా నా భూమికి సంబంధించిన ఫారాలు ఇచ్చారు. అందులో ఆరున్నర ఎకరాలకుగాను 14 గుంటలే వచ్చింది. వీఆర్వోను అడిగితే మళ్లీ ఎక్కిస్తానని తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిప్పించుకొంటున్నాడు. నాకు న్యాయం చేయండి.

- కోడూరి రాజ్‌కుమార్, యత్నారం గ్రామం, మహాముత్తారం మండలం

### రికార్డుల నుంచి తొలగించాడు



నాకు యత్నారం గ్రామంలో సర్వే నంబర్ 14/37/1లో 1.17 ఎకరాలు, 14/37/4లో 1.17 ఎకరాలు, 14/75లో 12 గుంటల భూమి ఉన్నది. ప్రభుత్వం కొత్త పాస్‌బుక్ మంజూరుచేసింది. మా ఊరి వీఆర్వో రమేశ్ మాత్రం మొత్తం భూమిని రెవెన్యూ రికార్డుల నుంచి తొలగించాడు. ఎందుకు తొలగించావు అంటే.. మళ్లీ ఎక్కిస్తానని తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిప్పించుకొంటున్నాడు. పట్టాల విషయంలోనూ ఇబ్బందిపెడుతున్నాడు. మా ఊరిలో అసలు భూమే లేనోళ్ల వద్ద రూ.లక్షలు తీసుకొని ఒక్కో కుటుంబానికి 40 నుంచి 50 ఎకరాలు దొంగ పట్టాలు చేసిండు. మహాముత్తారం మండలానికి ఏ వీఆర్వో, తాసిల్దార్ వచ్చినా డబ్బుల సంచులు పట్టుకొని పోవడమే తప్ప రైతులకు న్యాయంచేసిన దాఖలాలు ఎక్కడా లేవు.

- దయ్యాపు ఎర్రయ్య, యత్నారం గ్రామం, మహాముత్తారం మండలం

# సికింద్రాబాద్ స్టేషన్ వైఫై @ 4

- వినియోగంలో దేశంలోనే నాలుగో స్థానం
- నెలకు సగటున 10 లక్షల మంది యూజర్లు




**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఉచిత వైఫై వినియోగంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ దేశంలోనే నాలుగో స్థానంలో ఉన్నది. ఇక్కడ వైఫై వినియోగిస్తున్న ప్రయాణికుల సంఖ్య సగటున నెలకు 10 లక్షలు. 2016 జనవరిలో ముంబై రైల్‌వైర్ పేరిట ఉచిత వైఫై సౌకర్యం ప్రారంభించారు. 26 నెలల్లో భారతీయ రైల్వేలోని 1600 స్టేషన్లకు దీనిని విస్తరించారు. ప్రస్తుతం దక్షిణమధ్య రైల్వేలోని 36 ప్రధాన రైల్వేస్టేషన్లు, 171 చిన్నస్టేషన్లు కలిపి 207 స్టేషన్లలో వైఫై సౌకర్యం ఉన్నది. స్టేషన్లలో వైఫై ఉపయోగించే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. ఉచిత వైఫై సౌకర్యంతో 30 నిమిషాల వ్యవధిలో ఒక్కో వినియోగదారుడు సగటున 343 ఎంబీ డాటా వాడుతున్నారు.

# హైదరాబాద్‌లో రేపు జాతీయ విద్యుత్ సదస్సు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రెండో జాతీయ విద్యుత్ సదస్సు (నేషనల్ పవర్ సమ్మిట్)ను శుక్రవారం (ఈ నెల 12న) హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా సలహాదారుగా.. ఎలెట్స్ టెక్నో మీడియా ప్రై. లి. సంస్థతో కలిసి తెలంగాణ విద్యుత్‌శాఖ ఈ సదస్సును నిర్వహిస్తుండగా.. (తెలంగాణ న్యూ రినువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌రెడ్కో) ఒకరోజు సదస్సుకు ఆతిథ్యం ఇచ్చేందుకు ఏర్పాట్లుచేసింది. సదస్సుద్వారా వినూత్న ఆలోచనలను పంచుకునేందుకు, అవకాశాలను అందిపుచ్చుకునేందుకు తెలంగాణ సరైన వేదికగా నిలువనుంది. జాతీయ విద్యుత్ సదస్సులో వినూత్న ఆలోచనలను పంచుకుంటారని అజయ్‌మిశ్రా తెలిపారు. పటిష్ఠమైన సంబంధాలను నెలకొల్పడం, అవకాశాలు గుర్తించడానికి పాలసీ అజెండాను తయారుచేయడమే లక్ష్యంగా సదస్సును నిర్వహిస్తున్నామని టీఎస్‌రెడ్కో వీసీఎండీ ఎన్ జానయ్య తెలిపారు. సదస్సులో పునరుత్పాదక ఇంధనం, కన్వెన్షనల్ ఎనర్జీ, విద్యుత్ రంగంలో స్మార్ట్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఈ-గవ్ మేగజైన్ (ఈ గవర్నెన్స్‌పై ఆసియాలో మొదటి ప్రీమియర్ మేగజైన్)ను విడుదల చేయనున్నారు.

# వర్క్ టు రూల్‌లో పాల్గొనడం లేదు

- రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వర్క్ టు రూల్‌లో తాము పాల్గొనడంలేదని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి కే సీఆర్, రాష్ట్ర ప్రభుత్వం ఒకటి రెండురోజుల్లో ఈ విషయంపై సానుకూలంగా నిర్ణయం తీసుకుంటుందనే పూర్తి నమ్మకం తమకు ఉన్నదని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని సీసీఎల్‌ఏలోని అసోసియేషన్ కార్యాలయంలో రవీందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల కోసం బదిలీ అయిన తాసిల్దార్లను పాత జిల్లాలకు తిరిగి పంపిస్తారన్న విశ్వాసం తమకు ఉన్నదని తెలిపారు. సీఎస్, ప్రభుత్వ సలహాదారులను తాము కలిశామని, పాత జిల్లాలకు తిరిగి పంపుతామనివారు హామీ ఇచ్చారని చెప్పారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోవడం సరికాదని నిర్ణయించుకొన్నామని, వర్క్ టు రూల్‌లో తమ సంఘం పాల్గొనడంలేదని పేర్కొన్నారు.



## వైభవోపేతం.. ఎల్లమ్మ అమ్మవారి రథోత్సవం



హైదరాబాద్‌లోని బల్కంపేట అమ్మవారి రథోత్సవం బుధవారం కన్నులపండువగా సాగింది. మూడురోజులుగా నిర్వహిస్తున్న అమ్మవారి కల్యాణ మహోత్సవం రథోత్సవంతో ముగిసింది. వివిధరకాల పూలతో అందంగా అలంకరించిన రథంపై అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయ సమీప ప్రాంతాల్లో ఊరేగించారు. రథోత్సవాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు.

-అమీర్‌పేట్, నమస్తే తెలంగాణ

# పంటపై కాలం కాటు

- రాష్ట్రంలో 1.08 కోట్ల ఎకరాలకు 43.33 లక్షల ఎకరాల్లోనే సేద్యం
- ఆరుశాతానికి పడిపోయిన వరిసాగు
- రాష్ట్రంలో 33% లోటు వర్షపాతం
- సర్కార్‌కు వ్యవసాయశాఖ నివేదిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వర్షాలు ముఖం చాటేయడంతో రాష్ట్రంలో వానకాలం పంటల సాగు నిరాశాజనకంగా మారింది. దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయి. కొన్ని జిల్లాల్లోనైతే తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని వ్యవసాయశాఖ ప్రభుత్వానికి బుధవారం నివేదించింది. జూలైలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 33% లోటు వర్షపాతం నమోదైందని వెల్లడించింది. వానకాలం సాధారణ సాగువిస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 43.33 లక్షల (39-40%) ఎకరాలకే పరిమితమైంది. అందులో అత్యధికంగా పత్తి 27.05 లక్షల ఎకరాల్లో సాగైంది. ఆహారధాన్యాల సాధారణ సాగువిస్తీర్ణం 48.25 లక్షల ఎకరాలుకాగా, ఇప్పటివరకు 10.98 లక్షల (23%) ఎకరాలకే పరిమితమైంది. పప్పుధాన్యాల సాధారణ సాగువిస్తీర్ణం 10.37లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.82లక్షల (46%) ఎకరాల్లో సాగైంది. అందులో కంది సాధారణ సాగువిస్తీర్ణం 7.29 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 3.66 లక్షల (50%) ఎకరాల్లో సాగైంది. అత్యంత కీలకమైన వరి సాధారణ సాగువిస్తీర్ణం రాష్ట్రవ్యాప్తంగా 24.11 లక్షల ఎకరాలు కాగా, 1.46 లక్షల ఎకరాల్లో (6%) నార్లు పోయడం ఆందోళన కలిగిస్తున్నది. మక్కజొన్న సాధారణ సాగువిస్తీర్ణం 12.52 లక్షల ఎకరాలకుగాను ఇప్పటివరకు 4.51 లక్షల (33%) ఎకరాల్లో సాగైంది. పెద్ద ఎత్తున పత్తి సాగుచేసినా వర్షాలు లేక మొలక దశలోనే మాడిపోతున్నాయి. వేల రూపాయలు ఖర్చుచేసి పత్తి సాగుచేస్తే పరిస్థితి ఇలా తయారైందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పత్తి అత్యధికంగా సాగుచేసే జిల్లాల్లో ఖమ్మం జిల్లా ఒకటి. అక్కడ తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొనడంతో పత్తి గింజలు భూమిలోనే మాడిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**ఈ సీజన్‌లో సాధారణ వర్షపాతం 197.8 మి.మీ.**

**నమోదైంది 133.2 మి.మీ.**

**గతేడాది ఇదే సమయానికి నమోదైన వర్షపాతం 237.6 మి.మీ.**



## 23 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు

**తీవ్ర దుర్భిక్షంలో ఉన్న జిల్లాలు**

| ఖమ్మం | నల్లగొండ | సూర్యాపేట |
|---|---|---|
| 68% లోటు | 66% లోటు | 67% లోటు |

**సాధారణ వర్షపాతం నమోదైన జిల్లాలు**

కుమ్రంభీం, వరంగల్ అర్బన్, సిద్దిపేట, కరీంనగర్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, నారాయణపేట

## చేనేత కార్మికుల సంక్షేమానికి చర్యలు

- టీఆర్‌ఎస్ ఎంపీ నామా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం హస్తకళలు, చేనేత కార్మికుల సంక్షేమానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నదని లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్ష నాయకుడు, ఖమ్మ ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీలో జాతీయ హస్తకళలు, చేనేత సంఘంవారు ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాల్ని వివరించారు.

## డయాగ్నస్టిక్ యంత్రాల వినియోగంపై దృష్టి

- మంత్రి ఈటల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ దవాఖానల్లో ఏర్పాటుచేసిన డయాగ్నస్టిక్ యంత్రాల వినియోగంపై వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేకదృష్టి సారించింది. ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ బుధవారం టీఎస్ ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎమ్మారై, సీటీస్కాన్, ఎక్స్‌రే మిషన్, రేడియాలజీ మిషన్లుసహా మొత్తం 20 పెద్ద మిషన్ల నిర్వహణ బాధ్యతలను మాన్యుఫాక్చరింగ్ కంపెనీలకు అప్పగించాలని నిర్ణయించారు. మధ్యరకం యంత్రాల నిర్వహణ బాధ్యతను టీఎస్ఎంఎస్ఐడీసీ పరిధిలో పనిచేస్తున్న బయో మెడికల్ ఇంజినీర్లకు అప్పగించనున్నారు. ప్రస్తుతం యంత్రాల నిర్వహణపై ఫెబర్ సింధూరి సంస్థతో ఉన్న కాంట్రాక్టును రద్దుచేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# 764 టీఎంసీలు

## గోదావరి నుంచి కృష్ణాబేసిన్‌కు తరలించేందుకు అందుబాటులో ఉన్న జలాలు

- 75 శాతం డిపెండబిలిటీ, సరాసరి ప్రవాహాల ఆధారంగా అంచనా
- శ్రీశైలం, సాగర్ నుంచి రెండురాష్ట్రాల అవసరాలు 726.44 టీఎంసీలు
- రాంపూర్ నుంచి సాగర్‌కు గోదావరి మళ్లింపునకు రూ.67,500 కోట్లు
- శ్రీశైలానికి పొడిగించాలంటే అదనంగా రూ.10 వేల కోట్లు
- తొమ్మిది అంశాలతో తెలంగాణ ఇంజినీర్ల కమిటీ ప్రాథమిక నివేదిక!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గోదావరి నుంచి కృష్ణాబేసిన్‌కు తరలించేందుకుగాను 764 టీఎంసీల జలాలు అందుబాటులో ఉన్నాయని తెలంగాణ ఇంజినీర్ల కమిటీ అంచనా వేసింది. గోదావరిలో 75 శాతం డిపెండబిలిటీ, సరాసరి ప్రవాహాల మధ్య తేడాను బేరీజు వేసిన కమిటీ ఈ అంచనాకు వచ్చింది. ప్రధానంగా తొమ్మిది అంశాలను కమిటీ తన ప్రాథమిక నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు ప్రాథమిక నివేదికలోని కొన్ని ప్రధానాంశాలు..

### మళ్లింపు పరిమాణం

గోదావరి జలవివాదాల ట్రిబ్యునల్ ప్రకారం 75 శాతం డిపెండబిలిటీపై తెలంగాణ, ఏపీ రాష్ట్రాల వాటా 1,486 టీఎంసీలు. వ్యాప్కోస్ నివేదిక ఆధారంగా గోదావరిలో సరాసరి ప్రవాహం దాదాపు 2,250 టీఎంసీలు. అంటే.. 75 శాతం డిపెండబిలిటీ, సరాసరి ప్రవాహాల మధ్య తేడా ప్రకారం కృష్ణాబేసిన్‌కు తరలించేందుకు 764 టీఎంసీల గోదావరి జలాలు అందుబాటులో ఉన్నాయి.

### 14 ప్రాజెక్టులు.. 726.44 టీఎంసీలు

నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల నుంచి ప్రస్తుతం రెండు రాష్ట్రాల నీటి అవసరాలు 726.44 టీఎంసీలు. రెండు రాష్ట్రాల పరిధిలో... సాగర్, శ్రీశైలం, కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి, ఎస్సెల్బీసీ, డిండి ప్రాజెక్టు, ఎస్సార్బీసీ, హంద్రీనీవా, గాలేరునగరి, వెలిగొండ, తెలుగుగంగ పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందించడంతోపాటు హైదరాబాద్, చెన్నై, మిషన భగీరథ తాగునీటి అవసరాలు ఉన్నాయి. వానకాలం తాగు, సాగునీటికి 600.94 టీఎంసీలు, యాసంగికి 125.50 టీఎంసీల అవసరాలు ఉన్నాయి.



బుధవారం ములుగు జిల్లా తుపాకులగూడెం బరాజ్ వద్ద గోదావరి ప్రవాహం

### కృష్ణాబేసిన్‌లో లోటు

బ్రిజేశ్ ట్రిబ్యునల్‌లోని ప్రవాహాల జాబితా ప్రకారం.. 1961-62 నుంచి 2007-08 వరకు 47 ఏండ్లలో 11 సంవత్సరాల్లో లోటు ఉన్నట్టుగా గుర్తించాం. ఎగువరాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక బ్రిజేశ్ ట్రిబ్యునల్ కేటాయింపుల్ని సంపూర్ణంగా వినియోగించుకుంటున్నట్టు స్పష్టమవుతున్నది. ఈ నేపథ్యంలో 75 శాతం డిపెండబిలిటీపై దిగువన ఉన్న తెలుగు రాష్ట్రాల పరిధిలో 811 టీఎంసీల కేటాయింపునకుగాను లోటు 66 టీఎంసీల నుంచి 386 టీఎంసీల వరకు ఏర్పడుతున్నది. ఆధారిత సంవత్సరాల్లో శ్రీశైలం జలాశయానికి సరాసరిన 380 టీఎంసీల వరకు వరద వస్తున్నందున.. 726 టీఎంసీల నీటి అవసరాలను భర్తీ చేసేందుకు మరో 346 టీఎంసీలు అవసరం.

### ఆగస్టుకు ముందే మళ్లించాలి

ఎగువ రాష్ట్రాలు బ్రిజేష్ కేటాయింపులనూ వాడుకుంటున్న దరిమిలా ఆగస్టు మొదటివారం కంటే ముందే శ్రీశైలానికి వరద వచ్చే పరిస్థితి లేదు. జూన్, జూలై, ఆగస్టు అవసరాలకుగాను గోదావరిజలాలను మళ్లించాల్సి ఉంటుంది. పక్కా ప్రణాళికతో ఆఫ్‌లైన్ రిజర్వాయర్లను ఏర్పాటుచేసుకొని మళ్లింపు చేపట్టాలి. తద్వారా శ్రీశైలం, సాగర్‌లోకి వరదొచ్చినా ఆ మేరకు ఖాళీ ఉంచుకోవాలి. శ్రీశైలం జలాశయానికి 500 టీఎంసీల జలాల్ని తరలించే వ్యవస్థ ఏర్పాటుకంటే రోజుకు టీఎంసీ చొప్పున వంద టీఎంసీలు మళ్లించే వ్యవస్థను ఏర్పాటుచేసుకోవడం ఆర్థికపరంగానూ ప్రయోజనకరం.

### రూ.2500 కోట్లతో రాంపూర్ బరాజ్

రాంపూర్ పాయింట్‌గా గోదావరిజలాల మళ్లింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఇంజినీర్ల కమిటీ.. రెండురకాల అంచనా వ్యయాల్ని పొందుపరిచింది. ఇందులోభాగంగా రాంపూర్ వద్ద బరాజ్ నిర్మాణానికి రూ.2,500 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసింది.

- రాంపూర్ నుంచి నీటిని నాగార్జునసాగర్‌కు తరలించేందుకు చేపట్టే ప్రాజెక్టుకు రూ. 67.5 వేలకోట్ల ఖర్చవుతుందని అంచనా.
- ఈ అలైన్‌మెంట్‌లో 61 కి.మీ. సొరంగ మార్గం నిర్మించాలి. 174 కి.మీ. గ్రావిటీ కాల్వ, 78 కి.మీ. లింక్‌కెనాల్, మూడుదశల్లో ఎత్తిపోతల అవసరం ఉంటుంది.
- రాంపూర్-నాగార్జునసాగర్-శ్రీశైలం తరలింపు ప్రాజెక్టుకు రూ.77వేల కోట్లు అవుతుందని అంచనా.
- మొదటి అలైన్‌మెంట్ కంటే అదనంగా 70 కి.మీ. సొరంగమార్గం నిర్మాణంతో పాటు, అదనంగా మరోదశ ఎత్తిపోతలు చేపట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం ముత్తంపేటలో మృతదేహాలను వెలికితీసేందుకు తవ్వకాలు చేపడుతున్న సింగరేణి రెస్క్యూ టీం



శ్రీనివాస్ (ఫైల్)



రాకేశ్ (ఫైల్)



మహేశ్ (ఫైల్)

# బావిలో ఆగిన ఊపిరి

- చేదబావిలోకి దిగి ముగ్గురు యువకుల మృత్యువాత
- మోటర్ మరమ్మతుకు వెళ్లి దుర్మరణం.. మృత్యుంజయులుగా మరో ముగ్గురు
- మృతుల్లో ఇద్దరిది ఆసిఫాబాద్ జిల్లా కాగా.. మరొకరిది మంచిర్యాల

**కౌటాల/ కౌటాల రూరల్:** మోటర్ మరమ్మతు కోసం చేదబావిలో దిగిన ముగ్గురు యువకులు ఊపిరి ఆడక మృత్యువాత పడ్డారు. ఒకరి కోసం మరొకరు వెళ్లిన ముగ్గురూ అందులోనే విగతజీవులుగా మారారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం ముత్తంపేట గ్రామంలో బుధవారం జరిగిన ఈ ఘటన పెనువిషాదం నింపింది. ముత్తంపేటకు చెందిన కారం మహేశ్ ఇంటి సమీపంలో 30 ఫీట్ల లోతు చేదబావి ఉన్నది. నీటిని తోడేమోటర్‌పాడవటంతో మరమ్మతు చేయడానికి మధ్యాహ్నం కారం మహేశ్ (18) బావిలోకి దిగాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో పైన ఉన్న గాదిరెడ్డి రాకేశ్(23), సొక్కల శ్రీనివాస్ (35) విద్యుత్ షాక్ తగిలిందని భావించి తీగలు తొలగించారు. ఎంతపిలిచినా మహేశ్ పలుకకపోవడంతో శ్రీనివాస్.. ఆ తర్వాత గాదిరెడ్డి రాకేశ్ కూడా అందులోకి దిగాడు. ముగ్గురిలో ఎవరూపైకి రాకపోవడంతో ఊపిరాడక మృతిచెంది ఉంటారని పైన ఉన్న వారు భావించారు. తర్వాత పంజాల పోశం తాడుసాయంతో బావిలో దిగేందుకు యత్నించి.. కొంతదూరం వెళ్లగానే ఊపిరాడక స్పృహ కోల్పోవడంతో మీదికి లాగారు. డొన్నయ్య, శివయ్య కూడా బావిలో దిగేందుకు ప్రయత్నించి అస్వస్థతకు గురయ్యారు. గ్రామ సర్పంచ్ ఆదె శ్రీనివాస్ పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ మోహన్, ఎస్సై ఆంజనేయులు హుటాహుటీన అక్కడకు చేరుకొన్నారు. పోలీసులు ఓ కోడిని తీసుకువచ్చి దానిని తాడుతో కట్టి బావిలోకి దించి.. 5 నిమిషాల తర్వాత బయటకు తీయగా, నిర్జీవంగా కనిపించింది. దీంతో బావిలో ఆక్సిజన్ అందకపోవడం వల్లే యువకులు మృతి చెందినట్టు నిర్ధారణకు వచ్చారు.

**పొక్లెయినర్‌తో తవ్వకాలు..**

బావిలోకి వెళ్లి మృతదేహాలను తీసుకువచ్చేందుకు వీలులేకపోవడంతో జేసీబీ ద్వారా తవ్వకం చేపట్టారు. తర్వాత పొక్లెయినర్‌ను రప్పించి బావిచుట్టూ సమాంతరంగా తవ్వడం ప్రారంభించారు. 20 ఫీట్లవరకు తవ్వకం చేపట్టగా.. మిగిలిన పదిఫీట్ల లోతుకు రెస్క్యూ టీం ఆక్సిజన్ సాయంతో దిగి మృతదేహాలను వెలికితీసింది. ఆక్సిజన్ అందకనే యువకులు మృతిచెందారని సింగరేణి రెస్క్యూ బృందం తెలిపింది. ఎస్పీ మల్లారెడ్డి, డీఎస్పీ సత్యనారాయణ సహాయకచర్యలు పర్యవేక్షించారు.

**మృతులు ముగ్గురూ దగ్గరి బంధువులు**

మృతులు మహేశ్, సొక్కల శ్రీనివాస్, గాదిరెడ్డి రాకేశ్ దగ్గరి బంధువులు. కారం మహేశ్‌కు.. గాదిరెడ్డి రాకేశ్ మేనత్త కొడుకు. రాకేశ్ చెల్లిని సొక్కల శ్రీనివాస్‌కు ఇచ్చి వివాహం చేశారు. కారం రాజన్న-బుజక్క రెండో కుమారుడైన మహేశ్ కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫస్టియర్ చదువుతున్నాడు. గాదిరెడ్డి అంజయ్య -లస్మక్క చిన్న కొడుకు రాకేశ్ ఇంటర్ పూర్తిచేశాడు.

**అత్తారింటికి వచ్చి..**

సొక్కల శ్రీనివాస్‌ది మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం శిఖినం గ్రామం. ముత్తంపేటకు చెందిన శైలజను వివాహం చేసుకున్నాడు. అతడికి ఆరేండ్ల కుమారుడు, మూడేండ్ల కుమార్తె ఉన్నారు. ముత్తంపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివుకునే కుమారుడికి పుస్తకాలు కొనిచ్చేందుకు మంగళవారం భార్యతో కలిసి అత్తగారింటికి వచ్చాడు. బావమరిది కోసం బావిలోదిగి మృత్యువాత పడ్డాడు.

# జోరందుకున్న హరితహారం

- ఎక్కడ వానలు పడితే అక్కడ మొక్కలు నాటేలా ప్రణాళిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణకు హరితహారం కార్యక్రమం కింద మొక్కలు నాటే కార్యక్రమం జోరందుకొన్నది. ఇప్పటివరకు అడవులకే పరిమితమైన హరితహారం.. ఇప్పుడు నివాసిత ప్రాంతాల్లో మొదలైంది. హరితహారం అధికారిక కార్యక్రమం నిర్వహణ వరకు వేచిచూడకుండా ఎక్కడ అనుకూల వాతావరణం ఉంటే.. అక్కడ మొక్కలు నాటాలని ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు ఆదేశాలు జారీచేశారు. జూన్ చివరివారంలో వానలు బాగా కురియడంతో అటవీశాఖ అడవుల లోపల, క్షీణించిన అటవీ ప్రాంతాల్లో భారీగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, నాగర్‌కర్నూలు తదితర జిల్లాల్లో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటడంలో జోరు పుంజుకొన్నది. హైదరాబాద్ కోఠి ఉమెన్స్ కాలేజీలో హరితహారం బుధవారం మొదలైంది. రాష్ట్రంలో ఎక్కడ వానలు కురుస్తున్నాయో, అక్కడ మొక్కలు నాటేలా ఉన్నతాధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకొన్నారు. జిల్లాల్లో మొక్కలునాటే కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు మండలానికో నోడల్ అధికారిని కలెక్టర్లు నియమిస్తున్నారు. హరితహారం అమలుపై అటవీశాఖమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఇప్పటికే ఉన్నతస్థాయి సమీక్ష జరిపి.. మొక్కలు విరివిగా నాటాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్లో 86కోట్ల మొక్కలు నాటాలన్న లక్ష్యంతో ఐదోవిడుత హరితహారం మొదలుపెట్టారు.

**నేడు ఆక్సిజన్ పార్కులో పక్షిశాల ప్రారంభం**

హైదరాబాద్ శివారులోని కండ్లకోయ ఆక్సిజన్ పార్కులో రకరకాల పక్షులు సందర్శకులకు కనువిందు చేయనున్నాయి. పార్కులో ఏర్పాటుచేసిన వాక్ ఇన్ ఐవరీ (పక్షిశాల)ని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గురువారం ప్రారంభించనున్నారు. అనంతరం బహదూర్‌పల్లిలో ఆయుష్-వనమును ప్రారంభిస్తారు.

# సోషల్ మీడియాపై టీఆర్‌ఎస్ శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సోషల్‌మీడియా వినియోగంపై టీఆర్‌ఎస్ పారీ శిక్షణ కార్యక్రమం చేపట్టింది. చెన్నూరు నియోజకవర్గానికి చెందిన టీఆర్‌ఎస్ విద్యార్థి, యువజన విభాగం నాయకులకు బుధవారం తెలంగాణభవన్‌లో సోషల్‌మీడియా సద్వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాల్కసుమన్ మాట్లాడుతూ.. సాంకేతిక పురోగతికి అనుగుణంగా విద్యార్థులు, యువత మార్పుచెందాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు శంభీపూర్‌రాజు, శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు, తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.



బుధవారం తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాల్కసుమన్

# ఓయూ డిగ్రీ కాలేజీలకే డిమాండ్

- రెండోస్థానంలో కాకతీయ యూనివర్సిటీ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కాలేజీలకే అధిక డిమాండ్ ఉన్నది. ఆయా కళాశాలల్లో చేరడానికే విద్యార్థులు అధిక ఆసక్తిచూపుతున్నారు. అన్ని వర్సిటీల పరిధిలోని కళాశాలల్లో 1,19,098 సీట్లు నిండగా.. వాటిలో ఓయూ కాలేజీల్లోనే 47,487 సీట్లు (39.87 శాతం) భర్తీ అయ్యాయి. ఆ తర్వాత కాకతీయ యూనివర్సిటీ పరిధి కాలేజీల్లో 32,198 సీట్లు (27శాతం)నిండాయి. శాతావాహన యూనివర్సిటీ పరిధిలో 14,392 సీట్లు, తెలంగాణ వర్సిటీ పరిధిలో 9,683 సీట్లు, పాలమూరు యూనివర్సిటీ పరిధిలో 9,011 సీట్లు, మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో 6,321సీట్లు, టీఎస్ ఎస్బీటీఈటీ పరిధిలోని కాలేజీల్లో ఆరు సీట్లు భర్తీఅయ్యాయి. బుధవారంనాటికి కళాశాలల్లో సీట్లు పొందిన విద్యార్థుల తుదిజాబితాను దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి వెల్లడించారు. ప్రభుత్వ అన్ని రకాల డిగ్రీ కాలేజీల్లో మొత్తం 38,650 సీట్లు, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 79,562, ప్రైవేటు అటానమస్ కాలేజీల్లో 790 సీట్లు, రైల్వే డిగ్రీ కాలేజీల్లో 96 సీట్లు నిండినట్టు వివరించారు.

**2,344 మందికి బ్రాంచ్‌లో మార్పులు**

దోస్త్ కౌన్సెలింగ్‌లో భాగంగా కాలేజీలో ఒక బ్రాంచ్‌నుంచి మరొక బ్రాంచ్‌లో మారడం కోసం 2,947 మంది విద్యార్థులు ఆప్షన్లు పెట్టుకోగా.. వారిలో 2,344 మందికి మార్పులు జరిగాయి. ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు ఈ నెల 13 తర్వాత వెల్లడించే అవకాశాలు ఉన్నాయని, ఆ తర్వాత దోస్త్ తుదివిడుత కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ జారీచేస్తామని కన్వీనర్ తెలిపారు.

# 49 ఇంజినీరింగ్ కాలేజీల్లో 100% భర్తీ

- జీరో అడ్మిషన్ కాలేజీ ఒక్కటీ లేదు
- 49,012 సీట్లు భర్తీ.. మిగిలిన సీట్లు 16,432
- తొలివిడుత సీట్ల కేటాయింపు పూర్తి
- రిపోర్టింగ్‌కు 15 వరకు గడువు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని 49 ఇంజినీరింగ్ కళాశాలల్లో వందశాతం సీట్లు నిండాయని ఎంసెట్ అడ్మిషన్ కన్వీనర్ నవీన్ మిట్టల్ చెప్పారు. జీరో అడ్మిషన్ కాలేజీ ఈ ఏడాదిలో ఒక్కటి కూడా లేదని అన్నారు. ఇంజినీరింగ్ కాలేజీల్లో సీట్ల భర్తీని గతనెల 27 నుంచి ఈ నెల ఎనిమిది వరకు చేపట్టిన తొలివిడుత ఎంసెట్ కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు బుధవారంతో పూర్తయిందని చెప్పారు. ఎంసెట్ కౌన్సెలింగ్‌లో మొత్తం 65,444 సీట్లు ఉండగా.. వాటిలో 49,012 సీట్లు (74.89 శాతం) నిండాయని, ఇంకా 16,432 సీట్లు మిగిలి ఉన్నాయని, వాటిని మిగితా కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తామని తెలిపారు. ఫార్మసీ (ఎంపీసీ) విభాగానికి స్పందన కరువైందని, ఇందులో 3,280 సీట్లు ఉండగా 87 సీట్లే నిండాయని, ఫార్మా-డీలో 298 సీట్లకు 30 సీట్లే భర్తీ అయ్యాయన్నారు. ఈ ఏడాది నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఐదు ఇంజినీరింగ్ కోర్సుల్లో మొత్తం సీట్లు నిండాయని చెప్పారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్‌కు ఈ నెల 15 వరకు గడువు విధించినట్టు తెలిపారు.

**కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కోర్సుకే మొగ్గు**

ఎంసెట్ కౌన్సెలింగ్‌లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్‌ఈ) కోర్సు వైపే విద్యార్థులు మొగ్గు చూపారు. కౌన్సెలింగ్‌లో 52,623 మంది విద్యార్థులు వెబ్ ఆప్షన్లు పెట్టుకోగా, వారిలో 45,514 మంది సీఎస్‌ఈనే ఎంపికచేసుకున్నారు. ఇందులో 17,248 సీట్లు అందుబాటులో ఉండగా 16,287 సీట్లు (94.43 శాతం) నిండాయి. 961 సీట్లు మాత్రమే మిగిలాయి. ఆ తర్వాత ఈసీఈ కోసం 35,937 మంది విద్యార్థులు ఎంపికచేశారు. ఇంజినీరింగ్‌లోని మిగతా బ్రాంచ్‌ల వైపు విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఆప్షన్లు నమోదు చేసుకున్న వారిలో 3,499 మందికి ఏ కాలేజీలో కూడా సీటు దక్కలేదు.



బుధవారం సచివాలయంలో మంత్రి మల్లారెడ్డిని కలిసిన స్నేహ మహిళా మ్యూచువల్ ఎయిడెడ్-కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు వివిధ శాఖలకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు

# త్వరలోనే పావలావడ్డీ నిధులు

- స్నేహ మహిళా బ్యాంకుకు మంత్రి మల్లారెడ్డి హామీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బ్యాంకులకు పావలావడ్డీ నిధులు త్వరలోనే విడుదల చేస్తామని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి తెలిపారు. స్నేహ మహిళా మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకు (మహిళా బ్యాంకు)కు చెందిన వివిధశాఖల అధ్యక్షులు, కార్యదర్శులు బుధవారం మంత్రి మల్లారెడ్డిని సచివాలయంలో కలిశారు. బ్యాంకులకు రావాల్సిన పావలావడ్డీ నిధులు విడుదలచేయాలని కోరారు. దీనిపై అధికారులతో మాట్లాడిన మంత్రి మల్లారెడ్డి.. త్వరలో విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నేత మర్రి రాజశేఖర్‌రెడ్డి, బ్యాంకు ప్రతినిధులు సంగీత, హరిత, శ్రీనివాస్, లత, రాణి, భారతమ్మ, జగదీశ్ పాల్గొన్నారు.



కర్ణాటకలో ప్రజాస్వామ్యానికి వెన్నుపోటు పొడిచారు. కర్ణాటక ప్రభుత్వాన్ని పడదోసేందుకు కేంద్రం కుట్ర పన్నింది. హోటల్‌లో ఉన్న ఎమ్మెల్యేలను మా నేత డీకే శివకుమార్ కలువకుండా పోలీసులతో అడ్డుకున్నారు.

**అధిర్ రంజన్ చౌదరి, కాంగ్రెస్ నేత**

కర్ణాటక తిరుగుబాటు ఎమ్మెల్యేలు తమ ప్రాణాలకు ముప్పు ఉన్నదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందుకే హోటల్ ముందు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశాం. ఎవరినీ హోటల్‌లోనికి అనుమతించటం లేదు.

**ప్రహ్లాద్ జోషి, కేంద్రమంత్రి**



**చరిత్రలో నేడు**



**1776**

మూడోసారి ప్రపంచ యాత్రకు బయల్దేరిన జేమ్స్ కుక్.

**1811**



వాయు పదార్థాలన్నీ అతి సూక్ష్మ ఏకరీతి అణువులతో కూడుకొని ఉంటాయని కనుగొన్న ఇటలీ శాస్త్రవేత్త అవగాడ్రో.



**1977**

అమెరికా అత్యుత్తమ ఫ్రీడం అవార్డును అందుకున్న మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్.

జాతీయత, దేశభక్తి వంటి ఉద్వేగాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునేందుకు పంజాబ్ ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం పంజాబ్‌లోని పాక్ సరిహద్దు ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఎన్‌సీసీ తప్పనిసరి చేసింది. ఫలితంగా విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించవచ్చని అంటున్నది. నవభారత నిర్మాణానికి విద్యార్థులకు కావాల్సింది నాణ్యమైన విద్య. నాలుగో పారిశ్రామిక విప్లవానికి అవసరమైన నైపుణ్యాలు. అంతేకానీ.. మిలిటరీ క్రమశిక్షణతో నవభారతం సాధ్యం కాదు. కాంగ్రెస్ కూడా బీజేపీ బాటలో నడుస్తున్నట్లు కనిపిస్తున్నది.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

జమ్ముకశ్మీర్‌లో మానవహక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయన్న ఐరాస మానవహక్కుల కమిషన్ నివేదికను భారత్ తీవ్రంగా తప్పు పట్టింది. జమ్ముకశ్మీర్‌లో 2016 జూలై తర్వాత చోటుచేసుకున్న హక్కుల ఉల్లంఘనలు, పోలీసులు,భద్రతాబలగాల అతి చర్యలపై విచారణ జరుపాలని యూఎన్‌ఓ మానవహక్కుల హై కమిషన్ పేర్కొన్నది. కశ్మీర్‌లో సరిహద్దు చొరబాట్లు, టెర్రరిస్టు కార్యకలాపాలను యూఎన్‌ఓ పట్టించుకోలేదని భారత్ ఆక్షేపించింది. యూఎన్‌ఓ నివేదిక ఉగ్రవాదానికి ప్రాసంగికత కల్పించినట్లుగా ఉన్నదని భారత్ ఆరోపించటంలో అర్థం ఉన్నది.

**ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్**



# ప్లాస్టిక్- పరమ చెత్త

ఆస్ట్రేలియా నుంచి ఎనిమిది కంటెయినర్లలో వచ్చిన ప్లాస్టిక్ వృథా సామాగ్రిని తిప్పి పంపనున్నట్టు ఇండోనేషియా ప్రకటించడంతో మూడవ ప్రపంచ దేశాలను చెత్తకుప్పలుగా మారుస్తున్న ఆధిపత్య దేశాల పోకడను తిప్పికొట్టినట్టయింది. ఇండోనేషియా అధికారులు ఆ కంటెయినర్లను తెరిచి అందులోని పునరుపయోగం సాధ్యం కాని బూట్లు, ప్లాస్టిక్ సీసాలు, డబ్బాలను, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసి చూపించి, ఈ 210 టన్నుల చెత్తనంతా తిప్పిపంపుతున్న స్పష్టంగా చెప్పారు. ఈ పదార్థాలు రిసైకిల్ చేయడానికి సాధ్యం కానివని వారు తెలిపారు. గత వారమే ఫ్రాన్స్ తదితర యూరప్ దేశాలకు 49 కంటెయినర్లను వెనుకకు పంపించింది. ఈ మధ్య ఆగ్నేయాసియా దేశాలు పెద్ద దేశాలు పంపుతున్న ప్లాస్టిక్ చెత్తనంతా తిప్పి పంపుతున్నాయి. మలేసియా మే నెలలో ఆస్ట్రేలియా తదితర దేశాలకు 450 టన్నుల ప్లాస్టిక్ చెత్తను ఆస్ట్రేలియాకు తిప్పి పంపింది. ఫిలిపీన్స్ గత నెలలో కెనడా నుంచి వచ్చిన 69 కంటెయినర్ల పునర్వినియోగ సాధ్యం కాని ప్లాసిక్‌ను తీసుకోవడానికి నిరాకరించింది. ఈ ప్లాస్టిక్ చెత్త పర్యావరణానికి, జలచరాలకు, స్థానిక ప్రజలకు హానికరంగా మారింది. నదులన్నీ చెత్తతో నిండిపోతున్నాయి. సముద్రాలలో చెత్త వేయడం వల్ల జలచరా పొట్టలు ప్లాస్టిక్ వస్తువులతో నిండి హాని చేస్తున్నాయి. ఈ ప్లాస్టిక్‌లో హానికర పదార్థాలు ఉండటంతో ఈ చెత్తను కుమ్మరిస్తున్న గ్రామాలలో ప్రజలు రోగాల పాలవుతున్నారు. ఇండోనేషియా, థాయిలాండ్, మలేషియా దేశాలు యూరప్ దేశాలకు చెత్తకుప్పలుగా మారిన నేపథ్యంలో స్థానిక ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ప్లాస్టిక్ వృథా పదార్థాలను చైనా ఎక్కువగా దిగుమతి చేసుకునేది. ప్లాస్టిక్ చెత్త పెద్ద సమస్యగా మారడంతో చైనా వీటి దిగుమతిని ఇటీవల నిలిపివేసింది. దీంతో పెద్ద దేశాలు ఆ భారీ చెత్త అంతా ఆగ్నేయాసియా దేశాలకు తరలిస్తుండటంతో అక్కడి దేశాలకు ఇదొక పెద్ద సమస్యగా మారింది.

**ప్రపంచ జనాభాలో 36 శాతం ఉన్న భారత్, చైనాలో 27 శాతం వివిధ రకాల చెత్త తయారవుతున్నది. అమెరికాతో పోలిస్తే తక్కువే అయినప్పటికీ, ప్లాస్టిక్, ఇతర చెత్త విషయంలో భారత్ ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలె. ఈ వేస్ట్ భవిష్యత్తులో పెద్ద సమస్యగా ముందుకురానున్నది. అమెరికా వంటి పాశ్చాత్య దేశాలు కానీ, భారత్ వంటి వర్ధమాన దేశాలు కానీ తమ జీవన సరళిని, అభివృద్ధి విధానాలను మార్చుకోనంత కాలం ఇటువంటి సమస్యలు పరిష్కారం కావు.**

అమెరికా ఇతర పాశ్చాత్య దేశాలు భారీ ఎత్తున ప్లాస్టిక్ చెత్తను వర్ధమాన దేశాలకు తరలిస్తుండటం పెద్ద సమస్యగా మారింది. దీనిని అరికట్టడానికి ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో దాదాపు రెండువారాల పాటు చర్చ సాగింది. జీవులకు, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ చెత్తను, హానికర పదార్థాలను అరికట్టడానికి చివరికి గత మే నెల పదవ తేదీన ఒప్పందం కుదిరింది. ఇతర దేశాలకు హానికర రసాయనాలు ఇతర పదార్థాలు తరలించకుండా అరికట్టడానికి గతంలోనే 'బేసల్ ఒడంబడిక' అంటూ ఒకటి ఉన్నది. ఇప్పుడు ప్లాస్టిక్ చెత్తను కూడా ఈ బేసల్ ఒడంబడిక పరిధిలోకి చేర్చారు. ఈ ఒప్పందం ప్రకారం ఇతర దేశాలకు ప్లాస్టిక్ చెత్తను తరలించే దేశాలకు అవి ఎక్కడకు చేరుతున్నాయో గమనించవలసిన బాధ్యత కూడా ఉంటుంది. ఈ ఒప్పందానికి దాదాపుగా ప్రపంచ దేశాలన్నీ అంగీకారం తెలిపాయి. ఒక్క అమెరికా మాత్రం వ్యతిరేకిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఎక్కువ చెత్త యురోపియన్ దేశాల్లో తయారవుతున్నది. ఒక దేశంగా విడిగా చూస్తే అమెరికాలో ఎక్కువ చెత్త ఉత్పత్తి అవుతున్నది. ఈ పెద్ద దేశాలు బయటపడేసే ప్లాస్టిక్ చెత్తను వర్ధమాన దేశాల ప్రైవేటు సంస్థలు కొనుక్కుంటాయి. ఇక్కడి ప్రభుత్వాలు చూసీ చూడనట్టు వ్యవహరిస్తాయి. ఈ ప్లాస్టిక్ చెత్తలో కొంత పునరుపయోగానికి పనికివస్తుంది. కానీ దానితో పాటు దాదాపు 90 శాతం పనికిరానిదీ, హానికరమైందీ ఉంటుంది. మే నెలలో ఐక్యరాజ్యసమితి ఒప్పందం ప్రకారం ఏదైనా దేశంలోని ప్రైవేటు సంస్థకు చెత్త తరలించాలన్నా అక్కడి ప్రభుత్వం అంగీకారం ఉండాలె. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుంది కనుక ప్రభుత్వం అంగీకరించదు. ఈ ఒప్పందం కుదిరినప్పటికీ, ఆయా దేశాలపై ఒత్తిడి తెచ్చి చెత్తను తరలించాలని అమెరికా భావిస్తున్నది.

మలేషియాకు బ్రిటన్, అమెరికా, జపాన్, చైనా, కెనడా, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్, జర్మనీ, నార్వే, ఫ్రాన్స్ తదితర దేశాల నుంచి వేలాది టన్నుల చెత్త వచ్చి పడుతున్నది. దీనిని తిప్పి పంపుతామని ఇప్పుడు మలేషియా ప్రభుత్వం ప్రకటించింది. పెద్ద దేశాల నుంచి చెత్త వచ్చి చేరుతున్న దేశాలలో భారత్ కూడా ఉన్నది. ఇప్పుడు ప్రజలలో అవగాహన పెరుగడంతో పెద్ద దేశాలకు చెత్త తరలించడం పెద్ద సమస్యగా మారింది. ప్రపంచంలో అమెరికా జనాభా నాలుగు శాతమే ఉంటే అక్కడ పన్నెండు శాతం చెత్త తయారువుతున్నది. ప్రపంచ జనాభాలో 36 శాతం ఉన్న భారత్, చైనాలో 27 శాతం వివిధ రకాల చెత్త తయారవుతున్నది. అమెరికాతో పోలిస్తే తక్కువే అయినప్పటికీ, ప్లాస్టిక్, ఇతర చెత్త విషయంలో భారత్ ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలె. ఈ వేస్ట్ భవిష్యత్తులో పెద్ద సమస్యగా ముందుకురానున్నది. అమెరికా వంటి పాశ్చాత్య దేశాలు కానీ, భారత్ వంటి వర్ధమాన దేశాలు కానీ తమ జీవన సరళిని, అభివృద్ధి విధానాలను మార్చుకోనంత కాలం ఇటువంటి సమస్యలు పరిష్కారం కావు. ఒక మంచి నీళ్లు లేదా ఇతర పానీయం గల సీసాను ఒకసారి ఉపయోగించి పడేయడం అవసరమా? అటువంటి ఒకేసారి ఉపయోగించే పదార్థాలను అనుమతించడం ఎందుకు? నిరాడంబర జీవన విధానాన్ని అలవరచుకోవడాన్ని అన్నిదేశాలు ప్రోత్సహించాలె.

**జనగళం**

### చర్యలు తీసుకోవాలె

కొన్ని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం వారు కాలం చెల్లిన బస్సులను వాడుతూ పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ విషయమై తల్లిదండ్రులు, రవాణా శాఖధికారులు శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఫిట్‌నెస్ లేని వాహనాల్లో విద్యార్థుల ప్రయాణం క్షేమకరం కాదు. ఎప్పుడు, ఏ రీతిలో ప్రమాదం ఎదురవుతుందో తెలియని పరిస్థితి దాపురిస్తుంది. జరుగాల్సిన నష్టం జరిగినాక బాధపడితే లాభమేమి ఉండదని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు, తల్లిదండ్రులు, రవాణా శాఖాధికారులు తెలుసుకోవాలి. ఫిట్‌నెస్ ఉన్న బస్సులనే వినియోగించేట్లు చూడాలి. కాబట్టి కాలం చెల్లిన వాహనాలను సీజ్ చేసి స్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

**- పుట్ట గణేష్, బేగంపేట, హైదరాబాద్**

### ఐక్యతగా ఉండాలె

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు బీసీలు పోరాటాలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు బీసీ సమస్యలపై దృష్టిసారించాల్సిన అవసరం ఉన్నది. సుమారు యాభై శాతానికి పైగా బీసీలు ఉన్నా, బీసీల్లో ఐక్యత లేక అనేక సమస్యలు అలాగే ఉంటున్నాయి. జనాభాలో సగభాగమున్న అధికారంలో వాటా లభించటం లేదు. బీసీలు ఐక్యతగా ఉంటేనే రిజర్వేషన్లు సాధించుకోవడంతో పాటు అధికారం దిశగా అడుగులు వేస్తాం.

**- బైరి జనార్దన్, ప్రగతినగర్, హైదరాబాద్**

### చట్టాలను సవరించాలె

పసిపిల్లలపై అత్యాచారాలు, యువతలపై కత్తుల దాడులు పెరుగుతుండటం హేయనీయం. ఆకృత్యాలకు పాల్పడుతున్న వారికి కఠినంగా శిక్షలు విధించాలె. అలాగే నేరాలకు కారణమైన విశృంఖల సాంస్కృతిక మూలాలను పెకిలించాలె. అశ్లీల, విశృంఖల 'సైట్ల'ను కట్టడి చేయటానికి మన చట్టాలు అనుగుణంగా లేకపోతే వెంటనే సవరించాలి. అప్పుడే ఇలాంటి దారుణాలు తగ్గుముఖం పడుతాయి.

**- కొలిపాక శ్రీనివాస్, పెద్ద సముద్రాల, హుస్నాబాద్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ఆలోకన



**టంకశాల అశోక్**

# రైతుబంధు: చర్చకు రాని కోణం

**తెలంగాణ ప్రభుత్వం అమలుపరుస్తున్న 'రైతుబంధు' పథకాన్ని అత్యధికులు ప్రశంసిస్తుండగా కొందరుమాత్రం అపోహలు సృష్టిస్తుండటం తెలిసిన విషయమే. ఆ మాట అట్లుంచి అసలు దీనంతటిలో చర్చకు రాని విషయం ఒకటున్నది. అది, ఇటువంటి చర్యల వల్ల తెలంగాణ వ్యవసాయం బాగుపడటం సరేసరి కాగా,ఈ రంగంలో క్రమంగా మిగులు సంపదల సృష్టి జరిగి, రైతాంగం నుంచి కూడా పెట్టుబడిదారులు, వ్యాపారులు, పారిశ్రామికులు ఆవిర్భవించటం. ఇది ప్రపంచవ్యాప్తంగా జరిగిన పరిణామం. అది రాష్ట్ర రైతు చరిత్రను కొత్త మలుపు తిప్పుతుంది.**

ఈ కీలకమైన కోణాన్ని పరిశీలించే ముందు, రైతు బంధు గురించి కొందరు ఇప్పటికే సృష్టిస్తున్న అపోహల గురించి కొంత చెప్పుకోవాలి. ఆ పనిని వారు స్వప్రయోజనాల కోసం ఉద్దేశపూర్వకంగా చేస్తుండగా, కొందరు వాస్తవాలు తెలియక అవే అపోహలకు గురవుతున్నారు. అందువల్ల దీనిపై కొంత వివరణ అవసరమవుతున్నది. రైతుబంధు పథకాన్ని మూడు విధాలుగా అర్థం చేసుకోవలసి ఉంటుంది. మొదటిది నిధుల పంపిణీ విషయం. రెండవది చిన్న రైతులు, మధ్య రైతులు, పెద్ద రైతుల మాట. మూడవది, పైన చెప్పుకున్నట్లు, వ్యవసాయంలో మిగులు సంపదలు ఏర్పడి అవి పెట్టుబడులుగా మారటం. విషయాన్ని చూడవలసిన పద్ధతి ఇది కాగా విమర్శకులు తమ విమర్శకు ఉపయోగపడే కొన్ని సంఖ్యలను మాత్రం తీసుకొని ఆ పని చేస్తున్నారు. వాస్తవాలను గమనించి సమగ్ర దృష్టిని తీసుకోవలసిన ఆర్థికవేత్తలు, పరిశోధకులు ఎందుకైతేనేమీ మౌనంగా ఉన్నారు. వారి మౌనం వల్లనే సాధారణ ప్రజలకు సరైన అవగాహన కలుగడం లేదు. దీర్ఘకాలిక దృష్టి ఏర్పడటం లేదు. దానితో ఒకమేరకు విమర్శకుల ప్రభావానికి లోనవుతున్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో అస్పష్టతలను పోగొట్టేందుకు, సరైన అవగాహన కలిగేందుకు వీలైనంత ప్రయత్నిద్దాము. ముందుగా అంకెల సంగతి చూద్దాము. తెలంగాణలో మొత్తం భూమి ఒక కోటి 40 లక్షల 47 వేల ఎకరాలు. మొత్తం రైతులు 57 లక్షల 24 వేల చిల్లర. వీరందరికి కలిపి రైతుబంధు పథకం కింద 5 వేల 618 కోట్ల చిల్లర పంపిణీ చేశారు. సహాయం పొందుతున్న రైతుల్లో అయిదు విధాలైన వారున్నారు. 1. రెండున్నర ఎకరాల లోపు చిన్నకారు రైతులు, 2. రెండున్నర నుంచి ఐదెకరాల సన్నకారు రైతులు. 3.5 నుంచి 10 ఎకరాల దిగువ మధ్య తరగతి రైతులు. 4.10 నుంచి 25 ఎకరాల ఎగువ మధ్య తరగతి రైతులు. 5.25 ఎకరాలకు మించిన పెద్ద రైతులు. వీరందరికి ఎకరానికి నాలుగు వేల రూపాయాలతో ఆరంభించి, ఇప్పుడు అయిదు వేలకు పెంచారు.

ఇందులో అపోహల సృష్టి జరుగుతున్నది ఎక్కడ? పైన పేర్కొన్న అయిదు తరగతుల రైతుల్లో కొందరు చివరి మూడింటిని, కొందరు చివరి రెండింటిని కలిపివేసి, ఈ పథకం మొత్తంగానే పెద్ద రైతులకు ఉపయోగపడుతున్నదనే విమర్శ చేస్తున్నారు. కానీ ఇటువంటి విమర్శకులకు కేవలం అంకెలు ఆధారం కాకూడదు. ఒక రైతుకు ఎన్ని ఎకరాలు ఉన్నాయనే దానితో పాటు తనకు గల నీటి సదుపాయం, ఇతర వనరులను సమకూర్చుకునే శక్తి, పంట దిగుబడి తీరు, మార్కెటు పరిస్థితి, అప్పుల భారం వంటి కీలకమైన ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఇది కనీస జ్ఞానానికి సంబంధించిన విషయం. ఈ పరిస్థితులన్నీ అనుకూలంగా గల ప్రాంతంలోని ఒక ఎకరానికి తెలంగాణ, రాయలసీమ వంటి ప్రాంతాల్లో ఐదెకరాలు, ఒక్కోసారి అంతకుమించి కూడా సమానం కాలేవు. పై తరహా వనరులు , ఇతర పరిస్థితులు తెలంగాణలో ఏ విధంగా ఉన్నయో కొత్తగా చెప్పనక్కరలేదు. అక్కడ 15-20 ఎకరాల రైతు తప్ప రెండు పూటలా భరోసాగా తిని, కనీస కుటుంబ అవసరాలు తీర్చుకునే పరిస్థితి లేదు. వారిలోనూ పలువురు అప్పులు చేస్తున్నారు. వారి 15-20 ఎకరాలు కూడా పై తరహా వనరులున్న ప్రాంతంలోని 3-4 ఎకరాలకు సమానమంటే అతిశయోక్తి కాదు దీనిపై అనేక అధ్యయనాలు ఉన్నాయి. అటువంటప్పుడు తెలంగాణ రైతు గురించిన అంచనాలకు తెలంగాణ పరిస్థితులను ప్రాతిపదికగా తీసుకోవాలి తప్ప, కేవలం ఎకరం లెక్కల ఛార్టర్డ్ అకౌంటెన్సీలు అవాస్తవిక దృష్టి అవుతాయి. ఇందులో పైన పేర్కొన్న 5వ తరగతి రైతుల మినహాయింపును డిమాండ్ చేయటం కొంత సహేతుకంగా తోచవచ్చు. కానీ, కనీసం తగినంత కాలం పాటు, అది కూడా సరికాకపోవచ్చు. సహాయం కొనసాగింపే ప్రస్తుతానికి సరైనది కావచ్చు. ఏవిధంగానో మొదటనే కొంత చెప్పుకున్నాము. తర్వాత మరికొంత చూద్దాము.

ఈ పరిస్థితుల్లో అంకెలను మరింత విశ్లేషించుకోవటం అవసరం. ఇక్కడ మొత్తం 57 లక్షల 40 వేల మంది రైతులలో 10-25 ఎకరాల వారు కేవలం 94 వేలు కాగా, 25 ఎకరాలకు మించినవారు 6 వేల చిల్లర మాత్రమే. ఉభయులు కలిపి సుమారు లక్షమంది. రైతుబంధు నిధులు 5 వేల 618 కోట్లలో 10 ఎకరాలు అంతకుమించి ఉన్నవారికి లభించింది సుమారు 609 కోట్లు. అది సుమారు 10.85 శాతం. మరొక విధంగా చెప్పాలంటే, 89.15 శాతం నిధులు 10 ఎకరాలకు లోపు వారికి అందుతున్నాయి. పాతిక ఎకరాలు దాటినవారు 6,448 మంది. మొత్తం రైతుల సంఖ్యలో వీరు 0.11 శాతం.

వాస్తవాలు ఇవి కాగా, కొందరు విమర్శకులు ఈ పథకం యావత్తును ప్రభుత్వం పెద్ద రైతుల కోసం అమలు పరుస్తున్నది అన్నట్లుగా మాట్లాడటం ఒక వింత. 15-20-25 ఎకరాలు దాటినవారికి ఈ పథకం ఎందుకని 2-4-5 ఎకరాల రైతులకు అనిపించటం సహజం. అదే సమయంలో ఈ భావన నీటి సదుపాయం వంటి వనరులు గల గ్రామాలలో తప్ప ఇతరత్రా లేదు. నీరు, వనరులు లేనందున 10-15 ఎకరాల రైతు వ్యవసాయం కూడా సరిగా సాగకపోవటం, తనూ అప్పుల పాలు కావటం, వేరే పనులు చేసుకోవటం వంటి విషయాలు 2-4-5 ఎకరాల రైతుకు తెలుసు. అందువల్ల, ప్రాజెక్టులు ఎట్లానూ లేకపోగా వర్షాలూ సరిగా ఉండని తెలంగాణలో, ఈ తేడాలన్నవి అత్యధిక ప్రాంతాలలో మిథ్య మాత్రమే. కనుక, తెలంగాణ రైతు బాగును, వ్యవసాయం బాగును నిజంగా కోరుకునే వారు చేయవలసింది సమగ్రమైన, వాస్తవికమైన దృష్టిని తీసుకోవటం. తగు అవగాహన లేనివారికి దానిని కల్పించటం.

ఇప్పుడు చివరి విషయానికి వద్దాము. ఇది క్లుప్తంగా మొదట ప్రస్తావించుకున్నదే. పైన అనుకున్నట్లు, తెలంగాణ వ్యవసాయాన్ని దీర్ఘకాలిక దృష్టితో, సమగ్ర దృష్టితో చూడవలసిన విషయం ఇది. ఆ పనిచేసినప్పుడు పైన పేర్కొన్న అంకెలు, తేడాలు ప్రధానమైనవిగా తోచవు కూడా. మనం తెలంగాణ వ్యవసాయంతో ముడిపెట్టి ఈ రాష్ట్ర దీర్ఘకాలిక భవితవ్యం గురించి ఊహించటం, అంచనాలు వేయటం చేయాలి. అటువం టి దార్శనికత అవసరం. కేసీఆర్ ప్రభుత్వం అమలుపరుస్తున్న రైతుబం ధు పథకాన్ని ఆయన వ్యవసాయ-గ్రామీణ రంగాల కోసం తెచ్చిన ఇతర కార్యక్రమాలతో కలిపి చూడాలి. ఇవి అన్నీ కలిపి ఉమ్మడిగా ప్రభావాన్ని చూపుతాయి గనుక. అటువంటి ఉమ్మడి ప్రభావంతోనే మార్పు వస్తుంది గనుక.

తెలంగాణ వంటి ప్రాంతంలో రైతాంగం తమ నిత్యజీవిత సమస్యలను తీర్చుకోవటంతో ఆగిపోకూడదు. ఆ తర్వాతి దశలలోకి ప్రవేశించాలి. చిన్నకారు, సన్నకారు, దిగువ, మధ్య శ్రేణి రైతులు పేదరికం, ఆకలి నుంచి బయటపడటమే గాక, ఎంతోకొంత మిగులును సాధించగలగాలి. అందుకు తగిన చర్యలు, వ్యూహాలు ఉండాలి. తెలంగాణ వంటి ప్రాంతం వ్యవసాయికంగా, పారిశ్రామికంగా, వ్యాపారపరంగా అభివృద్ధి చెందాలంటే ఈ దశలో చిన్న-మధ్య-పెద్ద అనే తారతమ్యం లేకుండా యావత్ రైతాంగం ప్రస్తుత స్థాయి నుంచి అనేక రెట్లు పైకి ఎదుగాలి. అది జరిగినప్పుడు రైతు జీవితానికి భరోసా ఏర్పడటం తొలిదశ కాగా, వ్యవసాయంలో మిగుల సంపదల సృష్టి, అవి పెట్టుబడులుగా మారటం మలి అవుతుంది. రైతుబంధు పథకం ఇతర పథకాలతో కలిసి ఫలితాలను ఇచ్చినప్పుడు ఇది జరుగుతుంది.

**తెలంగాణ వంటి ప్రాంతంలో రైతాంగం తమ నిత్యజీవిత సమస్యలను తీర్చుకోవటంతో ఆగిపోకూడదు. ఆ తర్వాతి దశలలోకి ప్రవేశించాలి. చిన్నకారు, సన్నకారు, దిగువ, మధ్యశ్రేణి రైతులు పేదరికం, ఆకలి నుంచి బయటపడటమే గాక, ఎంతోకొంత మిగులును సాధించగలగాలి. అం దుకు తగిన చర్యలు, వ్యూహాలు ఉండాలి. తెలంగాణ వంటి ప్రాంతం వ్యవసాయికంగా, పారిశ్రామికంగా, వ్యాపారపరంగా అభివృద్ధి చెందాలంటే ఈ దశలో చిన్న-మధ్య-పెద్ద అనే తారతమ్యం లేకుండా యావత్ రైతాంగం ప్రస్తుత స్థాయి నుంచి అనేక రెట్లు పైకి ఎదుగాలి. అది జరిగినప్పుడు రైతు జీవితానికి భరోసా ఏర్పడటం తొలిదశ కాగా, వ్యవసాయంలో మిగుల సంపదల సృష్టి, అవి పెట్టుబడులుగా మారటం మలి అవుతుంది.**

నీరు, ఇతర వనరులు, మార్కెట్లు సవ్యంగా అందుబాటులో గల ప్రాంతాలు అన్నింటా ఇదే జరిగింది. సంప్రదాయిక వ్యవసాయ సమాజాలు, ఫ్యూడల్ ఆర్థిక వ్యవస్థలు ఆధునిక దశలోకి అడుగుపెట్టాయి. వేర్వే రు వర్గాల మధ్య వ్యత్యాసాలు కొనసాగినా వెనుకటి పేదరికాలు పోయా యి. సంపదల సృష్టికి, ఆధునికతకు పునాదులు పడ్డాయి. చరిత్ర రుజు వు చేసిన ఇటువంటి మార్గంలో ప్రయాణించటం ఒక్కటే తెలంగాణకు అనుసరణీయం. అందువల్ల, రాష్ట్రం మేలును, భవిష్యత్తును కోరుకునేవారు సంకుచిత దృష్టిని వదిలి ఇటువంటి కోణాలను స్వీకరించాలి.

# హైదరాబాద్ కోహినూర్ వజ్రం

సందర్భం



**శ్రీధర్‌రావు దేశ్‌పాండే**

సీమాంధ్ర వలస పాలనలో మన చరిత్ర మనకు కాకుండా పోయింది. మనవాళ్లు ఎవరో, మన జాతి నిర్మాతలు, మన వైతాళికులు ఎవరో తెలియని పరిస్థితి ఏర్పడింది. మన చరిత్ర మనకు అందకుండాపోయింది. అందుకే తెలంగాణ కావాలని చెబుతూ సాగునీటి రంగంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని, ఉమ్మడి రాష్ట్ర పాలకుల వివక్షను, స్వాతంత్ర్యానికి పూర్వం హైదరాబాద్ రాజ్యంలో అలీ నవాజ్ జంగ్ కృషిని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల ఫోరం ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌రెడ్డి ఓ కాలేజీకి వక్తగా వెళ్లిన సందర్భంగా వివరించారు.

ఇక్కడ అది ఎందుకు ప్రస్తావించవలసి వస్తున్నదంటే.. నాడు నవాబ్ అలీ నవాజ్‌జంగ్ గురించి ఎవరికీ తెలియకపోయినా ఇప్పుడు బాగా తెలుసు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా అలీ నవాజ్‌జంగ్ బహద్దూర్ జయంతి జూలై 11ను తెలంగాణ ఇంజినీర్స్ డేగా ప్రకటించింది. నాలుగేండ్లుగా జూలై 11న అధికారికంగా రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఇంజినీర్స్ డే జరుపుకుంటున్నారు. సాగునీటి శాఖ ప్రధాన కార్యాలయం జలసౌధలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నాం. ఆయన పేరుమీద వివిధ శాఖల్లో విశిష్ట సేవలు అందించిన వెటరన్ ఇంజినీర్లకు నవాజ్ జంగ్ బహద్దూ ర్ మెమోరియల్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు 2015 సంవత్సరం నుంచి ప్రదానం చేస్తున్నారు. మూడేండ్లుగా పత్రికల్లో, టీవీల్లో ఆయనపై అనేక ప్రత్యేక కథనాలు ప్రచురించి, ప్రసారం చేసి అలీ నవాజ్‌జంగ్ కృషిని కొనియాడుతున్నారు.

ఇదంతా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినందున సాధ్యమైంది. తెలంగాణ చరిత్ర పరిశోధకులు పలుగూ పారా పట్టుకొని చరిత్ర పురా తవ్వకాలు జరిపారు. కాలం మట్టి దిబ్బల కింద కప్పిపెట్టబడిన మన చరిత్రను తవ్వి తీసి ప్రపంచానికి తెలియజెప్పినారు. మన జాతి నిర్మాతలను, మన వైతాళికులను ఎందరినో వెలుగులోకి తీసుకొచ్చారు. ఆ తవ్వకాల్లో బయటపడిన కోహినూర్ వజ్రమే అలీ నవాజ్‌జంగ్ బహద్దూర్. తెలంగాణ సాగునీటిరంగ పితామహుడు నవాబ్ అలీ నవాజ్‌జంగ్ బహద్దూర్ పేరుతో ఒక పుస్తకాన్ని కూడా 2013 జూలైలో అచ్చువేశాం. ఆ పుస్తకానికి అద్భుతమైన ఆదరణ లభించింది. అది ఉర్దూలోకి అనువాదమై ఉర్దూ పాఠకులకు కూడా అందింది.

అలీ నవాబ్ జంగ్ హైదరాబాద్ రాజ్యంలో పుట్టి దేశంలోనే అత్యంత ప్రతిభావంతుడైన ఇంజినీర్‌గా ప్రఖ్యాతిగాంచినాడు. దేశంలో సాగునీటి రంగానికి పునాదులు వేసిన తొలితరం మేధావి విశ్వేశ్వరయ్యకు సమకాలికుడు. అంతే ప్రతి భావంతుడైన ఇంజినీర్ అలీ నవాజ్‌జంగ్ బహద్దూర్. వారిద్దరూ కలిసి మూసి నది వరద నియంత్రణ, తాగునీటి కోసం ఉస్మాన్‌సాగర్, హిమా యత్‌సాగర్ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు.

అయితే ఉమ్మడి ఆంధ్రప్ర దేశ్ సాగు నీటిరంగ చరిత్రలో సర్ ఆర్థర్ కాటన్‌కు, కెఎల్ రావుకు దక్కిన స్థానం, ఖ్యాతి అలీ నవాజ్‌జంగ్‌కు దక్కలేదు. కాటన్ తరహాలోనే హైదరాబాద్ రాజ్యంలో ఈ ప్రాంత భౌగోళిక స్థితిగతులకు అను గుణంగా సమగ్ర సాగునీటి ప్రణాళికలు రచించి అనేక భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులను, అనేక చారిత్రక భవనాలను, వంతెనలను, రోడ్లను నిర్మించిన అలీ నవాజ్‌జంగ్ బహద్దూర్‌కు అటువంటి ఖ్యాతి దక్కవలసింది. తెలంగాణ ఉద్యమ చైతన్యంతో తెలంగాణ ఇంజినీర్లు తమ ఘనమైన చరిత్రను తెలుసుకున్నారు. ఆ ఎరుకలో నుంచే జూలై 11న తెలంగాణ ఇంజనీర్స్ డే జరుపుకొంటున్నాం.

ఆయన రూపొందించిన ఇంజినీరింగ్ నివేదికలు అపురూపమైనవి. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు భారత జాతీయ కాంగ్రెస్ దేశాభివృద్ధి పథకాలపై నివేదికలు తయారుచేయడానికి నెహ్రూ అధ్యక్షతన 1938లో నేషనల్ ప్లానింగ్ కమిటీని ఏర్పాటుచేసింది. ఆ కమిటీ వివిధ అంశాలపై నిపుణులతో సబ్ కమిటీలు ఏర్పాటు చేసింది. అటువం టి సబ్ కమిటీల్లో సాగునీటి రంగంలో సమగ్ర నివేది కను తయారుచేయడానికి అలీ నవాజ్ జంగ్‌ను నెహ్రూ ఎంచుకున్నాడు. అప్పటికే హైదరాబాద్ రాజ్యం ఇంకా భారత్‌లో విలీనం కాలేదు. అప్పటి కే ప్రతిభావంతుడైన ఇంజినీర్‌గా దేశంలో గుర్తింపుపొందిన ఆయన రివర్ ట్రైనింగ్ ఇరిగేషన్ పేరుతో సిఫార్సులతో కూడిన సమగ్ర నివేదికను రెండేండ్లలోనే నేషనల్ ప్లానింగ్ కమిటీకి సమర్పించాడు. స్వాతంత్ర్యానం తరం నెహ్రూ ఆ సిఫార్సులను అమలుచేశాడు. ఆయన సిఫార్సుల మేరకే ఢిల్లీలో సెంట్రల్ వాటర్ కమిషన్, సెంట్రల్ ఎలక్ట్రిసిటీఅథారిటీ, పుణేలో సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చి స్టేషన్ ఏర్పాటైనాయి. దేశంలో అన్ని నదుల పై గేజింగ్ స్టేషన్లు, దేశవ్యాప్తంగా వర్షపాతాన్ని నమోదు చెయ్యడానికి రెయిన్‌గేజ్ స్టేషన్లు ఏర్పాటయ్యాయి. అన్ని ప్రధాన నదులపై భాక్రానంగల్, హీరాకుడ్, దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు, నాగార్జునసాగర్ లాంటి భారీ ప్రాజెక్టుల నిర్మాణం జరిగాయి. అలీ నవా జ్‌జంగ్ కలలు ఆయన మరణానంతరం నిజమయ్యాయి.



**తెలంగాణలో అలీ నవాజ్‌జంగ్ బహద్దూర్ వారసత్వం సమున్నతంగా అమలవుతున్నది. వారి కఠోర పరిశ్రమ కారణంగా ప్రపంచంలో అతిపెద్ద మల్టీ స్టేజ్ ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టు మూడేండ్లలోనే నీటిని ఎత్తిపోసే దశకు చేరుకున్నది. ఇట్లా అనేక నిర్మాణాల్లో ఇంజినీర్లు నవాజ్ జంగ్ స్ఫూర్తిని, వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు.**

అలీ నవాజ్‌జంగ్ తన జీవిత కాలంలో అనేక ఉన్నత పదవులను సమర్థవంతంగా నిర్వహించాడు. హైదరాబాద్ సహా దేశంలో నాటి యురోపియన్ ఇంజినీర్ల ఆధిపత్యాన్ని అధిగమించి ప్రజా పనుల విభాగానికి చీఫ్ ఇంజినీర్‌గా, ఆ తర్వాత సెక్రటరీగా పదో న్నతి పొందాడు. దేశంలోనే ఆయన మొదటి స్వదేశీ చీఫ్ ఇంజినీర్.

హైదరాబాద్ ప్రజా పనుల శాఖకు చీఫ్ ఇంజినీర్-సెక్రటరీగా ఎంపికైనప్పుడు ఆయనకు చార్జ్ అప్పజెప్పిన హైదరాబాద్ రాజ్య చివరి బ్రిటిష్ చీఫ్ ఇంజినీర్ ఎటీ మెకంజీ, నేను నా బాధ్యతలను నాకంటే ప్రతిభావంతుడైన, నా కంటే గొప్ప పరిపాలనాదక్షుడికి అప్పజెపుతున్నానన్నాడు.

1948లో నవాబ్ చత్తారీ హైదరాబాద్ రాజ్య ప్రధానమంత్రి పదవికి రాజీనామా సమర్పించినప్పుడు కొత్త ప్రధానమంత్రి పదవికి అలీ నవాజ్‌జంగ్ పేరును కూడా నిజాం మీర్ ఉస్మాన్ ఖాన్ పరిశీలించినట్లు హైదరాబాద్ రాజ్య చివరి ప్రధానమంత్రి మీర్ లాయక్ అలీ ట్రాజెడీ ఆఫ్ హైదరాబాద్ పుస్తకంలో పేర్కొన్నాడు. అయితే హైదరాబాద్ రాజ్యానికి చివరి ప్రధానిగా చరిత్రలో నిలిచిపోయే ఒక విషాదం నుంచి తప్పించుకున్నాడు.

తెలంగాణలో అలీ నవాజ్‌జంగ్ బహద్దూర్ వారసత్వం సమున్నతంగా అమలవుతున్నది. ప్రపంచంలో అతిపెద్ద మల్టీ స్టేజ్ ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టు మూడేండ్లలోనే నీటిని ఎత్తిపోసే దశకు చేరుకున్నది. ఇట్లా అనేక నిర్మాణాల్లో ఇంజినీర్లు నవాజ్ జంగ్ స్ఫూర్తిని, వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. ఉమ్మడి పాలనలో అలీ నవాజ్ జంగ్‌కు చేసిన అన్యాయాన్ని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రం ఏర్పడిన నెలలోనే సవరించింది. అది ఆయనకు అం తిమంగా లభించిన పోయెటిక్ జస్టిస్. శాశ్వత సముచిత గౌరవం.

**(జూలై 11 తెలంగాణ ఇంజినీర్స్ డే..)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.





హైదరాబాద్‌లో మాజీ ఎంపీ కవితకు సభ్యత్వ రసీదును అందజేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి


కంటోన్మెంట్ పరిధిలో టీఆర్ఎస్ సభ్యత్వాలను అందజేస్తున్న మంత్రి చామకూర మల్లారెడ్డి


పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌కు సభ్యత్వ రసీదు అందజేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్


కొండాపూర్‌లోని హరీశ్‌రావు నివాసంలో సభ్యత్వం తీసుకుంటున్న ప్రైవేట్ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు రాములు


ఖమ్మంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాజీ మంత్రి తుమ్మలకు రసీదును అందజేస్తున్న మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో సభ్యత్వ నమోదు పత్రాలను అందజేస్తున్న మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, చిత్రంలో పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు

# ఊరూరా జోరుగా..

- కొనసాగుతున్న టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు
- ఉత్సాహంగా చేరుతున్న ప్రజలు
- ఆసక్తి చూపుతున్న యువత

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతున్నది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాల ఇంచార్జులు, నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సబ్బండ వర్గాల ప్రజలు టీఆర్ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. కేసీఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ అమీర్ హైదరాబాద్‌లో హోంమంత్రి మహమూద్ అలీ చేతులమీదుగా పార్టీ సభ్యత్వం స్వీకరించారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బోయిన్‌పల్లి, జయనగర్‌లో మంత్రి మల్లారెడ్డి సభ్యత్వ నమోదులో పాల్గొని సభ్యత్వాలు అందజేశారు. కంటోన్మెంట్‌బోర్డు సభ్యుడు మహేశ్వర్‌రెడ్డి, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవఅధ్యక్షుడు గంధం రాములు కొండాపూర్‌లో ఎమ్మెల్యే హరీశ్‌రావు చేతుల మీదుగా టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేట బైపాస్‌లోని రామ్‌లీలా ఫంక్షన్‌హల్‌లో పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి సభ్యత్వనమోదు కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి గ్రామానికి 65 శాతం సాధారణసభ్యత్వం, 35 శాతం క్రియాశీలక సభ్యత్వం ఇస్తున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి, మాజీమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, నాయకులు మద్దినేని స్వర్ణకుమారికి, మరికంటి ధనలక్ష్మికి సభ్యత్వం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పలువురికి టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వాలను అందజేశారు. కొత్తగూడెం మున్సిపాలిటీ 4వ వార్డులో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పర్యటించి పలువురికి టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వాలను అందించారు. ఇల్లెందు నియోజకవర్గం టేకులపల్లిలో టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య పలువురికి పార్టీ సభ్యత్వాలను అందజేశారు. భద్రాచలం నియోజకవర్గంలో భద్రాచలం పట్టణంలో నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం వెంకట్రావ్ సభ్యత్వ నమోదు ప్రక్రియలో పాల్గొని పలువురికి పార్టీ సభ్యత్వాలను అందించారు. అశ్వారావుపేట


బంజారాహిల్స్‌లోని హోంమంత్రి నివాసంలో టీఆర్ఎస్ సభ్యత్వాన్ని స్వీకరిస్తున్న కేసీఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ అమీర్

నియోజకవర్గంలో కూడా టీఆర్ఎస్ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రంలో అనతి కాలంలోనే టీఆర్ఎస్ బలమైన రాజకీయశక్తిగా ఎదిగిందని మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చందర్‌తో కలిసి రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ సభ్యత్వ రసీదును అందజేశారు. నిజామాబాద్ జుక్కల్, బాన్సువాడ నియోజకర్గాల సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి దాదన్నగారి విఠల్‌రావు ఆధ్వర్యంలో బిచ్కుంద మండలం పుల్కల్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొన్నారు. కరీంనగర్‌లోని 41,46, 47వ డివిజన్లలో స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. గంగాధర మండలం బూర్గుపల్లిలో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో సభ్యత్వాలు నమోదు చేశారు. అలాగే, హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, సైదాపూర్, శంకరపట్నం మండలాల్లోని పలు గ్రామాల్లో కూడా స్థానిక టీఆర్ఎస్ నాయకులు సభ్యత్వాలు సేకరించారు. ఇంటింటికి వెళ్లి కొత్త సభ్యులను చేర్పించారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్రంతోపాటు కొండాపూర్, దాయపంతులపల్లి, బాలానగర్, రాజాపూర్‌లో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ బాధ్యుడు చాడ కిషన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు, కొల్లాపూర్, పాన్‌గల్ మండలాల్లో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వరంగల్ 20వ డివిజన్‌లో సిద్దంరాజు ఆధ్వర్యంలో తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

### క్రియాశీల సభ్యత్వాన్ని పొందిన మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత

టీఆర్ఎస్ పార్టీ క్రియాశీల సభ్యత్వాన్ని నిజామాబాద్ పార్లమెంటు మాజీ సభ్యురాలు కల్వకుంట్ల కవిత స్వీకరించారు. హైదరాబాద్‌లోని కవిత స్వగృహంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సభ్యత్వ రసీదును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతున్నదని తెలిపారు. పార్టీ నిర్దేశించిన లక్ష్యాన్ని మించి సభ్యత్వ నమోదు అవుతుందన్నారు.


వరంగల్ నగరం 20వ డివిజన్‌లో కార్యకర్తలకు పార్టీ సభ్యత్వం ఇస్తున్న ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్


నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరులో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు


కరీంనగర్‌లో సభ్యత్వ నమోదు రసీదును అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్



మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్రంలో సభ్యత్వం అందజేస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


కామారెడ్డి జిల్లా పుల్కల్‌లో సర్పంచ్‌కు సభ్యత్వ నమోదు రసీదు అందజేస్తున్న దాదన్నగారి విఠల్‌రావు


వరంగల్ భద్రకాళి ఆలయం శాకంబరి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం అమ్మవారిని నాలుగు క్రమాల్లో అలంకరించారు. ఉదయం ఉగ్రప్రభా, త్వరితామాత, సాయంత్రం దీప్తా, కులసుందరీ క్రమంలో అలంకరించారు.
- మట్టెవాడ(వరంగల్)

## తాపీ పట్టిన కలెక్టర్


వంద శాతం ఓడీఎఫ్ జిల్లాగా జయశంకర్ భూపాలపల్లిని నిలిపేందుకు కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు కృషిచేస్తున్నారు. బుధవారం రేగొండ మండలం గోరికొత్తపల్లిలో పర్యటించిన ఆయన ఓ ఇంటివద్ద మరుగుదొడ్డి నిర్మాణంలో పాల్గొన్నారు. స్వయంగా తాపీ చేతపట్టి పనిచేశారు. -జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ

# పట్టణాలను మోడల్ సిటీగా మారుస్తాం

**పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. నర్సంపేటలో అభివృద్ధి పనులపై సమీక్ష**

**వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ/తొర్రూరు, నమస్తే తెలంగాణ:** వరంగల్ రూరల్ జిల్లాలోని పట్టణాలను మోడల్ సిటీలుగా మారుస్తామని, ఇందుకోసం ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్టు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖామంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట పట్టణంలో రైతుబీమా చెక్కులను, రైతులకు సబ్సిడీపై వచ్చిన విద్యుత్ మోటర్లను బుధవారం ఆయన అందజేశారు. అనంతరం నర్సంపేట మున్సిపల్ కార్యాలయంలో మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ హరితతోకలిసి అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ.. పట్టణాలను మోడల్ సిటీలుగా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. నర్సంపేట పట్టణాన్ని మోడల్‌సిటీగా అభివృద్ధి చేసేందుకు రూ.35 కోట్లు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రైతుబంధు, రైతు బీమా పథకాలతో నాడు వలసవెళ్లిన రైతులు, రైతుకూలీలు నేడు గ్రామాలకు చేరుకున్నారని వివరించారు. తెలంగాణ ప్రాజెక్టులకు ఒక్క రూపాయి సాయం చేయని బీజేపీకి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కులేదని చెప్పారు. ఐదో విడత హరితహారాన్ని ఉద్యమంలా చేపట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మొక్కలను రక్షించని ఇంటి యజమానులపై అవసరమైతే చర్యలు చేపట్టాలని కూడా అధికారులకు సూచించారు.



మహబూబాబాద్‌లో జాబ్‌మేళా కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

**ప్రతి నియోజకవర్గంలో ఉద్యోగ మేళా**

రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఉద్యోగమేళాలను నిర్వహిస్తున్నట్టు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని రామ ఉపేందర్ గార్డెన్‌లో ఆయన ఉద్యోగమేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణప్రాంతాల నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వ సూచన మేరకు హైదరాబాద్ నగరంలోని ప్రైవేట్ కంపెనీలు ముందుకు వస్తున్నాయని చెప్పారు. ఉద్యోగమేళాకు నియోజకవర్గానికి చెందిన 10 వేలమంది తరలివచ్చారు. 80 ప్రైవేట్ కంపెనీలకు చెందిన వారు దరఖాస్తుదారులను ఇంటర్వ్యూచేసి ఎంపికైనవారికి నియామకపత్రాలు అందజేశారు. ఉద్యోగాలు రానివారు నిరాశ చెందకూడదని నైపుణ్యాలను పెంచేందుకు మూడునెలల పాటు ఉచిత భోజనం, వసతితో కూడా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని చెప్పారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో హైఅలర్ట్

- ఎంపీటీసీ కిడ్నాప్‌పై వీడని ఉత్కంఠ
- మావోయిస్టుల చెరలోనే శ్రీనివాస్
- అడవిని జల్లెడ పడుతున్న పోలీసులు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** చర్ల మండలం పెద మిడిసిలేరు ఎంపీటీసీ నల్లూరి శ్రీనివాసరావు కిడ్నాప్ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. ప్రజాప్రతినిధులెవరూ తమకు సమాచారం ఇవ్వకుండా ఏజెన్సీలో పర్యటించవద్దని పోలీసులు ఆదేశించారు. టీఆర్ఎస్ ఎంపీటీసీని అపహరించడంతో అలర్ట్ అయిన పోలీసులు శ్రీనివాసరావు జాడ తెలుసుకొని అతన్ని క్షేమంగా రప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. శ్రీనివాసరావును అపహరణకు గురై 48 గంటలు దాటినా ఆచూకీ తెలియకపోవడం, మవోయిస్టుల వైపు నుంచి కూడా ఎలాంటి సమాచారం లేకపోవడం కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. సుమారు 15 మంది సాయుధ మావోలు సోమవారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న శ్రీనివాసరావును అపహరించి అడవిలోకి తీసుకెళ్లారు. ఎప్పుడు ఎటువంటి వార్త వినాల్సి వస్తుందోనని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. శ్రీనివాసరావును విడిపించేందుకు ఆదివాసీ సంఘాలు, పోలీసులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు అపహరణ నేపథ్యంలో ఇటు తెలంగాణ పోలీసులు, అటు ఛత్తీస్‌గఢ్ పోలీసులు అప్రమత్తమై అడవిని జల్లెడ పడుతున్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విశ్వాస్‌రెడ్డి

**మయూరిసెంటర్:** విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌విశ్వాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతు ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం విశ్వాస్‌రెడ్డిని సత్కరించారు. సమావేశంలో రాష్ట్ర సెక్రటరీ జనరల్ దామోదర్‌రెడ్డి, కోశాధికారి రామ్మోహన్‌రావు, కార్యదర్శి సుబ్బయ్య, ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కల్యాణం కృష్ణయ్య, ఆర్ రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న విశ్వాస్‌రెడ్డి


వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ బుధవారం బస్తీబాట నిర్వహించారు. ఇందులో భాగంగా ఇందిరానగర్‌లోని ఎస్సీ హాస్టల్‌లో బెడ్లను పరిశీలిస్తున్న దృశ్యం -రెడ్డికాలనీ(వరంగల్)

### కాకతీయ ప్యాసింజర్‌కు తప్పిన ప్రమాదం

- మహబూబాబాద్ జిల్లా గార్ల సమీపంలో విరిగిన పట్టా

**గార్ల:** మహబూబాబాద్ జిల్లా గార్ల రైల్వేస్టేషన్ సమీపంలోని పాకాల యేరు వద్ద మణుగూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే కాకతీయ ఫాస్ట్ ప్యాసింజర్ రైలుకు పెను ప్రమాదం తప్పింది. విరిగిన రైలు పట్టాను గుర్తించి లోకో పైలెట్ రైలును నిలిపివేశాడు. దీంతో పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. రైల్వే అధికారులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. ఉదయం ఐదు గంటల ప్రాంతంలో వరంగల్ వైపు కాకతీయ ఫాస్ట్ ప్యాసింజర్ రైలు వెళ్తుండగా పట్టాలు విరిగిన శబ్దాన్ని గమనించిన లోకో పైలెట్ రైలును నిలిపివేశారు. అప్పటికే పలు బోగీలు విరిగిన రైలు పట్టాపై నుంచి ముందుకు వెళ్లాయి. సకాలంలో పైలెట్ రైలును నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలిసిన రైల్వే అధికారులు, ఇంజినీర్ల బృందం ఘటన స్థలానికి వెళ్లి మరమ్మతులు చేపట్టారు. తిరిగి ఉదయం 6.20 గంటల సమయంలో పాసింజర్ రైలు అక్కడ నుంచి కదిలింది.

# తెలంగాణ పథకాలు అనుసరణీయం

- అసోం మత్స్యశాఖ అధికారులు
- పాలేరులో కేజ్ కల్చర్‌పై అధ్యయనం

**కూసుమంచి:** తెలంగాణ సంక్షేమ పథకాలు అనుసరణీయమని అసోం రాష్ట్ర మత్స్యశాఖ అధికారుల ప్రతినిధుల బృందం పేర్కొన్నది. బుధవారం ఖమ్మం జిల్లా పాలేరులో పర్యటించి, పాలేరు జలాశయంలో ప్రభుత్వ తోడ్పాటుతో ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్ (పంజర వల చేపల పెంపకం) ప్లాంట్లను పరిశీలించింది. చేపల పెంపకం విధానం, చేపల దిగుబడి, సర్కారు ప్రోత్సాహం తదితర అంశాలపై బృందం సభ్యులు అధ్యయనం చేశారు. మత్స్యకారులతో మాట్లాడి సాగు విధానాలను తెలుసుకున్నారు. జలాశయంలో ఉన్న పంజరాల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా బృందానికి ప్రాతినిధ్యం వహిస్తున్న చరకతేచత్రి, డాక్టర్ భగవాన్‌కలిత్ మాట్లాడుతూ.. తమ రాష్ట్ర ప్రభుత్వం చేపల ఉత్పత్తిని గణనీయంగా పెంచడానికి ప్రణాళికలు రూపొందించిందని, అందులో భాగంగా తెలంగాణ, జార్ఖండ్ రాష్ట్రాల్లోని చేపల పరిశ్రమలను అధ్యయనం చేయడానికి వచ్చినట్టు చెప్పారు. త్వరలో తమ రాష్ట్ర మత్స్యకారులు, అధికారుల బృందం పాలేరులో కేజ్‌కల్చర్ సాగుపై శిక్షణ పొందేందుకు రానుందన్నారు. బృందం సభ్యులు ప్రభాత్ డెక్కా, త్రిభునయ్‌దేవ్ శర్మ, అరూప్ దాస్, సంజయ్‌తిమాలిన్, అబనీడెకాత్ తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మం జిల్లా పాలేరు జలాశయంలో ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్ చేపల పెంపకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

# యువతకు సర్కారు పెద్దపీట


గంగాధరలో మాట్లాడుతున్న చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**గంగాధర:** రాష్ట్ర ప్రభుత్వం యువతకు పెద్దపీట వేస్తున్నదని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా గంగాధరలోబుధవారం నియోజకవర్గస్థాయి టీఆర్ఎస్‌పార్టీ యూత్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పిలుపుతోనియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి యువత భారీగా తరలివచ్చింది. టీఆర్ఎస్ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ప్రవీణ్‌కుమార్‌తో కలిసి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెలే మాట్లాడారు. రాబోయే రోజుల్లో యువత అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. పార్టీ, నామినేటెడ్ పదవుల్లో యువతకు పెద్ద ఎత్తున అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సంగారెడ్డి జిల్లా మంభాపూర్‌లో ఉన్న భూమికి వచ్చినరైతుబంధు సాయం రూ.42 వేలకు తనవంతు మరో రూ.42 వేలు కలిపి గ్రామాభివృద్ధికి అందజేస్తున్న ఏపీలోని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రతినిధి
- గుమ్మడిదల

# గన్స్‌తో బీజేపీ ఎమ్మెల్యే చిందులు



**డెహ్రాడూన్, జూలై 10:** మద్యం మత్తులో ఓ బహిష్కృత బీజేపీ ఎమ్మెల్యే చేసిన డ్యాన్సు వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఉత్తరాఖండ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే ప్రణవ్‌సింగ్ ఛాంపియన్ మద్యం మత్తులో తుపాకులు, మందు గ్లాసు పట్టుకుని బాలీవుడ్ పాటలకు డ్యాన్స్ చేస్తున్న రెండు నిమిషాల వీడియో బయటకొచ్చింది. కాగా ఓ జర్నలిస్ట్‌ను బెదిరించిన కారణంగా ఆయనను బీజేపీ నుంచి మూడు నెలల పాటు ఉత్తరాఖండ్ పార్టీ కమిటీ ఇదివరకే బహిష్కరించిందని, తాజా వీడియో నేపథ్యంలో రాష్ట్ర పార్టీ అతనిపై తగిన చర్యలు తీసుకుంటుందని ఉత్తరాఖండ్ రాజ్యసభ ఎంపీ అనిల్ బాలుని తెలిపారు. మరోవైపు, తానెవర్నీ బెదిరింపులకు లోను చేయలేదని, మద్యం తాగడం, లైసెన్స్ గన్స్ కలిగి వుండటం నేరమా? అని ప్రణవ్‌సింగ్ ప్రశ్నిస్తున్నారు.

# రెండోరోజు కొనసాగిన సీబీఐ సోదాలు

## యూపీ మాజీ మంత్రి ప్రజాపతి, నలుగురు అధికారులపై కేసులు

**న్యూఢిల్లీ:** సీబీఐ సోదాలు రెండో రోజు కూడా కొనసాగాయి. దేశవ్యాప్తంగా తనిఖీలు జరిపి కేసులు నమోదు చేస్తున్న సీబీఐ బుధవారం కూడా రెండు కేసులను నమోదు చేసింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇసుక అక్రమ తవ్వకాల కుంభకోణానికి సంబంధించి ఆ రాష్ట్ర మాజీ మంత్రి, సమాజ్‌వాదీ పార్టీ నేత గాయత్రి ప్రజాపతి, ఎస్పీ అధికారంలో ఉన్నప్పుడు ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేసిన జీవేశ్ నందన్, స్పెషల్ సెక్రటరీ సంతోష్‌కుమార్, జిల్లా కలెక్టర్లు అభయ్, వివేక్‌లపై ఈ కేసులు నమోదయ్యాయి. ఈ-టెండర్ విధానం ద్వారానే గనుల తవ్వకాల లీజ్‌లను కేటాయించాలంటూ 2012లో రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనను తీసుకొచ్చింది. అయితే నాడు మంత్రిగా ఉన్న ప్రజాపతి ఈ నిబంధనలను ఉల్లంఘించి పలువురికి అక్రమంగా గనుల తవ్వకాల పనులను కేటాయించారని, ఇందుకు అధికారులు సహకరించారని పేర్కొంటూ సీబీఐ కేసులు నమోదు చేసింది.

# నాపై రెండుసార్లు కాల్పులు జరిగాయి

## అయినా పోలీసులు చర్యలు తీసుకోలేదు

### ఆప్ ఎమ్మెల్యే ప్రకాశ్ జర్వాల్ ఆరోపణ



**న్యూఢిల్లీ:** తనపై రెండుసార్లు కాల్పులు జరిగాయని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యే ప్రకాశ్ జర్వాల్ తెలిపారు. ఢిల్లీలోని షాని బజార్ ప్రాంతంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో తాను పాల్గొన్నానని, ఈ సందర్భంగా అక్రమ మద్యం సరఫరాదారుడైన ఒక వ్యక్తి తనపై మూడు రౌండ్లు కాల్పులు జరిపాడని చెప్పారు. అంతకుముందు ఆదివారం కూడా తనపై కాల్పులు జరిగాయని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మరోవైపు పోలీసులు మాట్లాడుతూ ఘటనాస్థలం నుంచి సీసీటీవీ ఫుటేజీని సేకరించామని, కానీ ఆయనపై కాల్పులు జరిగినట్లు అందులో లేదని చెప్పారు.



# రోజ్‌వ్యాలీ కుంభకోణం కేసులో బెంగాలీ నటి రితూపర్ణకు ఈడీ సమన్లు

**కోల్‌కతా, జూలై 10:** రోజ్‌వ్యాలీ చిట్‌ఫండ్ కుంభకోణం కేసులో బెంగాలీ నటి రితూపర్ణ సేన్‌గుప్తాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. వచ్చేవారం విచారణకు హాజరు కావాలని ఆమెను కోరామని ఈడీ వర్గాలు తెలిపాయి. ఇదే కుంభకోణం కేసులో ప్రముఖ నటుడు ప్రొసేన్‌జిత్ చటర్జీకి జారీ చేసిన మరునాడే రితూపర్ణ సేన్‌గుప్తాకు ఈడీ సమన్లు జారీ చేయడం గమనార్హం. రోజ్‌వ్యాలీ గ్రూప్ చైర్మన్ గౌతం కుందుతో కలిసి రితూపర్ణ సేన్‌గుప్తా పలు సార్లు విదేశీ ప్రయాణం చేశారని, సినిమాల నిర్మాణంలో ఆయనకు సహకరించారని ఆరోపణలు ఉన్నాయి. తనకు సమన్లు జారీ చేసిన విషయమై ఆమె స్పందించలేదు. ప్రొసేన్‌జిత్ చటర్జీని ఈ నెల 19న సాల్ట్‌లేక్‌లోని సీజీవో కాంప్లెక్స్‌లో గల ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. హవాలా లావాదేవీల నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈడీ విచారించి, వాంగ్మూలం నమోదు చేయనున్నది.

# విమానం తలుపుల మధ్య చిక్కుకుని టెక్నీషియన్ మృతి

**కోల్‌కతా, జూలై 10:** విమానం హైడ్రాలిక్ తలుపుల మధ్య చిక్కుకుని గాయాలతో స్పైస్ జెట్ టెక్నీషియన్ దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. బుధవారం తెల్లవారుజామున 1.45 గంటల సమయంలో కోల్‌కతా విమానాశ్రయంలో ల్యాండైన విమానానికి మరమ్మత్తులు చేస్తున్నప్పుడు ఈ దుర్ఘటన చోటు చేసుకున్నదని స్పైస్ జెట్ ఒక ప్రకటనలో తెలిపింది. విమానాశ్రయంలోని బే నంబర్ 32లో పార్క్ చేసిన విమానానికి మరమ్మత్తులు చేస్తుండగా అకస్మాత్తుగా టెక్నీషియన్ రోహిత్ పాండే.. హైడ్రాలిక్ తలుపుల మధ్య చిక్కుకున్నాడని పేర్కొంది. హైడ్రాలిక్ తలుపులు బద్దలు కొట్టి అతడ్ని వెలికి తీసి దవాఖానకు తరలించినా అప్పటికే మరణించాడని వైద్యులు చెప్పారు. విమానాశ్రయం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని స్పైస్ జెట్ తెలిపింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సందర్శించారు. ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరిస్తున్నారని పేర్కొంది.

# కతువా దోషులకు ఉరిశిక్ష విధించాలి

## హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్న చిన్నారి తండ్రి

**చండీగఢ్, జూలై 10:** కతువా లైంగికదాడి, హత్య కేసులో ఆరుగురు దోషులకు విధించిన యావజ్జీవ కారాగారాన్ని ఉరిశిక్షగా మార్చాలని శిక్ష పంజాబ్-హర్యానా హైకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేయనున్నట్లు చిన్నారి తండ్రి చెప్పారు. దోషులు సాంజీరామ్, దీపక్ ఖజురియా, పర్వేశ్ కుమార్‌లకు యావజ్జీవ శిక్షకు బదులు ఉరిశిక్ష.. మరో ముగ్గురు దోషులు సురీందర్ కుమార్, తిలక్ రాజ్, ఆనంద్ దత్తాలకు ఐదేండ్ల జైలుశిక్షను యావజ్జీవ ఖైదుగా మార్చాలని కోరుతూ చిన్నారి తండ్రి హైకోర్టులో పిటిషన్ వేయనున్నారు. సాంజీరామ్ కొడుకు విశాల్ జంగోత్రాను నిర్దోషిగా విడుదల చేస్తూ పఠాన్‌కోర్టు న్యాయస్థానం గత నెలలో తీర్పు చెప్పింది. జంగోత్రాను నిర్దోషిగా ప్రకటించడానికి వ్యతిరేకంగా తాము హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని చెప్పారు. తమ కుటుంబానికి పరిహారం ఇవ్వాలని మృతురాలి తండ్రి ప్రభుత్వాన్ని కోరుతున్నారని బైన్స్ వివరించారు.

# లాంచ్‌ప్యాడ్‌పై 'బాహుబలి' రాకెట్!



లాంచ్‌ప్యాడ్‌పైకి జీఎస్‌ఎల్వీమార్క్-3 రాకెట్‌ను తరలిస్తున్న దృశ్యం

## జీఎస్‌ఎల్వీ మార్క్-3 ఫొటోలు విడుదల చేసిన ఇస్రో

## 15న చంద్రయాన్-2 ప్రయోగం

**శ్రీహరికోట, జూలై 10:** చంద్రయాన్-2ను నింగిలోకి మోసుకెళ్లే 'బాహుబలి' రాకెట్ జీఎస్‌ఎల్వీ మార్క్-3కి సంబంధించిన చిత్రాలను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) బుధవారం విడుదల చేసింది. లాంచ్‌ప్యాడ్‌పైకి రాకెట్‌ను తరలిస్తున్న దృశ్యాలను పక్క ఫొటోలో చూడొచ్చు. చంద్రయాన్-2 మిషన్‌ను భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ నెల 15న శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి చేపట్టే ఈ ప్రయోగానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ హాజరుకానున్నారు. 640 టన్నుల బరువున్న జీఎస్‌ఎల్వీ మార్క్ 3 రాకెట్ 3.8 టన్నుల బరువున్న ఉపగ్రహాన్ని మోసుకెళ్లనుంది. చంద్రుడిపై భారత్ చేపడుతున్న రెండో ప్రయోగం ఇది. 2008లో చంద్రయాన్-1 ప్రయోగాన్ని చేపట్టిన విషయం తెలిసిందే.

చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో దిగనున్న తొలి వ్యోమనౌకగా చంద్రయాన్-2 నిలువనుంది. ఇంతకుమునుపెన్నడూ ఏ దేశమూ ఆ ప్రాంతానికి వ్యోమనౌకను పంపలేదు.



## చంద్రయాన్-2 విశేషాలు

చంద్రయాన్-1కి ఇది కొనసాగింపు. 2018 సెప్టెంబర్ 18న ఈ మిషన్‌కు ఆమోదం లభించింది. ఈ నెల 15న శ్రీహరికోటలోని షార్ అంతరిక్ష కేంద్రం నుంచి జీఎస్‌ఎల్వీ మార్క్-3 రాకెట్ ద్వారా చంద్రయాన్-2ను ప్రయోగించనున్నారు. సెప్టెంబర్ 6న ఇది చంద్రుడిపై దిగనుంది.

చంద్రయాన్ 2లోని ఆర్బిటార్ ఒక ఏడాది పాటు పనిచేయనుంది. చంద్రుడి ఉపరితలంపై దిగే ల్యాండర్ (విక్రమ్), రోవర్ (ప్రగ్యాన్) 14 రోజులపాటు పనిచేస్తాయి. ల్యాండ్ అయిన ప్రదేశం నుంచి రోవర్ 500 మీటర్ల వరకు వెళ్లగలదు.

చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో మృదువుగా (సాఫ్ట్) ల్యాండింగ్ సాగించే తొలి మిషన్ ఇదే. అలాగే పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో చంద్రుడిపై పరిశోధనలు జరిపేందుకు భారత్ చేపడుతున్న తొలి ప్రయోగం కూడా ఇదే. ఇప్పటివరకు అమెరికా, రష్యా, చైనా మాత్రమే చంద్రుడి ఉపరితలంపై సాఫ్ట్ ల్యాండింగ్ సాగించాయి. చంద్రయాన్-2 విజయవంతమైతే ఆ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలువనుంది. చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ కోసం ఇప్పటివరకు వివిధ దేశాలు 38 ప్రయత్నాలు చేశాయి. అందులో సక్సెస్ రేట్ 52 శాతం మాత్రమే.



అరుణాచల్ ప్రదేశ్‌లో వరదల ధాటికి కొట్టుకుపోయిన ఇండ్లు

# ఈశాన్యంలో కుండపోత వానలు

## అసోం, అరుణాచల్‌ప్రదేశ్‌లో వరదలు.. ముగ్గురు మృతి..

### అరుణాచల్‌లో బ్రిడ్జి కొట్టుకుపోవడంతో చిక్కుకుపోయిన 800 మంది

**న్యూఢిల్లీ:** ఈశాన్య రాష్ర్టాలను వర్షాలు ముంచెత్తుతున్నాయి. కుండపోత వానలకు అసోం, అరుణాచల్‌ప్రదేశ్‌లో వరదలు సంభవిస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా అసోంలో ముగ్గురు చనిపోయారు. రాష్ట్రంలో 530 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయని, 13,267.74 హెక్టార్ల పంట నీటిలో మునిగిందని అసోం రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ పేర్కొంది. మరోవైపు అరుణాచల్‌లో కాస్పి, నాగ్ మందిర్‌ను కలిపే ఆర్‌సీసీ బ్రిడ్జి కొట్టుకుపోవడంతో దాదాపు 800 మందికిపైగా ప్రజలు చిక్కుకుపోయారు. వరదల కారణంగా అరుణాచల్‌ను, అసోంలోని 4కాప్స్ హెడ్‌క్వార్టర్స్‌ను కలిపే వ్యూహాత్మక రహదారి భలుక్ పాంగ్-చార్‌దౌర్-తవాంగ్ (బీసీటీ) రహదారిని బుధవారం కూడా అధికారులు మూసివేశారు. కమెంగ్ జిల్లాలోని బనా-సెప్పా ప్రాంతంలో ఐదు భవంతులు కొట్టుకుపోయాయి. ప్రాణ నష్టం వివరాలు తెలియరాలేదు.

# మధ్యప్రదేశ్‌లో ఎదురుకాల్పులు.. ఇద్దరు నక్సల్స్ మృతి

**బాలాఘాట్ (మధ్యప్రదేశ్), జూలై 10:** మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర పోలీసులకు వాటెండ్‌గా మారిన ఇద్దరు మావోయిస్టులు ఎదురుకాల్పుల్లో మరణించారు. మూడు రాష్ర్టాల్లో కలిపి వీరి తలపై రూ.14 లక్షల చొప్పున రివార్డ్ కూడా ఉన్నది. మృతుల్లో ఒకరు మహిళ. మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లా నెవార్‌వాహి గ్రామంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు గాలింపు చేపట్టారు. ఓ ఇంట్లో మావోయిస్టులు తలదాచుకోవడాన్ని గుర్తించిన పోలీసులు లొంగిపోవాలని సూచించారు. కానీ నక్సల్స్ కాల్పులకు తెగబడటంతో పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. దీంతో మావోయిస్టులు మంగేశ్, నందే మరణించారు. ఘటనాస్థలంలో రెండు తుపాకులు, బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రం రగుడు డంపింగ్‌యార్డులో సేంద్రియ ఎరువుల తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న సీవీ రాములు

# పారిశుద్ధ్య నిర్వహణలో సిరిసిల్ల భేష్

- ఎన్జీటీ చైర్మన్ జస్టిస్ సీవీ రాములు

**సిరిసిల్ల టౌన్:** పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) చైర్మన్, జస్టిస్ సీవీ రాములు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కలెక్టర్ కృష్ణభాస్కర్, ఎస్పీ రాహుల్‌హెగ్డే, జిల్లా అధికారులతోకలిసి సిరిసిల్లలోని మున్సిపల్ కార్యాలయం, జిల్లా దవాఖాన, వీధి విక్రయదారుల దుకాణాలను సందర్శించారు. అనంతరం రగుడు శివారులోని డంపింగ్ యార్డులో పొడివ్యర్థాల వనరుల సేకరణ కేంద్రం, వర్మి కంపోస్టు యూనిట్, ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ యా యూనిట్లు, పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణలో సిరిసిల్ల ఉత్తమంగా ఉందని కలెక్టర్ కృష్ణభాస్కర్, మున్సిపల్ కమిషనర్ డా కేవీ రమణాచారిలను ఆయన అభినందించారు. జిల్లా దవాఖానలో బయోవ్యర్థాల నిర్వహణ బాగుందని, ఇదేవిధంగా కొనసాగించాలని సూపరింటెండెంట్ తిరుపతికి సూచించారు.


Telangana State Co-operative Marketing Federation Ltd.,
5-2-68, 3rd Floor, Mahatma Gandhi Markfed Bhavan, Jambagh, Hyderabad- 500095, Ph: 040-24607106 & 24607108 PMBX 2 Lines, Fax: 040-24607100
E.mail: fert.tsmarkfed@gmail.com
INVITES SEALED TENDERS
TENDER NOTICE
From Reputed manufactures /authorized Distributors for Supply and Transportation of Bio-Fertilizers, Bio-Pesticides, Micronutrients, Organic Manures and Light Traps : (1) Last date for receipt of Tender Bids: 19.07.2019 at 12:00 Noon. (2) Opening of Tenders technical bid and price bid: 19.07.2019 at 02:00 PM. Regd. Office: 5-2-68, 3rd Floor, Mahatma Gandhi Markfed Bhavan, Jambagh, Hyderabad-500095. Website: www.tsmarkfed.com
Dt : 10.07.2019 Sd/- MANAGING DIRECTOR



తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీ రాజ్ శాఖ, నిజామాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. 185 to 214/2019-20 తేది: 08.07.2019
PR రీజియన్, నిజామాబాద్‌లో 2BHK ఇళ్ళు నిర్మాణం చేపట్టుట కొరకు దిగువ సంతకందారుచే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు కోరబడుతున్నవి. మొత్తం ECV: రూ. 6810.14 లక్షలు. టెండరు షెడ్యూళ్ళను 11.07.2019న ఉ. 10.30 గం|| నుండి 18.07.2019న మ. 3.00 గం|| వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ సైట్ నుండి అప్‌లోడ్ చేయవచ్చును. ఫోన్ నం. 08462-239502. తదుపరి వివరాల కొరకు www.tender.telangana.gov.in దర్శించండి.
సం/- రీజినల్ ఆఫీసర్, PR రీజియన్, నిజామాబాద్
DIPR RO. No. 589-DP/CL/Advt/1/2019-20, Dt: 10/07/2019



తెలంగాణ ప్రభుత్వము
రోడ్లు మరియు భవనాల శాఖ, కరీంనగర్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
e NIT No. 08/SE/(R&B)/KNR/2019-20 తేది: 03-07-2019
పని వివరణ మరియు అంచనా మొత్తం: 1) కరీంనగర్‌లోని కోర్టు భవనం ఆవరణలో జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు స్పెషల్ మొబైల్ కోర్టుకు మరమ్మతులు, నవీకరణ. 2) కరీంనగర్‌లోని జిల్లా కోర్టు ఆవరణలో పాత కోర్టు భవనానికి మరమ్మతులు, నవీకరణ. 3) కరీంనగర్‌లోని కోర్టు భవనాల ఆవరణలో ఫ్యామిలీ కోర్టు అండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ భవనం మరమ్మతులు, నవీకరణ-రూ.46.00 లక్షలు. బిడ్ దాఖలు ప్రారంభ తేది, సమయం: 09-07-2019న సా. 4.00 గం.బిడ్ దాఖలు ముగింపు తేది, సమయం: 16-07-2019న మ.3.30 గం. వాణిజ్య దశ: 16-07-2019న సా.4.00 గం. సంబంధిత SE పేరు & చిరునామా: SE(R&B) సర్కిల్, కరీంనగర్. ఫోన్ నం. 0878-2243754. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (R&B) సర్కిల్, కరీంనగర్
DIPR R.O.No. 596 DP/CL/Advt/1/2019-20 తేది: 10-07-2019



హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

| నిట్ నం. | పని పేరు | అంచనా మొత్తం/ECV | బిడ్ స్వీకరణకు ప్రారంభ తేది/చివరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నం. |
|---|---|---|---|---|
| 1)827/UMS/SE(SWM)/GHMC/2019-20 | దిగువ రెండు పనుల కొరకు GHMC అనుభవం గల మరియు అర్హత గల సర్వీస్ ప్రొవైడర్ల నుండి టెండర్లు కోరుతోంది. ప్యాకేజీలు 1 నుండి 34ల కోసం సంవత్సర కాలానికి GHMC లోని ఎల్.బి.నగర్, చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్లలోని ఎంటమాలజి విభాగంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై సూపర్‌వైజర్స్ వర్కర్స్ ఏర్పాటుచేయుట కోసం టెండర్లు కోరడమైనది. | 48.80 కోట్లు | 10-07-19న ఉ. 11.00 గం. 16-07-19న మ. 3.00 గం. | S.E(SWM)GHMC సెల్ నం. 7032911018 |
| 2)EOINo.01/SE(Elec.)/GHMC/2019-20,10-07-2019 | హైదరాబాద్ మహానగర పాలక సంస్థ దుర్గం చెరువు వంతెన కేబుల్స్ మరియు వంతెన టవర్స్, హైదరాబాద్‌కు ఆర్కిటెక్చరల్ ఇల్యూమినేషన్ ఫేజ్-I ఏర్పాటుకు ప్రతిపాదనలు కోరుతోంది. | — | 22-06-19న ఉ. 11.00 గం. 20-07-19న మ. 3.00 గం. | S.E(Elec.)/GHMC సెల్ నం. 9989930488 సెల్ నం. 9959442432 |

తదుపరి వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు
24x7 GHMC సేవల కొరకు 040-21111111కు ఫోన్ చేయండి.
R.O.NO. 88/CPRO/GHMC/2019-20 సం/- కమిషనర్


# సంక్షేమంలో తెలంగాణ నంబర్‌వన్

- పేదింటికి చేరుతున్న సీఎం కేసీఆర్ పెండ్లికానుక
- విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేటలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక యుగంధర్‌రావు, కలెక్టర్ అమయ్‌కుమార్ తదితరులు

**సూర్యాపేట టౌన్:** తెలంగాణ ఏర్పాటు తర్వాత వినూత్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచిందనీ, ప్రతి పేదింటికి కుటుంబ పెద్దగా ముఖ్యమంత్రి కేసీఆర్ పెండ్లికానుకగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అందిస్తూ కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారని విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట, హుజూర్‌నగర్, గరిడేపల్లిలో సూర్యాపేట, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులతోపాటు సీఎం సహాయ నిధి, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ రుణాల చెక్కులను మంత్రి అందజేసి మాట్లాడారు. యేటా రాష్ట్రంలో రూ.45 వేల కోట్లకుపైనే సంక్షేమ పథకాలకు ఖర్చు చేస్తున్నామని, వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రూ.50 వేల కోట్లకుపైనే పెరగనుందన్నారు. ప్రతి యేటా కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై రూ.800 కోట్లకు పైగా ఖర్చు పెడుతున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,146 మందికి రూ.10.48 కోట్ల కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు అందజేయడంతోపాటు 60 మందికి రూ.18.24 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, 28 మందికి 14 లక్షల బీసీ రుణాల చెక్కులు అందజేశారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆత్మకూర్ ఎస్.మండలానికి చెందిన 25.1 ఎకరాల ఇనాం భూముల పట్టాలు పేద కుటుంబాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ అమయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగంధర్‌రావు, ట్రైనీ కలెక్టర్ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో కలెక్టర్, ఎస్పీలతో కలిసి భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

# ప్రభుత్వభవనాలు నాణ్యతగా నిర్మించండి

## వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి, నమస్తే తెలంగాణ:** కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలతో పాటు క్యాంపు నిర్మాణాల పనులను నాణ్యతగా చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వనపర్తి జిల్లా మర్రికుంటలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను బుధవారం కలెక్టర్ శ్వేతా మొహంతి, ఎస్పీ అపూర్వరావులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉండేలా నూతన భవనాలను నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన మోడల్ ప్రకారం నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేసి అప్పజెప్పాలని ఆదేశించారు.

జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట అనుబంధ, కొండగట్టు దిగువన నివసిస్తున్న గంజికుంటు కులస్థులతో మాట్లాడుతున్న బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్ -మల్యాల



# వర్షపు నీటిని ఒడిసి పట్టాలి

- జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యురాలు గాయత్రీమిశ్రా



మెదక్ జిల్లా నస్కల్‌లో పర్యటిస్తున్న కేంద్రబృందం సభ్యురాలు గాయత్రీమిశ్రా

**రామాయంపేట:** వర్షపునీరు వృథాగా పోకుండా ఒడిసిపట్టాలని అప్పుడే భూగర్భ జలాలువృద్ధి చెందుతాయని జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యురాలు గాయత్రీ మిశ్రా పేర్కొన్నారు. జలశక్తి అభియాన్ పథకం కింద మెదక్ జిల్లాలోని నిజాంపేట మండలం ఎంపికైంది. బుధవారం మెదక్ జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డి, ఇతర అధికారులతో కలిసి మండలంలోని చల్మెడ, నస్కల్ గ్రామాలను సందర్శించి హరితహారం మొక్కలు, రైతులు నిర్మించిన పాంపండ్స్, నర్సరీలను సందర్శించారు.

# యువకుడి వేధింపులతో విద్యార్థిని ఆత్మహత్య

## నల్లగొండ జిల్లా వెల్మినేడులో ఘటన

**చిట్యాల:** యువకుడి వేధింపులు తట్టుకోలేక విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెల్మినేడులో చోటుచేసుకున్నది. వెల్మినేడుకు చెందిన ఏనుగు విజయ(23) హైదరాబాద్‌లోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ చివరిసంవత్సరం చదువుతున్నది. కాగా విజయను కొంతకాలంగా దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన నరేశ్ అనే యువకుడు ఫోన్‌లో వేధిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కూడా నరేశ్ ఫోన్ చేసి విజయను వేధించడంతో మనస్తాపం చెంది ఇంట్లో చీరతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఉదయం ఐదున్నర ప్రాంతంలో విజయ ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని కుటుంబసభ్యులు గుర్తించారు. మృతురాలి సోదరుడు రఘుమారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై రాములు తెలిపారు.

# హరితహారాన్ని విజయవంతం చేయాలి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్

**పర్వతగిరి:** హరితహారం కార్యక్రమాన్ని ప్రజలు బాధ్యతగా భావించి విజయవంతం చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ సూచించారు. వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలో బుధవారం నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో ఎమ్మెల్యే అరూరి రమేశ్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటిన మొక్కలు రాబోయే రోజుల్లో చెట్లుగా పెరిగి ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.



వరంగల్ రూరల్ జిల్లా కల్లెడలో మొక్క నాటుతున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్

# రూ.369 కోట్ల పెంట్‌హౌస్

## సింగపూర్‌లో కొనుగోలు చేసిన బ్రిటన్ వ్యాపారి



**సింగపూర్:** సింగపూర్‌లో అత్యంత ఖరీదైన, విలాసవంతమైన పెంట్‌హౌస్‌ను బ్రిటన్ వ్యాపారవేత్త జేమ్స్ డైసన్ కొనుగోలు చేశారు. 64 అంతస్తులు, 290 మీటర్ల ఎత్తు ఉన్న వాల్లిచ్ రెసిడెన్సీలోని పెంట్‌హౌస్‌ను రూ.369 కోట్లకు కొన్నారు. 21వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల ఈ పెంట్‌హౌస్‌లో మూడు అంతస్తులు, 5 బెడ్‌రూంలు, గార్డెన్, స్విమింగ్ పూల్, టెర్రస్, ప్రత్యేక లిఫ్ట్ సౌకర్యాలున్నాయి. ఈయూ నుంచి వైదొలగాలని బ్రిటన్ నిర్ణయించడంతో డైసన్ తన విద్యుత్ ఉపకరణాల కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని బ్రిటన్ నుంచి సింగపూర్‌కు తరలిస్తున్నారు. 'మా కంపెనీ అభివృద్ధి కోసం ప్రధాన కార్యాలయాన్ని సింగపూర్‌కు తరలిస్తున్నాం. ఇందులో భాగంగానే పెంట్‌హౌస్‌ను కొనుగోలు చేశాం' అని తెలిపారు.

# రైళ్లలో అదనంగా 4 లక్షల బెర్తులు

## అక్టోబర్ నుంచి అందుబాటులోకి



**న్యూఢిల్లీ:** రైళ్లలో రోజుకు అదనంగా నాలుగు లక్షలకుపైగా బెర్తుల పెంపుపై రైల్వేశాఖ కసరత్తు చేస్తున్నది. అక్టోబర్ నుంచి ఈ బెర్తులు ప్రయాణికులకు అందుబాటులో వచ్చేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నది. ఇంజిన్ నుంచి విద్యుత్‌ను తయారుచేసే టెక్నాలజీని ప్రవేశపెట్టనున్నామని, దీనివల్ల బెర్తుల సంఖ్య పెంచడం సాధ్యమవుతుందని బుధవారం ఓ సీనియర్ రైల్వే అధికారి తెలిపారు. రైల్వే బోగీల్లో లైట్లు, ఏసీలు నడవడానికి కావలసిన విద్యుత్‌ను ప్రస్తుతం రైలు చివర్లో ఉండే రెండు పవర్ కార్స్ నుంచి ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం ఎల్‌హెచ్‌బీ రేక్ రైళ్లలోని బోగీలకు విద్యుత్ సరఫరాకు ఎండ్ ఆన్ జనరేటర్(ఈఓజీ)ని వినియోగిస్తున్నారు. దీని కోసం రైలు చివరి భాగంలో ఒకటి, రెండు పవర్ కార్స్‌ను ఉపయోగిస్తున్నారు. డీజిల్‌తో నడిచే ఈఓజీతో బోగీలకు విద్యుత్ అందిస్తున్నారు. కొత్తగా రైల్వేలో ప్రవేశపెట్టే 'హెడ్ ఆన్ జనరేషన్' (హెచ్‌ఓజీ) టెక్నాలజీ సాయంతో.. రైలుపై వేలాడే పవర్ లైన్స్ నుంచి విద్యుత్ రైలు బోగీలకు సరఫరా చేస్తారు. అక్టోబర్‌కల్లా రైల్వేలోని సుమారు 5 వేల కోచ్‌లు ఈ కొత్త టెక్నాలజీతో పనిచేస్తాయి. దీంతో పవర్ కార్స్ వినియోగాన్ని పక్కనబెట్టడమే గాక, రైల్వే ఖజానాపై రూ. 6వేల కోట్ల ఇంధన బిల్లుల భారం తగ్గించవచ్చని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

# దావూద్ తోక కత్తిరించండి

## ఐరాస భద్రతామండలిని కోరిన భారత్



**ఐరాస:** పాకిస్థాన్ కేంద్రంగా నేర కార్యకలాపాలు సాగిస్తున్న అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంకు చెందిన 'క్రిమినల్ సిండికేట్'.. టెర్రరిస్ట్ నెట్‌వర్క్‌గా రూపాంతరం చెందిందని ఐరాసలో భారత్ శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ చెప్పారు. దావూద్‌కు చెందిన డీ-కంపెనీతోపాటు నిషేధిత జైషే మహమ్మద్, లష్కరే తాయిబా తదితర ఉగ్రవాద సంస్థల నుంచి భారత్‌కు ముప్పు ఉన్న నేపథ్యంలో వాటిని కట్టడి చేసేందుకు ఐరాస భద్రతా మండలి దృష్టిసారించాలని 'అంతర్జాతీయ శాంతి, భద్రతకు ముప్పు: అంతర్జాతీయ ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాలకు మధ్య సంబంధాలు' అనే అంశంపై జరిగిన చర్చాగోష్టిలో సయ్యద్ అక్బరుద్దీన్ మాట్లాడుతూ చెప్పారు. 'దావూద్ తమ దేశంలోనే ఉన్నాడని ఒప్పుకునేందుకు నిరాకరిస్తున్న 'స్వర్గధామం' (పాకిస్థాన్)నుంచి అతడు ఈ నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నాడు' అని పేర్కొన్నారు.



కర్ణాటక విధాన సభముందు జరిగిన ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న యెడ్యూరప్ప

## అసెంబ్లీ ఎదుట

# బీజేపీ నిరసన

**బెంగళూరు:** కాంగ్రెస్-జేడీఎస్‌కు చెందిన 16 మంది ఎమ్మెల్యేలు తమ సభ్యత్వాలకు రాజీనామా చేసినందున సంకీర్ణ సర్కార్ మైనారిటీలో పడిపోయిందని, అందువల్ల సీఎం కుమారస్వామి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బెంగళూరులో రాష్ట్ర అసెంబ్లీ ఎదుట బీజేపీ ధర్నాకు దిగింది. ఈ ఆందోళనలో మాజీ డిప్యూటీ సీఎం కేఎస్ ఈశ్వరప్పతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు. సీఎం వెంటనే గద్దె దిగాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కర్ణాటక శాఖ అధ్యక్షుడు యెడ్యూరప్ప మాట్లాడుతూ, కుమారస్వామి వెంటనే గద్దె దిగి బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలన్నారు. '12 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి. మెజారిటీ లేకుండా మీరు సభనెలా నిర్వహిస్తారు?' అని ప్రశ్నించారు. 'మీరు (కుమారస్వామి) స్వచ్ఛందంగా తప్పుకోవాలి. లేదా మీ తండ్రి (దేవెగౌడ) అయినా మీకు రాజీనామా చేయాలని సలహా ఇవ్వాలి' అని అన్నారు. ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ ఎందుకు ఆమోదించడం లేదో అర్థం కావడం లేదన్నారు. రాజీనామాలు నిబంధనల ప్రకారం లేకపోతే.. ఎమ్మెల్యేలు మళ్లీ సమర్పిస్తారన్నారు. కర్ణాటకలో ఏర్పడిన సంక్షోభంపై గవర్నర్ ఎటువంటి నిర్ణయం తీసుకున్నా తమకు సమ్మతమేనని కేంద్ర మంత్రి డీవీ సదానంద గౌడ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పతనం అంచున నిలిచినందున గవర్నర్ బలపరీక్ష జరిపినా తాము ఎదుర్కొంటామన్నారు. అధికార పార్టీల ఎమ్మెల్యేల రాజీనామాల నేపథ్యంలో తమ సభ్యుల సంఖ్య 107 అని సదానంద వివరించారు.

# సుప్రీంకోర్టుకు కర్ణాటకం

**తమ రాజీనామాలను ఆమోదించేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరిన రెబల్ ఎమ్మెల్యేలు**

- వారి పిటిషన్‌పై నేడు నిర్ణయించనున్న అత్యున్నత న్యాయస్థానం
- రాజీనామా చేసిన మరో ఇద్దరు ఎమ్మెల్యేలు
- ముంబైలో అసంతృప్తులను బుజ్జగించేందుకు శివకుమార్ విఫలయత్నం
- హోటల్‌లోని ఎమ్మెల్యేలను కలువకుండా అడ్డుకున్న పోలీసులు
- పరిస్థితి ఎమర్జెన్సీని మించిపోయిందన్న మాజీ ప్రధాని దేవెగౌడ



ముంబైలోని హోటల్ ముందు బైఠాయించిన శివకుమార్, శివలింగ గౌడ, మిలింద్ దేవరా తదితరులు

**న్యూఢిల్లీ, జూలై 10:** కర్ణాటక రాజకీయ సంక్షోభం మరో మలుపు తిరిగింది. అసెంబ్లీ సభ్యత్వాలకు రాజీనామా చేసిన పది మంది జేడీఎస్, కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలు బుధవారం సుప్రీంకోర్టు మెట్లెక్కారు. అసెంబ్లీ స్పీకర్ తమ రాజీనామాలను ఉద్దేశపూర్వకంగా ఆమోదించడం లేదని ఆరోపించారు. వీరి పిటిషన్‌ను స్వీకరించిన చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం, దానిపై అత్యవసర విచారణ జరుపాల్సిన అవసరముందో లేదో గురువారం నిర్ణయిస్తామని తెలిపింది. రెబల్ ఎమ్మెల్యేల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ మాట్లాడుతూ, ఎమ్మెల్యేలు ఇప్పటికే తమ సభ్యత్వాలకు రాజీనామా చేసి తాజా ఎన్నికలను కోరుతున్నారని చెప్పారు. స్పీకర్ పక్షపాత ధోరణితో, దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారన్నారు. మైనారిటీలో పడ్డ ప్రభుత్వాన్ని స్పీకర్ కాపాడుతున్నారని రెబల్స్ ఆరోపించారు. వీరి వాదన విన్న ధర్మాసనం 'పరిశీలిస్తాం' అని అభయమిచ్చింది. తమ రాజీనామాలను ఆమోదించేలా స్పీకర్‌ను ఆదేశించాలని ఎమ్మెల్యేలు కోరారు. తమపై అనర్హత వేటు వేయకుండా కూడా స్పీకర్‌ను నిరోధించాలని విజ్ఞప్తి చేశారు.

**ముంబైలో హైడ్రామా**

కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశం మేరకు అసంతృప్త ఎమ్మెల్యేలను బుజ్జగించేందుకు ముంబైకి వచ్చిన ఆ పార్టీ ట్రబుల్ షూటర్ డీకే శివకుమార్ తన ప్రయత్నాలలో విఫలమయ్యారు. పది మంది రెబల్ ఎమ్మెల్యేలు మకాం వేసిన హోటల్ ముందు శివకుమార్, ముంబై కాంగ్రెస్ నేతలు మిలింద్ దేవరా, సంజయ్ నిరుపమ్, జేడీఎస్ నేతలు జీటీ దేవెగౌడ, శివలింగ గౌడ, సీఎన్ బాలకృష్ణన్ తదితరులు దాదాపు ఐదు గంటల పాటు బైఠాయించారు. భారీగా వర్షం కురుస్తున్నా.. వారు కదలలేదు. రెబల్ ఎమ్మెల్యేలతో మాట్లాడే వరకు తాము ఇక్కడి నుంచి కదలబోమని స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలో విధించిన నిషేధాజ్ఞలను ఉల్లంఘించారని పోలీసులు వారిని అరెస్టు చేసి, అక్కడి నుంచి తరలించారు. అంతకుముందు, శివకుమార్ ముంబై వస్తున్న విషయం తెలియగానే 8 మంది రెబల్ ఎమ్మెల్యేలు ముంబై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదుచేశారు. శివకుమార్ నుంచి ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని కోరారు. తమ రాష్ట్ర నాయకులు తాము బస చేస్తున్న హోటల్‌పై దాడి చేసే అవకాశం ఉందని ఆరోపించారు. శివకుమార్‌ను, శివలింగ గౌడను కలుసుకోవడం తమకు ఇష్టం లేదని, అందువల్ల వారిని హోటల్ లోపలికి అనుమతించవద్దని కమిషనర్‌ను కోరారు. దీంతో పోలీసులు ఆ హోటల్ పరిసరాల్లో నిషేధాజ్ఞలు విధించారు. హోటల్‌లో శివకుమార్ చేసుకున్న గది బుకింగ్‌ను రద్దు చేశారు. రెబల్ నేతలు, బీజేపీ కార్యకర్తలు శివకుమార్‌కు వ్యతిరేకంగా 'గో బ్యాక్' అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం తనపైకి పోలీసులను పంపడం సిగ్గుచేటన్నారు. 'నా స్నేహితులను కలువకుండా నేను వెళ్లను.. వారు నన్ను పిలుస్తారు. వారి హృదయం కరుగుతుంది. ఇప్పటికే వారితో టచ్‌లో ఉన్నా. రాజకీయాల్లో మేము కలిసి పుట్టాం. కలిసే చచ్చిపోతాం' అన్నారు. హోటల్ యాజమాన్యం తన గది బుకింగ్ రద్దు చేయడంపై స్పందిస్తూ 'నా వంటి కస్టమర్ వచ్చినందుకు వారు గర్వపడాలి. ముంబై అంటే నాకు ఇష్టం. ఈ హోటల్ అన్నా కూడా ఇష్టమే. నాకు వేరే హోటల్‌లో వేరే గదులు దొరుకుతాయి' అన్నారు. విమానాశ్రయం నుంచి రెబల్ ఎమ్మెల్యేలు బసచేసిన హోటల్‌కు నేరుగా చేరుకున్న ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. 'వారు (రెబల్స్) మిమ్మల్ని చూసి భయపడుతున్నందున హోటల్ లోపలికి వెళ్లేందుకు అనుమతించలేం' అని చెప్పారు. రెబల్ కాంగ్రెస్ నేత ఎస్టీ సోమశేఖర్ హోటల్ లోపల మీడియాతో మాట్లాడుతూ, శివకుమార్‌ను అవమానించాలన్న ఉద్దేశం తనకు, తన సహచరులకు లేదన్నారు. 'శివకుమార్‌పై మాకు విశ్వాసం ఉంది. కానీ మేం ఈ నిర్ణయం తీసుకోవడానికో కారణం ఉంది. స్నేహం, ప్రేమ, ఆప్యాయత ఓవైపు ఉన్నాయి. ఆయనను మేం ఎందుకు కలువలేకపోతున్నామో దయచేసి అర్థం చేసుకోవాలి' అని వేడుకున్నారు. మరో అసమ్మతి నేత రమేశ్ జార్కిహోళి మాట్లాడుతూ, 'శివకుమార్‌ను కలువడం మాకిష్టం లేదు. బీజేపీ వారూ ఎవరూ మమ్మల్ని కలవడం లేదు' అన్నారు. హోటల్‌లోని రెబల్ ఎమ్మెల్యేలను ముంబై పోలీసులు బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని పోలీస్ గెస్ట్‌హౌస్‌కు తరలించినట్టు తెలిసింది.

**ఎమర్జెన్సీని మించిపోయింది: దేవెగౌడ**

కర్ణాటకకు చెందిన ఓ మంత్రి (శివకుమార్)ను ముంబైలో ఓ హోటల్‌లోకి అనుమతించకపోవడంపై జేడీఎస్ అధ్యక్షుడు, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ మండిపడ్డారు. ఈ పరిస్థితి 'ఎమర్జెన్సీ కన్నా అధ్వానంగా ఉంది' అని అన్నారు. తన 60 ఏండ్ల ప్రజా జీవితంలో ఇటువంటి పరిస్థితిని ఎన్నడూ చూడలేదని చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజకీయ పార్టీలన్నీ తమ విభేదాలకతీతంగా ఒక్కటి కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ, కాంగ్రెస్, జేడీఎస్ కార్యకర్తలు రాజ్‌భవన్‌కు ప్రదర్శన నిర్వహించడానికి ముందు వారినుద్దేశించి దేవెగౌడ మాట్లాడారు.

### మరో ఇద్దరు ఔట్



ఇప్పటికే కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ సర్కార్ పతనాన్ని ఖాయం చేస్తూ మరో ఇద్దరు ఎమ్మెల్యేలు తమ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. గృహ వసతి శాఖ మంత్రి ఎంటీబీ నాగరాజ్, ఎమ్మెల్యే కే సుధాకర్ విధాన సౌధలో స్పీకర్‌ను కలిసి తమ రాజీనామాలను అందజేశారు. దీంతో రెబల్స్ సంఖ్య 16కు పెరిగింది. 224 మంది సభ్యులున్న అసెంబ్లీలో ప్రభుత్వానికి ప్రస్తుతం 116 మంది సభ్యుల మద్దతు ఉంది. ఒకవేళ రెబల్ ఎమ్మెల్యేల రాజీనామాలు ఆమోదం పొందితే ప్రభుత్వానికి మద్దతునిచ్చే వారి సంఖ్య 100కు చేరి సర్కార్ మైనారిటీలో పడిపోతుంది. ప్రతిపక్ష బీజేపీకి 107 మంది సభ్యులున్నారు. కాగా రాజీనామా చేసిన ఇద్దరు ఇండిపెండెంట్ సభ్యులు బీజేపీకి మద్దతునిస్తున్నట్టు తెలిపారు.

# సంక్షోభం ముందున్న దారులు!



**న్యూఢిల్లీ:** తమ రాజీనామాలను ఆమోదించకుండా స్పీకర్ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ అసమ్మతి ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టు తలుపు తట్టడంతో కర్ణాటక రాజకీయ సంక్షోభం మరో మలుపు తిరిగింది. ఈ నేపథ్యంలో సంక్షోభం ముందున్న దారులేంటో చూద్దాం..

1. **సంకీర్ణ ప్రభుత్వం మనుగడ**
   13 మంది అసమ్మతి ఎమ్మెల్యేల్లో నలుగురు/ఐదుగురు తమ రాజీనామాలను ఉపసంహరించుకుని క్యాబినెట్‌లో చేరితే సంకీర్ణ ప్రభుత్వం నిలబడవచ్చు. ఇది సరిపోకుంటే ఐదుగురు బీజేపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేసేలా కాంగ్రెస్, జేడీఎస్ రివర్స్ ఆపరేషన్ చేపట్టవచ్చు.
2. **బీజేపీ ప్రభుత్వం**
   అసమ్మతి ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ ఆమోదిస్తే.. 108 మంది ఎమ్మెల్యేల మద్దతుతో (ఇద్దరు స్వతంత్రులు, ఓ బీఎస్పీ ఎమ్మెల్యేతో కలిపి) బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. రెబల్ ఎమ్మెల్యేల రాజీనామాతో కూటమి బలం 102కు తగ్గుతుంది. 13 ఖాళీల నేపథ్యంలో, అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సి మెజార్టీ సంఖ్య 106కు తగ్గుతుంది. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీని గవర్నర్ ఆహ్వానించవచ్చు.
3. **సుప్రీంకోర్టు జోక్యం**
   అసమ్మతి ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో.. వారి రాజీనామాలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను సుప్రీంకోర్టు కోరే అవకాశం ఉంది. అసెంబ్లీలో బల నిరూపణకూ ఆదేశించవచ్చు.
4. **మళ్లీ ఎన్నికలు**
   అసమ్మతి ఎమ్మెల్యేల రాజీనామాలు ఆమోదం పొంది, ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు, ఓ బీఎస్పీ ఎమ్మెల్యే బీజేపీకి మద్దతు ఇచ్చేందుకు నిరాకరిస్తే రాష్ట్రపతి పాలన విధించేందుకు గవర్నర్ సిఫార్సు చేయొచ్చు. తద్వారా మళ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతుంది.

# ఆర్టికల్ 370 తాత్కాలికమే!

- రాజ్యసభలో కేంద్రం స్పష్టీకరణ.. కర్ణాటక అంశంపై దద్దరిల్లిన సభ
- 2018-19లో 3,133 కోట్ల డిజిటల్ లావాదేవీలు..
- ఎన్నారై భర్తల మీద 4,698 ఫిర్యాదులు



రాజ్యసభలో వెల్‌లోకి వెళ్లి ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష సభ్యులు

**న్యూఢిల్లీ, జూలై 10:** జమ్ముకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రాజ్యాంగంలో తాత్కాలికమేనని కేంద్రం బుధవారం రాజ్యసభకు తెలిపింది. జమ్ముకశ్మీర్ ప్రజల ప్రత్యేక హక్కుల కోసం నిర్దేశించిన ఆర్టికల్ 35ఏ కూడా భారత రాష్ట్రపతి ఆమోదంతో రాజ్యాంగంలో చేర్చబడిందని పేర్కొంది. ప్రస్తుతం ఆర్టికల్ 370 రాజ్యాంగంలో తాత్కాలికమైన ఉత్తర్వుగా (పార్ట్ XXI - తాత్కాలిక, పరివర్తన, ప్రత్యేక నిబంధనలు) ఉన్నదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జీ కిషన్ రెడ్డి అన్నారు. 'ప్రస్తుతం, రాజ్యాంగం ఉత్తర్వులు (జమ్ము కశ్మీర్ కోసం), 1954లో ఆర్టికల్ 35ఏ ఉన్నది. ఆర్టికల్ 370 కింద దీన్ని చేర్చారు' అని అన్నారు. జమ్ముకశ్మీర్ భారత్‌లో అంతర్గత భాగమని, రాజ్యాంగ విషయాలు అంతర్గతమని, పార్లమెంటు వాటిని చూసుకుంటుందని తెలిపారు. ఈ విషయంలో విదేశీ ప్రభుత్వాలు, సంస్థల ప్రమేయం ఉండదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్టికల్ 370, 35ఏను ప్రభుత్వం ఉపసంహరించుకోనుందా? అని సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధానం ఇచ్చారు. మరోవైపు, కర్ణాటకలో పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ నిరసనలతో రాజ్యసభ బుధవారం కూడా వాయిదా పడింది. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై గురువారం సభలో చర్చిస్తామని కాంగ్రెస్ సభ్యులు తెలిపారు.

**దేశంలో ఐఏఎస్‌ల కొరత..**

సాధారణ పరిస్థితుల్లో 11 రోజుల్లోగా దరఖాస్తుదారునికి పాస్‌పోర్ట్‌ను అందజేస్తామని విదేశాంగ శాఖ సహాయ మంత్రి మురళీధరన్ ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నకు సమాధానమిస్తూ తత్కాల్ క్యాటగిరీ వాళ్లకు ఒకటి, రెండు రోజుల్లో పాస్‌పోర్ట్ అందిస్తామని చెప్పారు. మరోవైపు, పెండ్లి చేసుకొని భార్యలను విడిచిపెట్టిన ఎన్‌ఆర్‌ఐ భర్తలపై దాదాపు 4,698 ఫిర్యాదులు నమోదయ్యాయని వి మురళీధరన్ తెలిపారు. దేశంలో దాదాపు 1,500మంది ఐఏఎస్‌ల కొరత ఉన్నట్టు సిబ్బంది మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ లిఖిత పూర్వక సమాధానంలో చెప్పారు. దేశంలో 2018-19లో సుమారు రూ. 3,133.58 కోట్ల డిజిటల్ లావాదేవీలు జరిగాయని ఐటీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. కాగా, మధ్యవర్తిత్వ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.



గోవా స్పీకర్‌కు లేఖ అందిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

# గోవాలోనూ కాంగ్రెస్‌కు కష్టాలు

- గోవా బీజేపీఎల్పీలో సీఎల్పీ విలీనం
- విపక్ష నేత చంద్రకాంత్ కావ్లేకర్ సారథ్యంలో స్పీకర్‌కు లేఖ

**పనాజీ:** కర్ణాటక రాజకీయాల్లో నెలకొన్న అస్థిరత్వం పొరుగు రాష్ట్రం గోవాకు కూడా విస్తరించింది. ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ శాసనసభా పక్షం (సీఎల్పీ) నిట్ట నిలువునా చీలిపోయింది. 15 మందిలో 10 మంది ఎమ్మెల్యేలు బీజేపీలో విలీనమవుతున్నట్లు బుధవారం ప్రకటించారు. అసెంబ్లీలో విపక్ష నేత చంద్రకాంత్ కావ్లేకర్ సారథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్పీకర్ రాజేశ్ పట్నేకర్‌కు లేఖ అందించారు. తమను అసెంబ్లీలో విడిగా చూడాలని కోరారు. వీరు స్పీకర్‌ను కలిసినప్పుడు సీఎం ప్రమోద్ సావంత్, డిప్యూటీ స్పీకర్ మిచైల్ లోబూ అక్కడే ఉన్నారు. తాజా పరిణామం నేపథ్యంలో అసెంబ్లీలో కాంగ్రెస్ బలం ఐదుకు పడిపోగా బీజేపీబలం 27కు చేరింది. బీజేపీలో సీఎల్పీ విలీనానికి కారణాలు చెప్పడానికి కావ్లేకర్ నిరాకరించారు.

# సొంత కేడర్‌కి సీబీఐ డీఐజీ తరుణ్ గౌబా బదిలీ!

**న్యూఢిల్లీ:** సీబీఐ మాజీ స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్థానా కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ డీఐజీ తరుణ్ గౌబాను తన సొంత కేడర్ ఉత్తర్‌ప్రదేశ్‌కి ముందస్తుగానే పంపేలా ప్రధానమంత్రి నేతృత్వంలోని కేంద్ర నియామకాల కమిటీ నిర్ణయం తీసుకుందని సీబీఐ వర్గాలు తెలిపాయి. 'తరుణ్ గౌబాను తన రాష్ట్ర కేడర్‌కు ముందస్తుగా పంపేలా తీసుకున్న నిర్ణయంపై కేంద్ర నియామకాల కమిటీ(ఏసీసీ) ఆమోదం తెలిపింది' అని ప్రభుత్వం తెలిపింది.

# స్థానిక నేతల వల్లే అమేథీలో ఓటమి

- నియోజకవర్గ పార్టీ సమీక్షాసమావేశంలో రాహుల్ వ్యాఖ్యలు
- వయనాడ్ నుంచి ఎన్నికైనా అమేథీని వీడబోనని వెల్లడి



**అమేథీ, జూలై 10:** ప్రజలకు స్థానిక నేతలు దూరమైనందు వల్లే ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో అమేథీ స్థానం నుంచి ఓటమి పాలయ్యానని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అయినా అమేథీని తాను వదిలిపెట్టబోనన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తొలిసారి ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేథీలో రాహుల్‌గాంధీ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన పార్టీ సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ.. 'నేను అమేథీని వీడను. ఇది నా ఇల్లు, నా కుటుంబం' అని అన్నారు. 'అమేథీ అభివృద్ధికి ఆటంకాలు ఉండవు. నేను వయనాడ్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నా, అమేథీతో 3 దశాబ్దాలకు పైగా నాకు అనుబంధం ఉంది. అమేథీ కోసం ఢిల్లీలో పోరాడతా' అని రాహుల్ అన్నట్లు సమాచారం. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలహీనపడిందని, ఎన్నికల ప్రచారానికి దిశానిర్దేశం చేసే వారే కరువయ్యారని కొందరు నేతలు చెప్పారు. కొందరు పార్టీ నేతలు బీజేపీకి అనుకూలంగా పని చేశారని ఆరోపించారు.

# జల వివాదాలకు ఒకే ట్రిబ్యునల్

- రెండేండ్లలో వివాదాలను పరిష్కరించేలా గడువు
- చిన్నారులపై లైంగిక నేరాలకు పాల్పడితే మరణశిక్ష
- పోక్సో చట్టం మరింత పటిష్ఠం.. అనియంత్రిత డిపాజిట్ స్కీములపై నిషేధం
- ట్రాన్స్‌జెండర్ బిల్లుకు ఆమోదముద్ర.. కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు



క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న మంత్రులు నరేంద్రసింగ్ తోమర్, సంతోష్ గంగ్వార్, ప్రకాశ్ జవదేకర్

**న్యూఢిల్లీ, జూలై 10:** అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల సత్వర పరిష్కారానికి ప్రస్తుత 9 ట్రిబ్యునళ్లను విలీనం చేసి ఒకే శాశ్వత ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. కొత్త ట్రిబ్యునల్‌తోపాటు, అవసరమైన సమయాల్లో వివాదాలపై విచారణకు బెంచ్‌లను ఏర్పాటుచేసేలా అంతర్రాష్ట్ర నదీజలాల చట్టం-1956లో సవరణలు చేయాలని ప్రతిపాదించింది. ట్రిబ్యునల్ మాదిరి కాక, ఈ బెంచ్‌లు వివాదాలు పరిష్కారమైన తర్వాత రద్దు కానున్నాయి. బుధవారం ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ క్యాబినెట్ నిర్ణయాలను మీడియాకు తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా నదీ జలాల విషయమై 9 ట్రిబ్యునళ్లు ఉన్నాయని, వివాదాల పరిష్కారానికి వీటికి 17-27 ఏండ్లు పడుతున్నదన్నారు. రెండేండ్లలో తుది తీర్పు వెలువరించేలా కొత్త ట్రిబ్యునల్‌కు గడువు విధిస్తామన్నారు. ట్రిబ్యునల్ అవార్డు ప్రకటించగానే ఆటోమేటిక్‌గా దాన్ని నోటిఫై చేసేలా ప్రతిపాదనలు పొందుపరిచినట్లు సమాచారం.

**ఒకే గొడుగు కిందకు 13 కార్మిక చట్టాలు**

13 కేంద్ర కార్మిక చట్టాలను విలీనం చేసి, ఒకే కోడ్‌గా మార్చడానికి రూపొందించిన బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. వాణిజ్యం, వ్యాపారం, తయారీ, ఐటీ తదితర రంగాల్లో పది లేదా అంతకంటే ఎక్కువ మంది కార్మికులున్న అన్ని సంస్థలకూ ఈ కోడ్ వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది. 'వృత్తిపర భద్రత, ఆరోగ్యం, వర్కింగ్ కండిషన్స్ బిల్లు-2019' ద్వారా కార్మికులకు కవరేజీ పలు రకాలుగా మెరుగవుతుందని ప్రభుత్వం తెలిపింది. అనియంత్రిత డిపాజిట్ పథకాలపై నిషేధ బిల్లును క్యాబినెట్ ఆమోదించింది.

**ఇతర క్యాబినెట్ నిర్ణయాలు**

- ట్రాన్స్‌జెండర్స్ పరిరక్షణ బిల్లు-2019ను కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. ఈ సమావేశాల్లోనే ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు తెలిపింది. ఇంకా ఆర్పీఎఫ్ (రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్) సర్వీసులకు గ్రూప్ ఏ హోదా కల్పించేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన ఫేజ్-3ని ప్రారంభించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

### పిల్లలపై లైంగిక నేరాలకు మరణశిక్ష

చిన్నారులపై తీవ్రమైన లైంగిక నేరాలకు పాల్పడేవారికి మరణశిక్ష విధించాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్) చట్టాన్ని పటిష్ఠం చేస్తూ పలు సవరణలను ఆమోదించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ కట్టడికి జరిమానాలు, జైలు శిక్షలు విధించేలా పోక్సో చట్టం-2012 లోని పలు సెక్షన్లకు సవరణలు చేశామన్నది. చిన్నారులపై తీవ్రమైన లైంగిక నేరాలకు పాల్పడితే మరణశిక్ష సహా కఠిన శిక్షలు విధించేలా 4,5,6 సెక్షన్లలో సవరణలు చేశామన్నది. ప్రకృతి విపత్తుల వేళ హార్మోన్లు/ రసాయనాలతో చిన్నారులకు త్వరగా సెక్సువల్ మెచ్యూరిటీ వచ్చేలా చేసే నేరాల నియంత్రణకు సెక్షన్ 9... చైల్డ్ పోర్నోగ్రఫీ సామగ్రి ధ్వంసం/డిలీట్ చేయకుండా, రిపోర్ట్ చేయకుండా ఉంటే జరిమానాలు/ జైలు శిక్షలకు 14,15 సెక్షన్లను సవరించామన్నది.

### బడ్జెట్‌లో ముస్లింలకు అన్యాయం: అసద్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర బడ్జెట్‌లో ముస్లింలకు తీరని అన్యాయం జరిగిందని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆరోపించారు. ముస్లిం మైనార్టీల కోసం అమలు చేస్తున్న సబ్సిడీలను కేంద్రం రద్దు చేస్తున్నదని ఆరోపించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలపై జరిగిన చర్చలో అసదుద్దీన్ ఓవైసీ మంగళవారం లోక్‌సభలో మాట్లాడారు. ముస్లింల పట్ల కేంద్రం పూర్తి వివక్షను ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. కోటి మంది ముస్లింలకు స్కాలర్‌షిప్‌లు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. స్కాలర్ షిప్‌ల కోసం ఈసారి రూ.43 కోట్లు తగ్గించారని వివరించారు. హజ్ యాత్ర కోసం గతంలో కేటాయించిన రూ. 400 కోట్ల నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈసారి హజ్‌యాత్రకు కేవలం రూ.89 కోట్లు మాత్రమే కేటాయించడంలో అర్థమేమిటన్నారు. ఎంతమంది ముస్లింలకు ఉద్యోగాలు లభిస్తున్నాయనే విషయమై ప్రతియేటా విడుదల చేసే నివేదికనూ కేంద్రం తొక్కిపెడుతున్నదని ఆరోపించారు.

# భారత సైన్యాన్ని నిరంతరం దెబ్బ తీయాలి

## ఉగ్రవాదులకు అల్ ఖైదా చీఫ్ అయ్‌మన్ అల్ జవహరి పిలుపు



**న్యూఢిల్లీ:** కశ్మీర్‌లో భారత సైన్యాన్ని, ప్రభుత్వాన్ని అవిశ్రాంతంగా దెబ్బ కొట్టాలని ఉగ్రవాదులకు అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ అల్ ఖైదా చీఫ్ అయ్‌మన్ అల్ జవహరి పిలుపునిచ్చాడు. 14 నిమిషాలు సాగిన ఈ ప్రసంగాన్ని అల్‌ఖైదా మీడియా విభాగం విడుదల చేసింది. 'కశ్మీర్‌ను మరిచిపోవద్దు' అనే శీర్షికతో సాగిన ఈ ప్రసంగంలో కశ్మీర్‌లో పోరాడుతున్న ముజాహిదీన్లు ప్రస్తుత దశలో నిరంతర దాడులతో భారత్ సైన్యానికి, ఆయుధ సంపత్తికి నష్టం కలిగించాలన్నాడు. కశ్మీర్‌లో జిహాదీ పోరాటానికి మద్దతు ఇవ్వాలని ప్రపంచ దేశాల్లోని ముస్లింలను అభ్యర్థించాడు. పాకిస్థాన్ ప్రభుత్వం, సైన్యం 'అమెరికాకు బంట్లు'గా మారాయని ఆరోపించాడు.

# చేరువై.. దూరమై..

## సెమీఫైనల్లో కివీస్ చేతిలో పోరాడి ఓడిన టీమ్‌ఇండియా

### ప్రపంచకప్ నుంచి భారత్ నిష్క్రమణ

### మెరిసిన హెన్రీ, బౌల్ట్, శాంట్నర్.. జడేజా అద్భుత పోరాటం వృథా

### స్వదేశంలో ప్రపంచకప్ వరకు నిరీక్షణే



అభిమాన భారతం

ఫలితం నిరాశ పరిచినా.. టీమ్ ఇండియా పోరాటపటిమ ఆకట్టుకుంది. మొత్తం టోర్నమెంట్‌లో మనవాళ్లు ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చడం గర్వంగా ఉంది. జీవితంలో గెలుపోటములు భాగమే. భవిష్యత్తులో ఇంకా మెరుగైన ప్రదర్శన చేయండి.
- నరేంద్ర మోదీ, భారత ప్రధాని

ఆసాంతం మంచి ప్రదర్శనే చేసినా.. 45 నిమిషాల చెత్త ఆటతీరు ప్రపంచకప్ నుంచి దూరం చేసింది. పరాజయాన్ని జీర్ణించుకోవడం కష్టమే. ఈ విజయం కివీస్ బౌలర్లకే చెందుతుంది. జడేజా చక్కటి పోరాటం చేశాడు. ధోనీ రనౌట్ కావడం ఫలితంపై ప్రభావం చూపింది. మొత్తం టోర్నమెంట్‌లో మా ఆట బాగుందనే భావిస్తున్నాం.
- విరాట్ కోహ్లీ, భారత కెప్టెన్

కొత్త బంతితో మా బౌలర్లు చక్కటి ప్రదర్శన కనబర్చారు. ధోనీ, జడేజా మరి కాసేపు క్రీజులో ఉంటే మా నుంచి మ్యాచ్ లాక్కెళ్తారని అనుకున్నాం. కానీ ధోనీ రనౌట్ మ్యాచ్‌ను మలుపు తిప్పింది
- విలియమ్సన్, న్యూజిలాండ్ కెప్టెన్

**24/4**

ప్రపంచకప్‌లో తొలి పవర్‌ప్లే ముగిసే సరికి ఓ జట్టు చేసిన అత్యల్ప స్కోరు. ఈ చెత్త రికార్డు భారత్ పేరిట లిఖించుకుంది.



జడేజా (77, 1/34)



ధోనీ (50)



రాహుల్ 1

కోహ్లీ 1

రోహిత్ 1

టీమ్‌ఇండియా నాలుగోసారి ప్రపంచకప్ ఫైనల్ చేరాలంటే ఒక దశలో 117 బంతుల్లో 148 పరుగులు చేయాలి. అప్పటికే రోహిత్, రాహుల్, కోహ్లీ, కార్తీక్, పంత్, పాండ్యా అంతా పెవిలియన్ చేరారు. ఇక మిగిలిన స్పెషలిస్ట్ బ్యాట్స్‌మన్ మహేంద్రసింగ్ ధోనీ ఒక్కడే.. మరోఎండ్‌లో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా. ఇంకేముంది కివీస్ గెలుపు లాంఛనమే అని అంతా భావించారు. కానీ.. జడేజా పోరాటంతో అసాధ్యంలా కనిపించిన లక్ష్యం.. 6 ఓవర్లలో 62కు చేరింది. టీ20ల హవా నడుస్తున్న ప్రస్తుత తరుణంలో 4 ఓవర్లలోనే ముగించే లక్ష్యంలా కనిపించడంతో ఇదేమంత పెద్ద కష్టం కాదనిపించింది. అందునా క్రీజులో జోరుమీదున్న జడ్డూతో పాటు ప్రపంచ మేటి ఫినిషర్ ధోనీ ఉన్నాడు. అందుకు తగ్గట్లే తర్వాతి రెండు ఓవర్లలో టీమ్‌ఇండియా పదేసి పరుగులు పిండుకుంది. ఇక టార్గెట్ 4 ఓవర్లలో 42. హెన్రీ 47వ ఓవర్లో 5 పరుగులే ఇస్తే.. తదుపరి ఓవర్‌లో 6 పరుగులే ఇచ్చిన బౌల్ట్.. జడేజా వికెట్ పడగొట్టాడు. దీంతో సమీకరణం 12 బంతుల్లో 31కి చేరింది. ఎన్నో మ్యాచ్‌ల్లో ఇలాంటి స్థితి నుంచి జట్టును గెలిపించిన మాస్టర్‌మైండ్ మహీ క్రీజులో ఉండటంతో అభిమానుల్లో ఒక రకమైన భరోసా. దాన్ని నిజం చేస్తూ అదిరిపోయే సిక్సర్‌తో ఆశలు రేపిన ధోనీ.. గప్టిల్ వేసిన అద్భుత త్రోకు రనౌటయ్యాడు. దీంతో మైదానంలో ప్రత్యక్షంగా చూస్తున్న వేలాదిమందితో పాటు టీవీలకు అతుక్కుపోయిన కోట్లాది అభిమానుల గుండెలు ఆవేదనతో బరువెక్కాయి.

**మాంచెస్టర్:**

వరుసగా రెండోసారి సెమీఫైనల్ గండాన్ని దాటలేకపోయిన టీమ్‌ఇండియా ప్రపంచకప్‌లో తన ప్రస్థానం ముగించింది. మూడోసారి కప్పు కొట్టాలని కృతనిశ్చయంతో ఇంగ్లండ్‌లో అడుగుపెట్టిన విరాట్ సేన రెండడుగుల ముందే బోల్తా కొట్టింది. వరుణుడి ప్రభావంతో 28 గంటల 24 నిమిషాలు జరిగిన సెమీఫైనల్లో న్యూజిలాండ్ 18 పరుగుల తేడాతో భారత్‌పై నెగ్గి వరుసగా రెండోసారి తుదిపోరుకు అర్హత సాధించింది. మొదట న్యూజిలాండ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 239 పరుగులు చేసింది. టేలర్ (90 బంతుల్లో 74; 3 ఫోర్లు, 1 సిక్స్), విలియమ్సన్ (95 బంతుల్లో 67; 5 ఫోర్లు) అర్ధ శతకాలు సాధించారు. భారత బౌలర్లలో భువనేశ్వర్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం లక్ష్య ఛేదనలో భారత్ 49.3 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌటైంది. 92 పరుగులకే 6 వికెట్లు కోల్పోయినా.. రవీంద్ర జడేజా (59 బంతుల్లో 77; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) అసమాన పోరాటానికి మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ (72 బంతుల్లో 50; 1 ఫోర్, 1 సిక్స్) అండ తోడవడంతో ఒక దశలో ఆశలు చిగురించినా.. కీలక దశలో వీరిద్దరు వెనుదిరగడంతో పరాజయం తప్పలేదు. న్యూజిలాండ్ బౌలర్లలో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' హెన్రీ (3/37), బౌల్ట్ (2/42), శాంట్నర్ (2/34) రాణించారు. ఓడినా చివరి వరకు పోరాడిన కోహ్లీ 'కప్పు కల'నాలుగేండ్ల(2023) తర్వాత స్వదేశంలో జరిగే ప్రపంచకప్ వరకు కొనసాగాల్సిందే.

### కుప్పకూలిన టాపార్డర్

పేస్‌కు అనుకూలిస్తున్న వికెట్‌పై.. పిచ్ పరీక్ష పెడుతున్న తరుణంలో టీమ్‌ఇండియా టాపార్డర్ తడబడింది. స్కోరుబోర్డుపై 5 పరుగులు చేరాయో లేదో రోహిత్ (1), కోహ్లీ (1), రాహుల్ (1) పెవిలియన్‌కు వరుస కట్టారు. కొత్త బంతితో కివీస్ పేసర్లు నిప్పులు చెరగడంతో.. మెగాటోర్నీ మొత్తం అలరించిన ఈ త్రయం కీలక మ్యాచ్‌లో తడబడటంతో లక్ష్యఛేదనలో భారత్ ఆపసోపాలు పడింది. కాసేపటికే కార్తీక్ (25 బంతుల్లో 6) కూడా వెనుదిరిగాడు. ఫలితంగా పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ 24/4తో నిలిచింది. ఐదు శతకాలతో జోరుమీదున్న రోహిత్ శర్మ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరగ్గా.. కోహ్లీ వికెట్ల ముందు దొరికిపోయాడు. ఇప్పటికి ఉన్న కష్టాలు చాలవన్నట్లు రాహుల్ వాళ్ల వెంట నడిచాడు. ఖాతా తెరిచేందుకు 20 బంతులు తీసుకున్న కార్తీక్.. నీషమ్ పట్టిన కండ్లు చెదిరే క్యాచ్‌కు పెవిలియన్ చేరాడు. 12 ఓవర్లకు పైగా పోరాడిన పంత్ (56 బంతుల్లో 32; 4 ఫోర్లు), పాండ్యా (62 బంతుల్లో 32; 2 ఫోర్లు) ఐదో వికెట్‌కు 47 పరుగులు జోడించి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేసినా.. మరీ ఎక్కువ బంతులు వృథాచేశారు. 21 నుంచి 33వ ఓవర్ వరకు 13 ఓవర్ల పాటు భారత్ ఇన్నింగ్స్‌లో ఒక్క బౌండ్రీ కూడా నమోదు కాలేదు. పాండ్యా పెవిలియన్ చేరే సమయానికి భారత్ లక్ష్యం 117 బంతుల్లో 148 పరుగులు.

### మరో 28 పరుగులు జోడించి..

అంతకుముందు వర్షం కారణంగా మంగళవారం ఆట ఎక్కడైతే (46.1 ఓవర్లలో)నిలిచిందో.. అక్కడి నుంచి బుధవారం తిరిగి ప్రారంభమైంది. ఓవర్‌నైట్ స్కోర్ 211/5తో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 239 పరుగులు చేసింది. టేలర్ (90 బంతుల్లో 74; 3 ఫోర్లు, 1సిక్స్), లాథమ్ (10) ఔటైనా.. ఆఖర్లో శాంట్నర్ (9) కొన్ని విలువైన పరుగులు జోడించాడు.

### జడ్డూ 'జాదూ'

అప్పటి వరకు జిడ్డుగా సాగిన భారత ఇన్నింగ్స్‌లో జడ్డూ కదలిక తెచ్చాడు. నీషమ్ బౌలింగ్‌లో లాంగాన్ మీదుగా సిక్సర్ బాదిన జడేజా 33వ ఓవర్‌లో భారత్ స్కోరును 100 దాటించాడు. ఓ వైపు ధోనీ అండగా నిలబడితే.. మరో ఎండ్‌లో జడేజా దుమ్మురేపాడు. బౌలింగ్‌లో 10 ఓవర్లు వేసి 34 పరుగులే ఇచ్చి ఒక వికెట్ తీసిన ఈ ఆల్‌రౌండర్ బ్యాట్‌తోనూ అదరగొట్టాడు. ఆరంభంలో భయపెట్టిన శాంట్నర్‌కు 2 సిక్సులు రుచి చూయించాడు. ఈ క్రమంలో చూస్తుండగానే.. అర్ధశతకం (39 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. టీమ్‌ఇండియా 92/6తో పీకల్లోతు కష్టాల్లో ఉన్న దశలో జతైన ధోనీ, జడేజా ఏడో వికెట్‌కు 116 పరుగులు జోడించడంతో భారత్ గెలుపు లాంఛనమే అనిపించింది. కానీ 14 బంతుల్లో 32 పరుగులు చేయాల్సిన సందర్భంలో భారీ షాట్‌కు యత్నించిన జడేజా ఔట్ కావడంతో భారత్‌కు భారీ దెబ్బ పడింది. విరాట్ సేన విజయానికి 12 బంతుల్లో 31 పరుగులు చేయాలి.. ఫెర్గూసన్ వేసిన 49వ ఓవర్ తొలి బంతికి ధోనీ సిక్సర్ బాదాడు. ఇంకే ముంది 11 బంతుల్లో 25 పరుగులే.. మహీ సాధిస్తాడు. గెలుపు మనదే అని సగటు అభిమాని ఆశ. కానీ గప్టిల్ మన పాలిట కాలయముడయ్యాడు. రెండో బంతికి పరుగులేమి చేయని ధోనీ మూడో బంతిని స్క్వేర్ లెగ్ వైపు పంపి రెండో రన్ పూర్తి చేయాలనుకున్నాడు. మొదటి పరుగు ముగించి తిరిగి క్రీజుకు చేరే క్రమంలో గప్టిల్ విసిరిన డైరెక్ట్ త్రో భారత్ ఆశలపై నీళ్లు కుమ్మరించింది. **న్యూజిలాండ్‌కు ఎక్స్‌ట్రాల రూపంలో 18 పరుగులిచ్చిన భారత్ చివరకు అన్నే పరుగుల తేడాతో ఓడడం కొసమెరుపు.**

'హార్దిక్, దినేశ్ కంటే ముందు బ్యాటింగ్ ఆర్డర్‌లో ధోనీని పంపితే బాగుండేది. 2011 ప్రపంచకప్ ఫైనల్లో యువరాజ్‌సింగ్ కంటే నాలుగో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన మహీ..గెలుపు లాంఛనాన్ని దిగ్విజయంగా పూర్తి చేశాడు'
- వీవీఎస్ లక్ష్మణ్

'కివీస్‌తో సెమీస్ మ్యాచ్‌లో ధోనీ బ్యాటింగ్‌లో ముందుకు రావాల్సిన అవసరం ఉండింది. క్లిష్ట పరిస్థితులకు తగ్గట్లు ఎలా ఆడాలో అనుభవజ్ఞుడైన ధోనీకి బాగా తెలుసు. ధోనీ బ్యాటింగ్‌లో ముందు వచ్చి ఉంటే వికెట్లు పడిపోకుండా నియంత్రించేవాడు. అలాంటి సీనియర్‌ను ఏడో స్థానంలో దింపడం సరికాదు'
-సౌరభ్ గంగూలీ

### టాప్ త్రీ.. ఓన్లీ 3

1, 1, 1 ఇదేదో స్టేట్ ర్యాంకుల అడ్వర్టైజ్‌మెంట్ కాదు.. టీమిండియా టాప్ త్రీ బ్యాట్స్‌మెన్ చేసిన స్కోర్లు. ప్రపంచకప్‌లో పరుగుల వరద పారిస్తూ.. అలవోకగా జట్టును సెమీఫైనల్‌కు చేర్చిన టాపార్డర్ కీలకమైన సెమీఫైనల్లో చేతులెత్తేసింది. రోహిత్ శర్మ (647), విరాట్ కోహ్లీ (441), లోకేశ్ రాహుల్ (359) ఈ మ్యాచ్‌కు ముందు మన ముగ్గురు మొనగాళ్లు చేసిన మొత్తం పరుగులు 1447 కానీ ఈ మ్యాచ్‌లో ఈ త్రయం చేసింది 3 పరుగులే. ఇదే ఫలితంపై ప్రభావం చూపింది.

### కోహ్లీ మాట నిజమైంది

ప్రపంచకప్ ప్రారంభానికి ముందు కోహ్లీ మాట్లాడుతూ పరుగుల వరద పారుతుందని అంతా భావిస్తున్నా.. మెరుగైన బౌలింగ్ వనరులు ఉంటే 260, 270 స్కోర్లను కూడా కాపాడుకోవచ్చు అన్నాడు. అతడి నోటి మాటే నిజమైంది. నాణ్యమైన పేస్ వనరులున్న న్యూజిలాండ్ అంతకన్నా తక్కువ స్కోరును కాపాడుకొని వరుసగా రెండోసారి విశ్వసమరం తుదిపోరుకు చేరింది.



హెన్రీ (3/37)

### అచ్చం అలానే..

నాలుగేండ్ల క్రితం జరిగిన 2015 ప్రపంచకప్ సెమీఫైనల్లోనూ భారత్ ఛేజింగ్ చేయలేక చిత్తైంది. సిడ్నీలో జరిగిన ఆ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా మొదట బ్యాటింగ్ చేసి 328/7 చేసింది. అనంతరం లక్ష్యఛేదనలో ఓపెనర్లు రోహిత్, ధవన్ రాణించినా.. కోహ్లీ, సురేశ్ రైనా సింగిల్ డిజిట్‌కే పరిమితమవడంతో భారత్ 95 పరుగులతో పరాజయం పాలైంది. ఆ మ్యాచ్‌లో ఒక పరుగు మాత్రమే చేసి ఔటైన విరాట్ ఈసారి కూడా అదే స్కోరుకు పెవిలియన్ చేరగా, అప్పుడూ ఇప్పుడూ ధోనీ అర్ధసెంచరీ సాధించాడు.

### స్కోరు బోర్డు

**న్యూజిలాండ్:** గప్టిల్ (సి) కోహ్లీ (బి) బుమ్రా 1, నికోల్స్ (బి) జడేజా 28, విలియమ్సన్ (సి) జడేజా (బి) చహల్ 67, టేలర్ (రనౌట్/జడేజా) 74, నీషమ్ (సి) కార్తీక్, పాండ్యా 12, గ్రాండ్‌హోమ్ (సి) ధోనీ (బి) భువనేశ్వర్ 16, లాథమ్ (సి) జడేజా (బి) భువనేశ్వర్ 10, శాంట్నర్ (నాటౌట్) 9, హెన్రీ (సి) కోహ్లీ (బి) భువనేశ్వర్ 1, బౌల్ట్ (నాటౌట్) 3, **ఎక్స్‌ట్రాలు:** 18, **మొత్తం:** 50 ఓవర్లలో 239/8. **వికెట్ల పతనం:** 1-1, 2-69, 3-134, 4-162, 5-200, 6-225, 7-225, 8-232, **బౌలింగ్:** భువనేశ్వర్ 10-1-43-3, బుమ్రా 10-1-39-1, పాండ్యా 10-0-55-1, జడేజా 10-0-34-1, చాహల్ 10-0-63-1.

**భారత్:** రాహుల్ (సి) లాథమ్ (బి) హెన్రీ 1, రోహిత్ (సి) లాథమ్ (బి) హెన్రీ 1, కోహ్లీ (ఎల్బీ) బౌల్ట్ 1, పంత్ (సి) గ్రాండ్‌హోమ్ (బి) శాంట్నర్ 32, కార్తీక్ (సి) నీషమ్ (బి) హెన్రీ 6, పాండ్యా (సి) విలియమ్సన్ (బి) శాంట్నర్ 32, ధోనీ (రనౌట్/గప్టిల్) 50, జడేజా (సి) విలియమ్సన్ (బి) బౌల్ట్ 77, భువనేశ్వర్ (బి) ఫెర్గూసన్ 0, చాహల్ (సి) లాథమ్ (బి) నీషమ్ 5, బుమ్రా (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు:** 16, **మొత్తం:** 49.3 ఓవర్లలో 221 ఆలౌట్. **వికెట్ల పతనం:** 1-4, 2-5, 3-5, 4-24, 5-71, 6-92, 7-208, 8-216, 9-217, 10-221, **బౌలింగ్:** బౌల్ట్ 10-2-42-2, హెన్రీ 10-1-37-3, ఫెర్గూసన్ 10-0-43-1, గ్రాండ్‌హోమ్ 2-0-13-0, నీషమ్ 7.3-0-49-1, శాంట్నర్ 10-2-34-2.



## 'టెన్ పిన్ బౌలింగ్'ను ప్రోత్సహిస్తాం

### మంత్రి శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టెన్ పిన్ బౌలింగ్ క్రీడకు ప్రభుత్వం తరపున అన్ని విధాల ప్రోత్సాహం అందిస్తామని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి క్రీడకు విశేష ప్రాచుర్యం కల్పించే కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. నగరంలోని పార్క్ హయత్ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ టెన్ పిన్ బౌలింగ్ అసోసియేషన్ లోగోను మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించి, మాట్లాడారు. ఈ క్రీడా అసోసియేషన్ ఏర్పాటు హర్షించదగ్గ విషయమని, దీని ద్వారా ఆటను విస్తృతం చేయాలని సూచించారు. టెన్ పిన్ క్రీడాకారులను తయారు చేయడం సహా రాష్ట్రస్థాయి టోర్నీల నిర్వహణకు ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ టెన్ పిన్ బౌలింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రాహుల్ రెడ్డితో పాటు ప్రతినిధులను ఆయన అభినందించారు. క్రీడాకారులకు మెమొంటోలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాట్స్ ఛైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, స్మాష్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వీరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

## ద్యుతీ 'రికార్డు' పసిడి

### వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో సరికొత్త చరిత్ర



**నపోలీ(ఇటలీ):** భారత స్టార్ అథ్లెట్ ద్యుతీచంద్ చరిత్ర సృష్టించింది. వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో ద్యుతీ స్వర్ణంతో మెరిసింది. బుధవారం జరిగిన మహిళల 100మీటర్ల రేసును 11.32 సెకన్లలో ముగించి యూనివర్సిటీ పోటీల్లో పసిడి పతకం సాధించిన తొలి భారత అథ్లెట్‌గా ద్యుతి రికార్డుల్లోకెక్కింది. ఇదే పోటీలో బరిలోకి దిగిన డెల్ పొంటో(11.33సె), లిసా క్వాయి(11.39సె) వరుసగా రజత, కాంస్య పతకాలు అందుకున్నారు. ఎనిమిది మంది పోటీపడ్డ రేసులో నాలుగో లైన్ నుంచి పరుగు మొదలుపెట్టిన ద్యుతి..చిరుతను తలపిస్తూ కండ్లు మూసి తెరిసే లోపు గమ్యాన్ని ముద్దాడింది. భువనేశ్వర్‌లోని కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ(కేఐఐటీ) విశ్వవిద్యాలయ విద్యార్థి అయిన ద్యుతి అనితర సాధ్యమైన రికార్డుతో దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసింది. అంతర్జాతీయ వేదికపై మువ్వన్నెల పతకాన్ని రెపరెపలాడించిన ద్యుతీకి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడా మంత్రి కిరణ్ రిజిజు అభినందనలు తెలిపారు.

## సెమీస్‌లో ఫెదరర్ X నాదల్

### జొకోవిచ్, అగట్ ముందడుగు



**లండన్:** వింబుల్డన్ గ్లాండ్‌స్లామ్ టోర్నీలో స్థాయికి తగ్గ ప్రదర్శనతో అదరగొడుతున్న రెండో సీడ్, స్విస్ స్టార్ రోజర్ ఫెదరర్ సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. బుధవారమిక్కడ జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఫెదరర్ 4-6, 6-1, 6-4, 6-4 తేడాతో కీ నిషికోరి(జపాన్)పై చెమటోడ్చి విజయం సాధించాడు. వింబుల్డన్‌లో రోజర్‌కు ఇది వందో గెలుపు కావడం విశేషం. అలాగే ఒకే గ్రాండ్‌స్లామ్ చరిత్రలో సెంచరీ విజయాలు సాధించిన ఏకైక ఆటగాడిగానూ స్విస్ దిగ్గజం చరిత్ర లిఖించాడు. రెండున్నర గంటలపాటు సాగిన మ్యాచ్‌లో 12 ఏస్‌లు కొట్టిన ఫెదరర్.. 55 విన్నర్లను సాధించాడు. మరోమ్యాచ్‌లో డేవిడ్ గొఫిన్(బెల్జియం)పై 6-4, 6-0, 6-2 తేడాతో వరుస సెట్లలో విజయం సాధించిన టాప్‌సీడ్ నొవాక్ జొకోవిచ్ కూడా సెమీస్‌కు దూసుకెళ్లాడు. ఓవరాల్‌గా ఈ టోర్నీ సెమీస్‌కు చేరుకోవడం సెర్బియా వీరుడికిది ఎనిమిదోసారి. స్పెయిన్ స్టార్, మూడో సీడ్ రఫెల్ నాదల్.. అన్‌సీడెడ్ ప్లేయర్ సామ్ క్వెరీని మట్టికరిపించి సెమీస్‌లో అడుగుపెట్టి సింహనాదం చేశాడు. 2గంటల ఏడు నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌ను 7-5, 6-2, 6-2తో వరుస సెట్లలో గెలిచి సత్తా చాటాడు. మొత్తంగా 10 ఏస్‌లను కొట్టిన రఫా 44 విన్నర్లతో అదరగొట్టాడు. సెమీస్‌లో రెండో సీడ్ ఫెదరర్‌తో తలపడనున్నాడు. మరో క్వార్టర్స్‌లో గిడో పెల్లా(అర్జెంటీనా)పై 7-5, 6-4, 3-6, 6-3 తేడాతో బాటిస్టా అగట్(స్పెయిన్) గెలుపొంది, ముందడుగేశాడు. పురుషుల సింగిల్స్ సెమీస్ మ్యాచ్‌లు శుక్రవారం జరుగుతాయి.

**నేటి మహిళల సెమీస్‌లో..**
సెరీనా X స్ట్రికోవా
హలెప్ X స్విటోలినా

**సెమీస్‌లో..**
ఫెదరర్ X నాదల్
జొకోవిచ్ X బాటిస్టా అగట్

## కివీస్ ప్రత్యర్థి ఎవరు?

### నేడు రెండో సెమీస్‌లో ఆసీస్, ఇంగ్లండ్ ఢీ



మోర్గాన్

ఫించ్

**బర్మింగ్‌హామ్:** మరో రసవత్తర సమరాన్ని ఆస్వాదించేందుకు క్రికెట్ ప్రపంచం సిద్ధమైంది. ప్రపంచకప్ రారాజు ఆస్ట్రేలియా.. ఆతిథ్య ఇంగ్లండ్ మధ్య గురువారం ఎడ్జ్‌బాస్టన్ వేదికగా రెండో సెమీఫైనల్ జరగనుంది. విశ్వటోర్నీ చరిత్రలో ఇంతవరకు సెమీస్‌కు వెళ్లిన ఏడు సార్లూ అజేయంగా నిలవడం సహా ఐదుటైటిళ్లు సాధించిన ఆస్ట్రేలియాను... ఒక్కసారి కూడా కప్పును ముద్దాడలేకపోయిన ఇంగ్లండ్ ఢీ కొననుంది. ప్రపంచకప్ కలను సొంత గడ్డపై సాకారం చేసుకునేందుకు చిరకాల ప్రత్యర్థి ఆసీస్‌ను ఎలాగైనా ఓడించి తుదిపోరులో అడుగుపెట్టాలని మోర్గాన్ సేన పట్టుదలగా ఉంది. మరోవైపు ఆరో టైటిల్‌పై కన్నేసిన ఆస్ట్రేలియా మాత్రం లీగ్‌దశలో చిత్తుచేసినట్టే సెమీస్‌లోనూ ఇంగ్లిష్ జట్టును మట్టికరిపించి తుదిపోరులో ప్రవేశించాలని కంకణం కట్టుకుంది.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 38,557 | 11,499 |
| ↘174 | ↘57 |

ముడి చమురు (బ్రెంట్) ↗ 66.76 డాలర్లు

**బంగారం ధరలు** — న్యూఢిల్లీ (రూ.లలో)

| | |
|---|---|
| 24 క్యారెట్లు | 34,870 |
| 22 క్యారెట్లు | 34,700 |
| వెండి (కిలో) | 38,900 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 65.80 | 71.30 |
| యూరో | 73.80 | 80.30 |
| బహ్రెయిన్ దినార్ | 173.20 | 187.20 |
| కువైట్ దినార్ | 217.00 | 231.00 |
| సౌదీ రియాల్ | 17.00 | 18.80 |
| యూఏఈ దిర్హామ్ | 17.60 | 19.30 |

**చికెన్ ధరలు** (రూ.లలో)

| | |
|---|---|
| ఫారం ధర | 80.00 |
| రిటైల్ లైవ్ | 102.00 |
| డ్రెస్డ్ | 148.00 |
| స్కిన్‌లెస్ | 168.00 |

**నెక్ (వంద గుడ్లకు)** (రూ.లలో)

| | |
|---|---|
| హైదరాబాద్ | 429-00 |
| రంగారెడ్డి | 429-00 |
| మెదక్ | 429-00 |
| కరీంనగర్ | 432-00 |
| వరంగల్ | 432-00 |
| రిటైల్ ప్రైస్ | 4-90 |

# నేనంటే.. నేనే!

షేర్ విలువ 11% ఆవిరి

ఇండిగోలోని విభేదాలు.. బుధవారం స్టాక్ మార్కెట్లలోని ఆ సంస్థ షేర్లను ప్రభావితం చేశాయి. మదుపరులు అమ్మకాలకు దిగడంతో 11 శాతానికిపైగా నష్టపోయాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో 10.73 శాతం పడిపోయి రూ.1,397.75 వద్ద స్థిరపడిన ఇండిగో షేర్ విలువ.. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో 11.12 శాతం క్షీణించి రూ.1,392 వద్ద నిలిచింది. దీంతో ఈ ఒక్కరోజే బీఎస్ఈలో సంస్థ మార్కెట్ విలువ రూ.6,423 కోట్లు హరించుకుపోయి రూ.53,765.40 కోట్లకు పరిమితమైంది.

## రాహుల్ భాటియా వర్సెస్ రాకేష్ గంగ్వాల్

## ఇండిగో ప్రమోటర్ల మధ్య ముదిరిన వివాదం

**న్యూఢిల్లీ, జూలై 10:**

ఏమైందీ విమానయాన రంగానికి. ఓ వైపు సంక్షోభాలు.. మరోవైపు విభేదాలు. దేశీయ విమానయాన రంగం గురించి ఆందోళన చెందాల్సిన పరిస్థితులే ఉన్నాయి మరి. ప్రపంచ విమానయాన రంగంలో వేగంగా వృద్ధి చెందుతున్న భారత్‌ను సంక్షోభాలు, విభేదాలు, అప్పులు వేధిస్తున్నాయిప్పుడు. భారతీయ ప్రైవేట్ రంగ విమానయాన దిగ్గజంగా వెలుగొందిన జెట్ ఎయిర్‌వేస్ రుణ సంక్షోభం దెబ్బ మానకముందే.. మరో దిగ్గజ సంస్థ ఇండిగోలో విభేదాలు భగ్గుమన్నాయి. ప్రమోటర్ల మధ్య గొడవలు తారాస్థాయికి చేరి.. సెబీదాకా వెళ్లాయి. సంస్థ వ్యవస్థాపకులు రాహుల్ భాటియా, రాకేశ్ గంగ్వాల్‌ల నడుమ దాదాపు పదిహేనేండ్ల భాగస్వామ్యానికి బీటలు పడ్డాయి.

### 2005 నుంచి కలిసి..

ఇండిగోలో భాటియాకు చెందిన ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్‌కు మెజారిటీ వాటా ఉన్నది. భాటియా, ఆయన కుటుంబానికి ప్రస్తుతం 38 శాతానికిపైగా వాటా ఉండగా, ఎన్నారై గంగ్వాల్, ఆయన బంధువర్గానికి 37 శాతం లోపే ఉన్నది. 2005లో భాటియా, గంగ్వాల్ కలిసి ఇండిగోను స్థాపించగా, నాడు ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్‌కు 51.12 శాతం, గంగ్వాల్‌కు చెందిన వర్జీనియా ఆధారిత సెల్యూమ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు 47.88 శాతం వాటా ఉంది. అయితే స్టాక్ మార్కెట్లలోకి సంస్థ రావడంతో ఈ ఇరువురి వాటాలు తగ్గిపోయాయి. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్, జెట్ ఎయిర్‌వేస్‌ల పోటీని తట్టుకుని, ఎయిర్ ఇండియాను వెనక్కి నెట్టి ప్రస్తుతం భారతీయ విమానయాన రంగంలో అతిపెద్ద సంస్థగా ఉన్న ఇండిగోను ప్రమోటర్ల గొడవలు రచ్చకీడుస్తున్నాయి.

### అసలేం జరిగింది?..

సంస్థలో మెజారిటీ వాటా ఉండటంతో ప్రతీ విషయంలోనూ భాటియా పెత్తనమే కొనసాగుతూ వస్తున్నది. సీనియర్ మేనేజ్‌మెంట్ నియామకాల్లోనూ ఇంటర్‌గ్లోబ్‌దే తుది నిర్ణయం. ఇది గంగ్వాల్ ఈగోను హర్ట్ చేస్తూ వచ్చింది. సరిగ్గా ఇదే సమయంలో అమెరికాకు చెందిన సీఎఫ్ఎం ఇంటర్నేషనల్‌తో ఎల్ఈఏపీ-1ఏ ఇంజిన్ల కోసం జూన్‌లో ఇండిగో 20 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకున్నది. భవిష్యత్తులో సంస్థ సమకూర్చుకోబోయే 280 ఎయిర్‌బస్ 320, 321 విమానాల కోసమే ఈ ఇంజిన్లు. ఇప్పటిదాకా ఇండిగో విమానాల్లో ప్రాట్ అండ్ విట్నీ (పీ అండ్‌డబ్ల్యూ) ఇంజిన్లనే వాడుతున్నారు. అయితే ఇటీవలికాలంలో వీటి పనితీరు బాగా లేనందున మరో సంస్థతో ఇండిగో డీల్ చేసుకున్నది. ఈ క్రమంలో సంస్థ అసాధారణ సాధారణ సమావేశం (ఈజీఎం)లో కార్పొరేట్ గవర్నెన్స్‌పై గంగ్వాల్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై గత నెల 12న భాటియా ఓ లేఖ ద్వారా స్పందించడం, ఆపై గంగ్వాల్-భాటియా మధ్య మాటల యుద్ధం రాజుకున్నది. ఇంటర్‌గ్లోబ్ ప్రయోజనాల కోసమే భాటియా నిర్ణయాలు తీసుకుంటున్నారని గంగ్వాల్ ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై మార్కెట్ రెగ్యులేటర్ సెబీ జోక్యం చేసుకోవాలని గంగ్వాల్ లేఖ రాయడంతో ఇండిగో విభేదాలు బయటపడ్డాయి. పాన్ షాప్ కంటే అధ్వానంగా ఇండిగో నిర్వహణ ఉందంటూ విమర్శించారు.




రాహుల్ భాటియా | రాకేష్ గంగ్వాల్

### సమస్యల్లో పరిశ్రమ

దేశీయ విమానయాన రంగంలో ఒక సంస్థ తర్వాత మరో సంస్థ ఏదో ఒక రకంగా సమస్యల వలయంలో చిక్కుకోవడం ఇప్పుడు భయాందోళనకు గురిచేస్తున్నది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఇండియా, జెట్ ఎయిర్‌వేస్.. ఇప్పుడు ఇండిగో. ఇలా ప్రధాన సంస్థలన్నీ తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుండటం పరిశ్రమను ఆందోళనకు లోనుచేస్తున్నది. సామాన్యులకూ విమాన సేవలను అందించాలని కేంద్ర ప్రభుత్వం కొత్తకొత్త లక్ష్యాలతో ముందుకొస్తున్న వేళ.. తాజా పరిస్థితులు మొత్తం పరిశ్రమ అభివృద్ధినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. రూ.9,000 కోట్ల రుణ భారంతో కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ మూతపడగా, రూ.18,000 కోట్ల రుణ సంక్షోభంతో జెట్ ఎయిర్‌వేస్ ఆగిపోయింది. ఇక ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా గురించైతే చెప్పనక్కర్లేదు. పీకల్లోతు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన ఈ సంస్థను ప్రైవేటీకరణ దిశగా మోదీ సర్కారు నడిపిస్తున్నది. ఈ నేపథ్యంలో అంతా బాగుందనిపించిన ఇండిగోలో విభేదాలు.. ఇప్పుడు ఈ సంస్థ భవిష్యత్తుపై ఆలోచింపజేస్తున్నాయి.

### భయం అక్కర్లేదు: ఇండిగో సీఈవో

ప్రమోటర్ల మధ్య నెలకొన్న విభేదాలు.. సంస్థ పనితీరును, నిర్వహణను ఏవిధంగానూ ఆటంకపర్చబోవని ఇండిగో సీఈవో రోంజాయ్ దత్తా విశ్వాసం వ్యక్తం చేశారు. ఉద్యోగుల్లో ఏర్పడుతున్న భయాందోళనల్ని పోగొట్టేందుకు వారిని ఉద్దేశిస్తూ బుధవారం ఓ లేఖ రాశారు. సంస్థ లక్ష్యాలు, వ్యూహాల్లో ఎలాంటి మార్పూ ఉండబోదని స్పష్టం చేశారు. మరోవైపు ఇంటర్‌గ్లోబ్ కూడా ఎలాంటి అవకతవకలు జరగలేదని ఓ ప్రకటనలో పేర్కొన్నది.



# కన్నాట్ ప్లేస్ చాలా ఖరీదు!

## ప్రపంచంలో తొమ్మిదో స్థానం.. సీబీఆర్ఈ తాజా నివేదికలో వెల్లడి

**న్యూఢిల్లీ, జూలై 10:**

దేశ రాజధాని న్యూఢిల్లీలోని కన్నాట్ ప్లేస్(సీపీ)లో కార్యాలయం ఏర్పాటు చేయాలంటే మాములు విషయం కాదు. ప్రపంచంలో తొమ్మిదో ఖరీదైన స్థలం ఇదేనని ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెన్సీ సీబీఆర్ఈ తాజాగా వెల్లడించింది. ఇక్కడ ఒక్కో చదరపు అడుగుకు వార్షికంగా 144 డాలర్ల అద్దె చెల్లించాల్సి ఉంటుంది. మన కరెన్సీలో ఇది రూ.10 వేలు. ఢిల్లీ మధ్యలో ఉన్న ఈ స్థలం గతేడాది కూడా తొమ్మిదోస్థానంలో నిలిచింది. వార్షిక గ్లోబల్ ప్రైమ్ ఆఫీస్ అక్యూపెన్సీ కాస్ట్‌తో అంతర్జాతీయంగా అతి ఖరీదైన కార్యాలయాలపై నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. హాంకాంగ్‌కు చెందిన సెంట్రల్ డిస్ట్రిక్ వరుసగా రెండో ఏడాది తొలిస్థానంలో నిలిచింది. ఇక్కడ చదరపు అడుగు అద్దె 322 డాలర్లు. గతేడాదితో పోలిస్తే న్యూఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో అద్దె స్వల్పంగా పెరిగినప్పటికీ ర్యాంక్‌లో మాత్రం యథాతథంగా ఉన్నది. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ ర్యాంక్ 27వ స్థానానికి పడిపోగా, నారిమన్ పాయింట్ సీబీడీ కూడా 40వ స్థానానికి జారుకున్నది. 2018లో బాంద్రా కుర్లా కాంప్లెక్స్ 26వ స్థానంలో ఉండగా, నారిమన్ పాయింట్ 37వ స్థానంలో ఉంది. బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ఒక్కో చదరపు అడుగు అద్దె 90.67 డాలర్లుగా ఉండగా, అదే నారిమన్ పాయింట్‌లో 68.38 డాలర్లుగా ఉన్నది. కార్పొరేట్లు, అంతర్జాతీయ సంస్థలు తమ కార్యాలయాలను కన్నాట్ ప్లేస్‌లోనే ఏర్పాటు చేయడానికి ఎంతైన వెచ్చించడానికి ముందుకు రావడంతో ఇక్కడ ఆఫీస్ ప్లేస్‌కు డిమాండ్ నెలకొన్నదని సీబీఆర్ఈ ఇండియా చైర్మన్, సీఈవో అన్షుమన్ మ్యాగజైన్ తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగంలో కమర్షియల్ ఆఫీస్ మార్కెట్ ఎనలేని డిమాండ్ ఉన్నదని, ఢిల్లీలోని ప్రైమ్ మార్కెట్ టాప్-10 అత్యంత ఖరీదైన స్థలంగా నిలిచిందన్నారు. తొలి పది జాబితాలో ఆసియా నుంచి ఆరు స్థలాలకు చోటు లభించింది. లండన్‌లోని వెస్ట్ ఎండ్‌కు రెండో స్థానం లభించగా, హాంకాంగ్‌లోని కౌలాన్‌కు ఆ తర్వాతి స్థానం, న్యూయార్క్‌లోని మిడ్‌టౌన్ మ్యాన్‌హ్యాటన్‌కు నాలుగో స్థానం లభించింది. బీజింగ్‌లోని ఫైనాన్స్ స్ట్రీట్‌కు 5వ స్థానం దక్కింది.

# ఇక అందరి గుట్టూ రట్టు

- స్విస్ బ్యాంకుల్లో ఖాతాలున్న భారతీయులందరి వివరాలు కేంద్రం చేతికి
- సెప్టెంబర్ నుంచి దశలవారీగా ఇవ్వనున్న స్విట్జర్లాండ్

**న్యూఢిల్లీ/బెర్న్, జూలై 10:** విదేశాల్లో దాచిన అనుమానిత నల్లధనంపై కేంద్రం చేసిన పోరు నేపథ్యంలో ఈ సెప్టెంబర్ నుంచి స్విస్ బ్యాంకుల్లో ఖాతాలున్న భారతీయులందరి వివరాలు వరుసగా బహిర్గతం కానున్నాయి. గతేడాది మూసేసిన ఖాతాదారుల వివరాలూ ప్రభుత్వం చేతికి చిక్కనున్నాయి. ఆటోమేటిక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ (ఏఈవోఐ) ఒప్పందం మార్గదర్శకాల కింద భారతీయ ఆదాయం పన్ను (ఐటీ) శాఖ అధికారులతో స్విట్జర్లాండ్ సర్కారు ఈ వివరాలను పంచుకోనున్నది. స్విస్ ఆర్థిక సంస్థల్లో ఖాతా ఉన్న ప్రతీ భారతీయుడి అకౌంట్ నెంబర్, క్రెడిట్ బ్యాలెన్స్‌సహా ఇతర అన్ని రకాల వివరాలను మన ఐటీ శాఖకు స్విస్ అధికారులు అప్పగించనున్నారు. తొలి దఫా వివరాలు ఈ సెప్టెంబర్‌లో రానుండగా, మిగతా వివరాలు వార్షిక ప్రాతిపదికన హస్తగతం కానున్నాయి. ఈ మేరకు స్విట్జర్లాండ్ ఫెడరల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్స్ (ఎఫ్‌డీఎఫ్) తెలియజేసింది. ఇప్పటికే ఇరు దేశాల మధ్య కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందం కింద పన్ను వ్యవహారాల్లో అవకతవకలున్న వారి వివరాలను మోదీ సర్కారుకు స్విస్ అందించింది. దాదాపు 100 భారతీయ సంస్థలు, వ్యక్తుల లావాదేవీలను తెలియజేసిన విషయం తెలిసిందే.




### వివరాలు బహిర్గతం చేస్తారా?..

స్విట్జర్లాండ్ అధికారుల నుంచి ఆ దేశంలోని భారతీయ ఖాతాదారుల వివరాలను అందుకుంటున్నామని బుధవారం లోక్‌సభకు విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వీ మురళీధరన్ స్పష్టం చేశారు. అయితే తమకు వచ్చిన ఆ వివరాలను బహిర్గతం చేస్తారా? అన్న ప్రశ్నకు మాత్రం మంత్రి సూటిగా సమాధానం చెప్పకపోవడం గమనార్హం. ఆ వివరాల వినియోగం, ప్రకటన సమాచార గోప్యత నిబంధనలపై ఆధారపడి ఉంటుందన్నారు. ఏఈవోఐ.. నిరుడు జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. మొత్తానికి సెప్టెంబర్ నుంచి స్విస్ ఖాతాదారుల గుట్టు రట్టు కానుండటంతో చాలామంది భారతీయ అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అప్రకటిత ఆదాయానికి స్విస్ బ్యాంకులు స్వర్గధామంగా ఉండటంతో ఏండ్ల తరబడి అవినీతిపరుల సంపద అక్కడ గుట్టలుగా పేరుకుపోయింది. ఇప్పుడు ఆ కొండల్ని బద్దలుకొట్టే ప్రయత్నాలు మొదలుకావడంతో నల్లధన కుబేరుల ఒంట్లో ప్రకంపనలు వస్తున్నాయి.

### ఓబీసీ వడ్డీరేట్ల తగ్గింపు

- 10 బేసిస్ పాయింట్లు తగ్గించిన బ్యాంక్

**న్యూఢిల్లీ, జూలై 10:** ప్రభుత్వరంగ సంస్థ ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్(ఓబీసీ)..రుణాలను మరింత తక్కువ వడ్డీరేటుకు అందించే ఉద్దేశంలో భాగంగా మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది. గురువారం నుంచి అమలులోకి వచ్చేలా ఒకరోజు, నెల కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్‌ను 10 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో రుణరేటు 8.20 శాతానికి, 8.25 శాతానికి తగ్గాయి. అంతకుముందు ఇవి వరుసగా 8.30 శాతంగాను, 8.35 శాతంగా ఉన్నాయి. వీటితోపాటు మూడు, ఆరు, ఏడాది కాల పరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటును కూడా 5 బేసిస్ పాయింట్లు కోత విధించడంతో 8.45 శాతానికి, 8.55 శాతానికి, 8.65 శాతానికి తగ్గినట్లు బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది. ప్రస్తుత సంవత్సరంలో మూడు దశల్లో 75 బేసిస్ పాయింట్లు వడ్డీరేట్లు తగ్గించినప్పటికీ ఈ ప్రయోజనాన్ని బ్యాంకులు వినియోగదారులకు చేరవేయడం లేదని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ హెచ్చరించిన నేపథ్యంలో బ్యాంకులు వరుసగా రేట్లను తగ్గిస్తున్నాయి. ఇదివరకే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్ని రకాల రుణాలపై వడ్డీరేటును 5 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం తెలిసిందే.

### బీఎస్ఎన్ఎల్ ఫ్యాన్సీ నంబర్ల వేలం

**సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** బీఎస్ఎన్ఎల్ 69వ విడత ఫ్యాన్సీ నంబర్ల ఈ-వేలాన్ని ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ మొబైల్స్ నంబర్స్‌ను పూర్తిగా వెబ్ బేస్డ్ పద్ధతిలో కేటాయించనున్నారు. పూర్తి వివరాల కోసం eauction.bsnl.co.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చునని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న నంబర్లను ఎంచుకుని బిడ్డింగ్ వేయాల్సి ఉంటుంది. అనంతరం ఫ్యాన్సీ నంబర్లను బిడ్డింగ్‌లో గెలుపొందిన వారికి కేటాయించనున్నారు.

### జన్‌ధన్ ఖాతాల్లో లక్ష కోట్ల డిపాజిట్లు

**న్యూఢిల్లీ, జూలై 10:** జన్‌ధన్ ఖాతాల్లో డిపాజిట్లు లక్ష కోట్ల రూపాయలు దాటాయి. బుధవారం ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. జూలై 3 నాటికి దేశవ్యాప్తంగా ఉన్న 36.06 కోట్ల ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన(పీఎంజేడీవై) బ్యాంక్ ఖాతాల్లో రూ.1,00,495.94 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని తెలిపింది. జూన్ 6 నాటికి ఈ ఖాతాల్లో డిపాజిట్లు రూ.99,649.84 కోట్లుగా ఉన్నాయి. ఆగస్టు 28, 2014న కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది.

### 9 నుంచి రాత్రి 9 గంటల వరకు!

- ఫారెక్స్ ట్రేడింగ్ సమయం పెంచాలని ఆర్బీఐ ప్యానెల్ సూచన

**ముంబై, జూలై 10:** ఫారెక్స్ మార్కెట్ ట్రేడింగ్ సమయాన్ని ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటలకు పెంచాలని రిజర్వు బ్యాంక్‌కు ప్రత్యేక ప్యానెల్ సూచించింది. ఆగస్టు 2018న ఫారెక్స్ ట్రేడింగ్ సమయం పెంచేదానిపై సెంట్రల్ బ్యాంక్ ప్రత్యేక ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. ఈ ప్రతిపాదనకు ఆర్బీఐ బోర్డు అనుమతించాల్సి ఉంటుంది. దీనిపై ఈ నెల చివరిలోగా సూచనలు చేయవచ్చునని ఆర్బీఐ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఫారెక్స్ మార్కెట్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నారు.




### ఎగుమతుల ప్రోత్సాహానికి ప్రత్యేక విధానం

**దేశీయ గ్రానైట్‌లో రాష్ట్ర వాటా 70 శాతం: ఐటీ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

దేశీయ ఎగుమతుల్లో రాష్ట్రాన్ని మూడోస్థానానికి చేరుకునేందుకు కృషిచేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఎగుమతుల అవకాశాలపై బుధవారం భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ప్రత్యేక సదస్సును నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం రక్షణ రంగం ఎగుమతుల్లో దేశంలోనే మూడోస్థానంలో నిలిచిందని.. మొత్తం దేశీయ గ్రానైట్ ఎగుమతుల్లో మన రాష్ట్రం వాటా దాదాపు డెబ్బై శాతం ఉంటుందని వెల్లడించారు. తెలంగాణ నుంచి ఎగుమతులను ప్రణాళికాబద్ధంగా ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారిస్తున్నదని.. ఇందుకోసం ఎగుమతుల అభివృద్ధి మండలి సూచనలు, పరిశ్రమల పెద్దల సహకారం, విదేశీ అత్యుత్తమ ప్రమాణాలను క్రోడీకరించి ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. ఇక్కడి సంస్థలు ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించడం వల్ల రక్షణ, పునరుత్పాదక, ఖనిజ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయగలుగుతున్నామని చెప్పారు. ఫార్మా సిటీ, మెడికల్ డివైజెస్ పార్క్, జినోమ్ వ్యాలీ వంటి వాటితో చిన్న తరహా పరిశ్రమలకు ఎగుమతుల్లో మెరుగైన అవకాశాలు ఉంటాయన్న ధీమా వ్యక్తంచేశారు. ఇప్పటికే మన రాష్ట్రం నుంచి ఎగుమతి అయ్యే వాటిలో పాలరాయి, ఆహారశుద్ధి ఉత్పత్తులకు చక్కటి ఆదరణ లభిస్తుందని చెప్పారు. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే హస్తకళలకు పూర్తిస్థాయిలో ప్రోత్సాహాన్ని అందజేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతున్నట్టు తెలిపారు.

# కొనసాగుతున్న మార్కెట్ల పతనం

## 174 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

**ముంబై, జూలై 10:**

స్టాక్ మార్కెట్ల పతనం కొనసాగుతున్నది. బడ్జెట్లో తీసుకున్న నిర్ణయాలకు తోడు భారత్ సుంకాలను ఇంకా సహించబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు మదుపరుల్లో ఆందోళనను మరింత పెంచింది. ఫలితంగా లాభాల్లో ప్రారంభమైన సూచీలు సమయం గడుస్తున్న కొద్ది నష్టాల్లోకి జారుకున్నది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు అమ్మకాలకు మొగ్గుచూపడం, వాహన అమ్మకాల్లో క్షీణత, డాలర్‌తో పోలిస్తే రూపాయి పతనం కూడా సూచీల పతనానికి పరోక్షంగా దోహదం చేశాయి. బుధవారం 400 పాయింట్ల స్థాయిలో తచ్చాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 173.78 పాయింట్లు పతనం చెంది 38,557.04 వద్ద ముగియగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 57 పాయింట్లు కోల్పోయి 11,498.90 వద్ద క్లోజ్ అయింది. సూచీలు వరుసగా నాలుగో రోజు పతనం చెందినట్లు అయింది. బజాజ్ ఫైనాన్స్ అత్యధికంగా 4.91 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది. వీటితోపాటు టాటా స్టీల్, టాటా మోటర్స్, యాక్సిస్ బ్యాంక్, ఎల్ అండ్ టీ, హీరో మోటోకార్ప్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఆటో, ఎస్బీఐలు మూడు శాతం వరకు మార్కెట్ వాటాను కోల్పోయాయి. కానీ, యెస్ బ్యాంక్, సన్ ఫార్మా, కొటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్లు రెండు శాతం వరకు లాభపడ్డాయి. అమ్మకాలు పడిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటోమొబైల్ సంస్థలకు చమురు ధరల రూపంలో గట్టి షాక్ తగిలిందని, కార్పొరేట్ల నిరుత్సాహక ఆర్థిక ఫలితాలతో ఐటీ స్టాకులు దిగువముఖంగా ప్రయాణించాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద నాయర్ తెలిపారు. రంగాలవారీగా చూస్తే క్యాపిటల్ గూడ్స్, రియల్టీ, ఇండస్ట్రియల్, మెటల్, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల షేర్లు మదుపరులను ఆకట్టుకోలేకపోవడంతో రెండు శాతం వరకు పతనం చెందాయి. ఆసియా మార్కెట్లలో షాంఘై కంపోజిట్ ఇండెక్స్, నిక్కీలు పతనం చెందగా, హ్యాంక్ సెంగ్, కోస్పిలు లాభాల్లో ముగిశాయి.




### టాటా షేర్ల భారీ క్షీణత..

టాటా గ్రూపునకు చెందిన షేర్ల భారీ పతనం స్టాక్ మార్కెట్ల పతనానికి ఆజ్యంపోశాయి. లగ్జరీ కార్ల సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ అమ్మకాలు భారీగా పతనమైనట్లు గణాంకాలు విడుదల కావడంతో టాటా మోటర్స్ షేరు ధర ఏకంగా 3 శాతం క్షీణించింది. మార్కెట్ ముగిసే సమయానికి 2.79 శాతం కోల్పోయిన షేరు ధర రూ.151.40 వద్ద ముగిసింది. ఒక దశలో నాలుగు శాతానికి పైగా పతనమైన షేరు చివరికి నష్టాన్ని తగ్గించుకున్నది. మరోవైపు టీసీఎస్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలకు చేరుకోలేకపోవడంతో కంపెనీ షేరు ధర 1.11 శాతం పతనం చెంది రూ.2,107.70 వద్ద ముగిసింది.

### వాహన షేర్లది అదే దారి..

గడిచిన నెలలో ప్యాసింజర్ వాహన విక్రయాలు ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయినట్లు భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) విడుదల చేసిన నివేదిక ఆటో రంగ షేర్లను అతలాకుతం చేసింది. టాటా మోటర్స్ షేరు 2.79 శాతం తగ్గగా, భారత్ ఫోర్జ్ 2.41 శాతం, టీవీఎస్ మోటర్ 2.12 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 1.77 శాతం, హీరో మోటోకార్ప్ 1.68 శాతం, బజాజ్ ఆటో 1.54 శాతం, ఐచర్ మోటర్స్ 1.39 శాతం, మారుతి సుజుకీ 0.31 శాతం చొప్పున పతనం చెందాయి. రంగాల్లో బీఎస్ఈ ఆటో రంగ సూచీ అత్యధికంగా 1.07 శాతం తగ్గి 16,948.23 వద్ద ముగిసింది.



### ఫార్చ్యూన్ ఇండియాలో ఎల్‌పీయూ పూర్వ విద్యార్థి

**హైదరాబాద్, జూలై 10:** ఫార్చ్యూన్ ఇండియా మ్యాగజైన్ ఈ ఏడాదికిగాను విడుదల చేసిన '40 అండర్ 40' జాబితాలో లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్‌పీయూ) పూర్వ విద్యార్థి రాహుల్ త్యాగికి చోటు దక్కింది. లుసిడేస్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుల్లో ఒకరే రాహుల్ త్యాగి. 2012లో ఈ సంస్థను మరికొందరితో కలిసి రాహుల్ స్థాపించారని, తమ విద్యార్థికి ఈ గౌరవం దక్కడం పట్ల ఆనందంగా ఉందని ఎల్‌పీయూ చాన్సలర్ అశోక్ మిట్టల్ బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కేఎఫ్‌సీ, టాటా స్కై, సాఫ్ట్ బ్యాంక్‌లు ఈ సంస్థకు కస్టమర్లుగా ఉండటం గమనార్హం. ఇంటెల్, సోనీ, హెచ్‌పీ, డిస్కవరీ నెట్‌వర్క్స్, టీఈడీ తదితర మీడియా, టెక్నాలజీ సంస్థలకూ లుసిడేస్ సేవలు కొనసాగుతున్నాయి.

# హజ్ క్యాంపులో మెరుగైన సౌకర్యాలు

హజ్ కమిటీ చైర్మన్ మసిఉల్లాఖాన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో ఏ రాష్ట్రంలోనూ అందించనివిధంగా హైదరాబాద్ హజ్ క్యాంపులో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసిఉల్లాఖాన్ తెలిపారు. బుధవారం విజయవాడలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏపీకి చెందిన హజ్ యాత్రికులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మసిఉల్లాఖాన్ మాట్లాడుతూ... ఏపీకి చెందిన హజ్ యాత్రికుల కోసం హైదరాబాద్ హజ్ క్యాంపులో ప్రత్యేక ఏర్పాట్లుచేస్తున్నట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో విమాన టికెట్ల బుకింగ్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీ డిప్యూటీ సీఎం అమ్జద్‌బాషా, గుంటూరు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా, ఏపీ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ తాజుద్దీన్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


బుధవారం విజయవాడలో హజ్ యాత్రికులకు శిక్షణ శిబిరం లో మాట్లాడుతున్న హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసిఉల్లాఖాన్

ప్రారంభమైన
## టీఆర్టీ నియామక ప్రక్రియ

- జిల్లాలవారీగా ఎంపిక జాబితాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పాఠశాల విద్యాశాఖలోని 8,792 టీచర్ పోస్టుల (టీఆర్టీ) నియామక ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైంది. టీఆర్టీ ద్వారా ఎంపికైనవారి జాబితాలను జిల్లాలవారీగా ప్రకటించారు. పోస్టులను జిల్లా కార్యాలయాల్లోని నోటీస్‌బోర్డు, వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని జిల్లాస్థాయి కమిటీ నిర్ణయం తీసుకున్నది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ్‌కుమార్, ఇతర అధికారులు జిల్లాలవారీగా టీఆర్టీ ప్రక్రియను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్నారు. టీఆర్టీ నియామక షెడ్యూల్‌లో భాగంగా గురువారం డీఎల్సీలతో సమావేశం నిర్వహించి ఖాళీల జాబితాలను సిద్ధంచేయాల్సి ఉంది.


• అసెంబ్లీని సందర్శించిన శిక్షణ ఐఏఎస్‌లు

2018 బ్యాచ్‌కు ఎంపికైన ఐఏఎస్ అధికారులు శిక్షణలో భాగంగా బుధవారం తెలంగాణ అసెంబ్లీని సందర్శించారు. అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులుతో సమావేశమయ్యారు. శాసనసభ వ్యవహారాలు, నిర్వహణ, నియమాలు, నిబంధనలపై అసెంబ్లీ కార్యదర్శి వివరించారు.

- హైదరాబాద్, నమస్తే తెలంగాణ



## • బుద్ధవనంలో థాయ్‌లాండ్ బౌద్ధ గురువు



థాయ్‌లాండ్ బౌద్ధ గురువు అజాన్ టున్ థ్థిర చిత్తో, మహబోధి బుద్ధవిహార్ మహేంద్ర హిల్స్‌కు చెందిన భిక్షువులు బుద్ధపాల, ధమ్మరక్షిత, ఉపాసక, ఉపాసికలతోకూడిన 60 మంది బౌద్ధులు బుధవారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించారు. శ్రీపర్వతారామంలోని గోపురంపైన, మ్యూజియంలో అమర్చిన శిల్పాలను పరిశీలించారు. అనంతరం తెలంగాణ టూరిజం ఏర్పాటుచేసిన ప్రత్యేక లాంచీలో నాగార్జునకొండకు వెళ్లారు. టిబెట్‌కు చెందిన ఆరుగురు బౌద్ధ భిక్షువులు సైతం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం, నాగార్జునకొండను సందర్శించారు. వీరితో టూరిజం మాజీ ఎండీ చెన్నూరు ఆంజనేయరెడ్డి, బుద్ధవనం సహాయక శిల్పి శ్యామ్‌సుందర్, బుద్ధవనం గైడు సత్యనారాయణ ఉన్నారు.

- నందికొండ

# స్వరాష్ట్రంలో భారీ మున్సిపోల్స్

- ఉమ్మడి ఏపీలో 2 కార్పొరేషన్లు, 42 మున్సిపాలిటీలు
- స్వరాష్ట్రంలో ఆరు కార్పొరేషన్లు, 143 మున్సిపాలిటీలు
- పట్టణాల అభివృద్ధికి భారీ ప్రణాళిక
- నామినేషన్ డిపాజిట్ ఖరారుచేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో జరుగబోయే మున్సిపల్ ఎన్నికలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకొన్నాయి. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో భారీ మున్సిపోల్స్‌గా నమోదవుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలోని మున్సిపాలిటీలతో పోల్చితే ఇప్పుడు మూడున్నర రెట్లు పెరిగాయి. శివార్లలోని పలు గ్రామాల విలీనంతో వార్డులు కొత్తగా వచ్చాయి. ఇప్పుడు ఎన్నికయ్యే పాలకవర్గాలు కొత్త మున్సిపాలిటీల్లో తొలి పాలకమండళ్లుగా చరిత్రలో నిలువనున్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త గ్రామాలు ఏర్పాటుచేసిన నేపథ్యంలో పలు మున్సిపాలిటీలు కూడా కొత్తగా ఆవిర్భవించాయి. కొన్ని నగర పంచాయతీలను రద్దు చేసి మరికొన్ని గ్రామాలను కలిపి మున్సిపాలిటీలుగా రూపాంతరం చేశారు. పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికలు సైతం రూపొందించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని 129 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో భారీ మున్సిపల్ ఎన్నికలుగా మారనున్నాయి. మొత్తం 3,385 వార్డుల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ప్రతీ వార్డులో 1,500 నుంచి మూడు వేల ఓటర్లు ఉండేలా జాబితా తయారుచేశారు. అటు కార్పొరేషన్లలో ఒక్కో వార్డులో 15 వేల వరకు ఓట్లున్నాయి.

**143 కు చేరిన మున్సిపాలిటీల సంఖ్య**

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో 40 మున్సిపాలిటీలు ఉండేవి. 2002 వరకు మరో రెండు మున్సిపాలిటీలను ఏర్పాటుచేయడంతో వాటి సంఖ్య 42కు చేరాయి. కార్పొరేషన్ల విభాగంలో గ్రేటర్ హైదరాబాద్ ఒక్కటే ఉండగా.. 2004 తర్వాత వరంగల్ నగరం కార్పొరేషన్ జాబితాలో చేరింది. 2014 తర్వాత వరంగల్‌ను గ్రేటర్ హైదరాబాద్ సరసన చేర్చారు. అలాగే 2008 వరకు రాష్ట్రంలో కొన్ని పెద్ద గ్రామ పంచాయతీలను నగర పంచాయతీలుగా మార్చారు. ఈ పరిణామాల్లో సీఎం కేసీఆర్ నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చిన నేపథ్యంలో నగర పంచాయతీలన్నీ మున్సిపాలిటీలుగా మారిపోయాయి. ప్రస్తుతం మున్సిపాలిటీల సంఖ్య 42 నుంచి 143కు చేరింది. వీటిలో 129 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు 78 కొత్త మున్సిపాలిటీల్లో తొలి పాలకవర్గాలు అధికారంలోకి రానున్నాయి.

**ప్రత్యక్షం ఒకసారే**

మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో ఒకసారే చైర్మన్లు, మేయర్లకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించారు. 1995లో ప్రయోగాత్మకంగా ప్రత్యక్ష పద్ధతిన ఎన్నికలు జరిపారు. ఆ తర్వాత ఆ విధానాన్ని పక్కనపెట్టారు.

**నామినేషన్ డిపాజిట్ ఖరారు**

మున్సిపాల్టీ ఎన్నికల్లో నామినేషన్ డిపాజిట్లు మొత్తంలో గతంలో ఉన్నవాటినే కొనసాగిస్తున్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.2,500, జనరల్ అభ్యర్థులు రూ.ఐదు వేలు డిపాజిట్ కింద చెల్లించాలని ఎస్ఈసీ పేర్కొన్నది.


కమిషనర్లు, సీడీఎంఏ అధికారుల శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఈసీ కమిషనర్ నాగిరెడ్డి

## మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం

- 14 వరకు ఓటర్ల తుది జాబితా
- నేడు పార్టీల ప్రతినిధులతో భేటీ
- మున్సిపల్ కమిషనర్ల సమావేశంలో ఎస్ఈసీ నాగిరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కమిషనర్ నాగిరెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్ హెచ్చార్డీ) కార్యాలయంలో బుధవారం 129 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్ల కమిషనర్లు, సీడీఎంఏ అధికారులతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా, వార్డుల్లో ఫొటో ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల ఏర్పాట్లను వివరించారు. కోర్టు కేసుల నేపథ్యంలో ఎన్నికలు ఆలస్యమయ్యాయని ఆయన తెలిపారు. సమయం ప్రకారం కోర్టు తెలిపిన గడువులోగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలున్నాయని చెప్పారు. మున్సిపాలిటీల పరిధిలోని వార్డుల్లో బుధవారం ఓటరు జాబితా ముసాయిదా విడుదల చేశారని, ఈ నెల 14న తుది జాబితా ప్రకటిస్తామన్నారు. గురువారం అన్ని మున్సిపాలిటీల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. పోలింగ్ కేంద్రాలపై ఈ నెల 15న ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలని తెలిపారు.

**పారదర్శకంగా ఎన్నికలు జరుపాలి**

షెడ్యూల్ ప్రకారం వార్డుల విభజన పూర్తిచేశారని మున్సిపల్‌శాఖ డైరెక్టర్ టీకే శ్రీదేవి చెప్పారు. తక్కువ సమయంలో ఎన్నికల ఏర్పాట్లుచేస్తున్నారని అభినందించారు. ఇబ్బందులు లేకుండా ఓటర్ జాబితా అందుబాటులో ఉంచాలని సూచించారు.

# ఏసీబీ వలలో వీఆర్వో

- భూమి వివరాల నమోదుకు రూ. 8 లక్షలు డిమాండ్
- రంగారెడ్డి జిల్లా కేశంపేట తాసిల్దార్ వాటా రూ.5 లక్షలు
- ఆమె ఇంట్లో 93 లక్షలు లభ్యం


వీఆర్వో అనంతయ్య


తాసిల్దార్ లావణ్య

**కొందుర్గు:** తన భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని వేడుకున్న రైతునుంచి ఓ వీఆర్వో రూ.8 లక్షల లంచం డిమాండ్‌చేశాడు. అడ్వాన్స్‌గా రూ. 4లక్షల నగదును బుధవారం సాక్షాత్తు తాసిల్దార్ కార్యాలయంలోనే తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం దత్తాయపల్లి గ్రామానికి చెందిన మామిడిపల్లి చెన్నయ్యకు సర్వే నంబర్ 85/ఆలో 9.07 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమి సమస్య పరిష్కారానికి రూ. 8 లక్షలు లంచం ఇవ్వాలని, ఇందులో తాసిల్దార్ మునావత్ లావణ్యకు రూ. 5 లక్షలు కాగా, తనకు రూ. 3 లక్షలు అని వీఆర్వో అనంతయ్య రైతును డిమాండ్ చేశాడు. దీంతో చెన్నయ్య ఏసీబీని ఆశ్రయించాడు. ఈ మొత్తం వ్యవహారాన్ని నడిపించిన తాసిల్దార్ అందులో రూ.4 లక్షలు అడ్వాన్సుగా తీసుకొనేందుకు వీఆర్వో అనంతయ్యను పురమాయించారు. చెన్నయ్య కుమారుడు భాస్కర్ అనంతయ్యకు కొందుర్గు తాసిల్దార్ కార్యాలయంలో రూ. 4 లక్షలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేశంపేట మండలంలో వీఆర్వోగా విధులు నిర్వహించిన అనంతయ్య గతనెల 13న బదిలీపై కొందుర్గు మండలానికి వచ్చాడు. పోమాల్‌పల్లిలో రెవెన్యూ సదస్సులో ఉన్న తాసిల్దార్ లావణ్యను అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ హయత్‌నగర్‌లో లావణ్య నివాసంలో సోదా చేసి రూ.93 లక్షలు, రూ.13 లక్షల విలువైన ఆభరణాలు, పలు పత్రాలు లభించాయి.

### హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అధ్యక్షుడిగా రామారావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఎన్జీవో అనుబంధ రాష్ట్రస్థాయి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ (హెచ్‌డబ్ల్యూవో) నూతన కమిటీని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి ప్రకటించారు. హెచ్‌డబ్ల్యూవో కేంద్ర సంఘం ఫోరం అధ్యక్షుడిగా ఖమ్మం జిల్లాకు చెందిన టీ రామారావుకు, కార్యదర్శిగా సంగారెడ్డి జిల్లాకు చెందిన ఖాజాగౌస్ మోయినోద్దీన్ హష్మీకు బుధవారం టీఎన్జీవో భవన్‌లో రవీందర్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు.

### విధులు కేటాయించండి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నీటిపారుదల శాఖలో మాత్రం విభాగాలవారీగా విధులు కేటాయించాలని తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అసోసియేషన్ విజ్ఞప్తిచేసింది. బుధవారం ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషితోపాటు నీటి పారుదలశాఖ ఈఎన్సీ (పరిపాలన) నాగేంద్రబాబుకు ఆ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చక్రధర్, ప్రెసిడెంట్ రమ, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు వినతిపత్రాలు సమర్పించారు.

## 'గాంధీ' దర్యాప్తు తీరే వేరయా!

అధికారం ముసుగులో అనుయాయులకు అందలమని విమర్శలు

సీబీఐ తనిఖీలతో వెలుగులోకి వస్తున్న నిజాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మాజీ అధికారి బొల్లినేని శ్రీనివాస్ గాంధీ.. అధికారాన్ని అడ్డుపెట్టుకొని తనవారికి అనుకూలంగా వ్యవహరించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సెంట్రల్ జీఎస్టీలో యాంటీ ఎవేషన్ (పన్నుల ఎగవేత వ్యతిరేక విభాగం)లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న గాంధీకి ఏపీ మాజీ సీఎం చంద్రబాబు సన్నిహితుడిగా పేరుంది. చంద్రబాబు గ్రూపు వ్యతిరేకులపై నమోదైన హైప్రొఫైల్ కేసుల్లో తనదైన శైలిలో దర్యాప్తు చేసేవాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడన్న ఆరోపణలపై గాంధీకి చెందిన విజయవాడ, హైదరాబాద్‌లోని నివాసాలు, కార్యాలయాల్లో సీబీఐ అధికారులు మంగళవారం ఏకకాలంలో తనిఖీలు జరిపారు. సీబీఐ సోదాల నేపథ్యంలో గతంలో శ్రీనివాస్ గాంధీ దర్యాప్తుచేసిన ఈడీ కేసుల తీరు మరోమారు తెరపైకి వస్తున్నది. ఏపీ ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో వైఎస్ జగన్‌పై నమోదైన ఈడీ కేసుల్లో నిబంధనలకు మించి గాంధీ జోక్యం ఉండేదన్న ఆరోపణలు ఉన్నాయి. మాజీ కేంద్ర మంత్రి సుజనాచౌదరికంపెనీలపై నమోదైన మనీలాండరింగ్ కేసులను శ్రీనివాస్‌గాంధీ కావాలనే తొక్కిపెట్టారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

# క్షేత్రస్థాయిలో బీసీ కమిషన్ పర్యటన

- సంచార కులాల ప్రతిపాదనలపై ఆరా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బీసీ కులాల జాబితాలో చేర్చాలంటూ వివిధ సంచార కులాల నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు రాష్ట్ర బీసీ కమిషన్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నది. బుధవారం చైర్మన్ బీఎస్ రాములు హైదరాబాద్‌లో, సభ్యులు కృష్ణమోహన్‌రావు జగిత్యాల, ఆంజనేయగౌడ్ మహబూబ్‌నగర్, గౌరీశంకర్ రంగారెడ్డి జిల్లాల్లో పర్యటించారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న అహీర్ కులానికి చెందిన కుటుంబాలను రాములు కలిసి మాట్లాడారు. సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు జగిత్యాల జిల్లాలో గంజికూటివారు, అరవకోమలి, ఏనూటి కులాల కుటుంబాలను కలిసి వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకొన్నారు. మహబూబ్‌నగర్‌లో గవులీ కులానికి చెందిన కుటుంబాలను కలిసేందుకు వారు నివసించే ప్రాంతాల్లో ఆంజనేయగౌడ్ పర్యటించారు. గవులీ కుల ప్రతినిధులతో సమావేశమయ్యారు. మరో సభ్యుడు జూలూరు గౌరీశంకర్ రంగారెడ్డి జిల్లాలో పర్యటించారు. బైల్‌కమ్మర, సన్నాయి కులస్థుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. పటాన్‌చెరు, చిట్కుల్, గౌడిచర్ల, సంగారెడ్డి, తోగర్‌పల్లి, కొండాపూర్, మారేపల్లి, కందిలో నివసిస్తున్న వివిధ సంచార కులాల వారితో సమావేశమయ్యారు.


బుధవారం రంగారెడ్డి జిల్లాలో సన్నాయి కులస్థులతో బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్

ఇండ్ల పేరుతో మోసగించిన
### బీజేపీ నేతపై ఫిర్యాదు

**బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఇప్పిస్తానంటూ డబ్బులు దండుకుని ముఖం చాటేసిన జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ నాయకుడిపై బాధితులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని ఇందిరానగర్‌లో నివాసం ఉండే బీజేపీ డివిజన్ ఉపాధ్యక్షుడు ప్రదీప్ రెండేండ్లుగా బస్తీలో పలువురిని మోసంచేస్తున్న వ్యవహారంపై ఇప్పటికే కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందిరానగర్‌లో నివా సం ఉంటున్న కే విజయలక్ష్మి తననుంచి రూ.2.5 లక్షలు వసూలుచేసినట్లు బుధవా రం పోలీసులకు ఫిర్యాదుచేశారు. తమ ఎమ్మెల్యే ఓడిపోవడంతో ఇండ్లురావని, డబ్బులు తిరిగి ఇచ్చే ప్రసక్తి లేదంటూ మొండికేస్తూ.. పార్టీలో పెద్దలతో పరిచయాలు ఉన్నాయని, డబ్బుల గురించి మర్చిపోవాలని బెదిరిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## నేడు తెలంగాణ ఇంజినీర్స్‌డే ఉత్సవాలు

- నలుగురు సీనియర్ ఇంజినీర్లకు అవార్డుల ప్రదానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంజినీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ జయంతి పురస్కరించుకొని గురువారం తెలంగాణ ఇంజినీర్స్ డే ఉత్సవాల్ని ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఘనంగా నిర్వహించనున్నట్టు తెలంగాణ ఇంజినీర్ల జేఏసీ చైర్మన్ టీ వెంకటేశం తెలిపారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, తెలంగాణ ఇంజినీర్స్ జేఏసీ, తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్సవాల్ని నిర్వహిస్తున్నదని చెప్పారు. బుధవారం ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కార్యాలయంలో తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి, తెలంగాణ ఇంజినీర్ల జేఏసీ కో చైర్మన్ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, కార్యదర్శి చక్రధర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ తెలంగాణశాఖ గౌరవ చైర్మన్ జీ రామేశ్వరరావు తదితరులతో కలిసి టీ వెంకటేశం.. కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా రవాణాశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, సీఎస్ ఎస్కే జోషి, తెలంగాణ జల వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్‌రావు తదితరులు హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా నలుగురు సీనియర్ ఇంజినీర్లకు నవాజ్ జంగ్ మెమోరియల్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులను ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. విద్యుత్‌శాఖ నుంచి కే పెంటారెడ్డి, నీటిపారుదలశాఖ నుంచి పీ వెంకటరామారావు, రోడ్లు, భవనాలశాఖ నుంచి పీ కిషన్, మిషన్ భగీరథ నుంచి జ్ఞానేశ్వర్‌ను ఈ ఏడాది అవార్డులకు ఎంపికచేసినట్టు చెప్పారు. ఉదయం ఎర్రమంజిల్‌లోని జలసౌధలో నవాబ్ అలీ నవాజ్ జంగ్ విగ్రహం వద్ద ఇంజినీర్లు నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఇంజినీర్స్ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఎంఎన్ రమేశ్ పాల్గొన్నారు.


బుధవారం ఖైరతాబాద్‌లో ఇంజినీర్ డే ఉత్సవాల వివరాలు వెల్లడిస్తున్న తెలంగాణ ఇంజినీర్ల జేఏసీ చైర్మన్ టీ వెంకటేశం

ఏపీలో ఆత్మహత్యచేసుకున్న రైతు కుటుంబాలకు
### రూ.7 లక్షల సాయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరో కీలక నిర్ణయం ప్రకటించారు. ఏపీలో గత ఐదేండ్లలో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు రూ.7 లక్షల పరిహారం అందించనున్నట్టు చెప్పారు. బుధవారం అమరావతిలో స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ ప్రకటన చేశారు. ప్రజాసమస్యలపై సానుభూతితో, మానవతతో ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్సు బ్యూరో ప్రకారం 2014-19 మధ్యకాలంలో 1,513 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, కానీ, గత టీడీపీ ప్రభుత్వం 391 మందికే పరిహారం చెల్లించినట్టు రికార్డులు చెప్తున్నాయన్నారు. ఆత్మహత్యలకు సంబంధించి కలెక్టర్లు తమ జిల్లాల్లోని డాటాను పరిశీలించాలని సూచించారు. అర్హులైన రైతు కుటుంబాలకు వెంటనే పరిహారం అందజేయాలన్నారు. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేతో కలిసి బాధిత రైతు కుటుంబాల దగ్గరికి వెళ్లి, వారిలో ఆత్మస్థైర్యం నింపాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులను విచారించకుండా తిరస్కరిస్తే.. స్పందన కార్యక్రమాల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని జగన్ పేర్కొన్నారు. రేషన్‌కార్డు, పెన్షన్ వంటి సమస్యలు 72 గంటల్లో పరిష్కరించాలని సూచించారు.

# ఓటీపీ చెప్పారో.. ఖాతా ఖాళీ!

ఏడాదికి రూ. 18 కోట్లు దోపిడీచేస్తున్న సైబర్ నేరగాళ్లు

- బ్యాంకు అధికారులమంటూ ఫోన్లు చేసి వల
- మాటల్లో పెట్టి పిన్‌నంబర్లు తెలుసుకుని మోసం
- అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా మోసపోతున్న పౌరులు

❖ రాజస్థాన్‌కు పార్సిల్ పంపేందుకు హరీశ్ గూగుల్ సెర్చ్‌లో పార్సిల్ సంస్థ నంబర్ కోసం వెదికాడు. ఆ నంబర్‌కు ఫోన్‌చేసి పార్శిల్ విషయంపై మాట్లాడాడు. అవతలివ్యక్తి పార్సిల్‌కు సంబంధించిన డబ్బులు ఎలా పంపిస్తావంటూ ప్రశ్నించాడు. ఆన్‌లైన్‌లో పే చేస్తానంటూ సూచించడంతో.. గూగుల్ పేయాప్ ద్వారా పంపించమంటూ మాటల్లో పెట్టి.. హరీశ్ పిన్‌నంబర్‌ను అడిగి తెలుసుకున్నాడు. దాంతో అతడి ఖాతా నుంచి రూ.50 వేలు కాజేశాడు. పొరపాటున మీ ఖాతాలో నుంచి డబ్బులు బదిలీ అయ్యాయని, ప్రధాన కార్యాలయం నుంచి అవి వాపస్ వస్తాయంటూ నమ్మిస్తూ.. ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలను కూడా సేకరించాడు. ఇలా హరీశ్ ఖాతానుంచి రెండ్రోజుల్లోనే రూ.8.6 లక్షలు లూటీ చేశారు. ఇక్కడ అమాయకత్వం.. నిర్లక్ష్యంతోనే హరీశ్ బ్యాంకు ఖాతా ఖాళీ అయింది.

❖ విశ్రాంత ఉద్యోగి మహేందర్‌కు బ్యాంకు అధికారినంటూ ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. మీ ఖాతా అప్‌గ్రేడ్ చేయాలని.. లేదంటే బ్లాక్ అవుతుందంటూ పేర్కొన్నాడు. ఫోన్‌లో వివరాలు చెబితే అప్‌గ్రేడ్ చేస్తామంటూ నమ్మించాడు. దీంతో మహేందర్ తన డెబిట్ కార్డు నంబర్ చెప్పాడు. తరువాత ఒక్కొక్కటి అడుగుతుండగా సీవీవీ నంబర్, ఓటీపీ నంబర్ కూడా చెప్పేశాడు. ఇంతలోనే బ్యాంకు ఖాతాలో నుంచి రూ.49 వేలు మాయమయ్యాయి. ఇక్కడ విశ్రాంత ఉద్యోగికి అవగాహన లేకపోవడంతో ఖాతా నుంచి డబ్బులు పోయాయి.

❖ ఇమ్రాన్ ఓ వ్యాపారి. మీ డెబిట్ కార్డు విత్‌డ్రా చేసుకునే కెపాసిటీని పెంచుతున్నాం.. వివరాలు చెప్పండంటూ ఫోన్‌లో అవతలి వ్యక్తి డెబిట్ కార్డు వివరాలు తీసుకున్నారు.. మీ సెల్‌ఫోన్‌కు ఒక నంబర్ వస్తుంది.. ఆ నంబర్ చెప్పండంటూ ఓటీపీ తీసుకొన్నాడు. తర్వాత అతని ఖాతాలో నుంచి రూ.70 వేలు కాజేశాడు. విత్‌డ్రా కెపాసిటీ పెరుగుతుందనే ఆశతో వ్యాపారి మోసపోయాడు.



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** సైబర్ నేరగాళ్లు రోజుకోరకం మోసంతో అమాయకుల ఖాతా నుంచి డబ్బులు దోచుకుంటున్నారు. తెలిసి కొందరు.. తెలియక మరికొందరు ఏదోఒక రకంగా సైబర్‌నేరగాళ్లకు మోసాలకు చిక్కి కోట్ల రూపాయలు పోగొట్టుకుంటున్నారు. బ్యాంకు అధికారులమంటూ ఫోన్లుచేసి ఓటీపీ నంబర్ తెలుసుకొని.. బ్యాంకు ఖాతాలను లూటీచేస్తున్నారు. ఓటీపీ (వన్ టైమ్ పాస్‌వర్డ్), యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్) నంబర్ల ద్వారా కేవలం హైదరాబాద్ నగరంలోనే నెలకు సుమారు రూ.1.5 కోట్లు దోచుకుంటున్నట్టు తెలుస్తున్నది. ఈ లెక్కన ఏడాదికి రూ.18 కోట్లు కొల్లగొడుతున్నారు. రాజస్థాన్, బీహార్, ఉత్తర్‌ప్రదేశ్, ఢిల్లీ, జార్ఖండ్, హర్యానా తదితర రాష్ట్రాల్లో మారుమూల ప్రాంతాల్లో కనీసం పదో తరగతి కూడా చదవని యువకులు హిందీ, ఉర్దూలో మాట్లాడుతూ అమాయకులకు వలవేస్తున్నారు. రోజూ 200 నుంచి 300 మందికిపైగా ఫోన్లు చేస్తున్నారు. అందులో 10 నుంచి 20 మందిని తమ బుట్టలో వేసుకుంటున్నారు. ప్రతిరోజూ రూ.5 లక్షల వరకు బ్యాంకు ఖాతాల నుంచి కొట్టేస్తున్నారు. బాధితుల్లో రూ.5 వేల నుంచి లక్షల వరకు పోగొట్టుకుంటున్నవారు ఉంటున్నారు.

**ఈ దొంగలు దొరుకరు..!**

ఓటీపీ తీసుకుని మోసాలకు పాల్పడుతున్నవారిని పట్టుకోవడం సైబర్ క్రైమ్ పోలీసులకు సవాల్‌గా మారింది. నేరగాళ్లు ఒక్కోకాల్‌కు ఒక్కోసిమ్‌కార్డు వాడుతుండటం, డబ్బులు బదిలీచేసుకునే బ్యాంకు ఖాతాలు ఉత్తరభారతదేశం లేదా ఈశాన్య రాష్ట్రాలకు చెందినవి కావడంతో కేసు దర్యాప్తు కత్తిమీదసాములా మారుతున్నది. బ్యాంకు ఖాతాల ఆధారంగా పోలీసులు నేరస్థులను గుర్తిస్తున్నప్పటికీ ఇందులో ప్రధాన సూత్రధారులు కాకుండా, కేవలం ఖాతాదారులు మాత్రమే చిక్కుతున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందినవారు నేరాలకు పాల్పడితే వెంటనే దొరికేందుకు అవకాశాలున్నా.. ఇతర రాష్ట్రాల నుంచి అమాయకులకు వల వేస్తున్న సైబర్‌నేరగాళ్లలో ఎనభై శాతం మంది దొరకడం లేదు.

**అప్రమత్తతతోనే బ్యాంకు ఖాతాలు సేఫ్**

సైబర్‌నేరాలను కట్టడి చేసేందుకు పోలీసులు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బ్యాంకు డెబిట్ కార్డు, సీవీవీ, పిన్, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని సూచిస్తున్నారు. అయితే కొందరు అత్యాశతో, మరికొందరు నిర్లక్ష్యంతో, ఇంకొందరు తెలియక సైబర్‌నేరగాళ్ల మోసాలకు బలవుతున్నారు. పూర్తి అప్రమత్తతతో ఉన్నవారు మాత్రమే ఇందులో నుంచి బయటపడుతున్నారు. ఆన్‌లైన్ మొబైల్ అప్లికేషన్లపై కూడా అవగాహన ఉండాలని పలువురు పేర్కొంటున్నారు. అప్రమత్తతతోనే సైబర్‌నేరగాళ్ల బారినపడకుండా ఉండవచ్చని పోలీసులు చెప్తున్నారు.

నియామకాలకు ముందే
### పదోన్నతులు ఇప్పించండి

ఉపాధ్యాయ సంఘాల వినతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్టీ నియామక ఉత్తర్వులు ఇవ్వడానికి ముందుగానే సీనియర్ టీచర్లకు స్కూల్‌అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డికి వినతిపత్రాలు ఇచ్చాయి. విద్యాశాఖ కార్యదర్శిని కలిసినవారిలో ప్రభుత్వ టీచర్ల సంఘం నాయకులు వీరాచారి, టీటీఎఫ్ రాష్ట్ర నాయకులు రఘునందన్, టీపీజేఏసీ నాయకులు మణిపాల్‌రెడ్డి ఉన్నారు.

### కర్ణాటక పోలీసుల కస్టడీకి నౌహీరాషేక్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హీరాగోల్డ్ గ్రూప్ ఎండీ నౌహీరా షేక్‌ను కర్ణాటక పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. హీరాగోల్డ్ గ్రూప్ కంపెనీ మోసాలపై కేసుల దర్యాప్తులో భాగంగా బుధవారం కర్ణాటక పోలీసులు నౌహీరా షేక్‌ను పీటీ వారంట్‌పై హైదరాబాద్ నుంచి బళ్లారి పీఎస్‌కు తరలించారు.

గురుకుల టీచర్స్ నవోదయ TET TM EM Paper - I&II
TGT/PGT/PET/ LIBRARIANS
S.I/కానిస్టేబుల్స్ TM EM
FREE DEMO: 14-07-2019 at 10.08 am
RAMAIAH COMPETITIVE COACHING CENTRE Opp: Konark Theatre Dilsukhnagar, Hyd Cell: 8885555202 9246208422

నమస్తే తెలంగాణ
# జిందగీ
గురువారం 11 జూలై 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

కరీంనగర్

## ఒంటరి ప్రయాణం.. మారిన జీవితం!



**ఓ అందమైన యువతి. ఆమెకు ఓ బాయ్‌ఫ్రెండ్. జీవితాంతం కలిసుందామని బాసలు చేసుకున్నారు. ఆనందంగా సాగిపోతున్న వారి ప్రయాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. అమ్మాయి మనోవేదనకు గురైంది. ఒకానొక సమయంలో ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. కానీ అన్నింటినీ, అందరినీ వదిలి ఒంటరిగా ఆమె చేసిన ప్రయాణం ఆమె జీవితాన్ని మార్చేసింది.**

ముంబైకు చెందిన ప్రియంవద మంగల్ పీజీ చేసింది. ఆర్థికంగా ఉన్న కుటుంబం. అర్థం చేసుకునే బాయ్‌ఫ్రెండ్. ఇద్దరూ కలిసి సినిమాలకెళ్లారు. షికార్లకెళ్లారు. ఆనందంగా సాగిపోతున్న జీవితంలో అకస్మాత్తుగా పిడుగు పడినట్లయ్యింది. మంగల్‌కు బాయ్‌ఫ్రెండ్ బ్రేకప్ చెప్పేశాడు. దీంతో ఆమె బాధపడింది. చావు తప్ప మరో దారి లేదనుకుంది. ఆ ప్రయత్నాలు కూడా చేసింది. ఆ సమయంలోనే తను ఎందుకు చనిపోవాలనే ఆలోచన కూడా మొదలైంది. తనేంటో, అసలైన జీవితం ఏంటో తెలుసుకోవాలనుకుంది. అందుకే ఆమె ఇల్లు, కుటుంబం, అన్నింటినీ వదిలి ఒంటరిగా హిమాచల్ యాత్రకు బయల్దేరింది. 2012లో తాను చదువుతున్న కళాశాల ఆవరణలో మంగల్ చూసిన ఒక చైనా స్త్రీని గుర్తు తెచ్చుకుంది. ఆ స్త్రీ గుండుతో, ముఖంలో చిరునవ్వుతో, ఆత్మస్థైర్యంతో ఉండడాన్ని గుర్తు చేసుకుంది. తాను కూడా పూర్తిగా గుండు చేయించుకుందామనే నిర్ణయానికి వచ్చింది. హిమాచల్ యాత్రలో భాగంగా తన అందమైన కురులని తొలిగించుకుంది. ఏడాది పాటు హిమాలయాల్లోనే ధ్యానం చేస్తూ గడిపింది. గతాన్ని పూర్తిగా వదిలి ప్రస్తుతం కొత్త జీవితాన్ని ప్రారంభించింది. 'ప్రతీ సమస్యకు చావు ఒక్కటే పరిష్కారం కాదు. చావును జయించాలి. బతికినన్నాళ్లు ప్రపంచంలో కొత్త దారుల్ని అన్వేషిస్తూనే ఉండాలి' అని హ్యూమన్స్ ఆఫ్ బాంబే తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో చేసిన ఓ పోస్ట్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది.

# కిచెన్ కార్న్‌ర్!



**ఇవాళ వంటేంటి?**
**అదే వేపుడు.. అదే పప్పు.. అదే కూర!**
**ఏదైనా వెరైటీ ట్రై చేయొచ్చు కదా?**
**అని బోర్ కొట్టేదాక చూడకండి!**
**మాన్‌సూన్‌లో మజానిచ్చేలా కార్న్‌తో కసరత్తులు ఎందుకు చేయొద్దు? రొటీన్ ఫుడ్‌కు అడ్డాగా మారిన మీ కిచెన్‌ను కార్న్ కరకరలతో పేర్చి.. వండి.. వార్చి.. వడ్డన కూర్చి రెడీగా ఉంది కిచెన్ 'కార్న్'ర్.!**
**ఆరగించి.. ఆస్వాదించండి!!**

## కార్న్ వడ.. స్వీట్ పాయసం

**కావాల్సినవి :**

**కార్న్ :** ఒక కప్పు
**పచ్చిమిర్చి :** 4
**జీలకర్ర :** పావు టీస్పూన్
**ఉల్లిపాయ ముక్క :** 1, **సాబుదానా :** అర కప్పు
**యాలకుల పొడి :** అర టీస్పూన్
**బెల్లం :** పావు కప్పు, **పాలు :** 300 మి.లీ.
**కరివేపాకు :** ఒక రెమ్మ, **నూనె, ఉప్పు :** తగినంత

**తయారీ :**

**స్టెప్ 1 :** కార్న్, పచ్చిమిర్చి, జీలకర్ర, ఉప్పు, కరివేపాకు వేసి మెత్తగా పేస్ట్ చేయాలి. ఇందులో ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా కలపాలి.
**స్టెప్ 2 :** కడాయిలో నూనె పోసి ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసి వీటిని డీప్ ఫ్రై చేసుకోవాలి. గోల్డెన్ కలర్ వచ్చేవరకు వేయించి పక్కన పెట్టుకోవాలి.
**స్టెప్ 3 :** ఇప్పుడు సాబుదానా పాయసం దీనికి పర్‌ఫెక్ట్‌గా ఉంటుంది. దానికోసం సాబుదానాని అరగంట పాటు నీళ్లలో వేసి నానబెట్టాలి.
**స్టెప్ 4 :** గిన్నెలో సాబుదానాలో కొన్ని నీళ్లు పోసి ఉడికించాలి. ఇందులో యాలకుల పొడి, బెల్లం తురుము, పాలు పోసి కలుపుకోవాలి.
**స్టెప్ 5 :** ఈ పాయసం చిక్కగా అయ్యేంత వరకు ఉంచి దించేయాలి. వడ, పాయసం కలిపి తింటే మహా రుచిగా ఉంటాయి.

## స్వీట్ కార్న్ పుడ్డింగ్



**కావాల్సినవి :**

**స్వీట్ కార్న్ ప్యూరీ :** పావు కప్పు
**స్వీట్ కార్న్ :** పావు కప్పు
**కార్న్‌మీల్ ఫ్లోర్ :** ఒక టీస్పూన్
**మైదా :** ఒక టీస్పూన్
**కోడిగుడ్డు :** 1
**చక్కెర :** 3 టేబుల్‌స్పూన్స్
**పాలు :** పావు కప్పు
**బటర్ :** 2 టీస్పూన్స్

**తయారీ :**

**స్టెప్ 1 :** ముందుగా పాలను వేడి చేసి చల్లారబెట్టాలి. ఒక గిన్నెలో కోడిగుడ్డు, చక్కెర వేసి బాగా గిలక్కొట్టాలి.
**స్టెప్ 2 :** ఈ గుడ్డు మిశ్రమంలో పాలు పోసి బాగా కలుపాలి. ఆ తర్వాత కార్న్ ప్యూరీ, స్వీట్ కార్న్, కార్న్‌మీల్ ఫ్లోర్, మైదా వేసి ఉండలు కట్టకుండా కలుపుతుండాలి.
**స్టెప్ 3 :** బేకింగ్ ట్రేకి బటర్ రాసి ఈ మిశ్రమాన్ని మొత్తం పరుచాలి. దీన్ని ఓవెన్‌లో 180 డిగ్రీల వద్ద 20 నుంచి 30 నిమిషాల పాటు బేక్ చేయాలి.
**స్టెప్ 4 :** బేక్ చేసిన ఈ మిశ్రమాన్ని నీట్‌గా బయటకు తీయాలి. పైన వీలుంటే డ్రైఫ్రూట్స్‌తో గార్నిష్ చేసి తింటే మరింత టేస్టీగా ఉంటుంది.

## కార్న్ జడే సూప్



**కావాల్సినవి :**

**స్వీట్ కార్న్ :** అర కప్పు, **పాలకూర :** ఒక కట్ట,
**కొత్తిమీర :** చిన్న కట్ట, **క్యాప్సికం ముక్కలు :** పావు కప్పు,
**పచ్చిమిర్చి :** 1, **సెలరీ :** చిన్న కట్ట, **ఉల్లి ఆకు :** 1,
**వెల్లుల్లిపాయలు :** 4, **క్యారెట్ ముక్కలు :** పావు కప్పు,
**ఫ్రెంచ్ బీన్స్ :** పావు కప్పు, **కార్న్ స్టార్చ్ :** ఒక టేబుల్‌స్పూన్,
**నూనె, ఉప్పు :** తగినంత

**తయారీ :**

**స్టెప్ 1 :** పాలకూర కడిగి పెట్టుకోవాలి. కడాయిలో పాలకూర వేసి వేయించాలి. ఇందులో కొత్తిమీర వేసి కలుపాలి.
**స్టెప్ 2 :** ఇవి కాస్త పచ్చివాసన పోయాక.. ఇందులో క్యాప్సికం ముక్కలు, పచ్చిమిర్చి, సెలరీ వేసి కలిపి దించేయాలి. వీటిని మిక్సీ పట్టి మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి.
**స్టెప్ 3 :** కడాయిలో కొద్దిగా నూనె పోసి వెల్లుల్లి, ఉల్లి ఆకు, క్యారెట్ ముక్కలు, బీన్స్, స్వీట్ కార్న్ వేసి బాగా కలుపాలి. ఇవి కాస్త వేగాక.. పాలకూర పేస్ట్ వేసి కలుపాలి.
**స్టెప్ 4 :** కాసేపు కలిపాక.. కొన్ని నీళ్లు పోసి, చక్కెర వేసి కలుపాలి. కాసేపు ఈ మిశ్రమాన్ని మరుగనివ్వాలి. ఆ సమయంలోనే కార్న్‌స్టార్చ్ వేసి మరో రెండు నిమిషాలు సన్నని మంట మీద ఉంచి దించేయాలి. వేడి సూప్ రెడీ!

## కార్న్ గ్రిల్ సాండ్‌విచ్



**కావాల్సినవి :**

**స్వీట్‌కార్న్ :** ఒక కప్పు
**మిరియాల పొడి :** ఒక టీస్పూన్
**చీజ్ :** అర కప్పు
**బ్రెడ్ స్లైసెస్ :** 4
**మయనీస్ :** అర కప్పు
**బటర్ :** అర కప్పు
**ఉప్పు :** తగినంత

**తయారీ :**

**స్టెప్ 1 :** కడాయిలో బటర్ వేసి స్వీట్ కార్న్, మిరియాల పొడి, ఉప్పు వేసి రెండు నిమిషాల పాటు వేయించాలి.
**స్టెప్ 2 :** దీన్ని ఒక గిన్నెలోకి తీసుకొని ఇందులో చీజ్ వేసి బాగా కలుపాలి. ఇప్పుడు బ్రెడ్ స్లైస్‌ని తీసుకొని మయనీస్ అప్లయ్ చేయాలి.
**స్టెప్ 3 :** దీని మీద కార్న్ స్టఫ్ పెట్టాలి. పై నుంచి మళ్లీ కాస్త చీజ్ వేయాలి. ఇప్పుడు మరో బ్రెడ్ స్లైస్ పెట్టి పై నుంచి బటర్ వేయాలి.
**స్టెప్ 4 :** ఈ బ్రెడ్ ముక్కలని బ్రెడ్ టోస్టర్‌లో పెట్టి 2 నుంచి 3 నిమిషాలు గ్రిల్లింగ్ చేయాలి. వీటిని త్రిభుజాకారంలో కట్ చేసి లాగించేస్తే ఆ టేస్టే వేరు.



సంజయ్ తుమ్మ
సెలబ్రిటీ చెఫ్

## కార్న్ సర్వపిండి



**కావాల్సినవి :**

**కార్న్ :** ఒక కప్పు
**అల్లం :** చిన్న ముక్క
**జీలకర్ర :** పావు టీస్పూన్
**పచ్చిమిరపకాయలు :** 4
**బియ్యం పిండి :** పావు కప్పు
**ఉల్లి ఆకు ముక్కలు :** ఒక కప్పు
**కొత్తిమీర :** ఒక కట్ట
**క్యారెట్ తురుము :** 2 టేబుల్‌స్పూన్స్
**ఉల్లిపాయ ముక్కలు :** ఒక కప్పు
**నూనె :** 2 టీస్పూన్స్
**ఉప్పు :** తగినంత

**తయారీ :**

**స్టెప్ 1 :** కార్న్, అల్లం ముక్కలు, జీలకర్ర, పచ్చిమిర్చి అన్నీ కలిపి మిక్సీలో వేసి పేస్ట్‌లా చేసుకోవాలి.
**స్టెప్ 2 :** దీన్ని ఒక గిన్నెలో వేసుకొని బియ్యం పిండి, ఉప్పు, ఉల్లిపాయ ముక్కలు, ఉల్లి ఆకు, కొత్తిమీర, క్యారెట్, కొన్ని నీళ్లు పోసి బాగా కలుపాలి.
**స్టెప్ 3 :** ఒక గిన్నె తీసుకొని కొద్దిగా నూనె పోసి గిన్నె మొత్తం రాయాలి. ఇప్పుడు పిండిని తీసుకొని ఆ గిన్నె అచ్చు ఎలా ఉంటుందో అలా మొత్తం ఒత్తాలి. మధ్యలో చిన్న చిన్న రంధ్రాలు చేయాలి.
**స్టెప్ 4 :** ఈ గిన్నెను స్టౌ మీద పెట్టి సన్నని మంట మీద పది నిమిషాల పాటు ఎర్రగా కాల్చుకోవాలి. అంతే.. టేస్టీ సర్వ పిండి మీ ముందుంటుంది.



## అరటితో మెరుపు

**సీజన్‌తో సంబంధం లేకుండా దొరికే పండు అరటి. అరటిలో ఆరోగ్యాన్నిచ్చే లక్షణాలెన్నున్నాయో అందాన్ని రెట్టింపు చేసే లక్షణాలు కూడా అన్నే ఉన్నాయి. అరటి పండును ఉపయోగించి అందాన్ని రెట్టింపు చేసుకోండి.**

- సగం అవెకాడో ఫ్రూట్, సగం అరటి గుజ్జు తీసుకోవాలి. ఈ మిశ్రమాన్ని కలిపి ఒక పేస్ట్ లాగా అయిన తర్వాత దానిని ముఖానికి పట్టించి, 15 నిమిషాల తర్వాత ముఖాన్ని గోరు వెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి.
- అరటి పండు సగం తీసుకుని గుజ్జుగా చేసుకోవాలి. ముఖాన్ని శుభ్రంగా కడిగిన తర్వాత(సబ్బుతో కడగవద్దు) పొడి బట్టతో శుభ్రం చేసుకోవాలి. తరువాత అరటి పండు మిశ్రమాన్ని మీ ముఖంపై రాయాలి. 15 నిమిషాల తర్వాత గోరు వెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి.
- సగం అరటి పండు గుజ్జు, 1 టేబుల్ స్పూన్ తేనె తీసుకుని ఈ మిశ్రమాన్ని మీ ముఖానికి, మెడకు పట్టించి 15 నిమిషాల తర్వాత గోరు వెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. తరువాత ఒక మెత్తటి గుడ్డతో మీ ముఖాన్ని తుడుచుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి.
- ఒక అరటి పండు, 1 టేబుల్ స్పూన్ తేనె, 1 టేబుల్ స్పూన్ నిమ్మరసం తీసుకోవాలి. ఈ మూడింటిని ఒక గిన్నెలో వేసి బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. 15–20 నిమిషాల తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకుంటే మచ్చలు తొలిగిపోతాయి. ఇలా క్రమం తప్పకుండా వారం రోజులు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.
- సగం అరటిపండును గుజ్జుగా చేసుకోవాలి. చిన్న గిన్నెలో సగం ఉడికించిన ఓట్మీల్, 1 స్పూన్ చక్కెర, 1 గుడ్డులోని పచ్చ సొన తీసుకుని గిన్నెలో వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. 20 నిమిషాల తర్వాత చల్లని నీటితో శుభ్రం చేస్తే నిగారించే చర్మం మీ సొంతమవుతుంది.

## పారిశుద్ధ్య కార్మికులకు అండగా..

**వర్షాకాలం మొదలవ్వడంతో డ్రైనేజ్‌లో చెత్తచెదారం ఇరుక్కుపోకుండా మున్సిపాలిటీ కార్మికులు ఎప్పటికప్పడు శుభ్రపరుస్తుంటారు. మురికిలో చేతులు, కాళ్లు పెట్టడం వల్ల అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. వీరిని అనారోగ్యం నుంచి కాపాడేందుకు ఓ యువతి ముందుకొచ్చింది.**

కొన్ని ఏరియాలు చూడడానికి చాలా శుభ్రంగా ఉంటాయి. వాటికి కారణం డ్రైనేజ్ సమస్య ఉండకపోవడం. ముంబైలో ఇప్పుడు వరదలు పోటెత్తుతున్నాయి. దాంతో చెత్తచెదారం ఎక్కడికక్కడ పేరుకుపోయి డ్రైనేజ్‌లు మూసుకుపోతున్నాయి. వీటిని శుభ్రం చేసేందుకు పారిశుద్ధ్య కార్మికులు రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. ముంబైకి చెందిన సంజన ఒకరోజు స్కూల్‌కు వెళ్తుండగా ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులు డ్రైనేజ్‌లో చేతులు పెట్టి మురికిని తొలిగించడం చూసింది. వారి చేతులకు గ్లౌవ్స్, కాళ్లకు బూట్లు ఏమీ లేవు. ఇలా చేయడం వల్ల మలేరియా, డెంగ్యూ, వైరల్ జ్వరాలు వచ్చే ప్రమాదం ఉన్నదని అనిపించింది సంజనకి. వీరిలాంటి ఎంతోమంది ఇలాగే పని చేస్తున్నప్పుడు వారి ఆరోగ్య పరిస్థితేంటని ఆలోచనలో పడింది. వారిని అనారోగ్యం నుంచి ఎవరూ కాపాడలేరా? అనే ఆలోచనతో ఇంటర్నెట్‌లో వెతుకులాట మొదలుపెట్టింది. సంజన




అన్నయ్య 'క్లీనప్ ఫౌండేషన్' ఎన్‌జీవోలో పనిచేస్తున్నాడు. ఎన్జీఓ నుంచి సహాయం తీసుకొని నిధుల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. చెత్త ఏరుకునే వాళ్లకు సరైన గృహ సదుపాయలుండవు. వర్షాకాలంలో వారి నివాసాలు నీటితో నిండి మరింత అనారోగ్యానికి గురి చేస్తాయి. సంజన తల్లిదండ్రుల సాయంతో అందరి దగ్గర రూ. 80,000 వరకు వసూలు చేసి వారికి వైద్యం చేయించింది. ఇప్పుడు చెత్తలో పనిచేసే 200 మంది పనివాళ్లకు రెయిన్‌కోట్స్, గమ్ బూట్లు రెండు వారాల్లో అందజేసింది. 27 మే 2019న బాంద్రా కార్యాలయంలో ఈ ఉచిత భద్రతా సామగ్రిని అంజనా అందజేసింది. అంతే కాకుండా వారికి మెడికల్ ఇన్సూరెన్స్ ఇప్పించే దిశగా సంజన పనిచేస్తున్నది.

## మోకాళ్ల నొప్పులు మాయం

**మనం ప్రతిరోజు వంటకాల్లో చింత పండును ఉపయోగిస్తాం. దానిలోని గింజల్ని తీసి పారేస్తుంటాం. చింతపండు వల్ల మాత్రమే కాకుండా చింత గింజలతో కూడా మనకు ఎన్నో ప్రయోజనాలున్నాయి. ఈ చిన్న టిప్స్ పాటిస్తే చింత గింజలతో ఆరోగ్యాన్ని పొందవచ్చు.**



- పుచ్చులు లేని చింత గింజల్ని పెనంపై బాగా వేయించుకుని మంచి నీటిలో రెండు రోజుల పాటు నానబెట్టాలి. ప్రతి రోజు రెండు పూటలా నీటిని మారుస్తూ ఉండాలి. ఇలా నానిన చింత గింజలను పొట్టు తీసేసి మెత్తగా పొడిచేసి గాజు సీసాలో నిల్వ ఉంచుకోవాలి. చింత గింజల పొడిని రోజుకు రెండుసార్లు అరటీస్పూన్ చొప్పున పాలు లేదా నీటితో నెయ్యి లేదా చక్కెర కలిపి తీసుకోవాలి.
- చింతగింజల చూర్ణం కీళ్ల నొప్పులకే కాకుండా డయేరియా, డయాబెటిస్, గొంతులో ఇన్ఫెక్షన్లు ఇంకా దంత సమస్యలకు బాగా పనిచేస్తుంది. క్రమం తప్పకుండా చింతగింజల చూర్ణం తీసకుంటే నెలలోపే ఫలితం కనిపిస్తుంది.
- చింత గింజలు బాగా ఎండబెట్టి పొడిచేయాలి. ఒక గ్లాసు గోరు వెచ్చని నీటిలో కొద్దిగా చింతకాయ విత్తనం పొడి కలిపి మౌత్ వాష్‌లా ఉపయోగిస్తే నోటి దుర్వాసన పోతుంది. ఇందులో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి గొంతు నొప్పిని, జలుబును తగ్గిస్తాయి.
- చింతగింజల జ్యూస్‌తో అజీర్ణం సమస్యను పూర్తిగా పరిష్కరించవచ్చు. చింతగింజల జ్యూస్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. గింజల పైన ఉండే రెడ్ కలర్ కోట్‌లో జిలోగ్లూక్యాన్ ఉంటుంది. ఇది డయేరియాను నివారిస్తుంది.
- కొన్ని చింతగింజల్ని వేయించి పొడి చేసుకుని ఒక గ్లాసు నీటిలో కలుపుకుని రోజూ రెండు పూటలు తాగితే కీళ్ల నొప్పులు తగ్గుతాయి. ఆర్థరైటిస్ లక్షణాల నుంచి ఉపశమనం కలుగుతుంది. చింతగింజల్లో అన్ శ్యాచురేటెడ్ ఫ్యాట్, పొటాషియం ఎక్కువగా ఉంటాయి. ఇది గుండెను భద్రంగా ఉంచుతుంది.

## వంటింటి చిట్కాలు



- ఫ్రిజ్ నుంచి దుర్వాసన వస్తుంటే.. చిన్న కప్పులో నిమ్మకాయ ముక్క ఉంచి ఫ్రిజ్‌లో పెడితే తక్షణమే దుర్వాసన పోతుంది.
- కొందరు దోశలు పోసుకొని పెనంను శుభ్రం చేసుకోరు. దీనిపై కొంచెం ఉప్పు చల్లి చిన్న నిమ్మచెక్కతో రుద్ది కడుగాలి. ఆ తర్వాత పొడిబట్టతో తుడువాలి.
- ఇంట్లో పురుగులు, చీమలు, కీటకాలు ఎక్కువగా వస్తుంటే.. ఆ ప్రాంతంలో కొన్ని నిమ్మచెక్కలను ఉంచితే సరి.
- వంటింట్లో పాడైపోయిన కూరగాయలు, వంట తాలూకు చెడు వాసన వస్తే, గిన్నె నిండా నీరు నింపి అందులో నిమ్మ చెక్కలను వేసి మరిగించుకోవాలి. నీరు మరిగాక వాటి నుండి సువాసన వెదజల్లుతుంది.
- కడాయి, పొయ్యి వంటి వాటిలో నూనె మరకలు ఎక్కువగా ఉంటాయి. వాటిని తొలిగించడానికి నిమ్మచెక్క వాడితే సరిపోతుంది.

నమస్తే తెలంగాణ

విశేష

[ కరీంనగర్ ]

గురువారం 11 జూలై 2019

# ఐస్‌క్రీమ్ తింటే జరిమానా!




**ఐస్‌క్రీమ్ తింటే జరిమానా నా? వినడానికి కాస్త విచిత్రంగా ఉన్నా ఇది వాస్తవం. ఒక్క జరిమానాతోనే విడిచి పెట్టరు, కారాగారానికి కూడా పంపుతారు. ఓ యువతి చేసిన పనికి పోలీసులు చట్ట ప్రకారం ఇలా వ్యవహరించారు. ఇంతకీ ఆ అమ్మాయి ఏం చేసిందో తెలుసా?**

టెక్సాస్ లుఫ్కిన్‌లోని వాల్‌మార్ట్‌లో ఓ యువతి ఐస్‌క్రీమ్‌ను నాలుకతో టచ్ చేసి వదిలేసింది.'బ్లూ బెల్' అనే ఐస్‌క్రీమ్ కంపెనీ తమ ఉత్పత్తులను ఆ మాల్‌లోని ఫ్రిజ్‌లో ఉంచింది. సరదాగా మాల్‌కు వచ్చిన ఓ యువతి ఫ్రిజ్‌లోని ఐస్‌క్రీమ్ టబ్ మూత తీసి రుచి చూసి అక్కడే వదిలేసింది. ఆ యువతి స్నేహితురాలు ఈ వ్యవహారాన్నంతటినీ ఫోన్‌లో చిత్రీకరించింది. ఆమె తీసిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఆ వీడియో వైరల్‌గా మారింది. చివరకు 'బ్లూ బెల్' ఐస్ క్రీమ్ సంస్థ యాజమాన్యానికి ఈ విషయం తెలిసింది. దీంతో ఆ యువతి ఐస్‌క్రీమ్‌ను నాలుకతో టచ్ చేయడం వల్ల తమ బ్రాండ్ దెబ్బతిన్నదని పోలీసులకు ఫిర్యాదు చేసింది ఆ సంస్థ. దీంతో ఆ వీడియోలో ఉన్న యువతి కోసం పోలీసులు గాలించి, అదుపులోకి తీసుకున్నారు. సాధారణంగా ఇటువంటి నేరాలు చేసిన వారెవరికైనా టెక్సాస్ స్టేట్ పీనల్ కోడ్ ప్రకారం రూ.6,86,910 జరిమానాతోపాటు రెండు నుంచి 20 ఏండ్ల పాటు జైలు శిక్ష పడుతుందని అధికారులు చెబుతున్నారు.

# ఆమె ఒళ్లంతా ప్లాస్టిక్!



**ఆమెకు ప్లాస్టిక్ సర్జరీలు చేయించుకోవడం ఒక వ్యసనం. ద్వారా తాత్కాలికంగా మంచి ఫలితాలు కనిపించినా, భవిష్యత్‌లో అనేక దుష్పరిణామాలు ఎదురవనున్నాయి.. అయినా మరి ఆమె ఇదంతా ఎందుకు చేస్తున్నది?**

అమెరికాలోని వర్జీనియాకు చెందిన ఐటీ స్పెషలిస్టు క్రిస్టెన్ స్నిడర్. ఆమె తన శరీర ఆకృతులను మార్చుకునేందుకు తరచూ ప్లాస్టిక్ సర్జరీ చేసుకుంటున్నది. క్రిస్టెన్ స్కూల్లో ఉన్నప్పుడు ఆమెను కొంగముక్కు అని స్నేహితులంతా ఆటపట్టించేవారు. అప్పుడు ఆమె చాలా బాధపడిందట. ఆ తర్వాత కొన్ని రోజులకు ముక్కు, తదితర అవయవాలన్నీ ప్లాస్టిక్ సర్జరీ ద్వారా మార్చుకోవచ్చని తెలుసుకుంది. అయితే ప్లాస్టిక్ సర్జరీలకు అధిక మొత్తంలో డబ్బు ఖర్చు అవుతుందని తెలిసింది. భవిష్యత్‌లో మంచి ఉద్యోగంలో చేరాక ముక్కుకు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవాలని నిర్ణయించుకున్నది. 2010లో ఐటీ విభాగంలో భారీ వేతనంతో ఉద్యోగంలో చేరింది క్రిస్టెన్. అయితే తన మొదటి నెల వేతనంతోనే ముక్కుకు ప్లాస్టిక్ సర్జరీ చేసుకుంది. అప్పటి నుంచి శరీరంలోని వివిధ భాగాలకు సర్జరీ చేయించుకుంటూనే వస్తున్నది. ఇప్పటి వరకు రూ. 1.28 కోట్లు ఖర్చుచేసి దాదాపు అన్ని శరీర భాగాల ఆకృతులను మార్చుకున్నది. 'నేను నా శరీరాన్ని క్యాన్వస్‌గా భావిస్తాను. నా ఆకృతులను మార్చుకునేందుకు ప్లాస్టిక్ సర్జరీని కుంచెలా భావిస్తాను' అని క్రిస్టెన్ చెబుతున్నది. ఒళ్లంతా ప్లాస్టిక్ సర్జరీలతో ప్రాణాలపైకి తెచ్చుకుంటుందని ఆమె కుటుంబీకులు భయాందోళన చెందుతున్నారు.

# విజ్ఞానాన్నందిస్తున్నది!



**ఓ చిన్నారి ఉచితంగా విజ్ఞానం అందించేందుకు గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. తానే లైబ్రరీ నిర్వహణ చూసుకుంటూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నది. విశేషమేమిటంటే నాలుగువేల పుస్తకాలతో విజ్ఞానాన్ని అందిస్తున్నది.**

కేరళలోని కొచ్చికి చెందిన 12 ఏండ్ల యశోద ఏడోతరగతి చదువుతున్నది. అందరికీ విజ్ఞానాన్ని అందించాలనుకున్నది. అనుకున్నదే తడవుగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. చిన్నప్పటి నుంచి యశోదకు పుస్తకాలు చదవడమంటే చాలా ఇష్టం. ఆమె తన తండ్రి, సోదరులతో కలిసి గ్రంథాలయానికి వెళ్లడం అలవాటయింది. పుస్తకాల కోసం తన తండ్రి డబ్బులు కట్టడం చూసి ఆశ్చర్యపోయింది. ఉచితంగా పంచాల్సిన విజ్ఞానాన్ని డబ్బులకు అమ్ముకోవడాన్ని తప్పుబట్టింది. చదువుకోవాలని ఉన్నా ఆర్థికస్థోమత లేని వారి పరిస్థితి ఏమిటని ఆలోచించింది. ఇదే విషయాన్ని సీరియస్‌గా తీసుకుని తండ్రికి చెప్పింది. తాను ఓ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సోషల్ మీడియాలో వెల్లడించింది. లైబ్రరీకి డబ్బు సాయం చేయమని స్నేహితులను కోరింది. అయినవాళ్లనూ అడిగింది. అలా వచ్చిన విరాళాలతో తన ఇంటిలో ఓ గదిని గ్రంథాలయంగా మార్చేసింది. యశోద లైబ్రరీలో ఇంగ్లీష్, మలయాళం, హిందీ, తమిళం, కొంకణితోపాటు పలు భాషల్లో ముఖ్యమైన పుస్తకాలను ఉంచింది. దాదాపు నాలుగు వేల పుస్తకాలు సేకరించింది. ప్రతి రోజూ స్కూల్‌కు వెళుతూనే ఖాళీ సమయాల్లో గ్రంథాలయ బాధ్యతలు నిర్వర్తిస్తున్నది.






# నేను రావట్లే బిగ్‌బాస్!

**బిగ్‌బాస్ సీజన్**-3 ప్రారంభానికి ముందే హాట్ టాపిక్‌గా మారింది. మొదటి సీజన్ ఫర్వాలేదనిపించినా.. రెండో సీజన్ వివాదాలకు వేదిక అయింది. అయితే బిగ్‌బాస్ మూడో సీజన్‌పై జనాల్లో ఆసక్తి పెరిగింది. కారణం సోషల్ మీడియా. ఫలానా సెలబ్రెటీలు పాల్గొంటున్నారంటూ పుకార్లు వస్తుండడంతో.. జనాల్లో రోజు రోజుకూ ఉత్కంఠ పెరిగిపోతున్నది. అయితే సోషల్‌మీడియాలో వస్తున్న పుకార్లపై సెలబ్రెటీలు ఏమంటున్నారో తెలుసా?

బిగ్‌బాస్ రెండో సీజన్ ముగిసిన దగ్గర్నుంచి.. మూడో సీజన్ ప్రారంభం వరకూ ఎవరికి నచ్చిన విధంగా వాళ్లు రాసుకుంటూ వెళుతున్నారు. బిగ్‌బాస్-3కి హోస్ట్‌గా చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్, దగ్గుబాటి రాణా, నానీ, వెంకటేష్, విజయ్‌దేవరకొండ వంటి వారి పేర్లు వినిపించాయి. ఇటీవలే నాగార్జునను ఫైనల్ చెయ్యడంతో ఆ రూమర్స్‌కు బ్రేక్ పడింది. ఈ క్రమంలో బిగ్‌బాస్ ఇంటి సభ్యులుగా ఎవరెవరు ఉంటారనేదానిపై అధికారికంగా స్పష్టత లేకపోయినప్పటికీ.. ఈ పుకార్లు మాత్రం ఆగడం లేదు.

**ట్రెండింగ్ స్టార్ అయితే చాలు....**

బిగ్‌బాస్ షోలో పాల్గొనేవాళ్లు సోషల్ మీడియాలో ట్రెండింగ్ స్టార్ అయితే చాలు ఇక వారికి అర్హత ఉన్నట్టే. వీటిలోనూ పలు విభాగాలున్నాయి. కొంతమందిని బుల్లితెర నటులను, గాయినీ, గాయకులు సినిమా స్టార్లు, క్రీడా రంగానికి చెందిన వారు ఉన్నారు. ఇతర విభాగాల నుంచి కూడా మరి కొందరిని బిగ్‌బాస్ త్రీ షోకు ఎంపిక చేస్తారు. వంద రోజుల పాటు కొనసాగే ఈ షోలో భార్యాభర్తలను పంపిస్తే వాళ్లు చేసే ప్రతీ పని ఆసక్తికరంగా ఉంటుంది. వరుణ్ సందేశ్ ఆయన భార్య వితిక ఈ సారి బిగ్‌బాస్ హౌజ్‌లోకి ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉన్నదని పుకార్లొస్తున్నాయి. ఈ బిగ్‌బాస్-3కి కామన్‌మ్యాన్‌తో సంబంధం లేకుండా దాదాపు 40మంది సెలబ్రెటీల పేర్లు సోషల్‌మీడియాలో వినిపించాయి.

నా కవల పిల్లలు భూమి ఆరాధ్యా, యువి నక్షత్ర.. వీళ్లే నా ప్రపంచం. వారి పట్ల అంకితభావంతో ఉన్నాను. వీరికోసం ఎన్నో ఆఫర్స్ వదులుకున్నా. వాళ్లకంటే నాకేవీ ఎక్కువ కాదు'. అని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు ఉదయభాను.


ఉదయభాను

'నేను బిగ్‌బాస్-3 కి వెళ్లడం లేదు. న్యూస్ చానెల్స్, వెబ్ పేజీల వారికి నేను చెప్పేది ఒక్కటే. మీరు రాసేవన్నీ ఫన్ అయితే బాగుంది. కానీ మరీ ఎక్కువగా ఆలోచించి ఎంత పేమెంట్ చేస్తున్నారో కూడా రాస్తున్నారు. ఇకచాలు. దయచేసి ఇలాంటివి ఆపండి. కృతజ్ఞతలు' అని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తన అభిప్రాయాన్ని చెప్పారు హేమ చంద్ర.

'నన్ను ప్రతి సీజన్‌కు అప్రోచ్ అయ్యారు. కానీ నాకు ఢీ జోడీ, ఎక్స్‌ట్రా జబర్దస్త్‌లతో చాలా పాపులారిటీ వచ్చింది. దాని వల్ల బిగ్ బాస్ వంటి షోలకు వెళ్లలేకపోతున్నా' అని ఓ ఇంటర్వ్యూలో రష్మీ చెప్పారు.


హేమచంద్ర

'తెలుగు బిగ్‌బాస్-3లో నా ప్రమేయం లేదు. మీ పీఆర్ కోసం దయచేసి నా పేరును వాడుకోవద్దు.' అని జూన్ 25న ట్వీట్ చేశారు శోభిత.

నాకు బిగ్ బాస్ ఎవరూ లేరు. ఆ రూమర్లన్నీ అవాస్తవాలు' అని మే 25న ట్వీట్ చేశారు.

'నేను బిగ్‌బాస్‌లో పాల్గొనడం లేదు. ఇలాంటి సమాచారం ఎక్కడి నుంచి తీసుకొస్తారో తెలియదు. ఇంతకు ముందు కూడా ఓ ఇంటర్వ్యూలో చెప్పాను.. నేను బిగ్‌బాస్‌కి సూటబుల్ పర్సన్‌ని కాదు'. అని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా చెప్పారు రేణూదేశాయ్.


గుత్తా జ్వాలా

శోభితా ధూళిపాళ

రష్మీ గౌతమ్

రేణూదేశాయ్

**బిగ్‌బాస్-3కి వెళ్తున్నట్లు వినిపించిన పేర్లు..**

• బండ్ల గణేశ్ • నాగబాబు కొణిదల • శ్రీరెడ్డి • రేణూదేశాయ్ • కేఏ పాల్ • శ్రీముఖి • యాంకర్ ప్రదీప్ • యాంకర్ రవి • తీన్మార్ సావిత్రి • బిత్తిరిసత్తి • ఉప్పల్ బాలు • యాంకర్ సుమ • యాంకర్ లాస్య • రష్మీ గౌతమ్ • ఉదయభాను • గుత్తా జ్వాలా • సుడిగాలి సుధీర్ • గెటప్ శ్రీను (జబర్దస్త్) • హేమ చంద్ర • శోభితా దూళిపాళ్ల • సన్నీ (సీరియల్ ఆర్టిస్ట్) • వరుణ్ సందేశ్, అతని భార్య వితికా షేరు • పునర్నవి భూపాలం (ఆర్టిస్టు) • హేమ (క్యారెక్టర్ ఆర్టిస్టు) • రాహుల్ సిప్లిగంజ్ (గాయకుడు) • జాకీ (సీరియల్ నటుడు) • రవికృష్ణ (డాన్స్‌జోడీ) • వైవా హర్ష • జాహ్నవి (మహాతల్లి ఫేం) • రఘు (డాన్స్ మాస్టర్) • కమల్ కామరాజు • నరేశ్ (జబర్దస్త్) • చైతన్య కృష్ణ (హీరో) • మనోజ్ నందన్ • గద్దె సింధూర • జ్యోతి (వెబ్ మీడియా) • నాగపద్మిని • వేణు (యాక్టర్) • రేవంత్ సింగర్ • హరిత (టీవీ నటి) • కరాటే కల్యాణి. బిగ్‌బాస్‌లో ఇంటి సభ్యులుగా వెళ్తున్న వారిపై.. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలకు కొంతమంది సెలబ్రెటీలు సోషల్ మీడియా వేదికగా స్పందించారు.

## ట్వీట్



అనిల్ రావిపూడి
@AnilRavipudi

'సరిలేరు నీకెవ్వరు' అని కదిలొస్తూ కశ్మీర్‌లో ఆపరేషన్ స్టార్ట్ చేయడానికి అజయ్ కృష్ణగా వస్తున్నారు సూపర్‌స్టార్ మహేశ్‌బాబు.




అనిల్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నవారి సంఖ్య

876429

## కామన్‌మ్యాన్ వాయిస్

మధ్యాహ్న భోజనంలో రాగి ముద్ద పెట్టాలని విద్యాశాఖ ప్రతిపాదనలకు మోక్షం కలిగి.. దానికి తోడుగా పజ్జొన్న సంకటి కూడా పెడితే రైతులకు కూడా చేయూత ఇచ్చినట్లు అవుతుంది కదా?

– Burra Manohar Goud

జ్ఞాపకం, ఆశ అన్నవే మనిషిని జంతువు నుంచి వేరు చేస్తాయి. అవే చాలాసార్లు మనిషిని జంతువులకన్నా అల్పంగా, అర్భకంగా మారుస్తాయి!

– Bhargava Bhargava

డబ్బు ఇచ్చి సుఖాన్ని కొనగలుగుతాం. కానీ అందులోని సంతోషాన్ని కొనలేం!

– Madharam Parshuram

## వైరల్ వీడియో




**అక్షయ్ కుమార్, విద్యా బాలన్, సోనాక్షి సిన్హా, తాప్సీ వంటి హేమాహేమీలు నటించిన 'మిషన్ మంగళ్' అఫీషియల్ ట్రైలర్ యూట్యూబ్‌లో హల్‌చల్ చేస్తున్నది.**

Mission Mangal | Official Teaser | Akshay | Vidya | Sonakshi | Taapsee | Dir:Jagan Shakti | 15th Aug

Total views : 3,986,106+

Published on Jul 8, 2019

## సుడోకు

డైలీ సుడోకు 87 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 2 | 9 | 6 | 4 | 5 | 3 | 1 | 7 |
| 5 | 7 | 1 | 9 | 2 | 3 | 8 | 6 | 4 |
| 6 | 4 | 3 | 8 | 7 | 1 | 5 | 9 | 2 |
| 4 | 5 | 6 | 7 | 9 | 2 | 1 | 3 | 8 |
| 7 | 1 | 8 | 3 | 5 | 6 | 4 | 2 | 9 |
| 9 | 3 | 2 | 4 | 1 | 8 | 7 | 5 | 6 |
| 2 | 6 | 7 | 5 | 3 | 4 | 9 | 8 | 1 |
| 1 | 9 | 5 | 2 | 8 | 7 | 6 | 4 | 3 |
| 3 | 8 | 4 | 1 | 6 | 9 | 2 | 7 | 5 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

### డైలీ సుడోకు -88

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 8 | | | | | 4 | | |
| 4 | | 1 | | 5 | 7 | | | 3 |
| | | 6 | 3 | 4 | | | | 1 |
| 1 | | | | 8 | | 9 | | |
| 3 | | | 5 | | 4 | | | 8 |
| | | 8 | | 2 | | | | 5 |
| 6 | | | | 7 | 9 | 5 | | |
| 5 | | | 2 | 6 | | 8 | | 9 |
| | | 9 | | | | | 2 | |

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం

## కొచ్చిన్ షిప్‌యార్డులో

**కొచ్చిన్ షిప్‌యార్డులో ప్రాజెక్టు ఆఫీసర్, మేనేజర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

COCHIN SHIPYARD LTD

- **పోస్టు:** ప్రాజెక్టు ఆఫీసర్
- ఈ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తారు.
- **ఖాళీల సంఖ్య**- 11
- **విభాగాలవారీగా ఖాళీలు:** మెకానికల్-6, ఎలక్ట్రికల్-3, ఇన్‌స్ట్రుమెంటేషన్-1.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 30
- **పోస్టు:** మేనేజర్లు
- ఖాళీలు- 9
- **విభాగాల వారీగా ఖాళీలు:** అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (మెకానికల్)-1, డిప్యూటీ మేనేజర్ (మెకానికల్)-5, డిప్యూటీ మేనేజర్ (ఎలక్ట్రికల్)-2, డిప్యూటీ మేనేజర్, (వెపన్స్)-1 ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 14
- **వెబ్‌సైట్:** www.cochinshipyard.com

## హెచ్‌డీఎఫ్‌సీలో కొలువులు

**హెచ్‌డీఎఫ్‌సీ ఫ్యూచర్ బ్యాంకర్ పోస్టుల భర్తీకి నిర్వహించే పీజీడిప్లొమా ప్రోగ్రామ్ ప్రవేశ ప్రకటన విడుదల చేసింది.**

- **పోస్టు:** ఫ్యూచర్ బ్యాంకర్
- **ఎంపిక:** ఏడాది కాలవ్యవధిగల పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా శిక్షణను ఇచ్చి దానిని విజయవంతంగా పూర్తిచేసినవారికి ఉద్యోగావకాశాన్ని సంస్థ కల్పిస్తుంది.
- **ప్రోగ్రామ్ వివరాలు:** ఆరునెలలు రెసిడెన్షియల్ శిక్షణనిస్తారు. ఈ సమయంలో నెలకు రూ.5,500/- స్టయిఫండ్‌నిస్తారు. ఆ తర్వాత మూడునెలలు ఇంటర్న్‌షిప్ చేస్తున్న సమయంలో నెలకు రూ.10,000/- ఇస్తారు. ఆ తర్వాతి మూడునెలలు బ్యాంకులో శిక్షణనిస్తూ నెలకు పదివేలు ఇస్తారు.
- శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్నవారికి పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ సేల్స్&రిలేషన్‌షిప్ బ్యాంకింగ్ సర్టిఫికెట్‌తోపాటు డిప్యూటీ మేనేజర్‌స్థాయిలో పర్సనల్ బ్యాంకర్ ఉద్యోగావకాశాన్ని హెచ్‌డీఎఫ్‌సీ కల్పిస్తుంది.




- బెంగళూరులోని మణిపాల్ ఎడ్యుకేషన్ క్యాంపస్‌లో ఆరునెలల శిక్షణనిస్తారు. తర్వాత ఆరునెలలు దేశవ్యాప్తంగా ఉన్న ఏదైనా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఇంటర్న్‌షిప్, బ్యాంకు శిక్షణనిస్తారు.
- **అర్హతలు:** 2019, జూన్ 1 నాటికి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 21- 26 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా చేస్తారు.
- **ఆన్‌లైన్ టెస్ట్:** దీనిలో ఇంగ్లిష్ లాంగ్వేజ్, లాజికల్&క్వాంటిటేటివ్ ఎబిలిటీ, పర్సనల్ టెస్ట్, సేల్స్ ఆప్టిట్యూడ్‌పై ప్రశ్నలు ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్:** https://futurebankers.myamcat.com

## జేఎన్‌టీయూ డబుల్ డిగ్రీ ప్రోగ్రామ్

**హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ, స్వీడన్‌లోని బ్లెకింగి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీటీహెచ్) సంయుక్తంగా అందిస్తున్న ఇంటిగ్రేటెడ్ డబుల్ డిగ్రీ మాస్టర్స్ ప్రోగ్రామ్ (ఐడీడీఎంపీ) ప్రవేశ ప్రకటన విడుదలైంది.**

- కోర్సు: ఇంటిగ్రేటెడ్ డబుల్ డిగ్రీ మాస్టర్స్ ప్రోగ్రామ్ (ఐడీడీఎంపీ)
- **విభాగాలు:** ఈసీఈ -30 సీట్లు, సీఎస్‌ఈ - 40 సీట్లు
- బీటెక్ (ఈసీఈ), ఎంటెక్ (టెలీకమ్యూనికేషన్ సిస్టమ్స్)ను జేఎన్‌టీయూహెచ్, ఎమ్మెస్సీ(టెలీకమ్యూనికేషన్ సిస్టమ్స్)న బీటీహెచ్ స్వీడన్ అందిస్తాయి.
- బీటెక్ (సీఎస్‌ఈ), ఎంటెక్ (సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్)ను జేఎన్‌టీయూహెచ్, ఎమ్మెస్సీ (సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్)ను బీటీహెచ్, స్వీడన్ అందిస్తాయి.
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో ఇంటర్ ఉత్తీర్ణత. ప్రవేశ సమయానికి 16 ఏండ్లు



నిండి ఉండాలి.

- **ఎంపిక విధానం:** జేఈఈ మెయిన్స్-2019 ర్యాంకు ఆధారంగా 50 శాతం సీట్లను, టీఎస్-ఎంసెట్-2019 ర్యాంకు ఆధారంగా 50 శాతం సీట్లను భర్తీ చేస్తారు.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- **చివరితేదీ:** జూలై 13
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.1500/-
- **అడ్మిషన్ల కౌన్సెలింగ్ తేదీ:** జూలై 18
- **కౌన్సెలింగ్ వేదిక:** డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్.
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

## ఏఐసీటీఈ 'ఎంబీఏ'

**ఎంబీఏ/పీజీడీఎం కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2019 ప్రకటనను ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) విడుదల చేసింది.**

- కోర్సు: ఎంబీఏ/పీజీడీఎం (ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ వెంచర్ డెవలప్‌మెంట్ -ఐఈవీ)
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 20
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్ ద్వారా
- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** జూలై 28
- **వెబ్‌సైట్:** www.aicte-india.org

## అసోసియేట్ ప్రొఫెసర్లు

**ఢిల్లీ టెక్నాలాజికల్ యూనివర్సిటీ (డీటీయూ)లో అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టు:** అసోసియేట్ ప్రొఫెసర్
- **మొత్తం ఖాళీలు** : 17
- **విభాగాల వారీగా ఖాళీలు:** మేనేజ్‌మెంట్ (డీఎస్ఎం)-2, మేనేజ్‌మెంట్ (యూఎస్ఎంఈ)-12, ఎకనామిక్స్ (యూఎస్ఎంఈ)-3 ఉన్నాయి.
- అర్హతలు, వయస్సు, ఎంపిక, జీతభత్యాల వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో జూలై 13 నుంచి ప్రారంభం
- **చివరితేదీ:** సెప్టెంబర్ 13
- **వెబ్‌సైట్:** www.dtu.ac.in

నమస్తే తెలంగాణ
# రైతుబడి
[ కరీంనగర్ ]
గురువారం 11 జూలై 2019



రాష్ట్రంలో సంవత్సరమంతా మిరపసాగుచేయబడుతుంది. వినియోగ అవసరాల దృష్ట్యా ఏడాది అంతా డిమాండు ఉంటుంది. కాబట్టి రాష్ట్రంలో మిరప ఎప్పుడూ ఎక్కువ విస్తీర్ణంలోనే సాగవుతున్నది. విస్తీర్ణ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలు కూడా అవసరమే. అయితే వర్షాధారంగా, సాగునీటి ఆధారంగా ఈ పంట సాగు చేయబడుతుంది. ముఖ్యంగా వర్షాధార ప్రాంతంలో సూటిరకాల సాగు అనువైనవి. కొంతమేరకు నీటి ఎద్దడిని కూడా తట్టుకునే సామర్థ్యం వీటికి ఉండటంతో వీటికి ఆదరణ పెరుగుతున్నది. కాబట్టి ఇప్పటికే ప్రభుత్వాలు విడుదల చేసిన, వివిధ వాతావరణ మండలాలలో పరీక్షించిన పలు సూటి మిరప రకాలు సాగులో ఉన్నాయి. వీటిలో రసంపీల్చే పురుగులను తట్టుకునేవి, నాణ్యమైన కాయలు, అధిక దిగుబడినిచ్చే రకాలు ఉన్నాయి. రైతులు సూటి రకాలను సాగు చేసేటప్పుడు తమకు కావలసిన విత్తనాన్ని సొంతంగా తామే విత్తనోత్పత్తి ద్వారా తయారుచేసుకోవచ్చు. రాష్ట్రంలో సాగు చేయబడుతున్న అన్ని సూటి రకాలలో విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. అయితే వేర్పాటు దూరం, కల్తీల ఏరివేత, విత్తనం ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్ల నియంత్రణలో తగిన జాగ్రత్తలు పాటిస్తే నాణ్యమైన అధిక విత్తనోత్పత్తి సాధ్యమౌతుంది.

# మిరపలో విత్తనోత్పత్తి

**మిరపలో** విత్తనోత్పత్తికి అనువైన వాతావరణం కావాలి. మిరప ఉష్ణ, ఉప-ఉష్ణ ప్రాంతాల్లో పెరుగుతుంది. సముద్రమట్టానికి 2000 మీటర్లఎత్తులోనూ పెరుగగలదు. 20-25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత మిరప ఉత్పత్తికి అనువైనది. అయితే ఈ పంట మంచును తట్టుకోలేదు. మధ్యస్థ వర్షాపాతంతో (60-120 సెం.మీ)లతో కూడిన వెచ్చని, ఆర్ధ వాతావరణం మొక్క పెరుగుదలకు అనువుగా ఉంటుంది. పొడి వాతావరణం కాయ పక్వానికి రావటానికి చాలా ఉపయోగపడుతుంది. 17-30 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో మొలక శాతం ఎక్కువగా ఉంటుంది. ప్రత్యేకంగా అధిక ఎండ తీవ్రతతో మిరపలో దిగుబడి పెరుగుతుంది. అయితే ఘాటు (కాప్సైసిన్ పాళ్లు) తగ్గుతుంది. కాయ రంగు కూడా తగ్గిపోతుంది. పూత అభివృద్ధి, కాయ ఏర్పడే దశలలో నేలలో తేమ తక్కువగా ఉంటే పూత, పిందె రాలుతుంది. కాయల పరిమాణం తగ్గిపోతుంది. ఉష్ణోగ్రత 37.8 డిగ్రీలు, అంతకంటే ఎక్కువగా ఉంటే కాయ అభివృద్ధి దారుణంగా పడిపోతుంది. అధిక రాత్రి ఉష్ణోగ్రతలతో కాప్సైసిన్ పాళ్లు పెరుగుతుంది.

### పూత లక్షణాలు, సంపర్కం

మిరపలో పూలు సంపూర్ణంగా ఉంటాయి. 2-10 గంటల మధ్య పొద్దుగాల పూట పూలు విచ్చుకుంటాయి. ఆ తర్వాత గంట వ్యవధిలో పుప్పొడిరేణువులు విడుదల అవుతాయి. 8-10 గంటల మధ్య వీటి విడుదల గరిష్ఠంగా ఉంటుంది. పూత వచ్చిన మొదటిరోజు కీలాగ్రం సంసిద్ధత, పుప్పొడి రేణువుల సామర్థ్యం గరిష్ఠంగా ఉంటాయి. అయితే వాతావరణ పరిస్థితులను బట్టిపూలు విచ్చుకోవటం, పుప్పొడి రేణువుల విడుదల ఆధారపడి ఉంటుంది.

### వేర్పాటు దూరం

మిరప తరచుగా పరపరాగ సంపర్కం చెందే పంట. దీనికితోడు కూర మిరపతో కూడా సంపర్కం చెందుతుంది. కాబట్టి మిరపలోని రకాలతో పాటు, కూర మిరప రకాలకు దూరంగా విత్తనోత్పత్తి చేపట్టాలి. ఫౌండేషన్ విత్తనానికి 500 మీటర్లు, ధృవీకరణ విత్తనానికి 250 మీటర్ల వేర్పాటు దూరం కచ్చితంగా పాటించాలి.

### నేలలు

కర్బన శాతం ఎక్కువగా ఉండి, మురుగునీరు పోయే సౌకర్యం ఉన్న ఇసుక, రేగళ్లు, నల్లరేగడి నేలలు మిరప పంట సాగుకు అనుకూలం. ఆమ్ల, క్షార నేలలు అనుకూలం కాదు.

### ఎరువులు

దుక్కి తయారీ సమయంలో ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్లు బాగా చివికిన పశువుల ఎరువును వేయాలి. అట్లనే 65 కిలోల నత్రజని, 30 కిలోల భాస్వరం, 30 కిలోల పొటాష్ పోషకాలను ఇచ్చే ఎరువులను వాడాలి. ఒక వంతు నత్రజని, సిఫార్సు మేరకు భాస్వరం, పొటాష్‌లను చివరిగా పొలం తయారప్పుడు వేయాలి. మిగతా నత్రజనిని ప్రధాన ప్రధాన పొలంలో మొక్కలు నాటిన ఆరు వారాల తర్వాత వేయాలి.

**విత్తన మోతాదు:** ఎకరానికి 400 గ్రాములు వాడాలి.
**విత్తేసమయం:** వానకాలంలో జూలై- ఆగస్టు, యాసంగిలో అక్టోబర్,- నవంబర్ నెలల్లో విత్తటం పూర్తిచేయాలి.

**విత్తనోత్పత్తి చేపట్టదగిన రకాలు:** పూసా జ్వాలా, భాగ్యలక్ష్మీ, ఆంధ్రజ్యోతి, సింధూర్, కిరణ్, అపర్ణ, భాస్కర్, ప్రకాశ్, స్థానికంగా సాగు చేస్తున్న ఇతర సూటి రకాలు.

### ప్రధాన పొలంలో నాటడం

5-6 వారాల వయసున్న నారును, బాగా దుక్కి చేసిన ప్రధాన పొలంలో 60X45 సెం.మీ దూరంలో నాటుకోవాలి. నారు మొక్కలు సేకరించే ముందే నారుమడిని తడుపాలి. సాయంత్రం వేళల్లో నాటాలి. నాటిన వెంటనే తేలికపాటి తడి ఇవ్వాలి. ప్రధానపొలంలో మొక్కలు నాటిన 4,5 రోజుల తర్వాత ఎక్కడైనా మొక్కలు చనిపోయి ఖాళీలు ఏర్పడితే వాటిని పూరించాలి. ఆ వెంటనే రెండవ తడి ఇవ్వాలి. మిరప వేళ్లు భూమి పైపొరల్లోనే ఉంటాయి. కాబట్టి తక్కువ వ్యవధుల్లో నీటి తడులివ్వాలి. వాతావరణాన్ని బట్టి వేసవిలో అయితే 4-7 రోజులు, చలికాలంలో అయితే 12-15రోజుల వ్యవధిలో నీటి తడులివ్వాలి. మంచు ఎక్కువగా పడుతున్నప్పుడు నీటి తడులిస్తే నేలలో తేమ ఉంటుంది. మిరప మందకొడిగా పెరుగుతుంది. కలుపుతో పోటీని తట్టుకోలేదు. కాబట్టి కలుపు నివారణ సమర్థవంతంగా చేపట్టాలి. ప్రధాన పొలంలో నాటిన 3-4 రోజులలోపు హెక్టారుకు ఒక కిలో పెండిమిథాలిన్ కలుపు మందును పిచికారీ చేసి కూడా రసాయన పద్ధతుల ద్వారా కలుపును నివారించవచ్చు.



| క్షేత్ర ప్రమాణాలు (గరిష్ఠంగా ఆమోదించదగినవి) | ఫౌండేషన్ విత్తనం | ధృవీకరణ విత్తనం |
|---|---|---|
| కల్తీలు- | 0.10 | 0.20 |
| విత్తన తెగుళ్లు ఆశించినవి | 0.10 | 0.50 |
| వైరస్ తెగుళ్లు ఆశించినవి | 0.50 | 2.00 |
| **విత్తన ప్రమాణాలు** | విత్తన తరగతి ఫౌండేషన్ విత్తనం | ధృవీకరణ విత్తనం |
| విత్తన స్వచ్ఛత (కనీసం ) | 98 | 97 |
| జడ పదార్థం (గరిష్ఠంగా) | 2 | 2 |
| ఇతర పంట విత్తనాలు (గరిష్ఠంగా) | 0.05 | 0.10 |
| కలుపు విత్తనాలు (గరిష్ఠంగా) | 0.05 | 0.10 |
| మొలక శాతం (కనీసంగా) | 60 | 60 |
| **తేమ శాతం** | | |
| i) సాధారణ సంచులలో | 8 శాతం | 8 శాతం |
| ii) తేమ సోకని సంచులలో | 6 శాతం | 6 శాతం |

### పూత, పిందెరాలుట

ఆగస్టు-సెప్టెంబర్‌లలో పంట మొదటి దశలో పూత, పిందె రాలుతుంది. దీనిని అధిగమించడానికి 10 పీపీఎం నాఫ్తలిన్ అసిటిక్ ఆమ్లం (4.5 మీటర్ల నీటిలో ఒక మి.లీ ప్లానాఫిక్స్ కలిపి) పూత సమయంలో పిచికారీ చేయాలి. మొదటి పిచికారీకి మూడు వారాల తర్వాత మరోసారి పిచికారీ చేయాలి.

### కల్తీల ఏరివేత

నాణ్యమైన విత్తనోత్పత్తిలో కల్తీల ఏరివేత చాలా ముఖ్యమైన దశ. ఈ దశలో ఒక్కొక్క కాయ ఆధారంగా కాకుండా మొక్క ఆధారంగా కల్తీలను గుర్తించి ఏరివేయాలి. శాఖీయ దశలో ఆకుల పరిమాణం ఆధారంగా, ఆకారం, రంగు ఆధారంగా పూత, కాయలలో కల్తీలను గుర్తించాలి. గుర్తించిన వెంటనే తొలిగించాలి. మొదటి శాఖీయ దశలో, పూత దశలో, పూర్తి కాయ వచ్చిన దశలో కనీసంగా మూడు కల్తీల ఏరివేతలు చేపట్టాలి. ఆకు ఎండు తెగులు, ఆంత్రాక్నోజ్ సోకిన మొక్కలు, వైరస్, విత్తనం ఆశించే తెగుళ్లు సోకిన మొక్కలను ఎప్పటికప్పుడు తొలిగించాలి.

### కోత, విత్తన సేకరణ

మిరపపైనే బాగా ఎండిన ఎర్ర మిరప కాయలను కోసి, ఎండలో ఆరబెట్టాలి. పూర్తిగా ఎండిన కాయల నుంచి విత్తనం సేకరించాలి. ఆ తర్వాత విత్తన తేమను 8 శాతానికి వచ్చేలా నీడలో ఆరబెట్టాలి.

**విత్తన దిగుబడి:** రకాన్ని బట్టిహెక్టారుకు 3-5 క్వింటాళ్లు విత్తనం లభిస్తుంది.


డాక్టర్ పిడిగెం సైదయ్య
శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం
7780509322

raithubadi@ntnews.com

## మధ్య, స్వల్పకాలిక రకాలు మంచిది

ప్రస్తుత పరిస్థితుల్లో నైరుతి రుతుపవనాల వల్ల రాష్ట్రంలో వానలు పడుతున్నాయి. రైతులు వరి సాగును ముమ్మరం చేస్తున్నారు. వాతావరణ శాఖ ముందస్తు అంచనాల మేరకు ఈ ఏడాది వానలు కొంతమేరకు తగ్గే అవకాశం ఉన్నది. కాబట్టి మధ్యకాలిక (135 రోజులు), స్వల్పకాలిక (115-120 రోజులు) రకాలను సాగు చేయాలి.



- మధ్య కాలిక రకాలను రాష్ట్రంలో జూలై 15 వరకు నార్లు పోసుకోవచ్చు. ఒకవేళ జూలై 15 తర్వాత కూడా నార్లు పోయాలనుకుంటే స్వల్పకాలిక రకాలను ఎంపిక చేసుకోవడం మంచిది.
- వానలు కొంతమేరకు ఆలస్యం అవ్వడం వల్ల దీర్ఘకాలిక రకాలను ముదురు నారుతో నాటువేసే బదులు అంతే దిగుబడినిచ్చే మధ్య, స్వల్ప కాలిక రకాలను జూలైలో నార్లు పోసుకొని ఆగస్టులో నాటు వేసుకోవడం మంచిది. రైతులు ముదురు నారును నాట్లు వేయాల్సిన పరిస్థితుల్లో మొక్కల మధ్య దూరం తగ్గించి దగ్గర దగ్గరగా కుదురుకు 4-5 మొక్కలతో నాట్లు వేసుకుంటే దిగుబడి తగ్గకుండా ఉంటుంది.
- మధ్యకాలిక సన్న గింజ రకాలైన (జేజీఎల్ 11470, జేజీఎల్ 384, జేజీఎల్ 11727, డబ్ల్యూజీఎల్ 14, డబ్ల్యూజీఎల్ 32100, డబ్ల్యూజీఎల్ 44, కృష్ణ, అలాగే స్వల్పకాలిక సన్నగింజ రకాలు (తెలంగాణ సోనా, జేజీఎల్ 3844, కేఎన్ఎం 733, జేజీఎల్ 11118, జేజీఎల్ 17004), దొడ్డుగింజ రకాలు (బతుకమ్మ, కేఎన్ఎం 118, జగిత్యాల రైస్1, వరంగల్ రైస్ 1, ఎంటీయూ 1010, ఐఆర్ 64) ముఖ్యమైనవి.
- ధృవీకరించిన సంస్థల నుంచి వరి విత్తనాలను సేకరించి విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. తడి విత్తనశుద్ధికి కార్బండాజమ్ ఒక గ్రా, లీటరు నీటికి లేదా పొడి విత్తనశుద్ధికి 3 గ్రా, ఒక కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి.
- ప్రస్తుత పరిస్థితుల్లో నార్లు పోసి నాటుకోవడం మంచిది. ఒకవేళ కుదరని పరిస్థితుల్లో వెదజల్లే పద్ధతి లేదా డ్రమ్‌సీడర్ పద్ధతిలో విత్తుకొనే అవకాశం ఉన్నది. నాటు యంత్రాలు అందుబాటులో ఉన్న ప్రాంతాలలో ట్రేలలో పద్ధతి లేదా పాలిథీన్ షీట్ మీద జూలై నెల ఆఖరి వరకు వరి నార్లు పోసుకోవచ్చు.
- నారు మడి తయారుచేసుకునే టప్పుడు దుక్కి బాగా చదును చేసుకోవాలి. పశువుల ఎరువు దుక్కిలో వేసి కలియదున్నాలి. నీళ్లు పెట్టడానికి వీలుగా కాలువలు తయారుచేయాలి. చివరి దమ్ములో 5 సెంట్ల నారుమడికి 2.25 కిలోల యూరియా, 6.25 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 1.7 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేయాలి.
- నారుమడిలో ఊద, ఒడిపిలి వంటి గడ్డిజాతి కలుపు ఉన్నట్లైయితే విత్తిన 15-20 రోజులకు సైహలోఫాప్-పి. బ్యూటైల్ అనే కలుపు మందును 1.5 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.


డాక్టర్ ఎం. వెంకటరమణ
ప్రధాన శాస్త్రవేత్త (వరి) & హెడ్
వరి పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్

# డ్రమ్‌సీడర్‌తో వరి సాగు మేలు



**అనాదిగా** వరి పైరుని దమ్ముచేసి నాట్లువేసే పద్ధతిలోనే రైతులు వరి పైరును సాగు చేయడం జరుగుతుంది. నానాటికి పెరిగిపోతున్న కూలీల సమస్య, సరిపడా చాలీచాలని సాగునీటి సమస్య మూలంగా వరి పైరు సాగులో నూతన పద్ధతులను పాటించాల్సిన పరిస్థితి తప్పక ఏర్పడుతుంది. డ్రమ్ సీడర్‌తో వరి పైరు సాగు చేయడం వల్ల రైతులు కూలీల సంఖ్యను గణనీయంగా తగ్గించుకోవచ్చు, తక్కువ సాగు నీటితో సరైన సమయంలో వరి పైరును సాగుచేసుకోవచ్చు. నూతనంగా కలుపు మొక్కలను సైతం నాశనం చేసే మేలు రకమైన మందులు ఎన్నో ప్రస్తుతం రైతులకు అందుబాటులోకి రావడం వలన కూడా డ్రమ్‌సీడర్‌తో వరి పైరును సాగుచేయడానికి అనుకూలమైన అంశంగా మారింది. డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరిపైరును సాగు చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు కల్గుతుంది.

**దుక్కిని తయారు చేసుకునే విధానం**

- తొలకరి చినుకులు పడి భూమి పదునెక్కిన తరువాత ఆ భూమిని గుల్లబారేలా దున్నుకోవాలి.
- వ్యవసాయ భూమిని 15 రోజుల ముందుగా దమ్ముచేసి విత్తడానికి 4 నుంచి 5 రోజుల ముందు మరొకసారి దమ్ముచేసి ఎటువంటి ఎత్తు పల్లాలు లేకుండా నేలను బాగా చదును చేసుకోవాలి.
- మురుగునీరు పోవడానికి వీలుగా 2 మీటర్లకు 20 సెంటీమీటర్ల కాలువలను ఏర్పాటు చేసుకోవాలి.
- ఎటువంటి నీరు లేకపోయినా నేరుగా మెట్టభూమిని గుల్లబారేలా దున్నుకొని మెట్టభూమిలో కూడా డ్రమ్‌సీడర్‌తో విత్తనాలను చల్లుకొని తరువాత నీరు పెట్టుకోవచ్చు.

**విత్తన రకాల ఎంపిక**

అన్నిరకాల విత్తనాలను డ్రమ్‌సీడర్ పద్ధతిలో రైతులు సాగుచేసుకోవచ్చు. కాండం దృఢంగా ఉండి పడిపోవడానికి వీలు లేకుండా ఉండే వరి విత్తనాలను ఎంచుకోవడం చాలా ముఖ్యం.

**విత్తుకునే సమయం**

నాట్లు వేసే పద్ధతిలో నారు మడులను పెంచే సమయంలోనే డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరి విత్తనాలను నేరుగా విత్తుకోవచ్చు.

**విత్తన మోతాదు**

డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరిని సాగుచేయడానికి ఎకరాకు 12 నుండి 15 కిలోల విత్తనాలు మాత్రమే అవసరం అవుతాయి.

**విత్తుకునే దూరం**

డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరి విత్తనాలను విత్తేటప్పుడు ఒక సాలుకు మరో సాలుకు మధ్య 20 సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకూ మధ్య 5-8 సెంటీమీటర్ల దూరంలో విత్తనాలు పడతాయి.

**విత్తనశుద్ధి**

దమ్ము చేసిన భూమిలో చల్లే విత్తనాలలో అయితే ముందుగా విత్తనాలకు సరిపడా నీటిని కలిపి ఆ నీటిలో 1 గ్రాము కార్బండిజమ్ కలిపి ఆ ద్రావణంలో వరి విత్తనాలను 24 గంటలు నానబెట్టాలి. ఆపై కొద్దిగా ముక్కులు పగిలేంత వరకు 36 నుంచి 48 గంటలు మండెకట్టాలి. మెట్టభూమిలో చల్లే విత్తనాలను అయితే నేరుగా విత్తుకోవచ్చు.

**విత్తుకునే విధానం**

దమ్ముచేసిన పొలంలో డ్రమ్‌సీడర్ 8 సాళ్ళ పరికరంతో నీరు పూర్తిగా తీసివేసి విత్తనాలను విత్తుకోవచ్చు. మెట్టభూమిలో అయితే డ్రమ్‌సీడర్ పరికరం, ట్రాక్టర్ సహాయంతో నేరుగా విత్తుకోవచ్చు. విత్తిన తరువాత నారు మడులలో ఏ విధమైన నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తామో అదే విధంగా విత్తనాలను విత్తిన పొలంలో కూడా అవే పద్ధతులు పాటించాలి. నీరు ఎక్కువగా అయినట్లయితే గింజలు మురిగిపోవడం జరుగుతుంది. తక్కువ అయినట్లయితే కలుపు ఎక్కువగా రావడం, పిలకల సంఖ్య తగ్గడం జరుగుతుంది. విత్తిన 12 నుంచి 15 రోజుల మధ్య ఒత్తుగా ఉన్నచోట మొక్కలను పీకివేయాలి.

**ఎరువులను చల్లుకునే విధానం**

నాట్లు వేసి సాగుచేసే వరిపైరుకి వేసుకునే ఎరువులనే డ్రమ్‌సీడర్ పద్ధతిలో సాగుచేసే వరిపైరుకి వాడుకోవాలి. పూర్తి భాస్వరం, సగం పొటాష్ ఎరువులను ఆఖరి దమ్ములో వేసుకోవాలి. మిగిలిన పొటాష్‌ను అంకురం దశలో వేయాలి. నత్రజనిని 3 సమభాగాలుగా విత్తేటప్పుడు, పిలకదశలో, అంకురం ఏర్పాటు దశ లో వేసుకోవాలి. అవసరాన్ని బట్టి జింకు సల్ఫేట్‌ను పొలంలో 20 కేజీలు ఎకరాకు చల్లుకోవాలి లేదా 0.2 శాతం పిచికారీ చేసుకోవాలి.

**కలుపు నివారణలో జాగ్రత్తలు**

నేరుగా అలికి పండించే పొలాలలో కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. కాబట్టి సరైన సమయంలో కలుపును అరికట్టాలి. విత్తిన 35 నుంచి 40 రోజుల వరకు పొలంలో కలుపు సమస్య లేకుండా చూసుకోవాలి. విత్తిన 3 నుంచి 5 రోజుల మధ్య ఆక్సాడయరిజిల్ 35 గ్రాములు లేదా 8 నుండి 10 రోజుల మధ్య ప్రిటాలాక్లోర్+సేఫనర్ 300 మిల్లీ లీటర్‌లు లేదా అనిలోఫాస్ 400 మిల్లీ లీటర్‌లు 25 కిలోల ఇసుకతో కలిపి పొలమంతా పలుచగా నీరు ఉంచి సమానంగా వెదజల్లుకోవాలి. కలుపు సమస్య ఆ తరువాత కూడా ఉన్నట్లయితే బిస్‌పైరిబ్యాక్‌సోడియం 100 మిల్లీ లీటర్ల ఎకరానికి చల్లుకోవాలి. ఊద సమస్య ఎక్కువగా ఉన్నట్లయితే సైహలో-ఫామ్-పి- బ్యూటైల్ 400 మిల్లీ లీటర్ల వాడుకోవాలి. ఈ రెండు కలుపు మందులను విత్తిన 20 రోజులలోపు వాడుకోవాలి. వెడల్పు ఆకు కలిగిన కలుపు ఉన్నట్లయితే 2,4-డి సోడియం సాల్ట్ లీటర్ నీటికి 2.5 గ్రాముల చొప్పున కలిపి 20 నుండి 25 రోజుల మధ్య పిచికారీ చేసుకోవాలి. అవసరమైతే ఒకసారి కూలీలతో కలుపు తీయించుకోవాలి.

**నీటి యాజమాన్య పద్ధతులు**

మొక్కలకు మొదటి ఆకు పూర్తిగా పురి విచ్చుకునేంతవరకు సుమారు 7 నుంచి 10 రోజుల వరకు ఆరుతడి నీళ్లు అవసరం. పొలంలో నీటిని నిల్వ ఉంచకూడదు. సస్యరక్షణ చర్యలు నాట్లు వేసి వరిని సాగుచేసే పద్ధతిలో ఆచరించినట్లుగానే డ్రమ్ సీడర్ పద్ధతిలో కూడా అవే సస్యరక్షణ చర్యలను పాటించాలి.

**డ్రమ్‌సీడర్ వాడటం వల్ల ఉపయోగాలు**

డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరిని సాగు చేయడం వల్ల నారుమడి పెంచడం, నారు పీకడం, నాట్లు వేయాల్సిన అవసరం రాదు. ముదురు నారు నాటే అవసరము ఉండదు. నీరు వచ్చిన తరువాత దమ్ము చేసుకొని నేరుగా విత్తుకోవచ్చు. నాట్లు వేసే పద్ధతి కన్నా డ్రమ్ సీడర్ పద్ధతిలో 5 నుంచి 8 రోజులకు ముందుగా పంట కోతకు వస్తుంది. నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. కూలీల అవసరం గణనీయంగా తగ్గించుకోచ్చు.

వరి మాగాణులను చదును చేసుకొని సరైన కలుపు యాజమాన్య పద్ధతులను పాటించినట్లయితే నేరుగా విత్తి వరిలో మంచి దిగుబడులను, నికర ఆదాయాన్ని పొందవచ్చు.

నగిరి హరీశ్, త్రిపురారం







# మొలక శాతం పరీక్షలే ప్రామాణికం

**సా**గులో విత్తనాలకు చాలా ప్రాధాన్యం ఉన్నది. నాణ్యమైన విత్తనం కీలకం. సిఫార్సు చేసిన మేరకు మొక్కల సాంద్రత ఉంటేనే ఉత్పాదకత, దిగుబడి మేలుగా ఉండి సాగు గిట్టుబాటు అవుతుంది. ఒక్కొక్క పంటలో సిఫార్సు చేసిన విత్తే దూరం ఆధారంగా ఎకరాలో ఉండాల్సిన మొక్కల సంఖ్యను కచ్చితంగా ఉండేట్లు చూసుకోవాలి. ఇందుకు మొలక శాతం అత్యంత కీలకం. మార్కెట్‌లో లభించే ధృవీకరణ విత్తనం లేదా ట్రూత్‌ఫుల్లీ లేబల్డ్ విత్తనం కచ్చితంగా భారత కనీస విత్తన ధృవీకరణ ప్రమాణాలను అనుసరించి విత్తనాలు ఉత్పత్తి చేయాలి. ఆ ప్రమాణాలకు తగ్గట్టుగా లేకుండా ఉంటే వినియోగదారుల ఫోరంలో సైతం ఫిర్యాదు చేసి నష్టపరిహారం పొందవచ్చు. పొలంలో వేసినతర్వాత మొలక శాతం తక్కువగా ఉంటే పంట నష్టం జరుగుతుంది. కాబట్టి పొలంలో విత్తటానికి ముందే మొలకశాతం పరీక్షించుకోవాలి. మరీ తక్కువగా ఉంటే విత్తనశుద్ధి పద్ధతుల ద్వారా మొలక శాతం పెంచుకోవాలి. ముఖ్యంగా హైబ్రిడ్ విత్తనాల ఖర్చు ఎక్కువ. కాబట్టి ముందస్తుగా కచ్చితంగా మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి. విత్తన పరీక్షలు శాస్త్రీయంగా ప్రయోగశాలల్లో లేదా రైతులు కూడా సొంతంగా పరీక్షించుకోవచ్చు. కచ్చితంగా 400 విత్తనాలు పరీక్షలో వాడాలి. 100 విత్తనాలు ఒక గ్రూపుగా అలా నాలుగు గ్రూపులు లేదా 50 విత్తనాలతో 8 గ్రూపులు లేదా 25 విత్తనాలు 16 గ్రూపులుగా పరీక్షించుకోవచ్చు.

**ఇసుక మాధ్యమంగా:** మరీ చిన్నగా లేదా పెద్దగా లేని సమ పరిమాణం ఉన్న ఇసుకను మాధ్యమంగా వాడాలి. అయితే శిలీంధ్రాలు, విషపు పదార్థాలు లేకుండా చూసుకోవాలి. ఇసుకను తడిపి 1-2 సెం.మీ. లోతులో విత్తనం నాటాలి. ఆ తర్వాత కొద్దిగా బలంతో వాటిని మట్టిలో అదమాలి. విత్తన వ్యాసార్థానికి 1.5 రెట్ల దూరంలో నాటాలి. మక్కజొన్న తప్ప మిగతా పంటల విత్తనాలకు ఇసుక నీటిని నిలుపుకునే సామర్థ్యంలో 50 శాతం, పెద్ద పరిమాణం విత్తనాలు, మక్కజొన్న, అపరాల విత్తనాలకు ఇసుక నీటి నిలుపు సామర్థ్యంలో 60 శాతం నీటి తేమ ఉండేలా చూసుకోవాలి.

**కాగితం మాధ్యమంగా విత్తన మొలక శాతం పరీక్ష:** ఈ పద్ధతి బాగా ప్రాచుర్యం పొందింది. ఫిల్టర్ పేపర్ లేదా టవల్ క్రాఫ్ట్ పేపర్ లేదా బ్లాటర్ కాగితం ఇందుకు వాడవచ్చు. అయితే వేగంగా నీటిని తీసుకునే సామర్థ్యం కాగితాలకు ఉండాలి. బాక్టీరియా లేదా శిలీంధ్రం ఆశించి ఉండరాదు. మొలకల వేర్లు పెరిగేలా ఉండాలి. దానిలోకి చొచ్చుకుని పోకుండా ఉండాలి.

**కాగితం పైన:** నీటితో తడిపిన ఫిల్టర్ కాగితం పెట్టి ప్లేట్‌లో ఉంచి, విత్తనాలు ఒకటి, రెండు పొరల్లో ఉంచాలి. సూర్యరశ్మి సోకే చోట ఉంచి మొలక శాతం పరీక్షించాలి.

**కాగితాల మధ్య:** రెండు కాగితపు పొరల మధ్య విత్తనాలు ఉంచి, గుడ్డలలో నిలువుగా చుట్టి ఉంచాలి. తరచుగా తడుపుతూ తేమ కనీసంగా ఉండేలా చూడాలి.

ప్రిచింగ్ (ముందస్తు చలితో శుద్ధి) శరీర ధర్మ సుప్తావస్థ ఉన్న విత్తనాలను ప్రి-చిల్లింగ్‌తో మొలక శాతం పెంచవచ్చు. వ్యవసా య, కూరగాయల విత్తనాలను 5 డిగ్రీలు-10 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలో ఏడు రోజుల పాటు, చెట్టు విత్తనాలతో సహా ఇతర విత్తనాలను 3-5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత మధ్య 7-10 రోజుల పాటు ఉంచితే మొలక శాతం పెరుగుతుంది.

**ప్రి డ్రైయింగ్:** మరికొన్ని మొక్కల విత్తనాలు 40 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఏడు రోజుల పాటు ఉంచితే మొలకెత్తుతాయి.
**రసాయనాలతో శుద్ధి:** 0.2 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణం శుద్ధితో మొలక పరీక్షకు ఉపయోగించే మాధ్యమాన్ని తడుపాలి. లేదా 50 పీపీయం జిబ్బరెలిక్ ఆమ్లంతో కూడా శుద్ధి చేసిన మాధ్యమంలలో విత్తనాన్ని మొలక పరీక్షకు ఉంచి లెక్క కట్టుకోవాలి

డాక్టర్ అమరపల్లి గీత
శాస్త్రవేత్త
(ప్లాంట్ ఫిజియాలజీ విభాగం)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలెం


# మేజర్ అజయ్ కృష్ణ...


మహేష్‌బాబు

ఆర్మీ మేజర్‌గా ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు మహేష్‌బాబు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో మహేష్‌బాబు మేజర్ అజయ్‌కృష్ణ పాత్రలో కనిపించబోతున్నట్లు అనిల్ రావిపూడి బుధవారం ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. ఆర్మీ దుస్తులతో కూడిన నేమ్‌ప్లేట్ ఫొటోను అభిమానులతో పంచుకున్నారు కశ్మీర్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైందని, 2020 సంక్రాంతికి ఈ సినిమాను విడుదల చేయబోతున్నట్లు వెల్లడించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఏ.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై దిల్‌రాజు, రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్నది.

# సంక్రాంతి బరిలో బన్నీ


అల్లు అర్జున్

అల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్నది. హారిక హాసిని క్రియేషన్స్, గీతా ఆర్ట్స్ పతాకాలపై ఎస్.రాధాకృష్ణ, అల్లు అరవింద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్నది. ఈ సినిమాను 2020 సంక్రాంతికి విడుదలచేనున్నట్లు బుధవారం చిత్రబృందం ప్రకటించింది. త్రివిక్రమ్ శైలిలో కుటుంబ బంధాలు, వినోదం, భావోద్వేగాల సమ్మిళితంగా ఈ సినిమా రూపొందుతున్నట్లు సమాచారం. ఇందులో అల్లు అర్జున్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా కనిపించనున్నట్లు తెలిసింది. ఇటీవల హైదరాబాద్‌లో ఆయనపై కీలక ఘట్టాలను చిత్రబృందం తెరకెక్కించింది. ఈ చిత్రానికి తమన్ సంగీతాన్ని అందిస్తుండగా పి.ఎస్. వినోద్ ఛాయాగ్రహణాన్ని సమకూర్చుతున్నారు.


అనుపమపరమేశ్వరన్, బెల్లంకొండశ్రీనివాస్

# ఆగస్టు 2న 'రాక్షసుడు'

బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'రాక్షసుడు'. రమేష్‌వర్మ పెన్మత్స దర్శకుడు. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. ఎ హవీష్ లక్ష్మణ్ కోనేరు ప్రొడక్షన్స్ పతాకంపై కోనేరు సత్యనారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాత మాట్లాడుతూ 'తమిళంలో సూపర్‌హిట్‌గా నిలిచిన 'రాక్షసన్' చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేస్తున్నాం. ఇదొక నేరపరిశోధనాత్మక థ్రిల్లర్. రమేష్‌వర్మ అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. మేకింగ్ పరంగా ఏ విషయంలోనూ రాజీపడకుండా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. బెల్లంకొండ శ్రీనివాస్ నిజాయితీగల పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ తమ్ముడిని ఈ చిత్రం ద్వారా డైలాగ్ రైటర్‌గా పరిచయం చేస్తున్నాం. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి చిత్రాన్ని ఆగస్టు 2న విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు.

# మా అబ్బాయి కోసం సినిమా చేశాను


జగపతిబాబు, నాని, రవిశంకర్

"లయన్‌కింగ్' మా అబ్బాయి అర్జున్ కోసం చేశాను. మణిరత్నం 'ఓకే బంగారం' తర్వాత నేను డబ్బింగ్ చెప్పిన రెండో సినిమా ఇది' అని అన్నారు హీరో నాని. హాలీవుడ్ చిత్రం 'ది లయన్ కింగ్' తెలుగులో విడుదల కానుంది. ఈ సినిమాలో సింబా పాత్రకు హీరో నాని, స్కార్ పాత్రకు జగపతిబాబు, ముఫాసా పాత్రకు పి.రవిశంకర్, టైమస్ పాత్రకు అలీ, పుంబ పాత్రకు బ్రహ్మానందం డబ్బింగ్ చెప్పారు. ఈ నెల 19న ఈ చిత్రం విడుదలకానుంది. తెలుగు ట్రైలర్‌ను మంగళవారం విడుదలచేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ 'హీరో సింబా పాత్రకు నేను గళాన్ని అందించాను. ఇదివరకు తెలుగులో అనువాదమైన హాలీవుడ్ సినిమాలతో పోలిస్తే భిన్నమైన అనుభూతిని పంచుతుంది. తొలిసారి అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో కూడిన లైవ్‌యాక్షన్ యానిమేషన్ సినిమాను తెలుగులో చూస్తున్నట్లు ఉంటుంది. నాతో పాటు జగపతిబాబు, బ్రహ్మానందం, అలీ, రవిశంకర్ డబ్బింగ్ చెప్పడం వల్ల ఈ సినిమాలోని పాత్రలు, వాటి తాలూకూ ఎమోషన్స్‌తో తెలుగు ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. మన భారతీయ కథ ఇది. రజనీకాంత్ 'నరసింహా' సినిమాకు ఈ కథనే మూలం. మనదైన కథతో హాలీవుడ్ వాళ్లు ఈ సినిమా చేశారు. రవిశంకర్, జగపతిబాబుల వాయిస్‌లతో నా గళం మ్యాచ్ అవుతుందో లేదో అని చాలా భయపడ్డాను.అందరికంటే ముందు ఈ సినిమా నేను చూడొచ్చనే ఆలోచనతో డబ్బింగ్ చెప్పడానికి అంగీకరించాను' అని అన్నారు. జగపతిబాబు మాట్లాడుతూ 'సినిమాలకు పనికి రాదన్న నా గొంతు డిస్నీ చిత్రానికి డబ్బింగ్ చెప్పే స్థాయికి చేరుకోవడం గర్వంగా ఉంది. నాకు ఇష్టంలేనివి జీవితంలో ఏం చేయకూడదని అనుకున్నానో అన్ని చేస్తున్నాను. యానిమేషన్ సినిమాలో కూడా విలన్ పాత్రకే డబ్బింగ్ చెప్పాల్సివచ్చింది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో అలీ, రవిశంకర్, లిప్సిక పాల్గొన్నారు.

# కంటెంట్ వున్న చిత్రాలకే ఆదరణ!


సి.కల్యాణ్, జానీ, షకలక శంకర్

షకలక శంకర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'నేనే కేడీ నెం.1'. ముస్కాన్ కథానాయిక. ఆర్.ఎ.ఆర్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై జాని స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్నారు. ఈ నెల26న విడుదల కానుంది. బుధవారం ఈ చిత్ర ట్రైలర్‌ని నిర్మాతల మండలి అధ్యక్షుడు సి.కల్యాణ్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ట్రైలర్ బాగుంది. మంచి కథకు మాస్ అంశాల్ని జోడించి దర్శకుడు చిత్రాన్ని రూపొందించినట్టు కనిపిస్తోంది. షకలక శంకర్ మంచి గుర్తింపు వుంది కాబట్టి ఈ చిత్రానికి ఓపెనింగ్స్ వస్తాయన్న నమ్మకముంది. చిన్న చిత్రాలు ఆడితేనే ఇండస్ట్రీ బాగుంటుంది. పది మందికి పని దొరుకుతుంది. కంటెంట్ వున్న చిత్రాల్ని ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, బ్రోచే వారెవరురా చిత్రాల్లో కంటెంట్ వుంది కాబట్టే ఆడుతున్నాయి. నిర్మాతలకు నేను చెప్పేది ఒక్కటే మంచి కథాబలమున్న చిత్రాల్ని నిర్మించండి. బడ్జెట్ పెరగకుండా చూసుకోండి. చిన్న చిత్రాల నిర్మాతల కోసం చర్చలు జరుగుతున్నాయి. ఈ నెలాఖరు వరకు అవి ఓ కొలిక్కి వస్తాయి' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మంచి ఎంటర్‌టర్‌టైన్‌మెంట్ నేపథ్యంలో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్ ఇది. ప్రస్తుత సమాజంలో పిల్లలు చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారంటే దానికి కారణం తల్లిదండ్రులే. తల్లిదండ్రులు పిల్లల్ని పట్టించుకోవడం లేదు. ఇదే విషయాన్ని ఈ చిత్రంలో చర్చించాం. మూడు భిన్నమైన పార్శ్వాల్లో సాగే పాత్రలో షకలక శంకర్ కనిపిస్తారు' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో షకలక శంకర్, అజయ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకే కేటాయించాలి!


ప్రతాని రామకృష్ణగౌడ్

'చిత్రపురి పోరాట సమితి చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం వుంది. 24 శాఖల్లో పనిచేస్తున్న సినీ కార్మికులకు కాకుండా సినిమాకు సంబంధం లేని వారికి ఇండ్లు కేటాయించారు. దాదాపు 5వేల కార్మికులకు ఇండ్లు కేటాయించాల్సి వుంది. 26 రోజులుగా దీక్షలు చేస్తున్నా చిత్రపురి హౌజింగ్ సొసైటీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది' అన్నారు ప్రతాని రామకృష్ణగౌడ్. చిత్రపురి పోరాట సమితికి తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ తన సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ 'చిత్రపురి హౌజింగ్ సొసైటీలో జరిగిన అవకతవకలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళతాం. అంతే కాకుండా సినీ కార్మికులకు కేటాయించిన స్థలాన్ని కైరోస్ స్కూల్‌కు కేటాయించడం చట్టవిరుద్ధం. వెంటనే ఆ స్కూల్‌ను తొలగించాలి. ప్రభుత్వం కేటాయించబోయే 9 ఎకరాలని చిత్రపురి పోరాట సమితికే కేటాయించాలి' అన్నారు.










